

'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 104

శుక్రవారం 5-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత్‌లో మెటా థ్రెడ్స్ జోరు

అంతర్జాతీయంగా 17.5 కోట్ల యాక్టివ్ యూజర్లు. - 17లో



మార్కెట్ల పరుగు తస్మాత్ జాగ్రత్త!

సెబీ, శాట్‌లకు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన. - 17లో



ముంబై సాగరతీరంలో టీమిండియాకు స్వాగతం పలికేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు



ఢిల్లీలో ప్రధాని మోదీతో టీమిండియా సభ్యులు..

సంద్రం.. జనసంద్రం

- 17 ఏళ్ల తర్వాత మళ్లీ టి20 ప్రపంచకప్ టైటిల్ సాధించి బార్బడోస్ నుంచి గురువారం స్వదేశానికి చేరుకున్న భారత క్రికెట్ జట్టుకు అపూర్వ స్వాగతం లభించింది. ఢిల్లీలోని తన నివాసంలో భారత జట్టు సభ్యులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. సాయంత్రం ముంబైలో ఓపెన్ టాప్ బస్‌లో అశేష జనసందోహం నడుమ రోహిత్ శర్మ బృందం వాంఖెడే స్టేడియానికి వచ్చింది. విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుకు బీసీసీఐ రూ.125కోట్లు నజరానాను అందించింది. ఈ కార్యక్రమం ముగిశాక జట్టు సభ్యులందరూ స్టేడియం మొత్తం కలియదిరిగి అభిమానులకు అభివాదం చేశారు.

17లో



సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు. చిత్రంలో మంత్రి పొంగులేటి

కాంగ్రెస్‌లోకి ఆరుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు

ఆషాఢం అమావాస్యకు ముందురోజు రాత్రి చేరిక

సారయ్య, యెగ్గె మల్లేశం, ప్రభాకర్, దయానంద్, భానుప్రసాద్, విఠల్‌లను పార్టీలోకి ఆహ్వానించిన సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి ప్రజాప్రతినిధుల వలసల పర్వం కొనసాగుతోంది. ఇప్పటివరకు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మాత్రమే కాంగ్రెస్‌లో చేరగా, రాజ్యసభ సభ్యుడు కేకే పార్టీలో చేరిన మరుసటి రోజే ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం అర్ధరాత్రి ఢిల్లీ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ చేరుకున్న తర్వాత జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో వారిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల్లో బస్వరాజు సారయ్య, భానుప్రసాదరావు, ప్రభాకర్‌రావు, దండె విఠల్, బొగ్గారపు దయానంద్, యెగ్గె మల్లేశం ఉన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

బైడెన్‌ను.. మార్చొచ్చా?



ట్రంప్‌తో ముఖాముఖి చర్చలో బైడెన్ తడబడటం, మాటల కోసం వెతుక్కోవడంతో డెమొక్రాట్లలో భయాందోళనలు పెరిగిపోయాయి. 81 ఏళ్ల వయసులో బైడెన్ సమర్థుడైన అభ్యర్థి కాగలరా? మరో 4ఏళ్లు అధినేతగా భారం మోయగలరా? అనే సందేహాలున్నాయి.

- వివరాలు 6లో

జార్ఖండ్ సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్



జార్ఖండ్ ముక్తి మోర్చా ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు హేమంత్ సోరెన్ జార్ఖండ్ సీఎంగా మరోసారి ప్రమాణం చేశారు. గురువారం రాంచీలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ రాష్ట్ర 13వ సీఎంగా ఆయనతో ప్రమాణం చేయించారు.

- వివరాలు 6లో

సింగరేణికే కేటాయించాలి

బొగ్గు బ్లాకులపై ప్రధాని మోదీకి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తి

హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను పునరుద్ధరించాలి

తెలంగాణకు 25 లక్షల ఇళ్లు మంజూరు చేయండి

రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలు కేటాయించండి

విభజన చట్టంలోని హామీలను అంశాలను నెరవేర్చాలని వినతి



ఢిల్లీలో ప్రధాని మోదీకి జ్ఞాపికను ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, న్యూఢిల్లీ: సింగరేణి పరిధిలోని బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలని ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సింగరేణి కాలరీస్ కంపెనీ (ఎస్‌సీసీఎల్)లో తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటాలు ఉన్నాయని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. గనులు, ఖనిజాభివృద్ధి నియంత్రణ చట్టంలోని (ఎంఎండీఆర్) సెక్షన్ 11ఏ/17 (ఏ) (2) ప్రకారం వేలం జాబితా నుంచి శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను తొలగించాలని, అదే సెక్షన్ ప్రకారం గోదావరి లోయ బొగ్గు నిల్వల క్షేత్రం పరిధిలోని కోయగూడెం, సత్తుపల్లి బ్లాక్–3 గనులనూ సింగరేణికే కేటాయించాలని కోరారు. రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాల అవసరాలు తీర్చేందుకు ఈ గనుల కేటాయింపు కీలకమైనందున సింగరేణికే వాటిని కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం ఢిల్లీలో ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలిసిన సీఎం రేవంత్, మిగతా 2వ పేజీలో ▶

రుణమాఫీ తర్వాతే పంచాయతీ ఎన్నికలు

- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి
- ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోంది
- 10% ఈవీఎంలను మార్చినా ఫలితాలు తారుమారే
- తెలంగాణలో పదేళ్లు.. ఏపీలో ఐదేళ్లకోసారి ప్రభుత్వ మార్పు ట్రెండ్
- ఈ లెక్కన పదేళ్లు నేనే సీఎంగా కొనసాగుతా
- అమరావతిలో పెట్టుబడులు పెట్టేకన్నా హైదరాబాద్ శివార్లు, వరంగల్‌లో పెట్టడం మంచిది - 2లో



మన పాలన లేక దేశ రైతాంగానికి నష్టం

రాష్ట్ర ఫలితాలపై మహారాష్ట్రలోనూ ఆవేదన : కేసీఆర్

ఫామ్‌హౌస్‌లో పార్టీ నేతలతో కొనసాగుతున్న భేటీలు

ముందస్తు సమాచారం లేకుండా నన్ను కలిసేందుకు వచ్చి ఇబ్బంది పడొద్దు

అధికారం, ప్రతిపక్ష పాత్ర మనకు శాశ్వతం కాదు.. ప్రజాతీర్పే శిరోధార్యం

ప్రజల్లో కలిసి ఉంటూ వారి సమస్యల మీద నిరంతర పోరాటం..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కేసీఆర్ పాలన లేకపోవడంతో మహారాష్ట్రతోపాటు దేశం కూడా నష్టపోయిందనే భావన కొందరు మహారాష్ట్ర నేతలు తనవద్ద వ్యక్తం చేశారని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వెల్లడించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ఓటమితో కేసీఆర్ దార్శనిక నాయకత్వాన్ని దేశం కోల్పోయిందని వారు బాధపడ్డారన్నారు. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో గురువారం తనను కలిసేందుకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడారు. 'విద్యుత్, సాగునీరు, తాగునీరు, వ్యవసాయం తదితర రంగాల్లో మిగతా 5వ పేజీలో ▶

నిర్ణయమే మిగిలింది..

రిజిస్ట్రేషన్ విలువల సవరణ క్షేత్రస్థాయి కసరత్తు పూర్తి

అన్ని కేటగిరీల్లో కనిష్ట, గరిష్ట విలువలను ప్రతిపాదించిన కమిటీలు

త్వరలో రెవెన్యూ మంత్రితో భేటీకి అధికారుల సమాయత్తం

పొంగులేటితో కలిసి సీఎంతో జరిగే భేటీలో తుది నిర్ణయానికి చాన్స్

రెండు రోజుల్లో గ్రీన్ సిగ్నల్ వస్తుందంటున్న రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు

సీఎం ఆమోదం తెలిపితే ఆగస్టు 1 నుంచే కొత్త విలువలు అమల్లోకి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల విలువల సవరణ కసరత్తు క్షేత్ర స్థాయిలో పూర్తయింది. గత నెల 18వ తేదీ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైన సంగతి తెలిసిందే. కాగా రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు తీసుకునే తుది నిర్ణయం కోసం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఎదురుచూస్తోంది. క్షేత్రస్థాయి కమిటీల ప్రతిపాదనలను కొత్త కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ ఇటీవల జిల్లా రిజిస్ట్రార్లు, డీఐజీలతో కలిసి సమీక్షించారని, అన్ని కేటగిరీలు, స్థాయిల్లో ప్రతిపాదించిన కనిష్ట, గరిష్ట విలువలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. వీలున్నంత త్వరలోనే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మిగతా 5వ పేజీలో ▶



పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న ప్రధాని రిషి సునాక్ దంపతులు

బ్రిటన్‌లో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు

రాత్రి పదింటిదాకా కొనసాగిన పోలింగ్

పోలింగ్ పూర్తవగానే మొదలుకానున్న ఓట్ల లెక్కింపు

విపక్ష లేబర్ పార్టీయే గెలుస్తుందంటున్న విశ్లేషకులు 6లో

ఇదండీ సంగతి



సార్! ఇక బ్రిడ్జీలు కూలే ప్రసక్తే లేదు. ఉన్నవన్నీ కూలిపోయాయి!

ఊపిరి తీస్తున్న వాయు కాలుష్యం

హైదరాబాద్ సహా దేశంలోని పది పెద్ద నగరాల్లో 7.2% మరణాలకు 'పీఎం 2.5' ధూళి కణాలే కారణం

'లాన్సెట్ ప్లానెటరీ హెల్త్' పత్రిక వెల్లడి



- ఆయువు పోయాల్సిన వాయువు ప్రాణాలు తోడేస్తోంది. ఇండియాలోని పది అతిపెద్ద నగరాల్లో సంభవిస్తున్న రోజువారీ మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలకు వాయు కాలుష్యమే కారణమని తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. - 6లో

40 శాతమే అయితే ఎలా?

తప్పనిసరి బదిలీ జాబితాలో ఉన్నా.. జూనియర్లకు స్థానచలనం కష్టమే..

బదిలీ నిబంధనలు సవరించాలంటున్న ప్రభుత్వ ఉద్యోగులు



సాక్షి, హైదరాబాద్: సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా.. ప్రభుత్వ శాఖలు ఆ దిశగా కసరత్తు ముమ్మరం చేశాయి. ఒకట్రెండు రోజుల్లో శాఖల వారీగా బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలు జారీచేసే పనిలో బిజీ అయ్యాయి. వాస్తవానికి ఉద్యోగుల సాధారణ బదిలీలు 2018లో జరిగాయి. ఆ తర్వాత జీఓ 317 కింద జరిగిన కేటాయింపులు, ఎన్నికల సమయంలో జరిగిన బదిలీలు మినహా ఉద్యోగులకు స్థానచలనం కలగలేదు. అయితే తాజాగా ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలపై ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. 40 శాతం మించి ఉద్యోగులకు బదిలీలు చేయొద్దని స్పష్టం చేయడంతో, సుదీర్ఘకాలంగా వేచిచూస్తున్న వారికి తాజా బదిలీలు నిరాశ కలిగిస్తాయనే చర్చ తీవ్రంగా జరుగుతోంది.

సీనియర్లకే అవకాశం...

ఒక ఉద్యోగి ఒకస్థానంలో గరిష్ఠంగా నాలుగేళ్లు దాటితే బదిలీ తప్పనిసరి అనే నిబంధన పెట్టింది. దీంతో వరుసగా నాలుగేళ్లు ఒకేచోట పనిచేస్తే వారు తప్పకుండా బదిలీ కావాల్సి ఉంటుంది. 40 శాతం మించొద్దని చెప్పడంతో తప్పనిసరి బదిలీ కేటగిరీలో ఉన్న చాలామంది ఉద్యోగులకు స్థానచలనం కష్టమని అధికారవర్గాలు మిగతా 3వ పేజీలో ▶



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

చంద్రబాబూ పద్ధతి మార్చుకో..

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ హెచ్చరిక

విధ్వంస సంస్కృతికి ఫుల్‌స్టాప్ పెట్టకపోతే రియాక్షన్ తప్పదు

దాడులు ఆపమని కోరడం లేదు.. హెచ్చరిస్తున్నాం..

ఓ వైపు విధ్వంసం, దాడులు చేస్తూ తిరిగి తప్పుడు కేసులా?..

ఎవరి స్థాయిలో వాళ్లు రెడ్‌బుక్‌లు చూపిస్తూ విధ్వంసాలా?

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: రాష్ట్రంలో విధ్వంస రాజకీయాలకు పాల్పడుతూ విష సంస్కృతికి చంద్రబాబు బీజం వేస్తున్నారని, దీనికి ఫుల్ స్టాప్ పెట్టకపోతే భవిష్యత్‌లో రియాక్షన్ కూడా అదే స్థాయిలో ఉంటుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. దాడులు, విధ్వంసాలు ఆపాలని కోరడం లేదని, హెచ్చరిస్తున్నానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారని, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని.. పైగా బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టి మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

రాజ్యసభ సభ్యత్వానికి కేకే రాజీనామా



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్న సీనియర్ నేత కె.కేశవరావు గురువారం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను స్వయంగా రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు అందజేసి ఆమోదించాలని విన్నవించారు. దీనిపై రాజ్యసభ చైర్మన్ నిర్ణయం తీసుకోవలసి ఉంది. బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష రాహుల్‌గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కేకే కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. ఈ సందర్భంగా తన ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని హైకమాండ్ పెద్దలకు తెలిపి.. వారి ఆమోదం మేరకే రాజీనామాను సమర్పించారు. కాగా, ప్రధాని, కేంద్ర హోం మంత్రితో భేటీ అనంతరం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేకే నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై చర్చించారు. ఆయనను ప్రభుత్వ సలహాదారుగా తీసుకునే విషయమై కూడా ఇద్దరి మధ్య చర్చకు వచ్చినట్టు తెలిసింది. అనంతరం జరిగిన మీడియా చిట్‌చాట్‌లో కేకేకు కేబినెట్ హోదా కలిగిన సలహాదారు పదవి ఇవ్వనున్నట్టు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

కేకే రాజీనామా భేష్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో చేరిన సీనియర్ నేత కె.కేశవరావు బీఆర్ఎస్ పార్టీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం హర్షణీయమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాహుల్ మాటలను దేశం ఎలా నమ్ముతుంది?

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగం గురించి పదేపదే మాట్లాడే రాహుల్ గాంధీ.. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో మాత్రం విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కి కట్టుబడి ఉన్నామని చెపుతున్న రాహుల్ గాంధీ.. ఇతర పార్టీలలో గెలిచిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటూ రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నారని గురువారం కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తాము ఇచ్చిన మేనిఫెస్టోకి విరుద్ధంగా పార్టీలో చేర్చుకుంటూనే, ఫిరాయింపులను అరికడతామంటూ చెబుతున్న రాహుల్ గాంధీ మాటలను దేశం ఎలా నమ్ముతుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఫిరాయింపులను నిరోధిస్తాం అన్న అంశంపై రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత బీఆర్ఎస్ ఎంపీ కేశవరావు రాజీనామా చేయడాన్ని స్వాగతించిన కేటీఆర్, కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల సంగతి ఏమిటని ప్రశ్నించారు.

రుణమాఫీ చేసి తీరుతాం

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



పాలకవీడు: కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీపై మాట నిలబెట్టుకుంటాం.. దేశ చరిత్రలో రైతులకు రూ.31 వేల కోట్ల పంట రుణాలు మాఫీ చేస్తున్న ప్రభుత్వం తమదేనని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో గురువారం రూ.22.73 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.20 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేయలేకపోయిందని విమర్శించారు.

రైతు ఆత్మహత్యలు పట్టించుకోరా ?

పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదా: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ఆత్మహత్యలు నిత్యకృత్యంగా మారినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా లేదని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఘటన మరువకముందే సీఎం సొంతజిల్లాలో మరో రైతు ఆత్మహత్యాయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఆలియాతండాలో మరో రైతు పురుగుల మందు తాగి ప్రాణాలు వదిలేందుకు సిద్ధమయ్యాడన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం ప్రయత్నించకపోవడం బాధాకరమని చెప్పారు. ఈ ప్రభుత్వానికి ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ.. రైతుల సంక్షేమం పట్ల లేదన్నారు. రైతులు పురుగుల మందును పెరుగన్నంలా తినే దుర్భర పరిస్థితులు ఏడు నెలల కాంగ్రెస్‌పాలనలో మళ్లీ వచ్చాయని తెలిపారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని హరీశ్ డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ గతించిన చరిత్ర

- పార్టీ ఎక్కడుందోనని కేసీఆర్ టార్చ్‌తో వెతుక్కుంటున్నారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- బీజేపీ నేతలు ఇతర రాష్ట్రాల్లో తమ దీనావస్థను గమనంలో ఉంచుకోవాలి
- ఫిరాయింపులపై మాట్లాడుతున్న ఈటల 20 ఏళ్లు ఎక్కడున్నారు?
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాని, కేంద్ర హోంమంత్రిని కలిశామన్న రేవంత్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, ఎంపీ అనిల్

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ గతించిన చరిత్ర అని, ఆ పార్టీకి గత చరిత్ర ఉన్నది కానీ భవిష్యత్తు లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. టార్చ్ వేసుకుని ప్రజలు రావడం కాదని, బీఆర్ఎస్ ఎక్కడుందో టార్చ్ వేసుకుని కేసీఆర్ వెదుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలతో భేటీ అనంతరం.. తన అధికారిక నివాసంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాని, కేంద్ర హోంమంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించామన్నారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. 'రాష్ట్రంలో బీఆర్ఎస్ ఎక్కడుంది? టార్చ్‌లైట్ వేసి వెతకాల్సిందే కదా.. లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా లేదు. పార్టీ పుట్టినప్పటి నుంచి 25 ఏళ్లలో ఇంత దీనావస్థ ఎప్పుడూ లేదు..'అని రేవంత్ అన్నారు. బీజేపీ నాయకులు కూడా ఎవరైనా కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే ముందు ఇతర రాష్ట్రాల్లో వారి పార్టీ దీనావస్థను దృష్టిలో ఉంచుకుని మాట్లాడితే బాగుంటుందని సీఎం అన్నారు.

కేసీఆర్‌పై ఈటలకు ప్రేమ తగ్గనట్టుంది!

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ పార్టీ ఫిరాయింపులపై మాట్లాడుతున్నారని.. 20 సంవత్సరాలు ఈటల ఎవరితో కలిసి తిరిగారో గుర్తు చేసుకోవాలని రేవంత్ సూచించారు. గతంలో కేసీఆర్ ఫిరాయింపులు ప్రోత్సహించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు, కండువాలు కప్పేటప్పుడు ఈటల ఎప్పుడైనా మాట్లాడారా..? అని ప్రశ్నించారు. అసలు 11 రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలను బీజేపీ పడగొట్టిన విషయమైనా ఈటలకు తెలుసా..? అని నిలదీశారు. 'ఇప్పటికీ కేసీఆర్‌పై ఈటలకు సానుభూతి ఎందుకు? ఆయనపై ఇంకా ప్రేమ తగ్గనట్లు ఉంది. అయినా వారిద్దరూ ప్రేమించుకుంటే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. వాళ్ల నాయకుడు ఇంకా కేసీఆరే అని ఈటల అనుకుంటున్నట్లున్నారు..'అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, తర్వాత తమ ఫోకస్ అంతా అభివృద్ధిపైనే ఉంటుందని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడి ఎంపిక, మంత్రివర్గ విస్తరణ అంశాలు ఏఐసీసీ పరిశీలనలో ఉన్నాయని అన్నారు. పదవుల విషయంలో తమకు ఏకాభిప్రాయం ఉందని, ఎందుకు ఆలస్యం అవుతోందో ఏఐసీసీ పెద్దలనే అడగాలని అన్నారు. ఇలావుండగా భద్రాచలానికి సమీపాన ఏపీలో ఉన్న ఐదు గ్రామాలు, దేవుడి మాన్యాలను తెలంగాణలో విలీనం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానిని కోరినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

సింగరేణికే కేటాయించాలి

▶ మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సుమారు గంటసేపు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన బొగ్గు గనుల కేటాయింపు, ఐటీఐఆర్ పునరుద్ధరణ, రక్షణ భూముల కేటాయింపు, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలపై చర్చించారు.

ప్రధానికి సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి వినతులు ఇవీ..

- ➤ హైదరాబాద్-కరీంనగర్ రహదారి, హైదరాబాద్-నాగ్‌పూర్ రహదారి (ఎన్‌హెచ్-44)పై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి మధ్యలో అడ్డుగా ఉన్న రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలి. ఆ కారిడార్లతోపాటు హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, రవాణా, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ పరిధిలో 2,450 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించాలి. ఆ భూములకు ప్రత్యామ్నాయంగా రావిరాలలో రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ)కు లీజుకిచ్చిన 2,462 ఎకరాలను కేంద్రానికి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం ఉంది.
- ➤ 2010లో నాటి యూపీఏ ప్రభుత్వం హైదరాబాద్, బెంగళూరుకు కేటాయించిన ఐటీఐఆర్ ప్రాంతాల విషయంలో 2014 తర్వాత ముందడుగు పడలేదు. అందుకే హైదరాబాద్‌కు ఐటీఐఆర్ ను పునరుద్ధరించాలి.
- ➤ భారత్‌మాల పరియోజన మొదటి దశలో హైదరాబాద్ ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం (సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు) జాతీయ రహదారి నిర్మాణ టెండర్ల ప్రక్రియను వీలైనంత త్వరగా చేపట్టాలి. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని (చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు) వెంటనే జాతీయ రహదారిగా గుర్తించి దాన్ని కూడా భారత్ మాల పరియోజనలో చేర్చి నిర్మించాలి.
- ➤ రాష్ట్రంలో పెరిగిన రవాణా అవసరాల దృష్ట్యా 13 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలి. (జగిత్యాల-పెద్దపల్లి-కాటారం, దిండి-దేవరకొండ-మల్లెపల్లి-నల్లగొండ, భువనగిరి-చిట్యాల, చౌటుప్పల్ ఆమన్‌గల్-షాద్ నగర్-సంగారెడ్డి, మరికల్-నారాయణపేట రామసముద్ర, వనపర్తి-కొత్తకోట-గద్వాల మంత్రాలయం, మన్నెగూడ-వికారాబాద్-తాండూరు-జహీరాబాద్-బీదర్, కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-ఎల్లారెడ్డి-పిట్లం, ఎర్రవల్లి ఎక్స్ రోడ్డు-గద్వాల-రాయచూరు, కొత్తపల్లి-హుస్నాబాద్-జనగాం-హైదరాబాద్, సారపాక-ఏటూరునాగారం, దుద్దెడ-కొమురవెల్లి-యాదగిరిగుట్ట రాయగిరి క్రాస్ రోడ్డు, జగ్గయ్యపేట-వైరా-కొత్తగూడెం)
- ➤ రాష్ట్రానికి ఒక ఐఐఎం మంజూరు నిర్ణయం కింద తెలంగాణకు ఇంకా ఐఐఎం మంజూరు చేయలేదు. ఇప్పటికైనా హైదరాబాద్‌కు ఐఐఎం మంజూరు చేయాలి. ➤ తెలంగాణలోని కొత్త జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలి. ➤ ఏపీ పునర్విభజన చట్టంలో హామీ ఇచ్చినట్లుగా కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలి. ➤ హైదరాబాద్‌లో సెమీకండక్టర్ ఫ్యాబ్స్‌ను నెలకొల్పేందుకు పలు కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నందున ఇండియా సెమీకండక్టర్ మిషన్‌లో తెలంగాణను చేర్చాలి.
- ➤ 2024-25 నుంచి ప్రారంభమవుతున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో తెలంగాణకు 25 లక్షల ఇళ్లు మంజూరు చేయాలి.
- ➤ తెలంగాణకు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధి (బీఆర్‌జీఎఫ్) కింద 2019-20 నుంచి 2023-24 వరకు తెలంగాణకు రావల్సిన రూ. 1,800 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ➤ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం బయ్యారంలో వెంటనే ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పే ప్రక్రియను వేగవంతం చేయాలి.

రుణమాఫీ తర్వాతే పంచాయతీ ఎన్నికలు!

- అలాగైతేనే మాక్కూడా ప్రయోజనం
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: రైతు రుణమాఫీ తర్వాతే పంచాయతీ ఎన్నికలకు వెళ్లనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అలా అయితేనే తమకు కూడా ప్రయోజనం ఉంటుందనే ఆలోచన ఉందన్నారు. మూసీ పరీవాహక ప్రాంతాన్ని 55 కి.మీ. మేర అభివృద్ధి చేస్తున్నామని, కింద రోడ్డు మార్గం, సైక్లింగ్, పైన మెట్రో వెళ్లేలా ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. ఏపీ రాజధాని అమరావతి హైదరాబాద్‌కు ఎంతమాత్రం పోటీ కాదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అమరావతిలో రాజధాని నిర్మాణం, భవనాల నిర్మాణం తర్వాత 10 వేల ఎకరాలే రియల్ ఎస్టేట్‌కు ఉంటుందని, అందులోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం కష్టమనేది తన ఆలోచన అని అన్నారు. అక్కడ పెట్టుబడి పెట్టేకన్నా హైదరాబాద్ శివారు ప్రాంతాలు, వరంగల్‌లో పెట్టుబడి పెట్టడం మంచిదని సలహా ఇస్తున్నట్లు చెప్పారు. లేదా పక్క రాష్ట్రాలైన బెంగళూరు, చెన్నైలలోనూ పెట్టుబడి పెట్టుకోవచ్చని చెప్పారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమైన సీఎం రేవంత్.. మీడియా సమావేశంలో వివరాలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో కాసేపు ఇష్టాగోష్టిగా మాట్లాడారు.

మూసీ అభివృద్ధి.. నా మార్క్

'మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీఆర్, కేసీఆర్ హైదరాబాద్‌లో చేసిన అభివృద్ధికి ఓ మార్క్ ఉంది. ఇలా నా మార్క్ ఏంటనేది చెప్పాల్సి వస్తే మూసీ నది అభివృద్ధేనని చెప్తా. మూసీ పరీవాహక ప్రాంతం పరిధిలో 10 వేలకుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. వారందరికీ డబుల్ బెడ్రూం ఫ్లాట్లు లేదా లేదా నష్టపరిహారం చెల్లిస్తాం. మధ్యమధ్యలో ఎస్టీపీలు కట్టి నీటిని శుద్ధి చేసి మూసీలోకి వదిలేలా చేస్తున్నాం. 36 నెలల్లో పూర్తి చేయాలనేది నా ఉద్దేశం. 12-15 కి.మీ.లకు ఒక క్లస్టర్ లెక్కన 4 కస్టర్లుగా విభజించి 4 కంపెనీలకు ఇద్దామనే ఆలోచన చేస్తున్నాం. మూసీ ప్రాజెక్టును మరింత హుందాగా డిజైన్ చేసేందుకు ఆగస్టులో దక్షిణ కొరియా, జపాన్ వెళ్లి అక్కడి రివర్ డెవలప్‌మెంట్ మోడల్‌ను చూసి మరిన్ని ఆలోచనలు చేస్తాం. మొత్తం మూసీ నది అభివృద్ధే రేవంత్ మార్క్ అనేలా అభివృద్ధి చేసి చూపిస్తా'అని రేవంత్ వివరించారు.

గండిపేటకు ట్రంక్ లైన్..

'మంచినీటి నిల్వ కోసం గోదావరి, కృష్ణా నుంచి గండిపేటకు ట్రంక్ లైన్ వేస్తున్నాం. త్వరలో టెండర్లు పిలుస్తాం. అలాగే రీజనల్ రింగ్ రోడ్డు కూడా నిర్మిస్తున్నాం. ఈ ప్రాజెక్టుపై కూడా కేంద్రంతో చర్చలు జరుగుతున్నాయి. త్వరలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టాల్సి ఉన్నందున రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అవసరాల గురించి ప్రధాని మొదలు కేంద్ర మంత్రులందరినీ నేను, నాతో పాటు మంత్రులు కలుస్తున్నాం. కేంద్రం తెలంగాణకు సాయం చేస్తుందనే నమ్మకం ఉంది. ఎన్నికలు అయిపోయినందున ఇప్పుడు రాష్ట్రాభివృద్ధే మా ధ్యేయం. అందుకే అందరినీ కలుస్తున్నాం..'అని సీఎం చెప్పారు.

మరికొన్ని అంశాలపై

- ➤ వివాదం లేకుండా పోటీ పరీక్షలన్నీ నిర్వహించామని సీఎం అన్నారు. తమకు మంచి పేరు వస్తుందనే గ్రూప్-1 విషయంలో బీఆర్ఎస్ అనవసర రచ్చకు తెరలేపి నిరుద్యోగుల్ని ఉసిగొల్పుతోందని రేవంత్ ఆరోపించారు. అయితే గ్రూప్-1 గురించి ఎవరో ఏదో చెప్పారని చేసుకుంటూ వెళ్లలేమని.. అలా వెళ్తే కోర్టులు ఆక్షేపిస్తాయని చెప్పారు.
- ➤ లోక్‌సభ ఎన్నికలకు ముందే రాష్ట్రానికి ఎక్కువ సంఖ్యలో ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని ప్రధానిని కోరానని.. ఇప్పుడు ఎన్నికలు ముగియడంతో త్వరలో కొత్త బ్యాచ్‌కు చెందిన వారిని కేంద్రం తెలంగాణకు కేటాయించే అవకాశం ఉందన్నారు.
- ➤ కత్తి పట్టుకున్న వాడు కత్తికే బలైనట్లు కేసీఆర్ పరిస్థితి ఉందని రేవంత్ వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డ వ్యక్తి ఆ కేసుకే పట్టుబడేలా ఉన్నారని పేర్కొన్నారు. తనకు ఎవరి ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం లేదని.. తన ప్రభుత్వానికి ఢోకా లేదన్నారు.

పదేళ్లు నేనే సీఎం..

ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో పదేళ్లకు ఒకమారు, ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు మారే ట్రెండ్ కొనసాగుతోందని, ఈ లెక్కన పదేళ్లపాటు తానే ముఖ్యమంత్రిగా కొనసాగతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పదేళ్లపాటు కాంగ్రెస్‌కు వచ్చే ఢోకా ఏమీ లేదని చెప్పారు. 'తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాల మార్పు విషయంలో భిన్నమైన ట్రెండ్ నడుస్తోంది. తెలంగాణలో పదేళ్లకు ఒకమారు ప్రభుత్వాలు మారితే, ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్లకు ఒకమారు ప్రభుత్వం మారుతోంది. ఈ లెక్కన తెలంగాణలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లపాటు కచ్చితంగా కొనసాగుతుంది. నేనే ముఖ్యమంత్రిగా కొనసాగుతా'అని రేవంత్ వ్యాఖ్యానించారు.

ఈవీఎంలపై అప్పుడు టీడీపీయే ప్రశ్నించింది

సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎంల) ట్యాంపరింగ్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఈవీఎంల ట్యాంపరింగ్‌కు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో వాటి ట్యాంపరింగ్ జరుగుతోందని వ్యాఖ్యానించారు. ఈవీఎం ట్యాపరింగ్‌లు జరిగినట్లు వస్తున్న వార్తలపై అభిప్రాయం ఏమిటని మీడియా అడగ్గా సీఎం రేవంత్ వివరంగా బదులిచ్చారు. '2009లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ట్యాంపరింగ్ జరుగుతోందని ప్రశ్నించిందే టీడీపీ (అప్పుడు నేను ఆ పార్టీలోనే ఉన్నా). ఢిల్లీలోని కానిస్టిట్యూషనల్ క్లబ్ ఆఫ్ ఇండియాలో దీనిపై సెమినార్ నిర్వహించి అవగాహన కల్పించాం. అప్పట్లో ఈవీఎంల ట్యాంపరింగ్‌కు సంబంధించి అరెస్టులు కూడా జరిగాయి..'అని అన్నారు.

ఎలా జరగొచ్చంటే..

'ఎన్నికలకు ముందురోజు ప్రతి నియోజకవర్గానికి ఈవీఎంలను తీసుకొచ్చి పంపిణీ కేంద్రంలో ఉంచుతారు. పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంల కంటే 15 శాతం ఈవీఎంలను ఎక్కువగానే కేటాయిస్తారు. ఎన్నికల రోజు ఎక్కడైనా ఈవీఎంలు మొరాయిస్తే ఆ ఈవీఎంల స్థానంలో వాటిని ఉపయోగించుకోవడానికి ఆ 15 శాతం ఈవీఎంలను అదనంగా ఇస్తారు. ఈవీఎంల పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ రోజు ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు తరలిస్తారు. అదనంగా తెచ్చిన 15 శాతం ఈవీఎంలను మాత్రం డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లోనే ఉంచుతారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలన్నీ స్ట్రాంగ్ రూమ్‌కు కాకుండా తొలుత డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కే వస్తాయి. అక్కడే రాత్రంతా ఉంచుతారు. ఆ రాత్రి ఈవీఎంలను అటుఇటూ మార్చేలా ఏదైనా జరగొచ్చు కదా? పంపిణీ కేంద్రం బయట పోలీసులు కాపలాగా ఉంటే లోపల ఇంటర్, డిగ్రీ చేసిన వాళ్లు వాటిని తనిఖీ చేయడానికి ఉంటారు. మన చేతిలో అధికారం, బలం ఉంటే మనకు ఇష్టమైన వ్యక్తుల్ని అక్కడ డ్యూటీకి వేసుకొనే అవకాశం కూడా ఉంది. పోలింగ్ ముగిసిన మర్నాడు ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్తున్నాయి..'అని రేవంత్ తెలిపారు.

ట్యాంపరింగ్ ఏ రకంగా చేస్తారో చెప్పలేం

'ఈవీఎంల ట్యాంపరింగ్‌ను ఎక్కడో కూర్చుని చేశారా లేక చిప్‌లలోకి ఏదైనా ఫ్రీక్వెన్సీని పంపారా అనేది మనం చెప్పలేము. చిప్‌లోకి లోఫ్రీక్వెన్సీ అయితే ఒకలాగా, హైఫ్రీక్వెన్సీ అయితే మరోలాగా ఈవీఎంలను ఆపరేట్ చేయొచ్చు. కంపెనీ తయారు చేసే ప్రోగ్రామ్‌నిబట్టే ఈవీఎం పని చేస్తుంది. ప్రోగ్రాం రీరైడ్ చేయాలంటే మిషన్ చేతికి రావాల్సి ఉంటుంది. అయితే సిగ్నల్ ద్వారా ట్యాంపరింగ్ చేస్తున్నారా లేదా అనేది నాకు తెలియదు. ఫ్రీక్వెన్సీ ఉంటే ఒకలా, లేకపోతే ఇంకోలా దేనికి దానికే ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉంటుంది. గెలుపోటముల కోసం 100 శాతం మెషీన్లను ట్యాంపరింగ్ చేయాల్సిన అవసరం లేదు. జనరల్‌గా 10 శాతం ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉండొచ్చు. అంటే 10 వేల ఓట్ల వ్యవధిలోనే గెలుపోటములను డిసైడ్ చేయొచ్చు కదా' అని రేవంత్ చెప్పారు.

సోయిలేకే మొదటి నుంచి
తెలంగాణ ఆగం

- ప్రజల్లో చైతన్యం నింపడంలో కవులు, రచయితలు ముందుండాలి
- ఎమ్మెల్సీ గోరటి వెంకన్నతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



కేసీఆర్‌కు పుస్తకాలను అందిస్తున్న గోరటి వెంకన్న

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడిరాష్ట్రంలో నాటి ఆంధ్రా నాయకత్వ స్వార్థంతోపాటు, తెలంగాణ నాయకత్వం సోయిలేనితనం కారణంగానే రైతాంగానికి దశాబ్దాల పాటు నష్టాన్ని కలిగించిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. నాటి తెలంగాణ నాయకత్వం విద్యుత్, వ్యవసాయరంగంలో తెలంగాణకు ఉద్దేశపూరితంగా చేసిన ద్రోహాలు పసిగట్టంలో విఫలమైందన్నారు. ఆ సమయంలో తెలంగాణ సమస్యలను కవులు, కళాకారులు సాహిత్య, సాంస్కృతిక ప్రక్రియలతో ఓ వైపు వ్యాప్తి చేయడం, మరోవైపు టీఆర్ఎస్ రాజకీయ ప్రక్రియ.. జమిలిగా సాగిన భావజాల వ్యాప్తితోనే తెలంగాణ సాధించామని కేసీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న గురువారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కవితల పుస్తకాలు కేసీఆర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఇద్దరూ తెలంగాణ సాహిత్యం, సంస్కృతి, రాజకీయాలు తదితర అంశాలపై చర్చించారు. శాంతియుత పద్ధతిలో సాగిన కేసీఆర్ ఉద్యమ ప్రస్థానం, పదేళ్లలో కేసీఆర్ పాలన ఆదర్శవంతంగా సాగిందని గోరటి తనదైన సాహిత్య శైలిలో వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు వర్దెల్లి వెంకన్న తన 'పిట్ట వాలిన చెట్టు'పుస్తకాన్ని కేసీఆర్‌కు అందించారు. ఈ పుస్తకాన్ని పరిశీలించిన కేసీఆర్ వర్దెల్లిని అభినందించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నిఘా'కు నిధులివ్వండి

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సీఎం రేవంత్ వినతి



కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రాష్ట్ర స్థాయి అత్యున్నత నిఘా విభాగాలైన తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధునీకరణకు నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలో అమిత్ షాను ఆయన నివాసంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో కలిసి సీఎం రేవంత్ కలిశారు. సుమారు గంటపాటు షాతో భేటీ అయ్యారు. డ్రగ్స్ కట్టడి, సైబర్ నేరాల నియంత్రణకు కావాల్సిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల కొనుగోలు కోసం టీజీ న్యాబ్‌కు రూ. 88 కోట్లు, టీజీ సీఎస్‌బీకి రూ.90 కోట్లు కేటాయించాలని అమిత్ షాను కోరారు. ఐదేళ్లకోసారి ఐపీఎస్ క్యాడర్ సమీక్ష చేయడం తప్పనిసరని, తెలంగాణకు సంబంధించి 2016లో తొలిసారి సమీక్ష నిర్వహించారని, నాటి నుంచి సమీక్ష చేయనుందున వెంటనే సమీక్ష చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు 61 ఐపీఎస్ పోస్టులు కేటాయించారని, కొత్త రాష్ట్ర అవసరాలకు ఐపీఎస్‌లు సరిపోనందున.. తెలంగాణకు అదనంగా 29 ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

మరికొన్ని వినతులు

- ➤ తెలంగాణలో వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టేందుకు ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భద్రతా దళాల క్యాంపులను ఏర్పాటు చేయాలి.
- ➤ వామపక్ష తీవ్రవాదం అణచివేత కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి గ్రామం, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామ పరిధిలో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలి.
- ➤ మావోయిస్టుల ఏరివేతకు ఏర్పాటు చేసిన ఎస్పీవోల్లో మాజీ సైనికులు, మాజీ పోలీసులనే చేర్చుకోవాలన్న నిబంధనను సవరించి 1,065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి అనుమతించాలి.
- ➤ ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 60% కేంద్రం వాటా కింద రూ.18.31 కోట్లను వెంటనే విడుదల చేయాలి.
- ➤ ఏపీ, తెలంగాణ మధ్య విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలి. షెడ్యూల్-9లోని ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్-10లోని సంస్థల వివాదం సామరస్యపూర్వకంగా పరిష్కారానికి కృషి చేయాలి. ➤ విభజన చట్టంలో ఎక్కడా ప్రస్తావించని ఆస్తులు, సంస్థలను ఏపీ క్లెయిమ్ చేసుకుంటున్నందున అందులో తెలంగాణకు న్యాయం జరిగేలా చొరవ చూపాలి.

ధైర్యశాలి మా ముఖ్యమంత్రి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: 'మూడు నెలల కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అని చెప్పి ఎన్నికలకు వెళ్లిన ధైర్యశాలి మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన జనగామకు వెళ్తూ మార్గమధ్యంలో యాదాద్రి జిల్లా భువనగిరిలో ఆగారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పాలనపై దృష్టి పెట్టామని, మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీరు అందించే పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని చెప్పారు. రూ.4,500 కోట్లతో హైదరాబాద్- విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల టెండర్లు సెప్టెంబర్‌లో పిలుస్తున్నామని తెలిపారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడి ఉప్పల్, ఘట్కేసర్ ఫ్లైఓవర్ పనుల పాత టెండర్ రద్దుచేసి కొత్తటెండర్ నెలరోజుల్లో పిలుస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో ఏడు స్థానాల్లో డిపాజిట్‌రాని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చి పదిహేనేళ్లు ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. యాదగిరిగుట్ట దేవస్థానం ఈఓగా సమర్థుడైన అధికారి భాస్కర్‌రావును నియమించి ఆరు నెలల్లో భక్తుల సౌకర్యాలను మెరుగుపరిచామన్నారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు కృషి

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం దొడ్డి కొమురయ్య ఆశయాలను కొనసాగిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం ఉద్యమాలను, ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. తెలంగాణ సాధనకు ఆ నాటి దొడ్డి కొమురయ్య పోరాటమే స్ఫూర్తి అని తెలిపారు. తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు కొమురయ్య జీవితం సజీవంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, బీసీ కమీషన్ చైర్మన్ వకులా భరణం కృష్ణమోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులు పూర్తి

జిల్లా ఎమ్మెల్యేలతో సమీక్షలో మంత్రి దామోదర

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, సంగంబండ, జూరాల, తుమ్మిళ్ల, ఆర్డీఎస్, రేలంపాడు తదితర ప్రాజెక్టులన్నింటినీ శరవేగంగా పూర్తి చేసేందుకు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర్ రాజనరసింహ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. సచివాలయంలో గురువారం ఆయన జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ప్రాజెక్టులపై సమీక్షించారు. జిల్లా ప్రాజెక్టులపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న సమీక్షకు సన్నాహంగా ఈ సమావేశం నిర్వహించినట్టు దామోదర రాజనరసింహ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వాస్తవానికి అసెంబ్లీ, బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఎమ్మెల్సీల చేరికపై గత నెలలోనే చర్చలు జరిగాయి. వీరంతా వారం రోజుల ముందే పార్టీలో చేరాల్సి ఉన్నా, అనివార్య కారణాల వల్ల సాధ్యం కాలేదు. ఒకవైపు ఈ నెలలోనే బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండడం, మరోవైపు ఆషాఢమాసం రానుండడంతో ఆషాఢ అమావాస్యకు ముందురోజు రాత్రి వీరంతా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరి చేరికతో మండలిలో కాంగ్రెస్ బలం 12కు చేరనుంది. కాగా, సీఎం నివాసానికి చేరుకోవడానికి ముందు ఆరుగురు ఎమ్మెల్సీలు దస్‌పల్లా హోటల్‌లో సమావేశమయ్యారు. అక్కడి నుంచి నేరుగా సీఎం నివాసానికి చేరుకున్నారు.

క్లుప్తంగా...

ఎలక్ట్రానిక్స్ తయారీలో పెట్టుబడి అవకాశాలు

ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మొహింద్రూ



రేవంత్ రెడ్డితో వై.గురు, పంకజ్ మొహింద్రూ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రాష్ట్రంలోని బలమైన మౌలిక సదుపాయాలు, అత్యంత నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని ఉపయోగించుకోవడం ద్వారా ఎలక్ట్రానిక్స్ తయారీలో తెలంగాణ గణనీయంగా పెట్టుబడులను ఆకర్షించవచ్చని ఇండియా సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) చైర్మన్ పంకజ్ మొహింద్రూ అన్నారు. ఉపాధి అవకాశాలను సృష్టించి రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తోడ్పడవచ్చని చెప్పారు. సెల్‌కాన్ సీఎండీ వై.గురుతో కలిసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో గురువారం ఢిల్లీలో పంకజ్ మొహింద్రూ సమావేశమయ్యారు. సెమీకండక్టర్ ఉత్పత్తి రూపకల్పనలో తెలంగాణ గ్లోబల్ లీడర్‌గా ఎదగగల గొప్ప అవకాశం ఉందని ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. వికసిత్‌భారత్ వైపు ప్రయాణంలో తెలంగాణ ఒక శక్తి గుణకం అవుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఎంఎన్‌జే ఆస్పత్రిలో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీ

- నోటిఫికేషన్ విడుదల

సాక్షి, హైదరాబాద్: మెహిదీ నవాజ్ జంగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ అండ్ రీజనల్ కేన్సర్ సెంటర్ (ఎంఎన్‌జే కేన్సర్ సెంటర్)లో 14 విభాగాల్లో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఉద్యోగాల భర్తీకి జూలై 12వ తేదీ నుంచి 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు బోర్డు ప్రకటించింది. సర్జికల్ ఆంకాలజీలో 9 పోస్టులున్నాయి. రేడియోథెరపీ (7), అనస్తీషియా(5), గైనిక్ ఆంకాలజీ(4), పీడియాట్రిక్ ఆంకాలజీ (4), పెయిన్ అండ్ పల్లియేటీవ్ కేర్ (4), న్యూక్లియర్ మెడిసిన్ (2), పాథాలజీ(2), ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ (2), రేడియాలజీ (2), బయోకెమిస్ట్రీ, డెంటల్ సర్జరీ, మైక్రో బయాలజీ, ట్రాన్స్‌ఫ్యూషన్ మెడిసిన్ కేటగిరీలో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు భర్తీ చేయనున్నారు. అర్హత పరీక్ష, పాయింట్లు తదితర వివరాలను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయాలి

40 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ డిమాండ్



టీఈఏ సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు స్థానికతను కోల్పోకుండా సొంత జిల్లాలకు బదిలీ చేసి, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టీఈఏ) రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ జి.నిర్మల డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన టీఈఏ సమావేశంలో ఆమె మాట్లాడుతూ...సాధారణ బదిలీలపై నిషేధం ఎత్తివేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ఇవ్వాలని, పీఆర్‌సీ కమిటీ నివేదికను ఆధారంగా చేసుకుని తక్షణమే 40% ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలని కోరారు. అసోసియేషన్ కేంద్ర, జిల్లా కమిటీ సభ్యులకు సాధారణ బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చైర్మన్ చిలగాని సంపత్‌కుమార్, సంఘ నేతలు రామరాజు, ఎ.రామచంద్రం, ఎంకే రాజు, జానకిభాయి, శంకర్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో మరో సర్టిఫికెట్ కోర్సు ప్రారంభం

- హెచ్‌సీయూ–ఫెర్నాండెజ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో హెచ్‌సీయూ–ఫెర్నాండెజ్ ఫౌండేషన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్–బర్త్ డౌలా సర్టిఫికెట్ కోర్సును గురువారం ప్రారంభించారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, తర్వాత తల్లులకు మద్దతివ్వడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానంతో ఔత్సాహిక బర్త్ ప్రొఫెషనల్స్‌ను సన్నద్ధం చేయడానికి ఈ వైద్యేతర కోర్సును రూపొందించారు. ఆరు నెలల కాలపరిమితితో కూడిన ఆన్‌లైన్ శిక్షణ ఉంటుంది. అడ్మిషన్ నుంచి రెండేళ్లలో పూర్తి చేయాలి. కోర్సు సమయంలో అభ్యర్థులు ప్రినేటల్ యోగా, ప్రసవ విద్య, చనుబాలివ్వడం, కౌన్సెలింగ్ మొదలైన అదనపు సహాయ సేవలను అందించేందుకు శిక్షణ పొందుతారు. దంపతులకు గర్భం, ప్రసవం, ప్రసవానంతర సేవలను అందించేలా ఈ కోర్సును రూపొందించారు.

సీఎస్‌ఈ సీట్లు పెంచాల్సిందే

ప్రభుత్వంపై ఇంజనీరింగ్ కాలేజీల ఒత్తిడి

- కావాలంటే కోర్ గ్రూప్ సీట్లు తగ్గించాలని విజ్ఞప్తి
- డిమాండ్ లేని కోర్సులు ఎందుకంటూ వాదన
- అవసరమనుకుంటే పెంచే సీట్లకు పూర్తి ఫీజు పెట్టాలని సూచన
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్


కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో సీట్లు పెంచాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ మేరకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అనుమతించిందని, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ (కోర్) బ్రాంచీల్లో సీట్లు తగ్గించైనా, సీఎస్ఈ సహా అనుబంధ కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు పెంచాలని డిమాండ్ చేస్తున్నాయి. డిమాండ్ లేని కోర్సుల్లో సీట్లు ఉన్నా ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నాయి. ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వ పెద్దలను కలిసిన కొన్ని యాజమాన్యాలు.. అధికారులు ఉద్దేశపూర్వకంగా సీట్లు పెంచేందుకు అడ్డుపడుతున్నారని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ వంటి కోర్సులకు ఏటా డిమాండ్ పెరుగుతోందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళినట్టు సమాచారం. రాష్ట్రంలోని దాదాపు 125 కాలేజీలు సీట్ల పెంపు ప్రతిపాదన తెచ్చాయి.

సీట్లు తగ్గిస్తే అవి కనుమరుగే..

కంప్యూటర్ అనుబంధ కోర్సుల్లో సీట్ల పెంపుపై అధికారులు అభ్యంతరం చెప్పకపోయినా.. కోర్ గ్రూప్ కోర్సులకు కోత పెట్టడాన్ని అంగీకరించడం లేదు. దీనివల్ల ఈ కోర్సులు అసలుకే తెరమరుగయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. భవిష్యత్‌లో ఈ కోర్సులకు మళ్లీ డిమాండ్ ఉంటుందని అంటున్నారు. మరోవైపు బోధన ప్రణాళికను మారుస్తున్నారని, కోర్ గ్రూపులో జాయిన్ అయినా, సాఫ్ట్‌వేర్ వైపు వెళ్ళే వీలుందని వివరిస్తున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు కూడా అందుబాటులోకి వచ్చాయని పేర్కొంటున్నారు. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

గత ఏడాది తగ్గిన చేరికలు

గత ఏడాది 58 శాతం విద్యార్థులు సీఎస్‌సీ, అనుబంధ కోర్సుల్లోనే చేరారు. సివిల్, మెకానికల్ ఈఈఈ కోర్సుల్లో 12,751 సీట్లు ఉంటే, కేవలం 5,838 మంది మాత్రమే (45.78 శాతం) చేరారు. ఈఈఈలో 5,051 సీట్లు ఉంటే 2,777 సీట్లు, సివిల్‌లో 4,043 సీట్లు ఉంటే 1,761 సీట్లు, మెకానికల్‌లో 3,657 సీట్లు ఉంటే, 1,300 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయని అధికారులు ప్రభుత్వానికి పంపిన నివేదికలో తెలిపారు. ఆయా కోర్సులను మరింత బలహీనపరిచే ప్రైవేటు కాలేజీల ఆలోచన సరికాదని స్పష్టం చేస్తున్నారు. కాగా ప్రైవేటు కాలేజీల విజ్ఞప్తిని అంగీకరిస్తే ఈ ఏడాది కంప్యూటర్ కోర్సుల్లో దాదాపు 21 వేల సీట్లు పెరిగే వీలుంది. అదే సమయంలో కోర్ గ్రూపుల్లో దాదాపు 5 వేల సీట్లు తగ్గే అవకాశం కన్పిస్తోందని అంటున్నారు.



రీయింబర్స్‌మెంట్ వద్దు..

రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో అన్ని బ్రాంచీలకు కలిపి గత ఏడాది లెక్కల ప్రకారం 1.22 లక్షల సీట్లున్నాయి. ఇందులో 82 వేల సీట్లు కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తున్నారు. మిగతావి మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. కన్వీనర్ కోటా కింద భర్తీ చేసే సీట్లలో చాలావరకూ ఫీజును ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సి ఉంటుంది. దీంతో సీట్లు పెంచితే ఎక్కువ నిధులు చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కారణంగానే సీట్ల పెంపునకు కొన్నేళ్ళుగా ప్రభుత్వం పెద్దగా అనుమతించడం లేదు. అయితే డిమాండ్ లేని కోర్సుల్లో తగ్గించుకుని, డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లు పెంచుకునేందుకు ఏఐసీటీఈ రెండేళ్ల క్రితం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే సంబంధిత యూనివర్సిటీలు కూడా ఇందుకు అనుమతించాల్సి ఉంటుంది. కానీ సీట్లు పెంచడం వల్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బడ్జెట్ పెరగడంతో పాటు కొత్తగా అందుబాటులోకి వచ్చే కోర్సులకు ఫ్యాకల్టీ కొరత ఏర్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్‌కు మరో నాలుగేళ్ళ పాటు సరైన బోధనా సిబ్బంది దొరకడం కష్టమని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే నాన్ రీయింబర్స్‌మెంట్ సీట్ల పెంపు చేపట్టాలంటూ కాలేజీల యాజమాన్యాలు కొత్త ప్రతిపాదన తెరపైకి తెస్తున్నాయి. అంటే పెరిగిన సీట్లకు ఫీజుల నియంత్రణ కమిటీ నిర్ణయించిన మేరకు విద్యార్థే ఫీజు చెల్లించాలన్న మాట. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేయదు. ప్రస్తుతం కొన్ని కాలేజీల్లో ఈ తరహాలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు నడుస్తున్నాయి. ఈ విధానాన్ని అనుసరిస్తే బాగుంటుందని సూచిస్తున్నారు.

గత కొన్ని సంవత్సరాలుగా కన్వీనర్ కోటా సీట్ల భర్తీ ఇలా..



కామన్ టైమ్‌టేబుల్ ఉత్తర్వులను రద్దు చేయాలి

టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గురుకుల విద్యా సంస్థలన్నింటా కామన్ టైమ్‌టేబుల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ) అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.బాలరాజు, ఎస్.దయాకర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఐదు గురుకుల సొసైటీల పరిధిలో దాదాపు ఆరువందలకు పైబడి గురుకుల పాఠశాలలున్నాయని, వీటిలో 70 శాతానికి పైగా గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు లేవన్నారు. పూర్తిస్థాయి వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో కామన్ టైమ్‌టేబుల్ అమలు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. చాలాచోట్ల వాష్ రూమ్‌లో డిమాండ్‌కు తగినట్లు లేవని, దీంతో స్నానాలు చేయడానికి గంటల కొద్దీ వేచిచూడాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బదిలీలపై పీఆర్ శాఖ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తేసిన నేపథ్యంలో.. బదిలీల ప్రతిపాదనలు పంపించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఒక ఫార్మాట్‌ను రూపొందించింది. జిల్లా పరిషత్ సీఈవో, డిప్యూటీ సీఈవోలు, డీఆర్‌డీవో, అదనపు డీఆర్‌డీవోలకు (సీఈవో, డిప్యూటీ సీఈవో కేడర్‌లో పనిచేస్తున్నవారు), జిల్లా పంచాయతీ అధికారులు, డివిజినల్ పంచాయతీ అధికారుల బదిలీల ప్రతిపాదనలను కలెక్టర్లు పంపించాలని నిర్దేశించింది. మండల పంచాయతీ అధికారులు (ఎంపీవోలు), అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 1, 2, 3, సీనియర్ అసిస్టెంట్ (డీపీవో యూనిట్)ల ప్రతిపాదనలను జిల్లా పంచాయతీ అధికారులు, ఎంపీడీవోలు, ఇంకా సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు (జెడ్పీపీ, ఎంపీపీ యూనిట్లు) జెడ్పీపీ సీఈవోలు పంపించాలని సూచించింది. ఈ బదిలీలు కోరుకుంటున్నవారు తమ పూర్తి సమాచారాన్ని (ఆయా ఉద్యోగుల ఫార్మాట్‌లకు అనుగుణంగా) ఆయా కేడర్ల వారీగా విడివిడి షీట్లపై సంతకాలు చేసి శుక్రవారంలోగా పంపించాలని స్పష్టం చేసింది.

సొంత రాష్ట్రాలకు ఉద్యోగ బదిలీలకు ఒక్క అవకాశం కల్పించాలి

సాక్షి, హైదరాబాద్: సొంత రాష్ట్రాలకు ఉద్యోగ బదిలీలకు ఒక్క అవకాశం కల్పించాలని నాన్ లోకల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌ఎల్‌టీఏ) ప్రధాన కార్యదర్శి వి.సూర్యనారాయణ, తెలంగాణ నెటివ్ ఎంప్లాయీస్ వర్కింగ్ ఇన్ సీమాంధ్ర అసోసియేషన్(టీఎన్ఈడబ్ల్యూఎస్ఏ) కార్యదర్శి అంజయ్య కోరారు. ఈ నెల 6న రెండు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు కలుస్తున్న నేపథ్యంలో అంతర్రాష్ట్ర ఉద్యోగ బదిలీల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. గురువారం తెలంగాణ సచివాలయం మీడియా పాయింట్‌లో వారు మాట్లాడుతూ...2014 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఇప్పటివరకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో స్థానికేతరులుగా విధులు నిర్వహిస్తూ... ఉద్యోగుల పంపకాల్లో ఎలాంటి ఆప్షన్ లేని జిల్లా/ జోనల్/ మల్టీజోనల్ ఉద్యోగులను వారి సొంత రాష్ట్రాలకు అంతర్రాష్ట్ర ఉద్యోగ బదిలీలు చేయాలని కోరారు.

చచ్చిపోతున్నా జీతం ఇవ్వరా?

- పాతలింగాల జీపీ కార్యదర్శి ఆవేదన
- అనారోగ్యంతో బాధపడుతున్నా కనికరించడంలేదని వెల్లడి

కామేపల్లి (ఖమ్మం): అనారోగ్యంతో బాధపడుతూ కూడా ప్రభుత్వ విధులన్నింటినీ విధిగా నిర్వర్తిస్తున్నా తనకు జీతం ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఓ గ్రామపంచాయతీ కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేస్తూ వాట్సాప్ గ్రూప్‌లో పెట్టిన మెసేజ్ చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలోని పాతలింగాల గ్రామపంచాయతీ కార్యదర్శి ఎల్.మోహన్ బాబు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అయినా విధులు నిర్వర్తిస్తుండగా, జీతం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని తనకు ఆత్మహత్య చేసుకోవడం తప్ప వేరే దారిలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. సహచర ఉద్యోగులైనా తనకు సాయం చేయాలని కోరుతూ వాట్సాప్ గ్రూప్‌ల్లో మెసేజ్ చేశాడు. ఇటీవల తన సర్వీస్ పర్మినెంట్ అయిందని..సర్వీస్ రిజిస్టర్ ఉంటే హెల్త్ కార్డు వస్తుందని, ఆపై గుండె సమస్యకు మెరుగైన వైద్యం చేయించుకోవచ్చని తెలిసి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్తే కొందరు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపించారు. ఇదేవిషయమై ఎంపీడీఓ రవీందర్‌ను వివరణ అడగగా బుధవారం సంత నిర్వహణ, గురువారం కలెక్టరేట్‌లో సమావేశం కారణంగా వేతనాల బిల్లులు చేయలేకపోయామని తెలిపారు. శుక్రవారం బిల్లులు చేసి వేతనాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రాజస్తాన్‌లో సింగరేణి సోలార్ ప్లాంట్

అక్కడి ఉన్నతాధికారులను కలిసిన సీఎండీ ఎన్.బలరాం



అధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎండీ బలరాం

గోదావరిఖని (రామగుండం): రాజస్తాన్‌లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సింగరేణి సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు సంస్థ సీఎండీ ఎన్.బలరాం గురువారం రాజస్తాన్ రాజధాని జైపూర్‌లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఆ రాష్ట్ర ఇంధన శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ, ట్రాన్స్‌కో సీఎండీ అలోక్‌ను కలిశారు. సింగరేణి ఆధ్వర్యంలో ప్లాంట్ ఏర్పాటుకు ముందుకువస్తే రాజస్తాన్ ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని అలోక్ తెలిపినట్లు వెల్లడించారు. అనంతరం రాజస్తాన్ జెన్‌కో సీఎండీ దేవేంద్రశ్రింగి, రెన్యూవబుల్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ నథ్‌మల్, డిస్కమ్స్ చైర్మన్ భానుప్రకాశ్ ఏటూరును కలిసి ప్లాంట్ ఏర్పాటు, తర్వాత విద్యుత్ కొనుగోలు తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్న యోచనలో ఉన్నట్లు సంస్థ చైర్మన్ బలరాం.. రాజస్తాన్ ఉన్నతాధికారులకు వివరించారు. సోలార్ పార్కులో సింగరేణి ప్లాంట్‌కు అనుకూలమైన స్థలాన్ని పరిశీలించిన తర్వాత పూర్తి ప్రతిపాదనలతో మరోసారి సమావేశం అవుతామని బలరాం తెలిపారు. సీఎండీ వెంట డైరెక్టర్ సత్యనారాయణరావు, సోలార్ ఎనర్జీ జీఎం జానకీరాం, చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథరాజు ఉన్నారు.

జెడ్పీలకు కలెక్టర్లే స్పెషల్ ఆఫీసర్లు

సాక్షి, హైదరాబాద్: జిల్లా ప్రజా పరిషత్‌ల (జెడ్పీ)కు కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గురువారంతో 32 జిల్లా పరిషత్‌ల పాలకమండళ్ల పదవీకాలం ముగియడంతో, శుక్రవారం జెడ్పీలలో కలెక్టర్లు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇదిలా ఉంటే...గురువారం దాదాపుగా అన్ని మండలాల్లో (పదవీకాలం ముగియని ఎంపీపీలు, పాలకమండళ్ల మినహా) ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవోల కంటే ఒక ర్యాంక్ పైస్థాయి అధికారులను మండలాలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించాలని పీఆర్, ఆర్‌డీ శాఖ బుధవారమే ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యా, వైద్య, వ్యవసాయ, ఇతర శాఖలకు చెందిన ఈ ర్యాంక్ అధికారులు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీ అయిన మండలాలకు ఎన్నికలు నిర్వహించి ఎంపీపీ అధ్యక్షులు, ఎంపీపీ ఉపాధ్యక్షులను ఎన్నుకునే దాకా స్పెషల్ ఆఫీసర్లు మండలాల్లో తమ విధులను నిర్వహించనున్నారు.

టీజీఎంసీ రిజిస్ట్రార్‌గా లాలయ్య కుమార్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్‌గా విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి డాక్టర్ దండెం లాలయ్య కుమార్ నియమితులయ్యారు. డాక్టర్ లాలయ్య గతంలో కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ పరిధిలో ముంబైలోని ఓఎన్‌జీసీ ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఆ తర్వాత బాబా అటామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శాస్త్రవేత్తగా పనిచేశారు. ఐఆర్ఎస్‌కు ఎంపికైన తర్వాత త్రిపుర ఎన్నికల కమిషనర్‌గా, నాగ్‌పూర్ జీఎస్‌టీ కమిషనర్‌గా కూడా సేవలందించారు.

గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా సర్వేశ్వర్‌రెడ్డి

డైరెక్టర్‌గా పనిచేసిన ఇ.వి.నర్సింహారెడ్డి రిలీవ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా వి.సర్వేశ్వర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన ఇ.వి.నర్సింహారెడ్డి పాఠశాల విద్యాశాఖ సంచాలకునిగా ఇటీవల బదిలీ అయ్యారు. ఈ స్థానంలో గిరిజన సంక్షేమ శాఖలో అదనపు సంచాలకునిగా కొనసాగుతున్న వి.సర్వేశ్వర్‌రెడ్డికి ఇన్‌చార్జి డైరెక్టర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ నర్సింహారెడ్డి రిలీవ్ అయ్యారు.

గద్వాల కాంగ్రెస్‌లో లొల్లి..

బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్లను చేర్చుకోవద్దంటూ నిరసనలు



గద్వాలలో ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ నాయకులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: గద్వాల కాంగ్రెస్‌లో చేరికల చిచ్చు రాజుకోగా.. నడిగడ్డలో రాజకీయం రసవత్తరంగా మారింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారం ఆ పార్టీలో అలజడి సృష్టిస్తోంది. ప్రధానంగా తాజా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గాన్ని కలవరపాటుకు గురిచేస్తోంది. ఈ క్రమంలో కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ ఆమె వర్గానికి చెందిన అనుచరులు, అభిమానులు రోడ్డెక్కుతున్నారు. నియోజకవర్గంలోని గద్వాల మున్సిపాలిటీతోపాటు కేటీదొడ్డి, మల్దకల్, గట్టు మండలాల్లోని పలు ప్రాంతాల్లో సరిత వర్గానికి చెందిన నాయకులు గురువారం ధర్నాలకు దిగారు. గద్వాల పట్టణంలోని రాజీవ్‌మార్గ్‌లో ప్రసాద్ అనే వ్యక్తి సెల్‌టవర్ ఎక్కి ఆందోళన చేపట్టారు. సరిత గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కృష్ణమోహన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలైన విషయం తెలిసిందే.

శనివారం స్పష్టత..

ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం గద్వాల పట్టణంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలతోపాటు తన అభిమానులతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరాలని మంత్రి జూపల్లిని సంప్రదించిన మాట వాస్తవమేనని చెప్పారు. కాగా, శనివారం హైదరాబాద్‌కు రమ్మని ఎమ్మెల్యే బండ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోన్‌చేసినట్లు సమాచారం. దీంతో ఆయన ఏ రోజు కాంగ్రెస్‌లోకి వస్తారన్నది శనివారం తేలనుంది.

40 శాతమే అయితే ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

అభిప్రాయపడుతున్నాయి. సాధారణ బదిలీ ప్రక్రియలో భాగంగా రాష్ట్రస్థాయి, మల్టీజోనల్, జోనల్, జిల్లా కేడర్‌లో బదిలీలు జరగనున్నాయి. ఈ క్రమంలో కేడర్ యూనిట్ ప్రకారం బదిలీలకు అర్హులైన ఉద్యోగుల జాబితాను సంబంధిత శాఖలు ప్రకటిస్తాయి. 40 శాతం మాత్రమే బదిలీలకు అవకాశం కల్పిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రకారం జిల్లా కేడర్‌లో 10 మంది ఉద్యోగులు ఉంటే అందులో కేవలం నలుగురికి మాత్రమే బదిలీకి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే రాష్ట్రంలో సాధారణ బదిలీలు జరిగి దాదాపు ఆరేళ్లు కావొస్తుంది. దీంతో నాలుగేళ్ల సర్వీసు దాటిన ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పిస్తే పనిచేస్తున్న వారిలో మెజారిటీ శాతం తప్పనిసరి బదిలీ కేటగిరీలో అర్హత సాధించే అవకాశం ఉంది. కానీ 40 శాతం మందికి అవకాశం కల్పిస్తే కేవలం కొందరు సీనియర్లకు మాత్రమే స్థానచలనం కలుగుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరోవైపు ఆర్డర్ టు సర్వ్ ప్రాతిపదికన పలు జిల్లా కార్యాలయాల్లో ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. సాధారణ బదిలీల కోసం వారంతా ఎదురుచూస్తుండగా... ప్రభుత్వ నిబంధన ప్రకారం వీరిలో మెజారిటీ ఉద్యోగులకు తాజా బదిలీల్లో అవకాశం కలుగుతుందా? లేదా? వేచి చూడాలి. అయితే 40శాతం నిబంధనను ఎత్తివేయాలనే డిమాండ్ కూడా ఉద్యోగవర్గాల నుంచి వినిపిస్తోంది. ఉద్యోగుల సీనియారిటీ జాబితా, తప్పనిసరి బదిలీల జాబితా వెలువడేందుకు మరో నాలుగైదు రోజుల సమయం పడుతుంది. ఈలోపు ఎంతమందికి బదిలీల్లో అవకాశం కలుగుతుందో స్పష్టత వస్తుందని ఉద్యోగ సంఘాల నేతలు అభిప్రాయపడుతున్నారు.

తండ్రి లేని బిడ్డలకు వారి ఆస్తిని వారికివ్వండి. పరిశుద్ధమైన, ధర్మసమ్మతమైన వస్తువులకు బదులు అపవిత్రమైన, అధర్మమైన వస్తువులను తీసుకోకండి. మీ సొమ్ములతో పాటు వారి సొమ్మును కూడా కలగాపులగం చేసి స్వాహా చేయకండి. ముమ్మాటికీ ఇది మహా పాతకమే.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 5 జూలై 2024

రచ్చ కాదు... చర్చ కావాలి!

కొత్త సభ కొలువు తీరిందన్న మాటే కానీ, పార్లమెంట్‌లో పాత దృశ్యాలే పునరావృతమయ్యాయి. 18వ లోక్‌సభ ఏర్పడ్డాక జరిగిన తొలి పార్లమెంట్ సమావేశాలు సభ్యుల ప్రమాణ స్వీకారం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానానికే పరిమితమయ్యాయి. కానీ, నేతలెవరు మాట్లాడుతున్నా... వెనుక నుంచి అవే అరుపులు, గందరగోళ పరిస్థితులు, రన్నింగ్ కామెంటరీలు, సభాపతితో వాగ్వాదాలు, చివరకు వాకౌట్లు తప్పలేదు. సర్వసాధారణంగా ఏకగ్రీవం గానో, లేదంటే అధికార – ప్రతిపక్షాల మధ్య పోటీతోనో జరగాల్సిన లోక్‌సభ స్పీకర్ ఎన్నిక సంప్రదాయానికి భిన్నంగా ఈసారి మూజువాణి ఓటుతో సాగింది. ఇక, ప్రతిపక్షాలకు కేటాయించాల్సిన లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని తద్భిన్నంగా గత అయిదేళ్ళుగా ఖాళీగా అట్టిపెట్టేసిన అధికార బీజేపీ, ఈసారి కూడా ఆ పదవిని వారికి వదిలిపెట్టే పెద్దమనసు చేస్తున్నట్టు లేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వ సారథిగా తన మిత్రపక్షాలకు ఆ పదవిని కట్టబెట్టాలని బీజేపీ చూస్తున్నట్టు వస్తున్న కథనాలే అందుకు నిదర్శనం. ఇక, సభానాయకుడికీ, ప్రతిపక్ష నేతకూ మధ్య పొసగని పరిస్థితి సరేసరి. వెరసి లోక్‌సభలో మంగళవారం, రాజ్యసభలో బుధవారం ముగిసిన తొలి సమావేశాలు అసంతృప్తినే మిగిల్చాయి.

ఈ పాపంలో అధికార, ప్రతిపక్షాలు రెంటికీ సమాన భాగస్వామ్యం ఉంది. కొద్ది నెలలుగా పూర్తిస్థాయి ఎన్నికల ప్రచారంలో మునిగితేలిన పార్టీలు ఇప్పటికీ ఆ మానసిక స్థితి నుంచి బయట పడినట్టు లేవు. ఎన్నికల ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా పార్లమెంట్ సాక్షిగా ఇరుపక్షాలూ పరస్పరం ఎన్నికల ప్రచార తరహా ఆరోపణల పర్వం కొనసాగించడం దురదృష్టం. ప్రతిపక్ష నాయకుడిగా తొలిసారిగా బాధ్యతలు చేపట్టిన రాహుల్ గాంధీ తన ప్రథమ ప్రసంగంలోనే ప్రభుత్వంపై నిశిత విమర్శలతో దూకుడు ప్రదర్శించారు. ఇతర ప్రతిపక్ష నేతలు సైతం శక్తిమంతమైన ప్రసంగాలే చేశారు. కాబట్టి వారికి తగినంత సమయం ఇవ్వలేదన్న ప్రసక్తే లేదు. రాహుల్ ఉద్వేగభరితంగా మాట్లాడుతూ మార్కులు సంపాదించినా, సరైన గణాంకాలతో సమస్యల్ని నిర్దిష్టంగా ప్రస్తావించలేకపోయారు. అగ్నివీర్ లాంటి అంశాల్లో ఆయన లెక్కలు తప్పు చెప్పారు. మరోపక్క ప్రధాని లోక్‌సభలో మాట్లాడుతున్నంత సేపూ ప్రతిపక్షాలు నినాదాలు హోరెత్తించాయే తప్ప, హుందాతనం పాటించలేదు. రాహుల్ సైతం సభలో సభ్యుల్ని రెచ్చిపొమ్మన్నట్టు ప్రేరేపించడం సైతం ఏ మాత్రం సమర్థనీయం కాదు.

రాహుల్‌ది పిల్లతనం, కాంగ్రెస్ పరాన్నజీవి లాంటి రాజకీయ విమర్శలు గుప్పించిన మోదీ కూడా తక్కువేమీ తినలేదు. ఎంతసేపటికీ పాత ఎమర్జెన్సీ గాయాన్ని గుర్తు చేసి, కాంగ్రెస్‌ను తప్పు బట్టడానికి ప్రయత్నించారు. లేదంటే గడచిన తమ పదేళ్ళ ప్రస్థానాన్ని గుణగాన సంకీర్తన చేశారు. అంతేతప్ప లోక్‌సభలో చేసిన రెండున్నర గంటల సుదీర్ఘ ప్రసంగంలో ప్రతిపక్షాలు ప్రస్తావించిన, దేశాన్ని పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కార్యాచరణ ఏమిటన్నది మాత్రం చెప్పలేదు. చెప్పాలనుకోలేదు. సంక్షుభిత మణిపుర్‌లో ఏడాదిగా ఒక్కసారైన పర్యటించని మోదీ సదరు ఈశాన్య రాష్ట్రంలో పరిస్థితులు మెరుగుపడ్డాయంటూ రాజ్యసభలో అసత్యాలాపన చేయడం మరీ విడ్డూరం. ఒక్కమాటలో... ఈసారి సొంత మెజారిటీ తగ్గి, కూటమి ప్రభుత్వం నడుపుతున్న మోదీ ఇప్పటికీ గత రెండుసార్లు తిరుగులేని మెజారిటీతో సాగిన బీజేపీ ప్రభుత్వ ఆధిపత్య ధోరణినే ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ పెద్దగా, అనుభవజ్ఞుడిగా ప్రతిపక్షాలను సైతం కలుపుకొని పోవాలన్న ఆలోచన చేయట్లేదు. పట్టువిడుపులు చూపట్లేదు. దాంతో ఇరుపక్షాలకూ మధ్య రాజీ కుదిరేలా కనిపించట్లేదు.

అందరూ కలిసి నాటకీయ చర్యలు, వ్యాఖ్యలతో పార్లమెంట్‌ను (రణ) రంగస్థలిగా మార్చేశారన్నది చేదు నిజం. అధికార, ప్రతిపక్ష నేతలు అంశాల వారీగా చర్చిస్తే, విభేదిస్తే ఫరవాలేదు కానీ, నిత్యం ఉప్పు నిప్పుగా ఉంటే పార్లమెంట్ నడిచేదెట్లా? మళ్ళీ జనం ముందుకు వెళ్ళడానికి మరో అయిదేళ్ళుండగా, రేపే ఎన్నికలన్నట్టు రాజకీయ విమర్శల్లో మునిగితేలితే లాభమేంటి? నీట్ పరీక్ష, నిరుద్యోగం, ఈ అయిదేళ్ళలో సాగాల్సిన నియోజక వర్గ పునర్విభజన, ఇప్పటికే చాలా ఆలస్యమైపోయిన జనగణన లాంటి అనేక తక్షణ, దీర్ఘకాలిక అంశాలు చర్చకు మిగిలే ఉన్నాయి. అలాంటి వాటిపై దృష్టి పెట్టాలి. కీలకమైన బిల్లుల ఆమోదానికి లోక్‌సభలో టీడీపీ, జేడీయూల పైన, రాజ్యసభలో బిజూ జనతాదళ్ సైతం దూరమైనందున ఇతరులపైన ఆధారపడాల్సిన మోదీ 3.0 ఆభిజాత్యం వదులుకోకపోతే కష్టం. ఘర్షణ, విద్వేషం మరింత పెరిగిపోవడాని కన్నా ముందే నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలి. దేశ శ్రేయస్సు కోసం హుందా చర్చకు తెర తీయాలి.

బడ్జెట్ కోసం జూలై మూడో వారంలో పార్లమెంట్ తిరిగి సమావేశం కానుంది. అప్పుడైనా అధికార, ప్రతిపక్షాలు తమ వైఖరి మార్చుకోవాలి. ఇరుపక్షాలూ విజ్ఞతతో వ్యవహరించాలి. ప్రతిపక్ష వాదనకు చెవి ఒగ్గాల్సిన బాధ్యత పాలకులకు తప్పనిసరిగా ఉంది. అదే సమయంలో– ప్రజలిచ్చిన మెజారిటీతో గద్దెనెక్కి, చెప్పే అధికారం చేజిక్కించుకున్న పాలకుల మాటలను ప్రతిపక్షాలూ సావధానంగా విని తీరాలి. ఎవరు ఎవరిని మాట్లాడనివ్వబోమన్నా, వినిపించుకోబోమన్నా అది ప్రజాస్వామ్యం కాదు. ప్రజాక్షేమానికి అసలు పనికిరాదు. అనేక అంశాలపై పరస్పర భిన్నమైన అభిప్రాయాలు సహజంగానే ఉంటాయి. కానీ పార్లమెంట్‌లో జరగాల్సింది అర్థవంతమైన చర్చే తప్ప అనవసర రాద్ధాంతం కాదు. ప్రజాస్వామ్య దేవాలయంగా, అత్యున్నత నిర్ణాయక వేదికగా పార్లమెంట్‌కు ఉన్న ప్రతిష్ఠకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే అది అందరికీ నష్టం. గత పదేళ్ళుగా చట్టసభల్లో అంతకంతకూ పెరిగిపోతున్న ఇలాంటి ప్రవర్తన ఇలాగే కొనసాగితే, మొదటికే మోసం వస్తుంది. ప్రజాసమస్యలపై చర్చించాల్సిన చట్టసభల సమావేశాలకు ప్రయోజనం లేకుండా పోతుంది.

మహా కూటమిలో ‘ముఖ్య’ విభేదాలు

విశ్లేషణ



రోహిత్ చందావర్కర్

ముఖ్యమంత్రి అభ్యర్థి, సీట్ల పంపకం అంశాల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ)లో విభేదాలు కనిపిస్తున్నాయి. రానున్న మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఎన్సీపీ, శివసేన–ఉద్ధవ్ గ్రూపు, కాంగ్రెస్ ఉమ్మడిగా పోటీ చేస్తున్నాయి. వీటి మధ్య విస్తృత అవగాహన ఏమిటంటే, మొత్తం 288 స్థానాలకు గానూ తలా 95 స్థానాల్లో పోటీ చేయాలనేది! కానీ ఉద్ధవ్ పార్టీ 150 సీట్లలో వాస్తవ పరిస్థితిని అంచనా వేస్తున్నట్టుగా తెలుస్తోంది. ఇక, ఎంవీఏ ముఖ్యమంత్రి ముఖం ఉద్ధవ్ అని ఆయన గ్రూపు ప్రతినిధి వ్యాఖ్యానించడమూ, అలాంటి ముఖం ఏదీ లేదని శరద్ పవార్ అనడమూ, మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలేను ముఖ్యమంత్రి ముఖంగా చెబుతూ పోస్టర్లు వెలియడమూ కూటమి మధ్య జరగనున్న ఘర్షణను సంకేతిస్తున్నాయి.

ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) సభ్యులు సాధించిన అధిక ఓట్ల శాతం, మహారాష్ట్రలో ప్రతిపక్షాల చేతిలో తుపాకి గుండులా పనిచేసింది. అది వారికి ఎంత విశ్వాసాన్ని కలిగించిందంటే, కాబోయే ముఖ్యమంత్రి ఎవరు అనే అంశం గురించి, రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో పోటీ గురించి అనేక అంశాలపై పరస్పరం వివాదాలకు దిగుతూ కనిపిస్తున్నారు. ఎంవీఏ భాగస్వాములు ఇటీవల ముంబైలో మీడియా ముందు ఐక్యతా ముఖాన్ని ప్రదర్శించి ఉండవచ్చు; కానీ కొంతమంది నాయకులు ఇప్పుడు ముంబై వంటి ముఖ్య నగరాల్లోని కీలక నియోజకవర్గాలపై కూటమి అభ్యర్థుల మధ్య విభేదాలు ఎలా ఉన్నాయో వివరిస్తున్నారు.



నానా పటోలే, ఉద్ధవ్ ఠాకరే, శరద్ పవార్

‘ముఖ్యమంత్రి ముఖం’ ఎవరు?

విధాన్ భవన్‌లో ఈ మంగళవారం కూటమిలో పగుళ్లు స్పష్టంగా కనిపించాయి. అక్కడ ఉద్ధవ్ ఠాకరేకు చెందిన శివసేన పార్టీ, ఆకస్మికంగా పార్టీ కార్యదర్శి మిలింద్ నార్వేకర్‌ను జూలై 12 నాటి ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయమని కోరింది. అసెంబ్లీలో బలాబలాల ప్రకారం చూస్తే మహా వికాస్ అఘాడీకి కేవలం రెండు సీట్ల కోటా మాత్రమే ఉంది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వ్యవస్థాపకుడు శరద్ పవార్ ఈ కోటాలో ఒక సీటును ‘పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ (పీడబ్ల్యూపీ)కి ఇవ్వాలని అనుకున్నారు. అయితే, ఉద్ధవ్ 12వ తేదీన పోటీని అనివార్యం చేస్తూ తన సొంత అభ్యర్థి ఎంపికతో ముందుకు సాగారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా పశ్చిమ మహారాష్ట్రలోని సాంగ్లీ నియోజక వర్గంలో ఉద్ధవ్ తన పార్టీ పోటీ చేస్తుందని పట్టుబట్టారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయిన మల్లయోధుడు చంద్రహార్ పాటిల్‌కు ఉద్ధవ్ పార్టీ టిక్కెట్ ఇచ్చారు. కానీ అక్కడ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన కాంగ్రెస్ నేత విశాల్ పాటిల్ మంచి ఆధిక్యతతో గెలుపొందారు.

రాష్ట్రంలోని 150కి పైగా నియోజకవర్గాల్లో వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలని ఉద్ధవ్ కోరినట్లు శివసేన–ఉద్ధవ్ గ్రూపు అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. ముంబయిలో జరిగిన కూటమి సమావేశంలో మహావికాస్ అఘాడిలోని మూడు భాగస్వాములు ఒక్కొక్కటీ 95 స్థానాల్లో పోటీ చేస్తాయని విస్తృత అవగాహన ఉన్నప్పటికీ, శివసేన–ఉద్ధవ్ గ్రూపు 150 నియోజకవర్గాల్లో ఎందుకు సర్వే చేస్తోందని చాలామంది ఆశ్చర్యపోతున్నారు. గత వారం శివసేన ఫైర్ బ్రాండ్ అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ రాబోయే అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఉద్ధవ్ ఠాకరే ముఖ్యమంత్రి పదవికి కూటమి తరపు అభ్యర్థిగా ఉంటారని ప్రకటించారు. ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ వెంటనే, తమ కూటమిలో సీఎం అభ్యర్థిని ముందుగానే నిర్ణయించబోమని స్పష్టతనిచ్చారు. ‘‘మేము కూటమిలోని అన్ని భాగస్వామ్య పార్టీల ఉమ్మడి బలంతో ఎన్నికల్లో పోరాడతాం. మా అందరికీ ఉమ్మడి బాధ్యత ఉంది. ప్రస్తుతానికి సీఎం ముఖం అంటూ ఏమీ లేదు’’ అని శరద్ పవార్ పుణెలో మీడియాతో అన్నారు. ఈ ‘సీఎం ఫేస్’ విషయంపై భిన్నాభిప్రాయాలు చాలా స్పష్టంగా కనిపించాయి. అయితే శరద్ పవార్ కూటమిలో విభేదాలు లేవని చెప్పడమే కాకుండా, ప్రతి విషయంపైనా కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం ఉందని అన్నారు.

ఎవరు ఎక్కడ?

అలాగే కాంగ్రెస్ పార్టీ, శివసేన– ఉద్ధవ్ ఠాకరే గ్రూపు మధ్య కూడా కొన్ని విభేదాలు ఉన్నాయి. ఇవి ప్రధానంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్) లేదా ఎంఎంఆర్ లోని నియోజకవర్గాలకు సంబంధించినవి. ముంబై ఎంఎంఆర్ ప్రాంతంలో తమ ఉనికిని నిలుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుండగా, ఉద్ధవ్ ఇప్పుడు తనకు గరిష్ఠంగా ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ సీట్లు కావాలని పట్టుబట్టారు. ముంబై నార్త్ సెంట్రల్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. గతంలో పార్టీకి కంచుకోటగా ఉన్న నార్త్ సెంట్రల్, నార్త్ వెస్ట్‌లలో తమ స్థావరాన్ని నిలుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కూటమి భాగస్వాముల మధ్య విస్తృత అవగాహన ఏమిటంటే, శివసేన–ఉద్ధవ్ గ్రూప్ కొంకణ్, థానే, మరాఠ్వాడా ప్రాంతంలో గరిష్ఠ స్థానాలు తీసుకోవాలి; కాంగ్రెస్ పార్టీ విదర్భ ప్రాంతంలో గరిష్ఠ స్థానాలు తీసుకోవాలి; ఇకపోతే, శరద్ పవార్ ఎన్సీపీ పశ్చిమ మహారాష్ట్రపై దృష్టి పెట్టాలి. కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలేకు చెందిన విదర్భ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లో కాంగ్రెస్ ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. అలాగే పశ్చిమ మహారాష్ట్రలోని పుణె, సాంగ్లీ జిల్లాల్లో కూడా పార్టీ క్షేత్రస్థాయి కార్యాచరణను మొదలుపెట్టింది.

లోక్‌సభ ఎన్నికల సమయంలో సాంగ్లీలో ఏమి జరిగిందో పునరావృతం కాకుండా పశ్చిమ మహారాష్ట్రలో కచ్చితమైన సీట్ల పంపకం గురించి తమ పార్టీ, శివసేన ఉద్ధవ్ ఠాకరే గ్రూపుతో తెర వెనుక కమ్యూనికేషన్‌ను ప్రారంభించిందని శరద్ పవార్–ఎన్సీపీ వర్గాలు చెబుతున్నాయి. కూటమిలోని మూడు భాగస్వామ్య పార్టీలూ కెమెరా ముందు పరస్పరం వ్యతిరేక వ్యాఖ్యలకు దూరంగా ఉన్నప్పటికీ, సీట్ల పంపకాల చర్చల కోసం కూర్చున్నప్పుడు కొంత ఘర్షణ జరిగే అవకాశం ఉందని లోపలి వ్యక్తులు అంటున్నారు. కూటమి వర్గాల అభిప్రాయం ప్రకారం, ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన సాధారణ సూత్రం ఏమిటంటే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి మెజారిటీని పొందినట్లయితే, అసెంబ్లీలో ఏ పార్టీ ఎక్కువ స్థానాలను గెలుచుకుంటుందో ఆ పార్టీ ముఖ్యమంత్రి స్థానాన్ని ఆశిస్తుంది. విదర్భలో కాంగ్రెస్ కార్యకర్తలు రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలేను తదుపరి ముఖ్యమంత్రిగా చిత్రీకరిస్తూ పోస్టర్లు వేశారు. కాబట్టి, ‘కాబోయే ముఖ్యమంత్రి ముఖం’ అనే సమస్య కూటమి భాగస్వాములలో కొన్ని చీలికలను, ఒత్తిడిని కలిగిస్తోందని స్పష్టంగా తెలుస్తోంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(‘ద ఫ్రీ ప్రెస్ జర్నల్’ సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

సంతోషంలో భాగస్వాములు



ప్రపంచ కప్ గెలవగానే రోహిత్ శర్మ కన్నీళ్లతో తన భార్యను హత్తుకున్నాడు; విరాట్ కోహ్లీ దాన్ని ఉత్సవం చేసుకోవడానికి భార్యకు వీడియో కాల్ చేశాడు; జస్‌ప్రీత్ బుమ్రా సంతోషంతో భార్యను కౌగిలించుకున్నాడు... మౌలిక విషయాలకు విలువ ఇవ్వడం వారిని ఛాంపియన్లుగా మలుస్తోంది. కానీ ఇప్పుడు ఒక తరం వ్యవస్థాపకులు యువ ఆంట్రప్రెన్యూర్లకు పెళ్లనేది కలలకు ఆటంకం అని బోధిస్తున్నారు. పెళ్లి ఒక అందమైన ప్రయాణం. మీ రోల్ మోడల్స్‌ను జాగ్రత్తగా ఎంచుకోండి.

– రాజీవ్ తల్‌రేజా, బిజినెస్ కోచ్

పదవి ఎందుకో?



నిజం చెప్పాలంటే– బైడెన్, ట్రంప్ వయసులో ఉన్నవాళ్లు ఎందుకు అధ్యక్షుడు కావాలని కోరుకుంటారో నాకైతే అర్థం కాదు. నాకిప్పుడు 60 ఏళ్లు. కనీసం పై అంతస్థుకు పోవడానికి కూడా ఇష్టపడను.

– డేవిడ్ బడియేల్, రచయిత

మౌన బాధితులు



భారతీయ న్యాయ సంహితలోని 325వ సెక్షన్ ప్రకారం... ఒక జంతువును చంపడం, అవయవ ఛేదనకు ఐదేళ్ల జైలు, జరిమానా, లేదా రెండింటినీ విధించే అవకాశం ఉంది. కానీ జంతువులపై జరిగే లైంగిక దాడి విషయంలో ఎలాంటి ఏర్పాటూ లేదు. కాబట్టి మోదీజీ, అమిత్‌షాజీ... బీఎన్‌ఎస్‌ను సవరించి, దీన్ని నేరంగా చేర్చగలరు.

– వేదిక, నటి

అటవీ సేవ



కొండల్లో పడే వానలు అడవికి విస్తారమైన జలరాశిని అందిస్తాయి. అవి గడ్డి, అడవిలోని వృక్షజాలం వల్ల వడగట్టబడతాయి. తాజా నీటిని అందించడం అనేది అడవులు అందించే అత్యంత ప్రాధాన్యత కలిగిన పర్యావరణ సేవ.

– పర్వీన్ కాశ్వాన్, ఐఎఫ్‌ఎస్ అధికారి

స్థిరత్వమే సూత్రం



సెన్సెక్స్ మళ్లీ 80,000 మార్కును చేరింది. మార్కెట్లు పైకీ, కిందికీ మారుతున్నప్పుడు మనం ఏం చేయాలి? మీ సంపద కేటాయింపులు చూసుకోండి. మీకు 60:40 (ఈక్విటీ: రుణం) ఓకే అయ్యి, మార్కెట్ ఉన్నట్టుండి పెరగడం వల్ల అది 70:30 అయితే, మీరు తిరిగి 60:40కి వెళ్లిపోండి. మార్కెట్లు పైకీ కిందికీ వెళ్తాయి, మీరు వెళ్లకూడదు.

– మోనికా హాలన్, బిజినెస్ స్పీకర్

తగ్గిస్తే మంచిది



మీ ఆరోగ్యం మెరుగుపడాలంటే – చక్కెర, మతం... ఈ రెండింటినీ బాగా తగ్గించండి. రెండూ ఎక్కువగా ప్రాసెస్ చేసినవి, పైగా వ్యసనాలు.

– తారా దేశ్‌పాండే, నటి

వృథా ఖర్చు వద్దు!



మూడు రకాల సినిమాలు ఉంటాయి. హై బడ్జెట్ సినిమాలు, లో బడ్జెట్ సినిమాలు, నో–వేస్ట్ (వృథా చేయని) సినిమాలు. నేను నో–వేస్ట్ ఫిలిం మేకర్‌ను.

– జేమ్స్ కామెరాన్, ‘అవతార్’ దర్శకుడు

ఏది వాస్తవ చరిత్ర?

జూన్ 27న ‘వాస్తవ చరిత్రతోనే మెరుగైన భవిత’ అని డా॥ కత్తి పద్మారావుగారు రాసిన వ్యాసంలో వ్యక్తం చేసిన అభిప్రాయానికి అభ్యంతరం లేదు. కాని వాస్తవ చరిత్ర ఏదన్నదే అసలైన చిక్కు. నాలుగు దశాబ్దాల నాడు వచ్చిన ఒక తెలుగు సినిమాలో రావుగోపాలరావు పాత్ర ద్వారా చెప్పించిన డైలాగ్ ‘చరిత్ర అడక్కు... చెప్పింది విను’ అనే దాన్ని ఆయన తన వ్యాసం ద్వారా మరోమారు చెప్పారు. డీ.డీ. కోశాంబి, రొమిల్లా థాపర్, బిపిన్ చంద్రలు చెప్పిందే చరిత్రగా అంగీకరించి తీరాలా! అంతకన్నా భిన్నమైన చరిత్ర ఉందని కొత్త పరిశోధన ద్వారా బయటకు తీసుకురాకూడదా?

ఒక సబ్జెక్టులో ఒకరి కన్నా ఎక్కువ మంది రాసిన పుస్తకాలు ఉంటాయి. వాటిలో దేనినైనా చదువుకోవచ్చు. కాని చరిత్రలో మాత్రం నియంతృత్వ పోకడగా రొమిల్లా, బిపిన్ చంద్రల పుస్తకాలు దాటి చదవటానికి వీలు లేదనడం సబబేనా? ఈ రచయితలు భారతీయ చరిత్రకు ఒక రంగు పులిమారు. ఆ రంగును పలుచన చెయ్యటాన్ని అంగీకరించం అంటారు వారి శిష్యులు. వివాదాస్పద కట్టడం కూల్చివేత చిన్న విషయం కాదన్నారాయన. ఆ కూల్చివేత వెనుక హిందూ రాజ్య నిర్మాణ భావన ఉందని తీర్మానించారు. అయితే జమ్మూ–కశ్మీర్, కాశీ, మధురల్లో దేవాలయాలు ధ్వంసమవ్వడం చారిత్రక వాస్తవమే కదా! ఆ ధ్వంసం వెనుకనున్న భావన ఏమిటో కూడా పిల్లలకు తెలియాలి కదా!

ఎన్.సి.ఇ.ఆర్.టి. వారి చరిత్ర పుస్తకాలలో మత ఘర్షణల గురించి చెప్పిన అధ్యాయంలో ఏమి రాశారో ఆయన చదివారా? అందులో గుజరాత్‌లో జరిగినవి, అయోధ్య నేపథ్యంలో జరిగినవి మాత్రమే ఉన్నాయి. నవీన భారత చరిత్రలో ఆ రెండు సందర్భాలలో తప్పించి మరెన్నడూ మత కల్లోలాలు జరగలేదన్నది యోగేంద్ర యాదవ్, సుహాస్ పల్శీకర్ వంటి రచయితలు భావిస్తుంటే అంతకన్నా హాస్యాస్పదం ఏదీ ఉండదు. కశ్మీరీ పండిట్ల ఊచకోత గురించి, ఇందిరాగాంధీ హత్య జరిగినప్పుడు సిక్కుల ఊచకోత గురించి కూడా వీరు ప్రస్తావించి ఉంటే అది వాస్తవ చరిత్ర అయి ఉండేది. కొన్నింటిని కప్పిపుచ్చి, మరికొన్నింటిని కొందరి రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వివరంగా రాస్తామంటే అది వాస్తవ చరిత్ర కానేకాదు. రైతు ఉద్యమాల గురించి రాసినప్పుడు, 2018లో నాసిక్ నుండి ముంబైకి, ఆ తర్వాత పంజాబ్ నుండి ఢిల్లీకి జరిగిన రైతాంగ ఊరేగింపుల గురించే రాస్తామంటే ఎలా! ఆంధ్రాలో జరిగిన ఎన్జీ రంగా ఆధ్వర్యంలో పలాస నుండి చెన్నపట్నంకి జరిగిన రైతు యాత్ర గురించి రాయం అంటే ఎలా! ‘దేశంలో లౌకికవాదం, రాజ్యాంగ స్ఫూర్తి పెరగనున్నాయి’ అనడాన్ని అంతా స్వాగతించాల్సినదే. అయితే భారతీయులందరికీ వర్తించే లౌకిక చట్టాలు లేకుండా లౌకికవాదం ఎలా పెరుగుతుంది? అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 అమలు చెయ్యకుండా రాజ్యాంగ స్ఫూర్తి ఎలా వస్తుంది?

ఏ వర్గానికి చెందినవైనా చరిత్రలోని మంచి చెడులు చెబితేనే అది వాస్తవ చరిత్ర. ముఖ్యమైనవి, విద్యార్థులకు అంతగా అవసరం లేని అంశాలు పుస్తకాల నుండి తొలగించటం అన్ని సబ్జెక్టులలో జరుగుతుంది. చరిత్ర పుస్తకాల్లోనూ జరిగింది. విద్యార్థులకు మేలు చేసిన అంశం మీద అనవసరపు రాద్ధాంతం ఎందుకు?

డా॥ దుగ్గరాజు శ్రీనివాసరావు । 9440421695

సమ్మిళిత అభివృద్ధికి సహకార నమూనా!

‘సమాజంలో ప్రతి ఒక్కరి కోసం మెరుగైన ప్రపంచాన్ని సహకార సంఘాలు నిర్మిస్తాయి...’ ఇదీ ఈ ఏడాది అంతర్జాతీయ సహకార దినోత్సవ నినాదం! జూలై మొదటి శనివారం నాడు సహకార దినోత్సవం జరుపుకోవటం ఆనవాయితీ. ఈ జూలై 6న సహకార దినోత్సవ సంబురం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన కోట్లాది సహకారులు రకరకాల కార్యక్రమాల ద్వారా సరికొత్త ఆశలతో సహకార స్ఫూర్తిని మరోసారి చాటడానికి సమాయత్తమవుతున్నారు. మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సహకార శాఖను ఏర్పాటు చేసి అనేక సంస్కరణలు చేపట్టిన తర్వాత మన దేశంలో సహకార వ్యవస్థలో కొత్త కదలిక మొదలైంది. అంతకుముందు నుంచే రాష్ట్రాల్లో ప్రత్యేకంగా సహకార శాఖలు ఉన్నప్పటికీ కేంద్రం స్థాయిలో వ్యవసాయ శాఖలో ఒక విభాగంగానే సహకార పాలన ఉంటూ వచ్చింది. అనాదిగా రైతులకు రుణాలు ఇచ్చే సొసైటీలుగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) రైతుల ఆర్థిక సేవలకే పరిమితం కాకుండా ఇతర ప్రజల అవసరాలను కూడా తీర్చే వ్యాపార సంస్థగా ఉండాలని భావించి కేంద్ర సహకార శాఖ పీఏసీఎస్ లకు సరికొత్త బైలాస్‌ను నిర్దేశించటం ఒక కీలక పరిణామం. ఈ సేవలన్నీ పారదర్శకంగా అందించటం కోసం పీఏసీఎస్ లన్నిటినీ కంప్యూటరీకరించే పని జరుగుతోంది.



పీఏసీఎస్‌ల తర్వాత సంఖ్యాపరంగా పాడి రైతుల సొసైటీలు, మహిళా సహకార సంఘాలు (ఉదా: లిజ్జత్ పాపడ్‌ను ఉత్పత్తి చేసే మహిళా సొసైటీ), చేనేత కార్మికుల సొసైటీలు, మత్స్యకారుల సొసైటీలు, గృహనిర్మాణ సొసైటీలు, ఉద్యోగుల సొసైటీలు, ప్రత్యేకించి కార్మికుల సొసైటీలు (ఉదా: కేరళలో ప్రసిద్ధమైన ఉరులుంగల్ నిర్మాణ కార్మికుల సొసైటీ) సైతం గతంలోనే ఏర్పాటు కావటం మనకు తెలిసిందే. గుజరాత్‌లో ఏర్పడిన చిన్న పిల్లల పొదుపు సహకార సంఘం పెద్ద హిట్ అయ్యింది. ఆధునిక కాలానికి అనుగుణంగా సరికొత్త వర్గాలు విలక్షణమైన సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అర్బన్ ప్రాంతాల్లో చిన్నపాటి ఎలక్ట్రానిక్ వస్తువులకు రిపేర్లు చేసే పనివారి సహకార సంఘం కూడా ఏర్పాటైంది. ఈ–కామర్స్ సంస్థల్లో వస్తువులు పంపిణీ చేసే గిగ్‌వర్కర్ల సహకార సంస్థలు సైతం ఏర్పాటవుతున్నాయి.

ఆయుర్దాయం పెరుగుతున్న కొద్దీ గ్రామాల్లో, పట్టణాల్లో వయోవృద్ధుల జనాభా పెరుగుతోంది. పిల్లలు చదువులు/ ఉద్యోగాలు/ వ్యాపారాల కోసం దేశ విదేశాలకు వెళ్లిపోవటంతో గ్రామాలు/ పట్టణాలు/ నగరాల్లో వృద్ధులే మిగిలిపోతున్నారు. కొందరు వృద్ధాశ్రమాల్లో చేరుతున్నా ఇళ్లు వదిలి వెళ్లలేక, అక్కడే ఉండలేక పండుటాకులు నానా అగచాట్లు పడుతున్నారు. వీరి ప్రత్యేక ఆహార, వైద్య, సామాజిక అవసరాలు తీర్చే ప్రత్యేక సహకార సంఘాలు ఇప్పటికే కేరళ వంటి రాష్ట్రాల్లో విశేష సేవలు అందిస్తున్నాయి. ప్రత్యేకంగా కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసుకొని ఉమ్మడిగా భోజన ఏర్పాట్లు చేసుకోవటం దగ్గరి నుంచి.. ప్రత్యేక ఆసుపత్రులు ఏర్పాటు చేసుకునే వరకు సభ్యులైన వృద్ధులకు అనేక సేవలు అందిస్తున్నాయి ఈ సొసైటీలు. తెలుగు రాష్ట్రాల్లోనూ వృద్ధుల సహకార సంఘాల అవసరం ఎంతో ఉంది.

గుజరాత్‌లో సహకార వ్యవస్థతో గట్టి సంబంధం ఉన్న అమిత్ షా కేంద్ర సహకార మంత్రిగా ఇటీవలే రెండోసారి బాధ్యతలు చేపట్టారు. సహకార వ్యాపారాన్ని దేశ విదేశాల్లో కొత్త పుంతలు తొక్కించాలన్నది తమ లక్ష్యమని మోదీ, అమిత్‌షా చెబుతున్నారు. సహకార రంగంలో ఢిల్లీ నుంచి తేదలచిన మార్పులన్నిటినీ క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సింది రాష్ట్ర సహకార శాఖలు. రాష్ట్రస్థాయిలో సహకార వ్యవస్థ చురుగ్గా పనిచేయాలంటే సలహా మండళ్లు కీలకం. వాటి జాడ లేకుండా పోయింది. సాచివేత ధోరణి, అవినీతి, మితిమీరిన రాజకీయ జోక్యం, జవాబుదారీతనం లోపించటం వంటి జాడ్యాలతో కునారిల్లుతున్న సహకార శాఖల్లో కొత్తగా సహకార స్ఫూర్తి వెల్లివిరియాలంటే రాష్ట్ర స్థాయిలోనూ సంస్కరణలు తేవాలి. అప్పుడే ‘సహకార నమూనా’ మేలైన సమ్మిళిత అభివృద్ధి మార్గంగా నిలుస్తుంది. వాతావరణ మార్పుల గడ్డు కాలంలో సహకార అభివృద్ధి నమూనా కొత్త ఆశలను రేకెత్తిస్తోంది.

– పంతంగి రాంబాబు । సీనియర్ జర్నలిస్ట్
(రేపు సహకార దినోత్సవ సంబురం)

అక్కర్లేని వెంపర్లాట

ప్రాచీన కాలాన్నీ, ప్రస్తుత కాలాన్నీ పోల్చి చూస్తే, ప్రజల జీవన శైలిలో కనబడే ఒక ముఖ్యమైన వ్యత్యాసం నిరాడంబరత. పాత కాలంలో పెద్దలు నిరాడంబరంగా జీవించమని బోధించేవాళ్ళు. శుకమహర్షి నాటి నుంచీ, రమణ మహర్షి నాటి వరకూ తక్కువ అవసరాలతో, వనరులతో జీవనం సాగించే యోగులనూ, త్యాగులనూ సామాజికులు ఎక్కువ గౌరవించేవాళ్ళు. బాహ్యమైన పటాటోపాలనూ, ఆర్భాటాలనూ, వాక్– ఆభరణ – వస్త్రాడంబరాలను వదిలేసి, అంతర్ముఖులై ఆత్మనిగ్రహంలో జీవించే వాళ్ళను ఆదర్శప్రాయులుగా భావించేవాళ్ళు.

జ్యోతిర్మయం

క్రమంగా ఇది తలకిందులవుతున్నట్టు కనిపిస్తుంది. ఇరవయ్యొకటో శతాబ్దంలో ఎక్కడ చూసినా ఆడంబరాల వెంపర్లాటే! వాడుకకు పనికి రాని పాతిక లక్షల రూపాయల చేతి సంచీలు కొని ధరించేవాళ్ళు ఆదర్శం. సమయం సూచించని యాభై లక్షల రూపాయల చేతి గడియారం ధరించడం మహనీయతకు చిహ్నం. కోట్ల రూపాయలు విలువ చేసే కార్లలో తిరిగే వాళ్ళను మించిన ఘనులు, వ్యక్తిగతమైన పుష్పక విమానాలలో తిరిగే ఆచంట మల్లన్నలు. బిడ్డ వివాహం నాలుగయిదు దశలుగా చేసి పది వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం శ్రేష్ఠత్వానికి లక్షణం. ఎవరి పిచ్చి వారికి ఆనందమని సమర్థించవచ్చు కానీ, సామాన్య దృష్టికి ఇది కేవలం వెర్రితనంగా, ధనోన్మాదంగా కనిపిస్తుంది. ఈ ఆడంబర ప్రియత్వం మునుపు లేదని కూడా అనలేం. కానీ ఇటీవలి దశకాలలో ఇది మరింత వెర్రితలలు వేస్తున్నదనటం నిర్వివాదం. సమాజంలో కూడా ఈ ‘అతి’ని గర్హించే ధోరణికంటే, ఎవరికి చేతయినంత వరకు వాళ్ళు ఈ ఆడంబరాలను అనుకరించడమే జీవిత లక్ష్యమని నమ్మే భావజాలం బలపడుతున్నట్టు కనిపిస్తుంది.

ఆడంబరాల మీద వ్యామోహం తీరని దాహం అని తెలిసీ దాని వెంట పరుగెత్తడం ఒక వ్యసనం లాంటిదే. దానివల్ల కలిగే కష్టనష్టాలు కూడా అందరూ ఎరిగినదే. ఎరిగి కూడా ఈ ఆడంబరాల మీది నుంచి దృష్టి మళ్ళించకపోతే ఇహపరాలలో ఉభయ భ్రష్టత్వం మిగులుతుందేమో శ్రద్ధగా తర్కించుకోవడం శ్రేయస్కరం.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; జ్యేష్ఠ మాసం, తిథి: అమావాస్య తె.3.53 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి ఆషాఢ శుక్ల పాడ్యమి; నక్షత్రం: ఆరుద్ర తె.4.20 వరకు (తెల్లవారితే శనివారం); తదుపరి పునర్వసు; వర్జ్యం: ప.12.47 నుండి 2.24 వరకు ; దుర్ముహూర్తం: ఉ.8.09 నుండి 9.02 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.23 వరకు; అమృత ఘడియలు: రా.6.24 నుండి 8.01 వరకు; సూర్యోదయం : 5.33 ; సూర్యాస్తమయం : 6.34 ; రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

క్లుప్తంగా...

'అల్లూరి విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిష్టించాలి'



సీతక్కను సన్మానిస్తున్న క్షత్రియ సేవా సమితి నాయకులు

సాక్షి, హైదరాబాద్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిష్టించాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధనసరి సీతక్క విజ్ఞప్తి చేశారు. అల్లూరి విగ్రహం ఏర్పాటుకు కేంద్రంపై తెలుగు రాష్ట్రాల ఎంపీలు ఒత్తిడి తేవాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు. అల్లూరి సీతారామ రాజు 127వ జయంతి వేడుకల సందర్భంగా అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించారు. అడవి బిడ్డల హక్కుల కోసం పోరాడి అమరుడైన త్యాగశీలి అల్లూరి అని కొనియాడారు. అల్లూరి అంటేనే ఒక పోరాటం, ఒక వెలుగు, ఒక స్ఫూర్తి అని పేర్కొన్నారు. అమరజీవి అల్లూరి ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు.

'మియాపూర్' ఘటనపై నిష్పక్షపాత విచారణ

- తెలంగాణ డీజీపీకి ఎన్‌సీడబ్ల్యూ లేఖ

సాక్షి, న్యూఢిల్లీ: రియల్‌ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్న యువతిపై అదే సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు చేసిన సామూహిక లైంగిక దాడిని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) ఖండించింది. ఘటనపై నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా విచారణ జరపాలని కోరుతూ తెలంగాణ డీజీపీకి ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ గురువారం లేఖ రాశారు. బాధితురాలికి వైద్య చికిత్స అందించడంతోపాటు పరిహారం ఇప్పించాలని పేర్కొన్నారు. తీసుకొన్న చర్యలు, తాజా నివేదిక మూడు రోజుల్లో ఎన్‌సీడబ్ల్యూకు పంపాలని ఆ లేఖలో కోరారు.

మిర్చి ధర పతనం

- రెండు రోజుల్లో రూ.2వేల మేర తగ్గిన వైనం



ఖమ్మంలోని ఓ కోల్డ్ స్టోరేజీ నుంచి విక్రయానికి తీసిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం: మిర్చి ధర నానాటికీ పతనమవుతోంది. గతేడాది జూలై 4న క్వింటాకు రూ.24,600గా పలికిన ధర ఈ ఏడాది అదేరోజు రూ.17,600గా నమోదైంది. అంటే క్వింటాకు రూ.7వేల మేర వ్యత్యాసం వచ్చింది. సీజన్‌లో గరిష్టంగా రూ.20వేల నుంచి రూ.22 వేల మధ్య ధర పలకగా...మరింత పెరుగుతుందనే భావనతో రైతులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు. ఇప్పుడు వానాకాలం సీజన్ పెట్టుబడి కోసం విక్రయానికి సిద్ధమవుతుండగా ధర గణనీయంగా పడిపోతోంది. ఖమ్మం వ్యవసాయం మార్కెట్‌లో సోమవారం వరకు రూ.20వేలు పలికిన ధర మంగళ, బుధవారం రూ.19,500కు పడిపోయింది. ఇక గురువారానికి ఏకంగా రూ.1,900 మేర తగ్గి రూ.17,600కు చేరడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పండించే తేజ రకం మిర్చికి విదేశాల్లో డిమాండ్ ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆర్డర్లు లేక ఎగుమతిదారులు కొనుగోళ్లకు వెనుకాడుతున్నారు. దీంతో ధర తగ్గుతుందని తెలుస్తోంది.

వర్గీకరణ సాధనకు 7న వంగపల్లి దీక్ష

- పోస్టర్ ఆవిష్కరణ



నిరాహార దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ తదితరులు

ముషీరాబాద్ (హైదరాబాద్): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు రెండు రాష్ట్రాలలో ఉన్న పెండింగ్ సమస్యలపై చర్చల కోసం కలుస్తున్న నేపథ్యంలో, గత 30 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యపై చర్చించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ జాప్యంపై కేంద్రం మొండి వైఖరిని నిరసిస్తూ జూలై 7వ తేదీన ఇందిరాపార్కు వద్ద వంగపల్లి చేస్తున్న దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు అనుకూల ప్రకటన చేశారని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి కూడా అనేకసార్లు వర్గీకరణపై సానుకూలంగా స్పందించారన్నారు. ఇప్పుడు ఇద్దరు ముఖ్యమంత్రులకు మాదిగలపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇరువురు కలిసి ఢిల్లీకి వెళ్లి వర్గీకరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ వర్గీకరణపై గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని ఇందిరా పార్కు వద్ద నిరాహార దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు.

నిర్ణయమే మిగిలింది

▶ మొదటి పేజీ తరువాయి

ఈ విలువల ప్రతిపాదనలను వివరిస్తామని, ఆ తర్వాత రెవెన్యూ మంత్రితో కలిసి ముఖ్యమంత్రితో భేటీ కావాల్సి ఉందని, ఆ భేటీలో తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని వివరిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం పూర్తి కాగానే మిగిలిన షెడ్యూల్ మేరకు ముందుకెళతామని, క్షేత్రస్థాయి కమిటీల ప్రతిపాదనలకు ఆమోదం తీసుకుని, శాఖా పరమైన సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ చేస్తే సరిపోతుందని అంటున్నారు. సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకుంటే వచ్చే నెల 1వ తేదీ నుంచే సవరించిన విలువలను అమల్లోకి తెస్తామని అధికారులు చెబుతున్నారు.

గతానికి భిన్నంగా క్షేత్రస్థాయిలో..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల విలువలను ఒకేసారి సవరించారు. అప్పుడు క్షేత్రస్థాయి నుంచి కసరత్తు చేయకుండా, రాష్ట్ర స్థాయిలో నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం విలువలు నిర్ణయించారు. కాగా ప్రభుత్వం మరోసారి భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల విలువల సవరణకు నిర్ణయం తీసుకోవడంతో..గత నెల 15వ తేదీన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు వెలువరించింది. వాటి ప్రకారమే క్షేత్రస్థాయి నుంచి కసరత్తు ప్రారంభమైంది. వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములు (ఖాళీ నివాస స్థలాలు), ఆస్తుల (అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాలు) విలువలను క్షేత్రస్థాయిలో ఉన్న మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచాలని సూత్రప్రాయంగా తీసుకున్న నిర్ణయం మేరకు రిజిస్ట్రేషన్ విలువల కసరత్తు జరిగింది. ఖాళీ స్థలాలు, అపార్ట్‌మెంట్ల విషయంలో ప్రస్తుతం మార్కెట్ ధర ఎంత ఉందో చూసి అందులో సగం మేరకు విలువలను సవరించే ప్రయత్నం జరిగింది.

మూడు కేటగిరీల్లో నిర్ధారణ

వ్యవసాయ భూముల విలువలను మూడు కేటగిరిల్లో నిర్ధారించారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు ఒక విలువ, వెంచర్లు చేసేందుకు సిద్ధంగా ఉన్న భూములకు ఇంకో విలువ, హైవేల పక్కన ఉండే వ్యవసాయ భూములకు మరో విలువను ప్రతిపాదించారు. అందులో భాగంగా ఏజెన్సీ ప్రాంతాలు మినహాయించి వ్యవసాయ భూమి కనిష్ట విలువ రూ.5 లక్షలుగా ప్రతిపాదించారు. ఆపై రూ.50 లక్షల వరకు వ్యవసాయ భూముల విలువలను ప్రతిపాదించగా, వెంచర్లకు సిద్ధంగా ఉన్న భూములు, హైవేల పక్కన ఉండే భూములను అక్కడి విలువల ప్రాతిపదికన రూ.40 లక్షల నుంచి 2.90 కోట్ల వరకు ప్రతిపాదించారు. ఈ విలువల మేరకు 7.5 శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించే విధంగా ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఇక నివాస స్థలాల చదరపు గజం కనీసం రూ.500, అపార్ట్‌మెంట్ల చదరపు అడుగు కనీసం రూ.1000గా ప్రతిపాదించారు.

విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలు మినహా రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రతిపాదనలివే (రూ.లలో)

ప్రాంతం	వ్యవసాయ భూమి		నివాస స్థలం		అపార్ట్‌మెంట్	
	కనిష్ట	గరిష్ట	కనిష్ట	గరిష్ట	కనిష్ట	గరిష్ట
ఏజెన్సీ	4 లక్షలు	6 లక్షలు	500	5,000	1,500	1,700
మండల కేంద్రం (హైవే వెంబడి)	5 లక్షలు	50 లక్షలు	1,000	5,000	1,000	2,000
మండల కేంద్రం (గ్రామీణ)	5 లక్షలు	10 లక్షలు	1,000	3,000	1,000	1,300
జిల్లా కేంద్రం (గ్రామీణ)	5 లక్షలు	60 లక్షలు	3,000	35,000	1,500	3,500
జిల్లా కేంద్రం (అర్బన్)	10 లక్షలు	2.90 కోట్లు	3,000	40,000	2,000	3,800

(నోట్: వ్యవసాయ భూమిని ఎకరం, నివాస స్థలాన్ని చదరపు గజం, అపార్ట్‌మెంట్‌లను చదరపు అడుగు కింద పరిగణించాలి)

ప్రజాభిప్రాయం లేకుండానే..?

క్షేత్రస్థాయి కమిటీల ప్రతిపాదనలకు ఆమోదం లభించిన అనంతరం ఈనెల ఒకటో తేదీ నుంచే సవరించిన విలువల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాల్సి ఉంది. ఈ మేరకు గత నెల 15వ తేదీన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెలువరించిన మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం రిజిస్ట్రేషన్ల శాఖ ప్రతిపాదించిన విలువలపై ఈ నెల 1వ తేదీ నుంచి 15 వరకు ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించి వాటిపై సమీక్ష చేసిన అనంతరం తుది విలువలను నిర్ధారించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు కూడా క్షేత్రస్థాయి కమిటీల ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో పెట్టలేదు. అయితే గతంలో రిజిస్ట్రేషన్ విలువలను సవరించిన రెండుసార్లు ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఈసారి ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలనుకున్నా సమయం సరిపోయేలా లేదని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలు తెలుసుకునే గడువును కుదిస్తారని లేదంటే ఈసారి కూడా ప్రజాభిప్రాయం లేకుండానే తుది విలువలను నిర్ధారించే అవకాశాలున్నాయని ఆ శాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం.

మనపాలన లేక దేశ రైతాంగం నష్టపోయింది

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణతో దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ వ్యవసాయ ప్రగతిని చూసి మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాల ప్రజలు తమకూ కేసీఆర్ పాలన కావాలని కోరుకున్నారు. ఆబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో రైతురాజ్యం తెచ్చుకోవాలని బీఆర్‌ఎస్‌తో కలిసి అడుగులు వేశారు. దేశ రైతాంగం పురోగతికి బయలుదేరిన బీఆర్‌ఎస్‌పై తెలంగాణ ప్రజలు తీసుకున్న నిర్ణయం ఇతర రాష్ట్రాల రైతులను నిరుత్సాహ పరిచింది' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

ప్రజలదే అంతిమ నిర్ణయం: 'ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ నిర్ణయం. అధికారం, ప్రతిపక్ష పాత్ర మనకు శాశ్వతం కాదు..ప్రజాతీర్పే శిరోధార్యం. వారు ఏ పాత్ర అప్పగిస్తే దానిని చిత్తశుద్ధితో నిర్వర్తించాలి. అధికారం కోల్పోయామని బాధపడడం సరైన రాజకీయ నాయకుని లక్షణం కాదు. ప్రజాసంక్షేమానికి కొనసాగే నిరంతర ప్రక్రియే రాజకీయం. దానికి గెలుపోటములతో సంబంధం ఉండదు. ప్రజల్లో కలిసి ఉంటూ వారి సమస్యల మీద నిరంతర పోరాటం ద్వారా అభిమానాన్ని సాధించాలి. గత ప్రభుత్వ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించక పోవడంతో తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోతోంది. రాష్ట్రంలో తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. తెలంగాణ సంపూర్ణ అభివృద్ధే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యం.నిరంతరం ప్రజాక్షేత్రంలో పనిచేయాలంటూ' పార్టీ కేడర్‌కు కేసీఆర్ పిలుపు ఇచ్చారు.

సమాచారం లేకుండా రావొద్దు: ముందస్తు సమాచారం లేకుండా తనను కలిసేందుకు వచ్చి ఇబ్బంది పడొద్దని పార్టీ నేతలకు కేసీఆర్ సూచించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ నుంచి అందే సమాచారం తర్వాతే స్థానిక నాయకత్వాన్ని సమన్వయం చేసుకొని రావాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కేసీఆర్ తిరిగి సీఎం కావాలని నినాదాలు చేశారు. గురువారం కేసీఆర్‌ను కలిసిన వారిలో ఖమ్మం, మహబూబాబాద్, వేములవాడ నర్సాపూర్ ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గాలకు చెందిన నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

డీఎస్ మన జ్ఞాపకాల్లో ఎప్పటికీ జీవించి ఉంటారు

- శ్రీనివాస్ సతీమణి విజయలక్ష్మికి రాసిన లేఖలో ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: ధర్మపురి శ్రీనివాస్ మరణం ఎప్పటికీ పూడ్చలేని శూన్యాన్ని మిగిల్చిందని.. ఆయన మన జ్ఞాపకాల్లో జీవించి ఉంటారని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రభుత్వంలో అయినా, రాజకీయంగా అయినా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అంకితభావం, నిబద్ధతతో వివిధ బాధ్యతలు నిర్వర్తించిన ధర్మపురి శ్రీనివాస్ మరణించినా ఆయన్ను అందరూ ఎప్పటికీ ప్రేమగా గుర్తుంచుకుంటారని చెప్పారు. ఆయన మరణించారనే వార్త తనలో తీవ్ర విషాదం, దుఃఖాన్ని మిగిల్చాయని ప్రధాని తెలిపారు. ఈ మేరకు డీఎస్ సతీమణి ధర్మపురి విజయలక్ష్మికి లేఖ రాసి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు.

బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లేఖ రాశారు. ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన మహోన్నత నాయకుడిని కోల్పోయామని రాహుల్‌గాంధీ తెలిపారు. ఏపీ, తెలంగాణల్లో కాంగ్రెస్ పార్టీకి డీఎస్ చేసిన విశేషమైన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.

విత్తన సహకార సంస్థ ఏర్పాటు చేస్తాం

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఐదు సహకార సంఘాలకు అవార్డులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా విత్తన ఉత్పత్తి, సేంద్రియ ఉత్పత్తుల సహకార సంస్థ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ సంస్థ ద్వారా సేంద్రియ వ్యవసాయం, విత్తన ఉత్పత్తుల్లో నిమగ్నమైన రైతులకు నేరుగా ప్రయోజనం కలుగుతుందని వివరించారు. రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సహకార సంఘాలకు గురువారం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ద్వారా అవార్డులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి.. రైతులనుద్దేశించి ప్రసంగించారు. దేశంలో సహకార ఉద్యమం దాదాపు 125 సంవత్సరాల నుంచి ఉందని, కానీ సకాలంలో మార్పులు చేయకపోవడం వల్ల అది కాలం చెల్లినట్లు కనిపిస్తోందని అన్నారు. సహకార రంగం ఈ కాలపు అవసరాలకు అనుగుణంగా బలోపేతం కావాలని అభిప్రాయపడ్డారు. సహకార రంగం పటిష్టతకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయడం చాలా ముఖ్యమని, ఇందుకోసం ప్రభుత్వం ద్వారా అనేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా, ఈ కార్యక్రమంలో ఐదు సహకార సంఘాలకు అవార్డులతో పాటు రూ.25 వేల నగదు బహుమతిని అందజేశారు. టీజీకాబ్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు, ఎండీ గోపి, ఎన్‌సీడీసీ రీజనల్ డైరెక్టర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హాజరుపై నివేదిక ఇవ్వండి

వ్యవసాయ శాఖ డైరెక్టరేట్ పరిధిలో ఉద్యోగుల హాజరుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ శాఖ సంచాలకుడిని ఆదేశించారు. గురువారం మంత్రి బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు సమయానికి రాని విషయాన్ని గుర్తించిన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగుల హాజరు తీరుపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఈ సందర్భంగా డైరెక్టర్‌ను ఆదేశించారు.

భూమిని ఆక్రమించారని కలుపు మందు తాగాడు

- రైతు భద్రయ్యకు ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్ నాయక్‌తో వివాదం
- ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో కలకలం సృష్టించిన ఘటన





కలుపు మందు తాగుతున్న భద్రయ్య. అంతకు ముందు ట్రాక్టర్‌కు అడ్డంగా పడుకున్న భద్రయ్య

కారేపల్లి: తన భూమిని అన్యాయంగా ఆక్రమించి ట్రాక్టర్లతో దున్నుతున్నారంటూ ఓ రైతు కలుపు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం .. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయపల్లికి చెందిన పచ్చిపాల భద్రయ్య, ఆయన సోదరులు సోమయ్య, రామయ్య, మల్లయ్యకు ఆలియాతండాలో వ్యవసాయ భూమి ఉంది. ఇందులో భద్రయ్య మినహా మిగతా వారు ఆర్టీఐ మాజీ కమిషనర్ జి.శంకర్‌నాయక్‌కు భూమి అమ్ముకున్నట్లు సమాచారం. అయితే, సర్వేనంబర్ 548లోని తన 1.20 ఎకరాల భూమిని శంకర్‌నాయక్ తప్పుడు పత్రాలతో బై నంబర్లు సృష్టించి పట్టా చేసుకున్నారని భద్రయ్య కొన్నేళ్లుగా ఆరోపిస్తున్నాడు. మరోపక్క శంకర్‌నాయక్ తాను చట్ట ప్రకారమే భూమి కొన్నట్లు చెబుతున్నారు. దీనిపై ఇరువర్గాలు తహసీల్దార్ మొదలు ఉన్నతాధికారుల వరకు ఫిర్యాదు చేసుకున్నారు. భద్రయ్య కోర్టును సైతం ఆశ్రయించినట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం శంకర్‌నాయక్ మనుషులు ట్రాక్టర్లతో వివాదాస్పద భూమిని దున్నసాగారు. దీంతో రైతు భద్రయ్య, ఆయన భార్య భాగ్యమ్మ అడ్డుకున్నారు. ట్రాక్టర్ కదలకుండా భద్రయ్య అడ్డుగా పడుకోవడంతో పాటు తన వెంట తెచ్చుకున్న కలుపు మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఆయనను తొలుత ఇల్లెందుకు, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆలియాతండాకు వెళ్లి వివరాలు ఆరాతీశారు. ఇదే జిల్లా ప్రొద్దుటూరులో ఇటీవల భూవివాదంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకోగా ఇప్పుడు మరో రైతు ఆత్మహత్యకు యత్నించడం చర్చనీయాంశమైంది. తాజా ఘటనలో భద్రయ్య భార్య భాగ్యమ్మ ఫిర్యాదుతో పలువురిపై కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్సై రాజారాం తెలిపారు. భద్రయ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు.

అసెంబ్లీలో కొమురయ్య వర్ధంతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించారు. అసెంబ్లీ ప్రాంగణంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య నిర్వర్తించిన పాత్రను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు, చీఫ్ మార్షల్ కరుణాకర్, అసెంబ్లీ అధికారులు పాల్గొన్నారు.

తల్లిని చంపిన కొడుకు

- నిద్రలోనే చనిపోయిందని నమ్మించిన ఘనుడు
- సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలో ఘటన

వర్గల్(గజ్వేల్): తల్లితో గొడవపడిన ఆ కొడుకు.. క్షణికావేశంతో ఆమె తలను నేలకేసిబాదడంతో అసువులు బాసింది. ఈ విషయం బయటకు రాకుండా అస్వస్థతకులోనై నిద్ర లోనే మృతి చెందినట్టు నమ్మించాడు. సోదరిరాకతో తల్లి హత్యకు గురైన ఉదంతం బయటపడింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గుట్ట సత్రాల వద్ద గురువారం వెలుగుచూసింది. గౌరారం ఎస్సై శివకుమార్ కథనం మేరకు.. కుత్బుల్లాపూర్ ఇందిరానగర్‌కు చెందిన గాలిగామ బాలకిష్టమ్మ(54) ఖైరతాబాద్‌లోని అర్థగణాంక శాఖ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తుంది. ఆమె కు కుమారుడు సర్వేశ్, కూతురు సుజాత ఉన్నారు. బాలకిష్టమ్మ భర్త చాలా ఏళ్ల కిందట చనిపోయాడు. కొడుకు, కూతురు వివాహాలు చేసింది. సర్వేశ్ భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లింది. దీంతో 2 నెలల క్రితం తల్లీకొడుకు లిదరూ భాగ్య లక్ష్మికాలనీలోని సుజాత ఇంటికొచ్చి అక్కడే ఉంటున్నారు. బుధవారం ఉదయం సుజాత దంపతులు పనులకు వెళ్లారు.

అస్వస్థతతో చనిపోయిందని పోలీసులకు ఫోన్

అదే రోజు సాయంత్రం బాలకిష్టమ్మ, సర్వేశ్, ఆటోడ్రైవర్ కన్నెబోయిన నర్సింహారెడ్డి, అతడి భార్య సుజాత కలిసి దైవదర్శనానికి ఆటోలో వర్గల్ మండలంలోని నాచగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి వచ్చారు. దర్శనం అనంతరం సత్రం వరండాలో బస ఏర్పాటు చేసుకొని భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి బాలకిష్టమ్మ వాంతులు, మూత్రవిసర్జన చేసుకోవడంతో కొడుకు సర్వేశ్ తల్లితో గొడవపడ్డాడు. ఆవేశంతో ఆమె తలను నేలకేసి బాదాడు. అంతర్గత గాయాలతో ఆమె అక్కడే ప్రాణాలు వదిలింది. ఈ గొడవతో వెంట వచ్చిన ఆటోడ్రైవర్ నర్సింహారెడ్డి దంపతులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తల్లి తన చేతిలో మృతి చెందిన విషయం బయటకు పొక్కకుండా, వాంతులతో అస్వస్థతకు లోనై నిద్రలోనే మృతి చెందినట్టు గురువారం ఉదయం పోలీసులకు సర్వేశ్ ఫిర్యాదు చేశాడు. నాచారం గుట్ట వద్ద తల్లి చనిపోయినట్టు సోదరి సుజాతకు చెప్పాడు. వెంటనే సుజాత దంపతులు నాచారం చేరుకున్నారు. సర్వేశ్‌ను నిలదీయగా వారికి సరైన సమాధానం చెప్పలేదు. అనుమానంతో వారి వెంట వచ్చిన ఆటోడ్రైవర్ నర్సింహారెడ్డికి ఫోన్ చేశారు. దీంతో అసలు విషయం బయటపడింది. సర్వేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి తహసీల్‌కు..

- రైతులకు బాకీ కింద భూ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన సమయంలో ఘటన

ఎర్రుపాలెం: పలువురు రైతులకు రూ.2.20 కోట్లు బాకీ ఉన్న వ్యాపారి, తాను బాకీ ఉన్న వారికి భూమి రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పాడు. అయితే తీరా రిజిస్ట్రేషన్ సమయంలో తహసీల్‌కు పురుగు మందు తాగి రావడంతో గందరగోళం ఏర్పడింది. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామానికి చెందిన వ్యాపారి కృష్ణారావు పలువురి వద్ద గత సీజన్‌లో రూ.2.20 కోట్ల విలువైన మిర్చి కొనుగోలు చేశాడు. ఆ తర్వాత రైతులకు డబ్బు ఇవ్వకపోవడమే కాకుండా చాలా రోజులు కనపడకుండా పోయాడు. దీంతో బాధిత రైతులు గాలించి వ్యాపారిని ఎట్టకేలకు స్వగ్రామానికి తీసుకొచ్చారు. దీంతో గురువారం మిర్చి బకాయిల కింద భూమి రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పాడు. ఈ మేరకు ఎర్రుపాలెం తహసీల్‌లో ఓ రైతు పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. అనంతరం ఇంకొందరు రైతులతో కలిసి మధిరలోని తహసీల్ కార్యాలయానికి వెళ్లి పొలాన్ని రిజిస్ట్రేషన్ చేసే క్రమంలో తాను అప్పటికే పురుగుల మందు తాగినట్లు కృష్ణారావు తెలిపారు. దీంతో ఆయనను కుటుంబసభ్యులు మధిరలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఈ విషయమై తమకెలాంటి సమాచారం అందలేదని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

మేడిగడ్డలో రింగ్‌బండ్ తొలగింపు

- పెరుగుతున్న ప్రాణహిత వరద ఉధృతి
- వాహనాలు, మెటీరియల్ తరలింపు



మేడిగడ్డ 7వ బ్లాక్ చుట్టూరా రింగ్‌బండ్‌ను తొలగిస్తున్న దృశ్యం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీలో 7వ బ్లాక్ చుట్టూ వేసిన రింగ్‌బండ్‌ను తొలగిస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి నేపథ్యంలో గురువారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గతేడాది అక్టోబర్ 21న బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 19, 20, 21 పియర్లు పగుళ్లు తేలి వంతెనతో పాటు కుంగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఏ సూచన మేరకు గ్రౌటింగ్, ఇసుక తొలగింపు, షీట్‌ఫైల్స్ అమరిక తదితర మరమ్మతులకు వీలుగా, 7వ బ్లాక్‌లోకి వరద చేరకుండా దానిచుట్టూ రింగ్‌బండ్ నిర్మించారు. అయితే వారం రోజులుగా ఎగువన మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో బ్యారేజీకి ప్రాణహిత వరద తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలోనే రింగ్‌బండ్‌ను తొలగించాలనే నిర్ణయానికొచ్చారు. రింగ్‌బండ్‌ను పొక్లెయినర్లతో తవ్వించి టిప్పర్ల ద్వారా మెటీరియల్‌ను బయటకు తరలిస్తున్నారు. వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతుండడంతో గోదావరిలో ఉన్న రోడ్లను సైతం తొలగిస్తున్నారు. నిర్మాణ సంస్థకు సంబంధించిన వాహనాలు, మెటీరియల్‌ను పైకి తీసుకువెళ్తున్నారు. ప్రస్తుతం మేడిగడ్డ వద్ద ప్రాణహిత ద్వారా 16 వేలకు పైగా క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ విషయమై ఇంజనీరింగ్ అధికారులను వివరణ అడగ్గా..మళ్లీ కుంగిందని, బొరియలు ఏర్పడ్డాయనే వదంతులు వచ్చాయని, కానీ అలాంటిదేమీ లేదని చెప్పారు. వర్షాలతో వరద నీరు రావడం వల్లే రింగ్‌బండ్ తొలగింపు పనులు చేపడుతున్నామని వివరించారు.

అన్నారం సీపేజీలకు మరమ్మతులు

అన్నారం బ్యారేజీలో సీపేజీలకు ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు నిర్మాణ సంస్థ, ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. బ్యారేజీలో ఇసుక మేటలను తొలగించారు. సీసీ బ్లాక్ అమరిక పనులు చేపట్టారు. పుణేకు చెందిన సీడబ్ల్యూపీఆర్‌ఎస్ బృందం పది రోజులుగా జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలను చేపట్టింది. బుధవారం రాత్రి వరకు మొదటి దశ పార్లర్ సెస్మిక్ మెథడ్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. భూగర్భంలో బ్యారేజీ పొడవునా అప్, డౌన్ స్ట్రీమ్‌లో మొత్తం 42 చోట్ల సికెంట్ ఫైల్స్ ఎలా ఉన్నాయి.. మట్టి బలంగా ఉందా.. వీక్‌గా ఉందా అనే దానిపై ప్రత్యేకంగా బోర్‌వెల్ వేసి వైర్ ద్వారా స్కానింగ్ పరీక్షలు చేపట్టాల్సి ఉండగా..రికార్డు స్థాయిలో 14 పరీక్షలు నిర్వహించినట్లు ఇరిగేషన్ ఇంజనీర్లు పేర్కొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- శ్రీలంక జర్నలిస్టులతో మంత్రి పొంగులేటి



శ్రీలంక మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని సమాచార, పౌరసంబంధాల, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. శ్రీలంకకు చెందిన మీడియా ప్రతినిధులతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం గురువారం సచివాలయంలో మంత్రి పొంగులేటిని కలిసింది. ఈ సందర్భంగా ఆయన వారికి సాదర స్వాగతం పలికారు. ప్రతినిధి బృందం పర్యటించిన ప్రదేశాల గురించి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణకు ఘన సాంస్కృతిక చరిత్ర, సహజవనరులు ఉన్నాయని చెప్పారు. డాక్టర్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్న మీడియా మేనేజ్‌మెంట్‌పై రెండు వారాల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ ప్రతినిధి బృందం తెలంగాణకు వచ్చింది. ఈ సమావేశంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శశాంక్ గోయెల్, సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


బీసీలందరూ ఏకం కావాలి

- బలహీనవర్గాలపై దాడులకు పాల్పడుతున్న కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయాలి
- జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ నేతలు

కవాడిగూడ (హైదరాబాద్): బలహీన వర్గాల ప్రజలు, ప్రతినిధులను దుర్భాషలాడుతూ.. దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దోమలగూడలోని బీసీ భవన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో తెలంగాణలోని బీసీలందరూ ఐక్యం కావల్సిన అవసరం ఉందన్నారు. బీసీలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిని ఎదిరించి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన కరీంనగర్ జెడ్పీ సమావేశంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన జెడ్పీటీసీ గీకు రవీందర్ ముదిరాజ్‌ను.. రాయలేని భాషలో బూతులు తిడుతూ అవమానించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తక్షణమే బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలపై బీఆర్‌ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే పార్టీ నుంచి కౌశిక్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని అన్నారు. 24 గంటల్లో కౌశిక్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పకపోతే ఆయనను అడ్డుకొని తమ నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.



బైడెన్‌ను.. మార్చొచ్చా?

దొనాల్డ్ ట్రంప్‌తో ముఖాముఖి చర్చలో జో బైడెన్ ఆద్యంతం తడబడటం, మాటల కోసం వెతుక్కోవడంతో డెమొక్రాట్లలో భయాందోళనలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 81 ఏళ్ల వయసులో బైడెన్ సమర్థుడైన అభ్యర్థి కాగలరా? మరో నాలుగేళ్లు అగ్రరాజ్యం అధినేతగా భారం మోయగలరా? అనే సందేహాలు ముప్పిరిగొన్నాయి. నవంబరు 5న అధ్యక్ష ఎన్నికలు ముంచుకొస్తుండటంతో వయోభారం రీత్యా అధ్యక్షుడి మానసిక సంతులతపై డెమొక్రాట్లలో అనుమానాలు తలెత్తుతున్నాయి. టెక్సాస్ నుంచి డెమొక్రాట్ ఎంపీ ఒకరు బైడెన్ అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవాలని పిలుపునిచ్చారు. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా జో బైడెన్‌ను మార్చే అవకాశం ఉందా? స్వయంగా ఆయన రేసు నుంచి తప్పుకోవచ్చా? అప్పుడు ఎవరు అధ్యక్ష అభ్యర్థి అవుతారు? అనే అంశాలను ఒకసారి పరిశీలిద్దాం.

- సాక్షి నేషనల్ డెస్క్

బైడెన్‌పై తీవ్ర ఒత్తిడి

అవును.. తప్పుకోవచ్చు. కాకపోతే అందుకు ఆయన సిద్ధంగా లేరు. తానే డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థినని, వైదొలగాలని తననెవరూ ఒత్తిడి చేయడం లేదని బైడెన్ బుధవారం స్పష్టం చేశారు. డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థిని ఆగస్టు 19–22 వరకు షికాగోలో జరిగే డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ (డీఎన్‌సీ)లో అధికారికంగా ఎన్నుకోనున్నారు. ఓహియో రాష్ట్రంలో బ్యాలెట్ పేపర్‌పై పేరుండటానికి వీలుగా జూలై 21 నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు జరిగే వర్చువల్ కన్వెన్షన్‌లో తమ అభ్యర్థిని ఖరారు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. వివిధ రాష్ట్రాల ప్రైమరీల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా.. ఆ నిష్పత్తిలో అభ్యర్థులకు డెలిగేట్లను కేటాయిస్తారు. దాదాపు 4,000 డెలిగేట్లలో 99 శాతం బైడెన్ గెల్చుకున్నారు. డీఎన్‌సీ నిబంధనల ప్రకారం వీరందరూ బైడెన్‌కు మద్దతు పలకాలి. ఒకవేళ రాబోయే రోజుల్లో ఒత్తిడి మరీ పెరిగిపోయి.. రేసు నుంచి వైదొలగాలని బైడెన్ నిర్ణయించుకుంటే.. అప్పుడు ఉపాధ్యక్ష అభ్యర్థి కమలా హారిస్‌తో పాటు ఇతరులెవరైనా డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడవచ్చు. అప్పుడు డెలిగేట్లు జాతీయ కన్వెన్షన్‌లో (ఓపెన్ కన్వెన్షన్ అంటారు) తమకు నచ్చిన అభ్యర్థులను సూచించి ఒకరికి మెజారిటీ వచ్చేదాకా రౌండ్ల వారీగా ఓటింగ్ చేయొచ్చు. 1968లో అప్పటి అధ్యక్షుడు లిండన్ బి.జాన్సన్ మళ్లీ పోటీచేయకూడదని నిర్ణయించడంతో ఓపెన్ కన్వెన్షన్ నిర్వహించారు.

బలవంతంగా తప్పించొచ్చా?

పార్టీలో మెజారిటీ మార్పును కోరుకొని బైడెన్ ససేమిరా అంటే ఆయన్ను బలవంతంగా తప్పించడానికి ఆస్కారం ఉంది. డీఎన్‌సీ నియమావళిలో కొన్ని లొసుగులు ఉన్నాయి. 'జాతీయ కన్వెన్షన్లో డెలిగేట్లు తమను ఎన్నుకున్న వారి అభిప్రాయాన్ని/ మనోగతాన్ని ప్రతిబింబించాలి' అని నిబంధనలు చెబుతున్నాయి. అంటే డెమొక్రాటిక్ పార్టీ డెలిగేట్లు ఇతరుల వైపు కూడా మొగ్గు చూపవచ్చు (అదే రిపబ్లికన్ పార్టీలో అయితే డెలిగేట్లు ఎవరి తరఫున అయితే ఎన్నికయ్యారో వారికే బద్ధులై ఉండాలని స్పష్టంగా ఉంది). బైడెన్ తరఫున ఎన్నికైన 3,894 డెలిగేట్లలో 1,976 మంది పైచిలుకు డెలిగేట్లు వర్చువల్ కన్వెన్షన్‌లో ఓటింగ్‌కు దూరంగా ఉండాలి. అప్పుడు స్పష్టమైన తీర్పు రాక అదనపు రౌండ్ల ఓటింగ్ జరుగుతుంది. డెలిగేట్లు ఇంత పెద్ద సంఖ్యలో తిరుగుబాటు చేస్తారా? అని అమెరికా రాజకీయ పండితులు సందేహిస్తున్నారు. అయితే అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకొనే నిబంధనలను డీఎన్‌సీ రూల్స్ కమిటీ ఏ సమయంలోనైనా మార్చవచ్చు.

బైడెన్ స్వయంగా వైదొలిగితే తప్పితే ఆయన్ను అధ్యక్ష అభ్యర్థిగా తప్పించడం అంత సులభం కాదు. సాంకేతికంగా అవకాశాలు ఉన్నప్పటికీ ఆచరణలో కష్ట సాధ్యమే.

కమలా హారిస్‌కు ఛాన్స్ ఉందా?

నాలుగేళ్ల పదవీకాలంలో అధ్యక్షుడు ఎప్పుడైనా తప్పుకొంటే.. ఉపాధ్యక్షురాలైన కమలా హారిస్ ఆటోమెటిగ్గా పగ్గాలు చేపడతారు. కానీ అధ్యక్ష అభ్యర్థి రేసులో ఇలాంటి ఆస్కారం లేదు. ఓపెన్ కన్వెన్షన్‌లో అందరి అభ్యర్థుల్లాగే భారతీయ–అమెరికన్ హారిస్ కూడా పోటీపడాల్సి వస్తుంది. మెజారిటీ డెలిగేట్ల ఓట్లను సంపాదించాల్సి ఉంటుంది. అధ్యక్ష డిబేట్ తర్వాత సీఎన్ఎన్ నిర్వహించిన పోల్‌లో ట్రంప్‌కు 47 శాతం మంది ఓటర్లు మద్దతు పలుకగా, కమలా హారిస్‌కు 45 శాతం మంది మద్దతు లభించడం విశేషం. హారిస్‌కు అనుకూలించే మరో అంశం ఏమిటంటే.. డెమొక్రాటిక్ పార్టీ ప్రచార ఫండ్‌ను బైడెన్ కాకుండా ఆమె మాత్రమే నేరుగా పొందగలరు.

ఊపిరి తీస్తున్న వాయు కాలుష్యం

- దేశంలోని పది పెద్ద నగరాల్లో 7.2 శాతం మరణాలకు 'పీఎం 2.5' ధూళి కణాలే కారణం
- 'లాన్సెట్ ప్లానెటరీ హెల్త్' పత్రిక వెల్లడి

న్యూఢిల్లీ: ఆయువు పోయాల్సిన వాయువు ప్రాణాలు తోడేస్తోంది. వాయువులో ప్రాణాంతకమైన కాలుష్య కారకాలు కలుస్తున్నాయి. ఊపిరి పీలిస్తే శరీరంలోకి చేరిపోయి, అవయవాలను నిర్వీర్యం చేస్తున్నాయి. ఇండియాలోని పది అతిపెద్ద నగరాల్లో సంభవిస్తున్న రోజువారీ మరణాల్లో సగటున 7.2 శాతం మరణాలకు వాయు కాలుష్యమే కారణమని తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) నిర్దేశించిన పరిమితి కంటే హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై తదితర నగరాల్లోని గాలిలో అత్యంత సూక్ష్మమైన 'పీఎం 2.5' ధూళి కణాలు అధికంగా ఉన్నట్లు లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ పత్రిక స్పష్టం చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో చాలా మరణాలకు వాయు కాలుష్యమే కారణమవుతున్నట్లు తెలియజేసింది. వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడుతున్న ఉద్గారాలు గాలిని విపరీతంగా కలుషితం చేస్తున్నాయని పేర్కొంది. అధ్యయనం వివరాలను పత్రికలో ప్రచురించారు. 2.5 మైక్రోమీటర్ల కంటే తక్కువ పరిమాణంలో ఉన్న ధూళి కణాలను 'పీఎం 2.5 కణాలు' అంటారు.

- భారతదేశంలోని పెద్ద నగరాల్లో నిత్యం వెలువడుతున్న పీఎం 2.5 ధూళి కణాలతో మరణాల ముప్పు నానాటికీ పెరుగుతోందని పరిశోధకులు వెల్లడించారు.
- ఇండియాలో వాయు కాలుష్యంపై వారణాసిలోని బనారస్ హిందూ యూనివర్సిటీ, ఢిల్లీలోని సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజ్ కంట్రోల్‌తోపాటు పలువురు అంతర్జాతీయ పరిశోధకులు ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతా, పుణే, సిమ్లా, వారణాసి నగరాల్లో 2008 నుంచి 2019 దాకా ఈ అధ్యయనం నిర్వహించారు.
- క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం 2.5 ధూళి కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే రోజువారీ మరణాల సంఖ్య 1.4 శాతం పెరుగుతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా మరణాల ముప్పు 2.7 శాతం పెరుగుతున్నట్లు తేల్చారు.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ విధివిధానాల ప్రకారం.. 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం 2.5 కణాలు 15 మైక్రోగ్రాముల లోపు ఉంటే ప్రమాదం లేదు. అంతకంటే మించితే ముప్పు తప్పదు.
- భారత వాయు నాణ్యత ప్రమాణాల ప్రకారం.. 24 గంటల వ్యవధిలో క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం 2.5 ధూళి కణాలు 60 మైక్రోగ్రాముల లోపు ఉండే ప్రమాదం అంతగా ఉండదు. కానీ, ప్రస్తుతం 75 మైక్రోగ్రాముల కంటే అధికంగానే ఉంటున్నట్లు తేలింది.
- క్యూబిక్ మీటర్ గాలిలో పీఎం 2.5 కణాలు 10 మైక్రోగ్రాములు పెరిగితే మరణాల రేటు సగటున 3 శాతం దాకా పెరుగుతున్నట్లు గుర్తించారు.
- స్థానికంగా వెలువడే ఉద్గారాలు, కాలుష్యంతో పీఎం 2.5 కణాల ఉత్పత్తి పెద్ద ఎత్తున జరుగుతోంది. అందుకే స్థానికంగా కాలుష్యాన్ని సమర్థవంతంగా కట్టడి చేస్తే మరణాల ముప్పు చాలావరకు తగ్గుతుందని సైంటిస్టులు సూచిస్తున్నారు.



జార్ఖండ్ సీఎంగా మళ్లీ సోరెన్

రాంచీ: జార్ఖండ్ ముక్తి మోర్చా ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు హేమంత్ సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణం చేశారు. గురువారం రాంచీలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ రాష్ట్ర 13వ సీఎంగా ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో హేమంత్ తండ్రి, జేఎంఎం చీఫ్ శిబూ సోరెన్, తల్లి రూపి, భార్య కల్పన, తాజా మాజీ సీఎం చంపయి సోరెన్, కూటమి సీనియర్ నేతలు పాల్గొన్నారు. భూ కుంభకోణంలో మనీ లాండరింగ్ ఆరోపణలపై జనవరి 31వ తేదీన హేమంత్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేయడం, జూన్ 28వ తేదీన హైకోర్టు ఆయన్ను బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించడం తెల్సిందే. అరెస్ట్‌కు కొద్ది గంటల ముందే సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారు.

ముఖ్యమంత్రిగా మూడోసారి..

తండ్రి శిబూ సోరెన్ రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ హేమంత్ 2009లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. అదే ఏడాది జేఎంఎం తరఫున రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2010లో రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేసి బీజేపీ సారథ్యంలోని అర్జున్ ముండా ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ల తర్వాత బీజేపీ ప్రభుత్వం కూలిపోవడంతో, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన వచ్చింది. 2013 ఎన్నికల్లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. హేమంత్ సోరెన్ 38 ఏళ్ల వయస్సులోనే సీఎం పదవిని చేపట్టారు. ఈ ప్రభుత్వం స్వల్ప కాలమే మనుగడ సాగించింది. 2014లో రఘుబర్ దాస్ సారథ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. 2019లో జరిగిన ఎన్నికల్లో హేమంత్ సారథ్యంలో మళ్లీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.



సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తున్న హేమంత్

వాస్తవాధీన రేఖను గౌరవించాల్సిందే

చైనా విదేశాంగ మంత్రికి జై శంకర్ స్పష్టీకరణ

ఆస్తానా: వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ)ను చైనా గౌరవించాల్సిందేనని, సరిహద్దుల్లో శాంతి నెలకొనడం ఎంతో అవసరమని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. గురువారం కజఖ్‌స్తాన్ రాజధాని ఆస్తానాలో ఎస్‌సీవో శిఖరాగ్రానికి హాజరైన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో ఆయన భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవం, ఆసక్తి, సున్నితత్వంపై ఆధారపడి ఉండాలని ఈ సందర్భంగా జై శంకర్ పేర్కొన్నారు. తూర్పు లద్దాఖ్‌లోని మిగతా ప్రాంతాల నుంచి సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించడానికి ప్రయత్నాలను ముమ్మరం చేయాలని కోరారు. రెండు దేశాల సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చే క్రమంలో ఉన్న అడ్డంకులను అధిగమించి, శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడం అవసరమన్నారు. ఇందుకోసం, రెండు దేశాల సరిహద్దుల నిర్వహణకు సంబంధించి గతంలో కుదిరిన ఒప్పందాలు, నిర్ణయాలకు పూర్తిగా కట్టుబడి ఉండాలన్నారు. తూర్పు లద్దాఖ్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలను వేగవంతం చేయాలని ఇరువురు నేతలు అంగీకారానికి వచ్చారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

బ్రిటన్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

- రాత్రి పదింటిదాకా కొనసాగిన పోలింగ్
- ఓటేసిన ప్రధాని రిషి సునాక్, భార్య అక్షతామూర్తి
- విపక్ష లేబర్ పార్టీయే గెలుస్తుందంటున్న విశ్లేషకులు

లండన్: పద్నాలుగేళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనకు యూకే పౌరులు చరమగీతం పాడనున్నారన్న విశ్లేషణల నడుమ బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పర్వం గురువారం ప్రశాంతంగా పూర్తయింది. ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసరాల ధరలు, వలసల కట్టడిలో విఫలమయ్యారన్న విమర్శలు ఎదుర్కొంటున్న భారతీయ మూలాలున్న బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారిన విషయం తెల్సిందే. ఉదయాన్నే భార్య అక్షతామూర్తితో కలిసి సునాక్ నార్త్‌అలెర్టన్ సిటీ దగ్గర్లోని కిర్బీ సిగ్‌స్టన్ గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేశారు. 'మార్పు' నినాదంతో ఎన్నికల్లో ఫేవరెట్‌గా నిలిచిన విపక్ష లేబర్ పార్టీ నేత కెయిర్ స్టార్మర్ సైతం భార్య విక్టోరియాతో కలిసి ఉత్తర లండన్‌లోని క్యామ్‌డెన్ విల్లింగ్‌హామ్ హాల్ పోలింగ్‌కేంద్రంలో హుషారుగా ఓటేశారు. బ్రిటిష్ స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఏడుగంటలకే 40,000 పోలింగ్‌బూత్‌లలో పోలింగ్ మొదలైంది. బ్రిటన్‌లో 4.6 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి 10 గంటలదాకా అంటే భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటల దాకా పోలింగ్ జరగనుంది. పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. బ్రిటన్ పార్లమెంట్ దిగువ సభ అయిన 'హౌజ్ ఆఫ్ కామన్స్'లో ఉన్న మొత్తం 650 ఎంపీ స్థానాలకు పోలింగ్ చేపట్టారు. సాధారణ మెజారిటీ సాధించాలంటే 326 సీట్లు గెలవాలి. ప్రధానమైన కన్జర్వేటివ్, లేబర్ పార్టీలతోపాటు లిబరల్ డెమొక్రాట్స్, గ్రీన్ పార్టీ, స్కాటిష్ నేషనల్ పార్టీ, ఎస్‌డీఎల్‌పీ, డెమొక్రటిక్ యూనియనిస్ట్ పార్టీ, సిన్ ఫియెన్, ప్లెయిడ్ సిమ్రూ, ది యాంటీ ఇమిగ్రేషన్ రిఫామ్ పార్టీలతోపాటు స్వతంత్రులు బరిలో దిగారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 67 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిశాక ఎగ్జిట్‌పోల్స్ వెలువడే అవకాశముంది. కన్జర్వటివ్ పార్టీ కేవలం 53–150 సీట్లు సాధిస్తుందని, లేబర్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఇప్పటికే ఒపీనియన్స్ పోల్స్ వెల్లడయ్యాయి.

సంస్కరణవాదా ? అతివాదా?

మసూద్ పెజెష్కియన్, సయీద్ జలిలి మధ్య హోరాహోరీ పోరు ● నేడు రెండో దఫా ఎన్నికలకు సిద్ధమైన ఇరాన్

ఇరాన్ అధ్యక్ష ఎన్నికల్లో అత్యల్ప ఓటింగ్‌తో ప్రతిష్టంభన నెలకొన్న తరుణంలో నేడు రెండో దఫా ఎన్నికలకు ఓటర్లు సిద్ధమయ్యారు. జూన్ 28న జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులందరినీ తిరస్కరిస్తూ, ఎవరికీ కీలక 50 శాతం ఓటింగ్‌ను ఓటర్లు కట్టబెట్టకపోవడంతో రన్‌ఆఫ్(రెండోసారి ఎన్నికలు)కు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. మతబోధకుడి పాలనను జనం ఎంతగా తిరస్కరిస్తున్నారనేది జూన్ 28నాటి అత్యల్ప ఓటింగ్ సరళి కళ్లకు కట్టింది. కునారిల్లిన ఆర్థికవ్యవస్థ, యువతలో అసహనం, మతఛాందసవాదం, ఉద్యమాలు, అంతర్జాతీయంగా ఇజ్రాయెల్, అమెరికాలతో కయ్యంతో ఇంటాబయటా ఇబ్బందులు పడుతున్న దేశాన్ని ఎవరు ఏలుతారన్న విషయం నేటి ఎన్నికలతో తేలిపోనుంది.

తొలి రౌండ్‌లో ఏం జరిగింది?

మే 19న హెలికాప్టర్ ప్రమాదంలో అధ్యక్షుడు రైసీ మరణించడంతో అధ్యక్ష ఎన్నికలు అనివార్యమయ్యాయి. సుప్రీం లీడర్ ఆయాతొల్లా అలీ ఖమేనీ ఆజ్ఞలు పాటిస్తూ దేశాధ్యక్షునిగా పాలించేందుకు ముగ్గురు అతివాద నేతలు, ఒక సంస్కరణవాది ఎన్నికల్లో పోటీకి ముందుకొచ్చారు. తొలి రౌండ్‌లో సంస్కరణవాది డాక్టర్ మసూద్ పెజెష్కియన్ అందరికంటే ఎక్కువగా 42.5 శాతం ఓట్లు సాధించారు. అతివాది సయీద్ జలిలి 38.6 శాతం ఓట్లు ఒడిసిపట్టారు. దేశంలో 6 కోట్ల మంది ఓటర్లుంటే కేవలం 2.5 కోట్ల మంది ఓటేశారు. దేశ చరిత్రలోనే అత్యల్పంగా 40 శాతం పోలింగ్ నమోదైంది. ఎవరికీ 50 శాతం ఓట్లు రాని పక్షంలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు రెండోదశ పోలింగ్‌కు అర్హత సాధిస్తారు. ఈ లెక్కన మసూద్, జలిలి మాత్రమే ఈరోజు జరిగే ఎన్నికల్లో పోటీపడుతున్నారు.

పిడివాదుల్లో పొరపొచ్చాలు?

అతివాద నేతల మధ్య అభిప్రాయభేదాలు పొడచూపాయి. అతివాదం నుంచి దేశాన్ని సంస్కరణల బాట పట్టిస్తే మంచిదని కొందరు అభిప్రాయపడ్డారు. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ సీనియర్ సభ్యుడు, అతివాది సర్దార్ మొహసీన్ రషీద్ తన మద్దతు మసూద్‌కే అని ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. తొలి రౌండ్‌లో పోటీపడి ఓడిన గలీబాఫ్‌కు ప్రచారసారథ్యంవహించిన సమీ నజారీ తర్కరానీ సైతం మసూద్‌కే తన ఓటు అని ప్రకటించారు.

మసూద్ గెలిస్తే?


తొలి రౌండ్‌లో పోలింగ్ కేంద్రందాకా రాని 60 శాతం ఓటర్లపైనే ఈ ఇద్దరు అభ్యర్థులు దృష్టిసారించారు. తొలి రౌండ్‌లో సమీప అభ్యర్థి జలిలి కంటే 3.9 శాతం ఓట్లు ఎక్కువ సాధించడం ద్వారా జనాల్లో తనకు ప్రజాదరణ ఎక్కువ ఉందని మసూద్ పెజెష్కియన్ ఇప్పటికే నిరూపించుకున్నారు. కొన్ని అంశాల్లో మసూద్‌ను సమర్థిస్తున్నట్లు ఎన్నికలపర్వం మొదలవడానికి ముందు జలిలి కొన్ని సందర్భాల్లో వ్యాఖ్యానించారు. మైనారిటీలు, యువత, మహిళల సమస్యలను ప్రచారం సందర్భంగా ప్రస్తావిస్తూ జనాన్ని మసూద్ తనవైపునకు తిప్పుకుంటున్నారు. మసూద్ గెలిచి దేశాధ్యక్షుడైతే నాటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయంతో మరుగునపడిన 2015నాటి అమెరికా–ఇరాన్ అణుఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు కృషిచేయొచ్చు. పశ్చిమదేశాలతో దోస్తీకి ప్రయత్నించవచ్చు. దీంతో ఆంక్షలు తొలగి, విదేశీ పెట్టుబడులు పెరిగి దేశార్థికం బాగుపడే అవకాశముంది.

జలిలి గెలిస్తే?

సయీద్ జలిలి గెలిస్తే ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. దేశాభివృద్ధి కోసం పశ్చిమదేశాలపై ఆధారపడాల్సిన పనిలేదని సుప్రీంలీడర్ ఖమేనీ అన్న మాటలనే జలిలి వల్లెవేస్తున్నారు. '' అసలు ఇరాన్‌పై ఎందుకు ఆంక్షలు విధించాం? అని పశ్చిమ దేశాలే బాధపడాలి. ఆంక్షలను సైతం మనం అవకాశంగా మలచుకోవాలి' అన్న జలిలి మాటలు చూస్తుంటే ఈయన గెలిస్తే దేశంలో మతచాందస పాలనను కొనసాగిస్తారని అర్థమవుతోంది.



మసూద్ పెజెష్కియన్



సయీద్ జలిలి

స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే మార్గముందా?

దేశ కీలక అంతర్గత వ్యవహారాలు అన్నీ సుప్రీంలీడర్ ఖమేనీ కనుసన్నల్లో జరుగుతాయి. అలాంటపుడు అధ్యక్షుడిగా ఉండి కూడా మసూద్‌గానీ, జలిలిగానీ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోగలరా? అనేది భేతాళ ప్రశ్నగా మిగిలిపోనుందని రాజకీయ విశ్లేషకుల మాట. అయితే విదేశీవ్యవహారాల్లో అధ్యక్షుడు, మంత్రివర్గం నిర్ణయాలే ఎక్కువగా చెల్లుబాటు అవుతాయని తెలుస్తోంది. ఇజ్రాయెల్, అమెరికాలతో శతృత్వం విషయం పక్కనబెడితే ఇతర పశ్చిమ దేశాలతో మైత్రికి నూతన అధ్యక్షుడు ప్రయత్నిస్తే దేశంలో ప్రగతి సాధ్యమే. మసూద్ అధ్యక్షుడైతే ఈ మార్పుకు బాటలు పడొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ 'మార్పు'కు ఖమేనీ ఒప్పుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.


- సాక్షి, నేషనల్ డెస్క్

ఐదేళ్ల తర్వాత మోదీ రష్యా పర్యటన



న్యూఢిల్లీ: చిరకాల మిత్రదేశం రష్యాలో భారత ప్రధాని మోదీ ఈనెల 8, 9వ తేదీల్లో పర్యటించనున్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత రష్యాలో మోదీ పర్యటిస్తుండటం విశేషం. రష్యాలో 22వ భారత్–రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పుతిన్‌తోపాటు మోదీ పాల్గొననున్నారు. ఇరు దేశాల మధ్య పలు ద్వైపాక్షిక ఒప్పందాలపై చర్చలు జరపనున్నారని భారత విదేశాంగ శాఖ గురువారం ప్రకటించింది. రష్యా పర్యటన ముగించుకున్నాక మోదీ ఆస్ట్రియా దేశంలో పర్యటించనున్నారు. గత 41 సంవత్సరాల్లో ఆస్ట్రియాను భారత ప్రధాని సందర్శించడం ఇదే తొలిసారి అవుతుంది. రష్యాలో చివరిసారిగా మోదీ 2019లో వ్లాడివోస్టాక్ పట్టణంలో ఆర్థికసదస్సులో పాలుపంచుకున్నారు.


శపథం మేరకు కిరోడీ లాల్ రాజీనామా..



జైపూర్: ప్రధాని మోదీ తనకు బాధ్యతలు అప్పగించిన ఏడు లోక్‌సభ స్థానాల్లో ఎన్నికల్లో నాలుగింటిని బీజేపీ కోల్పోయినందుకు మాటకు కట్టుబడి మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు రాజస్తాన్ మంత్రి కిరోడీ లాల్ మీనా(72) గురువారం తెలిపారు. అయితే, తన రాజీనామా లేఖను సీఎం భజన్‌లాల్ తిరస్కరించారని చెప్పారు. పార్టీ అధిష్టానం శుక్రవారం ఢిల్లీకి రావాలంటూ కబురు పంపించిందని, అక్కడ పార్టీ పెద్దలకు తన నిర్ణయాన్ని వివరిస్తానని కిరోడీ లాల్ మీడియాకు చెప్పారు. అధిష్టానంపైగానీ, సీఎం భజన్‌లాల్ శర్మపైగానీ తనకు ఎటువంటి అసంతృప్తి లేవన్నారు.

హరియాణా, ఢిల్లీలో ఆప్‌తో పొత్తు లేనట్టే!

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వెల్లడి



న్యూఢిల్లీ: హరియాణా, ఢిల్లీలో మరో ఏడాదిలోగా జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) మధ్య పొత్తు కుదిరే అవకాశాలు పెద్దగా కనిపించడం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ చెప్పారు. కానీ, మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీలన్నీ కలిసికట్టుగా పోటీ చేస్తాయని తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాల్లో జరిగే శాసనసభ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు తప్పనిసరిగా పొత్తు పెట్టుకోవాలన్న నిబంధన ఏదీ లేదని స్పష్టంచేశారు. అవగాహన కుదిరిన చోట కూటమి పార్టీలు కలిసి పోటీ చేస్తాయని వెల్లడించారు.

బిహార్‌లో కూలిన మరో వంతెన

పట్నా: బిహార్‌లో మరో వంతెన కూలింది. రాష్ట్రంలో పక్షం రోజుల వ్యవధిలో చోటుచేసుకున్న పదో ఘటన కాగా, సరన్ జిల్లాలో 24 గంటల వ్యవధిలో జరిగిన మూడో దుర్ఘటన. సరన్ జిల్లాలోని బనేయపూర్ బ్లాక్‌లోని పలు గ్రామాలను, సివాన్ జిల్లాతో కలుపుతూ పదిహేనేళ్ల క్రితం గండకీ నదిపై ఈ వంతెనను నిర్మించారు. గురువారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. వరుసగా వంతెనలు కూలుతున్న ఘటనలపై ప్రభుత్వం ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్తాన్‌లోని కోటాలో మరో విద్యార్థి బలవ్మనరణం చెందారు. జేఈఈ పోటీ పరీక్షకు ప్రిపేరయ్యే బిహార్ విద్యార్థి సందీప్ కుమార్ కుర్మి(16)హాస్టల్‌లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. నలందా జిల్లాకు చెందిన ఇతడు రెండేళ్లుగా మహావీర్ నగర్‌లో ఉంటూ ఇంజనీరింగ్ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. గురువారం ఉదయం 7 గంటలైనా ఇతడు రూం నుంచి బయటకు రాకపోవడంతో తోటి విద్యార్థి కిటికీలోంచి లోపలికి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అతడి వద్ద ఎలాంటి సూసైడ్ నోట్ కనిపించలేదని పోలీసులు తెలిపారు. తాజా ఘటనతో కలిపి ఈ ఏడాది జనవరి నుంచి కోటాలో 13 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

ఆరుగురు సేవాదార్లు అరెస్టు

హత్రాస్/లక్నో: 121 మంది మరణానికి కారణమైన హత్రాస్ తొక్కిసలాట ఘటనపై ఉత్తరప్రదేశ్ పోలీసులు దర్యాప్తు వేగవంతంగా చేశారు. ఈ కేసులో సత్సంగ్ నిర్వాహక కమిటీకి చెందిన ఆరుగురు సేవాదార్లను అరెస్టు చేసినట్లు గురువారం వెల్లడించారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారని చెప్పారు. రామ్ లాడైతి(50), ఉపేంద్రసింగయాదవ్(62), మేఘ సింగ్(61), ముకేశ్ కుమార్(38), మంజూ యాదవ్(30), మంజూ దేవి(40)ని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు, ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్ కనిపించకుండా పోయాడని, అతడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని, అతడి ఆచూకీ చెబితే రూ.లక్ష బహుమానం ప్రకటిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. సత్సంగ్‌లో ప్రజలకు జ్ఞానబోధ చేసిన నారాయణ్ సకర్ హరి అలియాస్ భోలే బాబా అలియాస్ సూరజ్‌పాల్ ఇంకా పరారీలోనే ఉన్నారు. ఆయన పేరును పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చలేదు. అవసరమైతే భోలే బాబాను కూడా విచారిస్తామని పోలీసులు వెల్లడించారు.

నీట్- యూజీ రద్దు చేయొద్దు

సుప్రీంకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు

సాక్షి, న్యూఢిల్లీ: నీట్–యూజీ 2024 రద్దు చేయకుండా చూడాలని పలువురు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పరీక్షను రద్దుచేయకుండా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని నిలువరిస్తూ ఆ సంస్థకు సంబంధిత ఆదేశాలు ఇవ్వాలంటూ గుజరాత్‌కు చెందిన దాదాపు 56 మంది అభ్యర్థులు కోర్టును కోరారు. తాజా నీట్–యూజీలో మంచి ర్యాంక్ సాధించిన అభ్యర్థులతోపాటు ఫస్ట్‌ర్యాంక్ సాధించిన కొందరు ఈ పిటిషన్ వేశారు.

అదే జరిగితే మానవజాతి అంతం!

ఐదేళ్ల తర్వాత భారీ గ్రహశకలం భూమిని ఢీకొట్టే చాన్స్: ఎస్.సోమ్‌నాథ్

న్యూఢిల్లీ: గ్రహశకలం. అత్యంత వేగంగా అంతరిక్షంలో పయనించే ఈ ఖగోళ అద్భుతాన్ని దూరం నుంచి చూసేందుకు అందరూ ఇష్టపడతారు. దూరం నుంచి దూసుకెళ్తుంటే ఆశ్చర్యం కల్గించే ఆస్టరాయిడ్ ఒకవేళ భూమికి దగ్గరగా వెళ్లినా, పేలినా అది సృష్టించే వినాశనం ఊహకు కూడా అందదు. అలాంటి ఘటనకు గత శతాబ్దంలో సెర్బియా సాక్షిభూతంగా నిల్చింది. 1908 జూన్ 30న ఒక భారీ గ్రహశకలం భూమి దిశగా దూసుకొచ్చి భూమిని ఢీకొట్టినంత పనిచేసింది. సెర్బియా గగనతలానికి కాస్తంత ఎత్తులో బద్దలైంది. ఈ పేలుడు ధాటికి వెలువడిన వేడి టుంగుస్కా ప్రాంతంలోని 2,200 చదరపు కిలోమీటర్ల అడవిని దహించేసింది. గాల్లో పేలితేనే ఇంతటి దారుణం జరిగితే ఇక నేరుగా భూమిని ఢీకొడితే ఎంతటి వినాశనం సంభవిస్తుందో ఊహించలేం. అయితే 2029 ఏప్రిల్ 13న అపోఫిస్ అనే గ్రహశకలం భూమిని ఢీకొట్టే ప్రమాదం పొంచి ఉందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమ్‌నాథ్ ఆందోళన వ్యక్తంచేశారు. 370 మీటర్ల వెడల్పున్న అపోఫిస్ ఆస్టరాయిడ్ తన కక్ష్యలో దూసుకెళ్తూ 2036లోనూ భూమి సమీపానికి రానుంది. 10 కి.మీ.ల వెడల్పాటి ఆస్టరాయిడ్ ఢీకొంటే వెలువడే ఉష్ణంధాటికి భూమి మీది కొన్ని జీవజాతులు పూర్తిగా చనిపోయే ప్రమాదముందని ఒక సిద్ధాంతం. డైనోసార్లు ఇలాగే అంతర్ధానమయ్యాయని శాస్త్రవేత్తల అంచనా. భూమిని ఇలాంటి ఖగోళ ప్రమాదాల నుంచి రక్షించుకునే వ్యవస్థల అభివృద్ధికి సంపన్న దేశాలు సమాయత్తమయ్యాయి. భారత్ సైతం తన వంతు కృషిచేస్తోందని సోమ్‌నాథ్ చెప్పారు. రెండేళ్ల క్రితం డార్ట్ వ్యోమనౌక ఢీకొట్టడంతో డైమార్ఫస్ అనే గ్రహశకలం తన కక్ష్యను మార్చుకుంది. తమ ప్రయోగం కారణంగా డైమార్ఫస్ పరిభ్రమణ కక్ష్యలో దాదాపు 32 నిమిషాల మార్పు చోటుచేసుకున్నట్లు నాసా ఆనాడు ప్రకటించింది. గ్రహశకలాల రూపంలో భవిష్యత్తులో భూమికి ఎలాంటి ముప్పు ముంచుకొచ్చినా సమర్థంగా ఎదుర్కొగల సామర్థ్యాలను సముపార్జించుకోవడంలో ఇది కీలక ముందడుగు అని ఆనాడు ప్రపంచదేశాలు కీర్తించాయి.



క్యారెట్లలో కిరికిరి

కొనేదంతా బంగారం కాదు!

సాధారణంగా 22 క్యారెట్ల బంగారంతోనే ఆభరణాల తయారీ	18, 14 క్యారెట్లతో కూడా చేస్తున్న జ్యువెలరీ దుకాణదారులు	తక్కువ క్యారెట్ల ఆభరణానికి ఎక్కువ క్యారెట్లతో బిల్లు	అవగాహనలేక మోసపోతున్న కొనుగోలుదారులు.. హాల్‌మార్క్ ఉంటే ఓకే స్వచ్ఛతపై అవగాహన అవసరం: నిపుణులు

హైదరాబాద్‌లోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఒక మహిళ తన బంగారు ఆభరణాన్ని కరిగించి మరో ఆభరణం తయారు చేయించుకునేందుకు స్వర్ణకారుడి వద్దకు వెళ్లింది. ఆభరణాన్ని పరిశీలించగా అందులో 70 శాతానికి మించి బంగారం లేదు. హాల్‌మార్క్ సెంటర్‌కు పంపి పరిశీలిస్తే ఆభరణంలో రాగి 16.47 శాతం, వెండి 15.23 శాతం ఉండగా బంగారం 68.12 శాతం మాత్రమే ఉన్నట్లు తేలింది. గతంలో ఆ ఆభరణాన్ని విక్రయించిన వ్యాపారి ఇచ్చిన రసీదు అందుబాటులో లేకపోవడంతో ప్రశ్నించే అవకాశం లేకుండాపోయింది.

బంగారంపై మహిళలకుండే మక్కువ అంతా ఇంతా కాదు. బంగారంతో చేసిన ఆభరణాలపై ఉండే క్రేజే వేరు. ధనం లేకున్నా, తులం బంగారం అయినా ఒంటి మీద ఉండాలని సగటు మధ్య తరగతి మహిళలు భావిస్తుంటారు. పేద, ధనిక తేడా లేకుండా ప్రతిఒక్కరూ తమ స్థాయికి తగ్గట్టు వీలైనప్పుడల్లా బంగారు ఆభరణాలు కొనేందుకు ప్రయత్నిస్తుంటారు. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో కొత్త బంగారు ఆభరణాలు కొనేవారి సంఖ్య, అన్‌సీజన్‌లో పాత బంగారంతో కొత్త ఆభరణాలు చేయించేకునే వారి సంఖ్య ఇటీవలి కాలంలో అధికంగా ఉంటోంది. గతంలో పెళ్లినాడు ఏ నగలైతే పెట్టుకునేవాళ్లో వాటినే భద్రంగా కాపాడుకుంటూ శుభకార్యాల్లో ధరించేవాళ్లు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. పాత నగలను ఫ్యాషన్‌కు అనుగుణంగా మార్చుకుంటున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే కొనేటప్పుడు ఆ ఆభరణాన్ని మొత్తం బంగారం కిందే లెక్కించి వ్యాపారి డబ్బులు వసూలు చేస్తాడు. అదే కొంత కాలం తర్వాత కొన్న బంగారాన్ని కరిగించి మరో ఆభరణం తయారీ కోసమో, ఆర్థిక అవసరాల కోసం అమ్మడానికో వెళితే అసలు రంగు బయటపడుతుంది. క్యారెట్ల మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. నాణ్యత తక్కువుందనో, వేస్టేజీ ఎక్కువుందనో పేర్కొంటూ వీలైనంత తక్కువ చెల్లించడం సర్వసాధారణం. ఇక వజ్రాభరణాల్లో మేలిమి బంగారం నేతి బీరలో నెయ్యి చందంగానే మారింది. కళ్ల ముందే బంగారం స్వచ్ఛతలో మాయ చేస్తున్నా నాణ్యత గుర్తించలేక వినియోగదారులు నష్టపోతున్నారు.

సాక్షి హైదరాబాద్

మోసం ఇలా..

ప్రముఖ జ్యువెలరీస్, షాపింగ్ మాల్స్ నుంచి చిన్నపాటి స్వర్ణకారుడి షాపు వరకు కూడా 24 క్యారెట్ల కంటే తక్కువ నాణ్యత కలిగిన బంగారాన్నే విక్రయిస్తుంటాయి. ఆభరణంలో పటుత్వం కోసం రాగి కలుపుతారు. సాధారణంగా ఆభరణాలన్నీ 22 క్యారెట్లు లేదా కొంచెం తక్కువ నాణ్యత కలిగి ఉంటాయి. వజ్రాల నగ కేవలం 18 క్యారెట్‌తోనే ఉంటుంది. అయితే వ్యాపారులు 18 క్యారెట్ల ఆభరణాన్ని చేతిలో పెట్టి 22 క్యారెట్ల బిల్లు వసూలు చేయడం సర్వసాధరణంగా మారిపోయింది. 22 క్యారెట్లు 18 క్యారెట్ల ఆభరణానికి మధ్య గ్రాముకు కనీసం రూ.500 నుంచి రూ.1,000 వరకు వ్యత్యాసం ఉంటుంది. ఈ లెక్కన 10 గ్రాముల బంగారానికి దాదాపు రూ.10 వేల వరకు వినియోగదారులు మోసపోతున్నారన్నమాట.

హాల్‌మార్క్ ముద్ర తప్పనిసరి

వంద శాతం స్వచ్ఛతతో కూడిన మేలిమి బంగారం బిస్కెట్ రూపంలో ఉంటుంది. కాగా బంగారు ఆభరణాల్లో స్వచ్ఛతను హాల్ మార్క్ ముద్ర తెలియజేస్తుంది. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) నిబంధన మేరకు బంగారం ఉంటేనే సదరు ఆభరణంపై హాల్ మార్క్ ముద్ర ఉంటుంది. 24 క్యారెట్ల బంగారంపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌లపై 916, 21 క్యారెట్‌లపై 875, 18 క్యారెట్‌లపై 750 అని ముద్ర ఉంటుంది. ఈ నంబర్ తర్వాత హాల్ మార్క్ వేసిన సెంటర్ మార్క్ ఉంటుంది. తయారైన సంవత్సరం ఇంగ్లిష్ అక్షరం కోడ్ రూపంలో ఉంటుంది. చివరిలో బీఐఎస్ ధ్రువీకరించిన ఆభరణాల తయారీదారుల గుర్తు ఉంటుంది. ఈ హాల్‌మార్క్ ముద్ర లేని ఆభరణాల కొనుగోలులోనే మోసాలకు అవకాశం ఉంటుంది.

స్వచ్ఛత...క్యారెట్లలో

బంగారం స్వచ్ఛతను క్యారెట్‌లలో కొలుస్తారు. ఇది 0 నుంచి 24 వరకు ఉంటుంది. క్యారెట్ విలువ ఎంత ఎక్కువగా ఉంటే బంగారం అంత స్వచ్ఛత లేదా నాణ్యత కలిగి ఉన్నట్టన్న మాట. ధర కూడా ఆ మేరకే ఉంటుంది. బంగారం ఎంతో సున్నితంగా పెళుసు స్వభావంతో కూడిన లోహం. కాబట్టే ఆభరణాల తయారీలో అది గట్టిగా ఉండేందుకు రాగి, నికెల్, వెండి, పల్లాడియం లాంటి లోహాలు కలుపుతారు. బంగారం, ఇతర లోహాలు ఏ నిష్పత్తిలో ఉన్నాయనేది క్యారెట్ ద్వారా తెలుస్తోంది. అయితే వాస్తవ నిష్పత్తి, క్యారెట్ల మధ్య తేడాలు.. వ్యాపారులు, ఎప్పుడూ బంగారం కొనుగోళ్లలో మునిగి తేలేవారికి, పెట్టుబడులు పెట్టేవారికి మాత్రమే తెలిసే అవకాశం ఉంటుంది.

ఆభరణంలో బంగారమెంత?



కొనుగోలు చేసే బంగారు ఆభరణాలలో ఎంత బంగారం ఉందో క్యారెట్ లెక్క ద్వారా తెలుసుకోవచ్చు. ఉదాహరణకు 14 క్యారెట్ల ఉంగరాన్ని కొనుగోలు చేశారనుకోండి.. బంగారం స్వచ్ఛతను 0 నుండి 24 స్కేల్‌లో కొలుస్తారు కాబట్టి, 14ని 24తో భాగించాలి. అప్పుడు 0.583 వస్తుంది. అంటే మీ 14 క్యారెట్ల బంగారు ఉంగరంలో 58.3% బంగారం ఉందన్న మాట. అదేవిధంగా బంగారం స్వచ్ఛతను ఫైన్‌నెస్, దాని రంగును బట్టి గుర్తించొచ్చు. 24 క్యారెట్ల బంగారం

మిగతా 8వ పేజీలో ▶

Chai చమక్

తేనీరు అంటే ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఉదయం నిద్ర లేవగానే దాదాపు ప్రతి ఒక్కరూ వేడి వేడి టీ ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తుంటారు. కొందరు కాఫీ ఇష్టపడితే... మరికొందరు టీ అంటూ మంచం మీదనుంచే కేకలు పెడుతుంటారు. అదే రకరకాల రుచులతో వివిధ రకాల కాఫీ, చాయ్‌లు అందుబాటులో ఉంటే ఎలా ఉంటదో ఒక సారి ఆలోచించండి. అలాంటి వెరైటీ కోరుకునే వారికోసమే ఈ విశేషాలు..

- వివరాలు 13లో

‘ప్లేట్’ ఫిరాయిస్తే కేసే!

వాహనాల నంబర్ ప్లేట్లు ‘మూసేస్తున్న’ ఉల్లంఘనులు

అదే బాటలో స్నాచర్లు, ఇతర నేరగాళ్లు

వరుస ఉదంతాలతో అప్రమత్తమైన అధికారులు

క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్న పోలీసులు

గత నెలలోనే నగరవ్యాప్తంగా 35 కేసులు రిజిస్టర్



ట్రాఫిక్ ఉల్లంఘనులు నగరంలో రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. జరిమానాలు తప్పించుకోవడానికి నిఘా నేత్రాలు, ట్రాఫిక్ కెమెరాలకు తమ వాహన నంబర్ చిక్కకుండా ఉండేందుకు వాటిని ‘కవర్’ చేస్తున్నారు. దీనికోసం నంబర్ ప్లేట్స్‌కు మాస్కులు తొడగటం, వంచేయడం, విరిచేయడం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇలాంటి ఉల్లంఘనులపై పోలీసులు మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తూ వచ్చారు. అయితే ఈ తరహా ఉల్లంఘనుల్లో మార్పు రాకపోవడం, స్నాచింగ్స్, చోరీలకు పాల్పడేవారు సైతం ఇదే బాటపట్టడంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్స్ మూసేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. గత నెలలోనే 35 కేసులు నమోదు చేయించారు.

సాక్షి, హైదరాబాద్

ఈ-చలాన్లు తప్పించుకోవాలనే ఉద్దేశంతో..

ఈ–చలాన్లు తప్పించుకోవడానికే నంబర్ ప్లేట్లు మూసేసే వారే ఎక్కువగా ఉంటున్నారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా నాన్–కాంటాక్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానాలు అమలవుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది తమ చేతిలో ఉన్న డిజిటల్ కెమెరాలతో, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ అధికారులు జంక్షన్లతోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ద్వారా ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాల ఫొటోలు నంబరు ప్లేట్స్‌తో సహా చిత్రీకరిస్తున్నారు. వీటి ఆధారంగా ఆయా ఉల్లంఘనులకు ఈ–చలాన్లు జారీ చేస్తున్నారు. ఈ విధానంలో ఉల్లంఘనులు వినియోగించిన వాహన రిజిస్ట్రేషన్ నంబర్, దాని ఆధారంగా సేకరించే రిజిస్టర్డ్ చిరునామానే కీలకం. కొందరు తమ వాహనాలకు సంబంధించిన నంబర్ ప్లేట్లను వివిధ రకాలుగా కవర్ చేస్తూ ట్రాఫిక్ కెమెరాలకు చిక్కుకుండా చేస్తున్నారు. కొందరు నేరగాళ్లు సైతం నంబరు ప్లేట్లు కనిపించకుండా చేసి నేరాలకు పాల్పడుతున్నారు. నగరంలో ఇలా జరిగిన కొన్ని నేరాలను కొలిక్కి తేవడానికి పోలీసులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



ముందు వాటి కంటే వెనుకవే ఎక్కువ

వాహనాల నంబర్ ప్లేట్స్ ఎదుటి వారికి, సీసీ కెమెరాలకు చిక్కకుండా కవర్ చేయడం అనేది కార్లు వంటి తేలికపాటి వాహనాల కంటే ద్విచక్ర వాహనాలకే ఎక్కువగా కనిపిస్తోంది. రోడ్లపై ఈ తరహా నంబర్ ప్లేట్‌ను పోలీసులు గుర్తించి ఆపడానికి ప్రయత్నిస్తే బైక్స్ మాదిరిగా ఫోర్ వీలర్స్ వాహనాలు తప్పించుకొని వెళ్లిపోలేవు. దీంతో వారు అలాంటి చర్యల జోలికివెళ్లరు. ద్విచక్ర వాహనాల్లోనూ 90 శాతం వెనుక వైపు నంబర్ ప్లేట్‌కే రూపురేఖలు లేకుండా చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో స్పెషల్ డ్రైవ్స్ చేసేప్పుడు రహదారులపై కొన్ని వాహనాలను తనిఖీ చేస్తారు. ముందు ఉండే నంబర్ ప్లేట్ వారికి స్పష్టంగా కనిపిస్తుండటంతో ఆ వాహనాలను ఆపి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అదే వెనుక నంబర్ ప్లేట్ అయితే వాహనం ముందుకు వెళ్లిపోయాకే ట్రాఫిక్ పోలీసులకు కనిపిస్తుంది. ఇలా ఉద్దేశపూర్వకంగా ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయడం మొదలెట్టారు. గత నెల వరకు ఐపీసీలోని సెక్షన్ 420 ప్రకారం నమోదు చేయగా, ఈ నెల నుంచి బీఎన్ఎస్‌లోని సెక్షన్ 318 వినియోగించనున్నారు. ఈ కేసుల్లో నేరం నిరూపణ అయితే ఏడేళ్ల వరకు జైలు లేదా జరిమానా విధించే అవకాశం ఉంది.



ఉద్దేశపూర్వకంగా చేసిన వారిపైనే కేసులు

- పి.విశ్వప్రసాద్, అదనపు పోలీసు కమిషనర్ (ట్రాఫిక్)

అనివార్య కారణాల వల్ల, పొరపాటుగా వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు డ్యామేజ్ అవుతుంటాయి. మరికొందరికి తమ నంబర్ ప్లేట్ డ్యామేజ్ అయిన విషయం తెలిసినా పని ఒత్తిడి, నిర్లక్ష్యం వంటి కారణాలతో దాన్ని సరి చేసుకోరు. స్పెషల్ డ్రైవ్‌లో ఇలాంటి వాహనాలు చిక్కితే వారికి చలాన్ ద్వారా జరిమానా మాత్రమే విధిస్తున్నారు. కొందరు మాత్రం నేరాలు చేయాలని, ఈ–చలాన్‌కు చిక్కకూడదనే ఉద్దేశంతో ఉద్దేశపూర్వకంగా నంబర్ ప్లేట్లను డ్యామేజ్ చేయడం, వాటిపై ఉన్న నంబర్లు మార్చడం, వంచేయడం, స్టిక్కర్లు వేసి మూసేయడం చేస్తున్నారు. ఇలాంటి వారిపై మాత్రమే శాంతిభద్రతల విభాగం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేయిస్తున్నాం.

క్యారెట్లలో కిరికిరి

▶ 7వ పేజీ తరువాయి

మెరుస్తూ ఉంటుంది. 22 క్యారెట్ల బంగారం మెరుపు కాస్త తక్కువగా ఉండి, 24 క్యారెట్లతో పోల్చుకుంటే కొంత ముదురు రంగులో ఉంటుంది. ఇలా ఇతర లోహాల పరిమాణం పెరిగేకొద్దీ రంగు తేలిపోతుంటుంది. బంగారం తెల్లగా ఉందంటే నికెల్ ఎక్కువగా ఉందన్నమాట.

టంచ్ మెషీన్‌లతో ‘పంచ్’

నగ నచ్చకనో, పాతబడిందనో, కొత్త మోడల్ మార్కెట్లోకి రావడంతో మార్చుకుందామనో జ్యువెలరీ దుకాణదారుని దగ్గరకు వెళతాం. అప్పుడు పాత నగను కరిగించడం ద్వారా దాంట్లో బంగారం శాతం ఎంత ఉందో తెలుసుకోవడానికి టంచ్ మెషీన్‌లో పరిశీలిస్తారు. మెషీన్‌లో ముందే సవరించిన రీడింగ్‌తో బంగారం శాతాన్ని నిర్ధారణ చేస్తారు. సాధారణంగా పాత నగలో ఉన్న బంగారం శాతం కంటే 5 నుంచి 10 శాతం తక్కువగా నిర్ధారణ చేస్తుంటారు. ఇది టంచ్ మెషీన్‌లతో జరుగుతున్న మోసం. వాస్తవానికి బంగారం నాణ్యతను, పాత బంగారంలో బంగారం శాతాన్ని నిర్ణయించేందుకు బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) సంస్థ ద్వారా అనుమతి పొందిన లైసెన్స్‌దారుడి దగ్గరే నిర్ధారణ చేయాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్స్–రే ఫ్లోరోసెన్స్ మిషన్ (కంప్యూటర్ అనుసంధాన యంత్రాల టంచ్ మెషీన్)తో నాణ్యత ప్రమాణాలు నిర్ధారిస్తున్నారు. అధికారిక కాగితంపై కాకుండా సాధారణ పేపర్‌పైనే ప్యూరిటీ పర్సంటేజీలను వేస్తున్నారు.

బంగారు పూతనే వన్ గ్రామ్

వన్ గ్రామ్ గోల్డ్ పేరుతో ఆభరణాల విక్రయం ఎక్కువ జరగడం అందరికీ తెలిసిందే. ఎంతో వ్యయం చేసి ఆభరణాలు కొనేకన్నా.. పెళ్ళిళ్లు ఇతర వేడుకల్లో ఒరిజినల్ బంగారాన్ని తలదన్నేలా కన్పించే ఆకర్షణీయమైన డిజైన్లలో ఉండే వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలకు ఇటీవలి కాలంలో గిరాకీ పెరిగింది. వెండి, రాగితో చేసిన ఆభరణాలకు బంగారం పూత పూసి వీటిని తయారు చేస్తారు. అందుకే వీటిని వన్ గ్రామ్ గోల్డ్‌గా వ్యవహరిస్తుంటారు. ఇమిటేషన్ (నకిలీ)జ్యువెలరీ కంటే వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు ఎక్కువ కాలం రంగు పోకుండా ఉంటాయి. అంతేకానీ ఈ ఆభరణాల్లో ఒక గ్రాము బంగారాన్ని వినియోగిస్తారని కాదు.

బంగారం నాణ్యత పరిశీలన తప్పనిసరి



బంగారం కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతపై అవగాహన అవసరం. నాణ్యత పరిశీలన తప్పనిసరి. చాలవరకు జ్యువెలరీస్, షాపింగ్ మాల్స్ నాణ్యతను తెలియజేసే క్యారెక్టరైజేషన్ మెషీన్ వినియోగించడం లేదు. ప్రభుత్వ పరంగా తనిఖీలు నిర్వహించే సంబంధిత అధికారుల వద్ద కూడా నాణ్యతను పరిశీలించే మెషీన్లు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెషీన్లు సరఫరా చేస్తే తనిఖీలతో వ్యాపారుల మోసాలకు అడ్డుకట్ట పడటంతో పాటు వినియోగదారులు చెల్లించే సొమ్ముకు తగిన నాణ్యతతో కూడిన బంగారం లభించే అవకాశం ఉంటుంది. వినియోదారుడు కూడ బంగారం నాణ్యతను అడిగాలి. అనుమానం ఉంటే నాణ్యతను పరీక్షించుకోవాలి. హాల్‌మార్క్ గుర్తును చూసిన తర్వాత మాత్రమే ఆభరణం కొనుగోలు చేయాలి. హాల్‌మార్క్ అనేది బంగారంపై ప్రభుత్వ హామీ. ఒక్కో ఆభరణాన్ని పరీక్షించి, హాల్ మార్క్ ఇచ్చేందుకు అయ్యే ఖర్చు చాలా తక్కువ

- భాస్కర్ కూచన,
రిటైర్డ్ అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, హైదరాబాద్

క్యారెట్లు.. రకాలు

24 క్యారెట్లు 99.9 స్వచ్ఛత

పూర్తి స్థాయి స్వచ్ఛత/నాణ్యత కలిగిన బంగారం. ఇందులో ఇతర లోహాలేవీ ఉండవు. అందుకే 22 క్యారెట్లు, 18 క్యారెట్ల బంగారంతో పోలిస్తే ఖరీదు ఎక్కువ. ఖరీదెక్కువ, ఆభరణానికి పనికిరాదు.. మరెందుకు ఇది అంటే బంగారంలో పెట్టుబడులు పెట్టే వారికి ఇది ఎక్కువగా ఉపయోగ పడుతుంది. కొంతమంది 24 క్యారెట్ల బంగారం (బిస్కెట్) కొని ఆభరణాలు చేయించుకుంటుంటారు.

22 క్యారెట్లు 91.6 స్వచ్ఛత

ఇందులో 22 వంతులు బంగారం ఉంటే రెండొంతుల్లో రాగి, జింక్ లాంటి లోహాలు ఉంటాయి అంటే 91.6 శాతం బంగారం, 8.4 శాతం కలిపిన ఇతర లోహాలు ఉంటాయన్న మాట. ముందే చెప్పుకున్నట్లు 24 క్యారెట్ల బంగారం కంటే దీనికి మన్నిక ఎక్కువ. కాబట్టే ఆభరణాల తయారీకి ఇది అనువైనది. సాధారణంగా 22 క్యారెట్ల బంగారంతోనే ఆభరణాలు తయారు చేస్తారు. దీనినే 916 కేడీఎం గోల్డ్ లేదా 91.6 కేడీయం గోల్డ్ అని కూడా అంటారు.

18 క్యారెట్లు 75.0 స్వచ్ఛత

ఇందులో 18 భాగాలు పసిడి ఉంటే.. ఆరు భాగాలు ఇతర మెటల్స్ ఉంటాయి. మొత్తం మీద 75 శాతం బంగారం, 25 శాతం జింక్, రాగి, నికెల్ లాంటి లోహాలు ఉంటాయి. 24, 22 క్యారెట్ల బంగారం కంటే ఇది మరింత మన్నికగా ఉంటుంది. తక్కువ ఖర్చు అవుతుందని చాలామంది ఈ ఆభరణాలు కొంటుంటారు.

14 క్యారెట్లు: 58.3 స్వచ్ఛత

ఇందులో 58.3 శాతం గోల్డ్, 41.7 శాతం ఇతర మెటల్స్ ఉంటాయి. దీనికి మన్నిక ఎక్కువ కానీ ధర చాలా తక్కువ. ఇక 12 క్యారెట్లలో 50 శాతం, 10 క్యారెట్లలో 41.7 శాతానికి మించి బంగారం ఉండదు.



సివిల్ వివాదంలో జోక్యం!

సివిల్ వివాదంలో తలదూర్చి ఓ నిందితుడికి మద్దతుగా నిలిచిన ముగ్గురు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు నగర సీపీ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీచేశారు. -10లో



'ఉస్మానియా' కలికితురాయి

విద్యార్థులకు పాఠాలతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎంతో ముఖ్యం. ప్రయోగాత్మకంగా ఎంత రాటుదేలితే అంతే వేగంగా మార్కెట్‌లోని అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. -12లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురవచ్చు. గరిష్టంగా 33 డిగ్రీలు, కనిష్టంగా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉండవచ్చు.

అన్నీ క్లియర్‌గా ఉంటేనే హైరైజ్‌కు అనుమతులు: హెచ్ఎండీఏ

సాక్షి, సిటీబ్యూరో: హైరైజ్ భవనాల నిర్మాణానికి అవసరమైన అన్ని అంశాల్లో క్లియరెన్స్ లభించగానే అనుమతులను అందజేస్తున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల మేరకు ఉన్న బహుళ అంతస్తుల భవనాలకు మాత్రమే అనుమతులు లభిస్తాయని పేర్కొన్నారు. 'ఎత్తు చిత్తు.. ఆకాశహర్మ్యాలు నేల చూపులు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనానికి హెచ్ఎండీఏ అధికారులు స్పందించారు. హైరైజ్ భవనాలపై ప్రతీ వారం సమావేశం నిర్వహించి సాంకేతిక అంశాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అగ్నిమాపక, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, పర్యావరణ, రెవెన్యూ, నీటిపారుదల తదితర విభాగాల నుంచి క్లియరెన్స్ పొందిన భవనాలకు హెచ్ఎండీఏ నుంచి నిర్మాణ అనుమతులు లభిస్తాయని చెప్పారు. ఇప్పటి వరకు 14 సార్లు కమిటీ సమావేశాలు జరిగాయని, 20 హైరైజ్ బిల్డింగ్‌లకు అనుమతులు లభించాయని పేర్కొన్నారు.

రేపు ఉచిత రేబిస్ వ్యాక్సిన్

సాక్షి, సిటీబ్యూరో: నారాయణగూడలోని వెటర్నరీ ఆస్పత్రిలో శనివారం పెంపుడు జంతువులకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్ క్యాంపు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి టీకాలు వేస్తారు. పెంపుడు జంతువుల యజమానులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించొద్దు

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా విద్యుత్ సవరణ బిల్లును నిలిపివేయాలని ఆల్ ఇండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ (ఏఐపీఈఎఫ్) కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. గురువారం ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ చైర్మన్ శైలేంద్ర దుబే, ప్రధాన కార్యదర్శి పి.రత్నాకర్, చీఫ్ ప్యాట్రన్ పదమ్‌జిత్ సింగ్, అజయ్‌పాల్ సింగ్ అత్వాల్, యశ్‌పాల్ శర్మ, ప్రశాంత్ చతుర్వేదిలతో కూడిన బృందం కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. విద్యుత్ (సవరణ) బిల్లు ద్వారా విద్యుత్ చట్టం 2003ని సవరించడానికి ప్రయత్నిస్తోందని, విద్యుత్ పంపిణీ రంగంలో ప్రైవేట్ గృహాలకు లైసెన్సులు ఇవ్వడం, ప్రభుత్వ రంగ విద్యుత్ పంపిణీ సంస్థల నెట్‌వర్క్‌లను ఉపయోగించడానికి అనుమతించడం ద్వారా వినియోగదారులకు నష్టం వాటిల్లనుందని, సవరణ ప్రతిపాదనను తక్షణమే నిలిపివేయాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ నగరం

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



హిమాయత్‌నగర్: మహా నగరాన్ని చెత్త రహిత, స్వచ్ఛ నగరంగా రూపొందించుకోవడంలో ప్రజలను భాగస్వాములను చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం కమిషనర్ ఆమ్రపాలితో కలిసి శానిటేషన్‌పై నిర్వహించిన అడ్‌హక్ కమిటీ సమావేశంలో నగరంలో మేయర్ మాట్లాడారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా కార్పొరేటర్లు తమ పరిధిలో మార్పు తేవాలని సూచించారు. ప్రజల మైండ్ సెట్ మారేలా అవగాహన కల్పించాలన్నారు. చెత్తను స్వచ్ఛ ఆటోల్లో వేసేలా చూడాలన్నారు. రాంకీ ఏజెన్సీ వాహనాలు రెగ్యులర్‌గా చెత్త ఎత్తివేసేలా సరైన పర్యవేక్షణ ఉండాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు డా.సురేఖ, సయ్యద్ సోహెల్ ఖాద్రి, డా.ఆయేషా హుమేరా, మధుసూదన్, శ్రవణ్, మినాజ్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రవికిరణ్, ఎస్టేట్స్ అధికారి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనపై నివేదిక ఇవ్వాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) గురువారం తెలంగాణ విద్యాశాఖ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్, మౌలిక సదుపాయాలు విద్యా ప్రమాణాలు బాగా లేవని జీహెచ్ఎంసీ కార్పొరేటర్ శ్రవణ్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కమిషన్ ఈ మేరకు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనపై తీసుకుంటున్న చర్యల గురించి నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యం వద్దు

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: రెవెన్యూ సేవల్లో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలోతహసీల్ ఆఫీసుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ధ్రువీకరణ పత్రాల జారీలో ఆలస్యత్వం ప్రదర్శించవద్దని, కార్యాలయ నిర్వహణ సక్రమంగా ఉండాలని, అధికారులు బాధ్యతతో, నిబద్ధతతో, పారదర్శకంగా సమర్థంగా, వేగవంతంగా పనిచేసి రెవెన్యూ శాఖకు మంచి పేరు తేవాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ వాట్సప్.. ఇలా ప్రతి దరఖాస్తుకూ ఇన్‌వార్డు చేయాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రతీ దరఖాస్తు స్వీకరించిన తేదీ, పరిష్కారమైన తేదీ నమోదు చేయాలని, రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయాల నిర్వహణ, సకాలంలో ధ్రువపత్రాలు అందించేలా చూసేందుకు.. కార్యాలయాలను ప్రతీవారం తనిఖీ చేసి నివేదిక అందించేందుకు నలుగురు డిప్యూటీ కలెక్టర్లను నోడల్ అధికారులుగా నియమిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కదిరవన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీఓలు మహిపాల్, దశరథ్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోటాపోటీగా..



అటు బీజేవైఎం..

గన్‌ఫౌండ్రీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హిందూవులకు క్షమాపణ చెప్పాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి రాహుల్‌గాంధీ ర్యాలీ నిర్వహించి రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహేందర్ మాట్లాడుతూ.. హిందువుల పట్ల కాంగ్రెస్ వైఖరి బట్టబయలైందని మండిపడ్డారు. అనంతరం బీజేవైఎం శ్రేణులు గాంధీభవన్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని ఠాణాకు తరలించారు.



ఇటు.. కాంగ్రెస్

గన్‌ఫౌండ్రీ: పార్లమెంట్‌లో విపక్షనేత రాహుల్‌గాంధీ ప్రజల తరఫున నిర్భయంగా మాట్లాడుతుండడం ప్రధాని మోదీకి భయాన్ని కలిగిస్తోందని యువజన కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మోతె రోహిత్ ఆరోపించారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయ ముట్టడికి బయలుదేరారు. కానీ.. వీరిని గాంధీ భవన్ నుంచి బయటికి రాకుండా పోలీసులు అడ్డుకుని ఠాణాలకు తరలించారు.

జగడమే!

- కనిపించనున్న 'జంపింగ్' ప్రభావం
- సాఫీగా సాగేందుకు అధికారుల కసరత్తు
- రేపే జీహెచ్ఎంసీ 'కౌన్సిల్' సమావేశం

అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్న కార్పొరేటర్లు



సాక్షి, సిటీబ్యూరో: దాదాపు నాలుగున్నర నెలల విరామంతో శనివారం జరగనున్న జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. పనులు జరగడం లేదని, సమస్యలు రాజ్యమేలుతున్నాయని కార్పొరేటర్లు అధికారులతో వాదనలకు దిగే అవకాశాలున్నాయి. పార్టీల వారీగానూ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వివాదాలు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

విచిత్ర దృశ్యం..

ఈసారి కౌన్సిల్ సమావేశంలో విచిత్ర దృశ్యం ఆవిష్కృతం కానుంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి గెలిచాక మేయర్ అయ్యారు. అప్పుడు రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత ఆమె కన్నా ముందే కాంగ్రెస్‌లో చేరారు. కొందరు కార్పొరేటర్లు సైతం తామున్న పార్టీల నుంచి ఇతర పార్టీల్లోకి మారారు. జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల మేరకు ఎవరు ఏపార్టీలోకి వెళ్లినా ఎలాంటి చర్యలుండవు. దీంతో ఎవరి పదవులకూ ఎలాంటి ఇబ్బంది రాలేదు. కానీ.. విజయలక్ష్మి మేయర్ అయ్యేటప్పుడు బీఆర్ఎస్ పార్టీకున్న కార్పొరేటర్ల బలం వల్ల ఆమె మేయర్ అయ్యారు. ఇప్పటికీ జీహెచ్ఎంసీలో మిగతా పార్టీల కంటే బీఆర్ఎస్ కార్పొరేటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు.

సమస్యల ప్రస్తావనకు సిద్ధం..

- అప్పట్లో బీజేపీ, కాంగ్రెస్ సభ్యులు లేవనెత్తే వివిధ అంశాలపై బీఆర్ఎస్ సభ్యులు మూకుమ్మడిగా స్పందించేవారు. మేయర్ సైతం బీఆర్ఎస్ కావడంతో సభ అనుకూలంగా నడిచేది. ప్రస్తుతం మేయర్ కాంగ్రెస్. ఆ పార్టీ కార్పొరేటర్ల సంఖ్య రెండు నుంచి దాదాపు ఇరవైకి చేరువైనప్పటికీ, మిగతా పార్టీల సభ్యుల కంటే తక్కువ. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో గతంలో వివిధ సమస్యలను ప్రస్తావించిన ఆ పార్టీ సభ్యులు ఇప్పుడు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను లేవనెత్తే అవకాశాలున్నాయి. గతంలో అభివృద్ధి కార్యక్రమాల గురించి చెబుతూ విమర్శలను తిప్పికొట్టిన బీఆర్ఎస్ సభ్యులు ఇప్పుడు వివిధ సమస్యల్ని ప్రస్తావించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.
- ఇలా పార్టీలు అనుసరించాల్సిన వ్యూహం రివర్స్ కావడంతో సమావేశం ఎలా జరుగుతుందోనని అధికారులు సైతం ఆలోచనలో పడ్డారు. సమావేశం సాఫీగా జరగాలని వారు భావిస్తున్నారు. సభ్యులడిగే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమగ్ర సమాచారంతో సమాధానాలివ్వాలని కమిషనర్ ఆమ్రపాలి ఇప్పటికే అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి ఇది తొలి సమావేశం. మేయర్, కమిషనర్ పోస్టుల్లో ఇద్దరూ మహిళలే ఉన్న మొదటి సమావేశం కూడా బహుశా ఇదే. మేయర్ సభను నిర్వహించాల్సి ఉండగా, అవసరాన్ని బట్టి కమిషనర్ సమాధానాలివ్వాల్సి ఉంటుంది.

కాలయాపనకే..

జీహెచ్ఎంసీ పాలకమండలి నిర్ణయమంటే ఎవరికీ లెక్క లేకుండాపోయింది. విలువ కూడా లేకుండాపోయింది. గత ఫిబ్రవరిలో జరిగిన జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో ప్రకటనలు, పారిశుద్ధ్యం అంశాల్లో జరుగుతున్న అవినీతిపై సభను నిలదీశారు. దాంతో స్పందించిన మేయర్ విజయలక్ష్మి రెండు అంశాలపై అన్ని పార్టీల కార్పొరేటర్లతో అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేసి, పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెండు కమిటీలకు మేయర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. కానీ.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తిరిగి శనివారం కౌన్సిల్ సమావేశం జరగనున్న తరుణంలో హడావుడిగా రెండు అడ్‌హక్ కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేశారు. గతంలో ఒకసారి మాత్రం సమావేశాలు జరిపినప్పటికీ, ఏం కనిపెట్టారో, ఏం చర్యలు తీసుకున్నారో తెలియదు. తిరిగి సమావేశం జరగనుండటంతో హడావుడిగా సమావేశాలు జరిపారు. ఇదంతా ఒక ఎత్తయితే నియమించిన అడ్‌హక్ కమిటీలను సైతం ధ్రువీకరించేందుకు కౌన్సిల్ అజెండాలో ఒక అంశంగా ఉంది. అంటే ఇంతకీ ఈ కమిటీలు ఉన్నట్లా? లేనట్లా?.. మేయర్‌కు, అధికారులకు, కమిటీ సభ్యులకే తెలియాలి.

మహా మార్పు

హెచ్ఎండీఏలో బదిలీలకు రంగం సిద్ధం

- ఏళ్లుగా పాతుకుపోయిన ఉద్యోగులకు స్థానచలం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏలో బదిలీలకు రంగం సిద్ధమైంది. వివిధ విభాగాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలంగా పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసే అవకాశం ఉంది. అన్ని ప్రభుత్వ విభాగాల్లో సాధారణ బదిలీలకు ప్రభుత్వం అనుమతినిచ్చిన నేపథ్యంలో హెచ్ఎండీఏలో బదిలీల అంశం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన కొందరు అధికారుల వ్యవహారశైలి, పనితీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో హెచ్ఎండీఏ కమిషనర్‌గా దానకిషోర్ విధులు నిర్వహించిన సమయంలోనే బదిలీల అంశం ప్రస్తావకు వచ్చింది. ప్లానింగ్ విభాగాన్ని విస్తరించి, బలోపేతం చేయాలని కూడా అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు కార్యాచరణ కూడా చేపట్టారు. ఈలోపు దానకిషోర్ స్థానంలో హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలను చేపట్టారు. కొద్ది రోజులుగా ఆయన వివిధ విభాగాల పనితీరును సమీక్షిస్తున్నారు. అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఆయా విభాగాల కార్యకలాపాలను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అంతర్గతంగా వివిధ విభాగాల్లో ఎక్కువ కాలంగా పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసి పనితీరును మెరుగుపర్చుకోవాలని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

అక్రమాలపై ఆరోపణలు రావడంతో..

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో ఎంతో క్రియాశీలంగా పని చేసినప్పటికీ కొద్దిమంది పనితీరు హెచ్ఎండీఏకు ఇబ్బందిగా మారుతోంది. నాలుగైదేళ్లుగా ఒకేచోట పని చేస్తున్న కొందరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు గతప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన కొందరు అధికారులకు కింది స్థాయిలో అన్ని విధాలా అనుచరులుగా వ్యవహరించిన వారు ఇప్పటికీ అదే స్థానాల్లో కొనసాగడం కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాజా బదిలీల్లో ఇలాంటి వారికి కూడా స్థానచలం ఉంటుందని అధికారవర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం హెచ్ఎండీఏలోని వివిధ విభాగాల్లో బదిలీల అంశమే హాట్‌టాపిక్‌గా మారింది.

ప్లానింగ్ విభాగంలో భారీగా..



- లే అవుట్‌లు, నిర్మాణరంగ అనుమతులు, హైరైజ్ భవనాలు, బహుళ అంతస్తుల భవనాల అనుమతుల్లో కీలకమైన ప్రణాళికా విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలనే ప్రతిపాదన ఉంది. కొంతమంది అధికారులు, ఉద్యోగుల పని తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో ఫైళ్ల పరిష్కారం కాకపోవడం, పెద్ద సంఖ్యలో పెండింగ్ జాబితాలో పడిపోవడం వంటి అంశాలను ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. విధుల నిర్వహణలో అలసత్వాన్ని, జాప్యాన్ని ప్రదర్శించేవారికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానచలనం కల్పించాలని అధికారులు భావిస్తున్నారు. శంషాబాద్, శంకర్‌పల్లి, ఘట్కేసర్, మేడ్చల్ నాలుగు జోన్‌లలో పని చేస్తున్న కొంతమంది జేపీఓలు, ఏపీఓల పనితీరుపై పై స్థాయిలో తీవ్రమైన అసంతృప్తి ఉంది.
- మరోవైపు సకాలంలో ఫైళ్ల పరిష్కారానికి నోచకపోవడంతో నెలల తరబడి హెచ్ఎండీఏ చుట్టూ తిరగాల్సిన వస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత బదిలీల్లో ఇలాంటి అధికారుల వ్యవహారశైలిని తీవ్రంగా పరిగణించే అవకాశం ఉంది. మరోవైపు ఎస్టేట్ విభాగంలో కూడా ఎక్కువ రోజులుగా పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు సైతం ప్రస్తుతం సాధారణ బదిలీల్లో భాగంగా స్థానచలం ఉండే అవకాశం ఉంది. మరోవైపు ప్లానింగ్ విభాగాన్ని నాలుగు జోన్‌ల నుంచి 6 లేదా 8 జోన్‌లకు విస్తరించే ప్రతిపాదన కూడా ఉండటంతో అదనపు సిబ్బంది నియామకంపై అధికారులు దృష్టి సారించారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో జోనల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జోనల్, డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికతో పాటు సంబంధిత ఫొటోలను కూడా పంపించాలని సూచించారు. డెంగీ నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమనుకుంటే అందుకు ఐఈసీ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత ఎంటమాలజీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి దోమల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డే, ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శానిటేషన్, సీఅండ్‌డీ వ్యర్థాలపై అధికారులు దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, రవి కుమార్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, అడిషనల్ కమిషనర్ పంకజ తదితరులు పాల్గొన్నారు.

జీవీపీల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలి

గురువారం ఉదయం ఆమ్రపాలి కూకట్‌పల్లి, మూసాపేట్, భరత్‌నగర్, రైతు బజార్ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీధుల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా ఎప్పటికప్పుడు చెత్త లేకుండా చేయాలని అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, రవికిరణ్ తమ జోన్లలో పారిశుద్ధ్యంపై ఆకస్మిక తనిఖీలు చేశారు.



కల్నల్ సంతోష్‌బాబు భార్యకు స్థలం

స్టాండింగ్ కమిటీలో మరో 8 అంశాలకు ఆమోదం


సాక్షి, సిటీబ్యూరో: 2020లో ఇండో చైనా యుద్ధంలో అమరుడైన కల్నల్ సంతోష్ బాబు భార్య సంతోషికి బంజారాహిల్స్ రోడ్ నంబర్-14లో 711 చదరపు గజాల స్థలాన్ని కేటాయిస్తూ మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. 8 అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. ఆమోదించిన 8 అంశాల్లో రోడ్లు, జంక్షన్ల అభివృద్ధికి సంబంధించినవి అధికంగా ఉన్నాయన్నారు. సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు. కమిటీ ఆమోదించిన వాటిల్లో ముఖ్యాంశాలు.

- జీఐఎస్ ఆధారిత సర్వే, ప్రాపర్టీస్, యుటిలిటీల మ్యాపింగ్ పనులు. నియో జియో ఇన్ఫో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కాంట్రాక్టు కోసం..
- బార్కాస్ డివిజన్ మజీద్-ఇ-నూర్ ఇస్మాయిల్ నగర్ నుంచి బిస్మిల్లా కిరాణా స్టోర్, అహ్మద్‌నగర్, బండ్లగూడ రోడ్డు విస్తరణకు ప్రభావితమయ్యే 153 ఆస్తులను మాస్టర్ ప్లాన్‌లో చేర్చి ప్రభుత్వానికి పంపేందుకు ఆమోదం.
- చాదర్‌ఘాట్ వద్ద మూసీ నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం జైలు గార్డెన్ నుంచి శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం వరకు ప్రతిపాదిత రోడ్డు వెడల్పు కోసం ప్రతిపాదిత 21 మీటర్ల వంతెన నిర్మాణంలో ప్రభావితమయ్యే 35 ఆస్తుల సేకరణకు, రోడ్డు వెడల్పు పెంచడం, మాస్టర్ ప్లాన్‌లో అలైన్‌మెంట్‌ను మార్చడానికి ఆమోదం కోసం ప్రభుత్వానికి సిఫారస్ కోసం..
- ఎస్సార్‌డీపీ కింద జోహ్రా బీ దర్గా జంక్షన్ అభివృద్ధి, విస్తరణ పనులకు చేసిన రూ.4.50 కోట్ల ఖర్చుకు ఆమోదం

లక్కీ లంగర్‌హౌస్

ఇక్కడి నుంచే గోల్కొండ బోనాలకు అంకురార్పణ

- ఆదివారం ప్రారంభం కానున్న ఉత్సవాలు
- తొలి, చివరి బోనం సమర్పించేదీ లంగర్‌హౌస్ వాసులే



లంగర్‌హౌస్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి చాటనున్న బోనాల ఉత్సవాలను ఆదివారం లంగర్‌హౌస్‌లో రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్నారు. ఈ వేడుకలకు లంగర్‌హౌస్, గోల్కొండలు వేదిక కానున్నాయి. నెల రోజుల పాటు నిర్వహించే అమ్మవారి బోనాలు గోల్కొండ కోటలో ప్రారంభమై, చివరి బోనాలు కూడా ఇక్కడే ముగియనున్నాయి. ఆషాఢ మాసం అమావాస్య తర్వాత వచ్చే మొదటి గురువారం లేదా ఆదివారాల్లో బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గోల్కొండ కోటపై వెలసిన జగదాంబికా అమ్మవారికి మొదటి పూజ నిర్వహించి నెల రోజుల పాటు ప్రతి గురు, ఆదివారాల్లో 9 పూజలు నిర్వహిస్తారు. లంగర్‌హౌస్ వాసుల చేతులమీదుగా బోనాలను నిర్వహించే ఆనవాయితీ శతాబ్దాలుగా కొనసాగుతోంది.

నజర్ బోనం.. భారీ తొట్టెలు..

గోల్కొండ జగదాంబిక అమ్మవారికి మొదటి పూజలో భాగంగా నజర్ బోనం సమర్పించి తొట్టెలు తీసుకెళ్లనున్నారు. లంగర్‌హౌస్‌లో అమ్మవారికి ప్రభుత్వం తరఫున రాష్ట్ర మంత్రులు పట్టు వస్త్రాలను సమర్పించి బోనాల ఊరేగింపును ప్రారంభిస్తారు. అనంతరం ఇక్కడి నుంచి పోతురాజులు, కళాకారుల విన్యాసాలతో డప్పు వాద్యాలు, భక్తుల ఆటపాటలతో గోల్కొండ వరకు ఊరేగింపు సాగుతుంది.

ముస్లింల సేవలు..

లంగర్‌హౌస్, గోల్కొండలో జరిగే బోనాల ఉత్సవాలు మరో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. బోనాల పండుగలో ముస్లింలు పాల్గొని సేవలు అందిస్తారు. ఊరేగింపులకు స్వాగత వేదికలు ఏర్పాటు చేసి భక్తులకు భోజనాలు, మంచినీరు అందిస్తుంటారు.

ఏర్పాట్లు పూర్తి..



లంగర్‌హౌస్‌లో ఆదివారం బోనాల ఉత్సవాలను వైభవంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. దారి పొడవునా భక్తులకు అన్ని వసతులూ కల్పించాం.

– కాంత అరవింద్, జగదాంబిక బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్

హష్ ఆయిల్ ముఠా అరెస్ట్

గన్‌ఫౌండ్రీ: తక్కువ సమయంలో సులువుగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దుర్బుద్ధితో ముగ్గురు యువకులు పక్కదారి పట్టారు. నిషేధిత మాదక ద్రవ్యాలను రవాణా చేస్తూ గురువారం పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల నుంచి 1.2 కిలోల హష్ ఆయిల్, ద్విచక్ర వాహనం, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బేగంబజార్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొర్రబాబు(30), దమ్మాయిగూడకు చెందిన చందన్ కుమార్ చౌదరి(34), ఎం.ధన్‌రాజ్(27) ముఠాగా ఏర్పడ్డారు. తక్కువ సమయంలో సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాలోచనతో ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన నిషేధిత హష్ ఆయిల్‌ను రహస్యంగా నగరానికి తీసుకువచ్చి వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ పోలీసుల కళ్లు కప్పి తప్పించుకు తిరుగుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో సౌత్, వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బేగంబజార్ పోలీసులు సంయుక్తంగా నాంపల్లిలోని భీమ్‌రావు బస్తీలో నిఘా పెట్టారు. నిందితులు ద్విచక్ర వాహనంపై హ్యాష్ ఆయిల్‌ను తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశారు. మరింత దర్యాప్తు కోసం కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో హష్ ఆయిల్ వాడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు, నిషేధిత ఉత్పత్తులను వాడుతున్నట్లయితే తక్షణమే పోలీసులకు తెలపాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా చూసేందుకు వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు.

నా పేరిట డబ్బులు అడిగితే నమ్మొద్దు

సీసీఎస్‌కు ఫిర్యాదు చేసిన నిమ్స్ డైరెక్టర్ బీరప్ప



లక్డీకాపూల్: 'సోషల్ మీడియాలో నా ఫొటో పెట్టుకుని కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారు. వాటిని నమ్మవద్దు' అని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. తన ఫొటోతో డబ్బులు అడుగుతూ గుర్తుతెలియని వ్యక్తులు చేస్తున్న కాల్స్, మేసెజ్‌ల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నాలుగురోజుల క్రితమే పంజగుట్ట పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గురువారం సీసీఎస్‌లో కూడా ఫిర్యాదు చేశానన్నారు. తన ప్రమేయం లేకుండా ఎవరైనా డబ్బులు అడుగుతున్న సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని బీరప్ప కోరారు.

సివిల్ వివాదంలో జోక్యం!

- ఓ నిందితుడికి మద్దతుగా నిలిచిన పోలీసులు
- బాధితుడు ఫిర్యాదు చేసినా ఉదాసీన వైఖరి
- విచారణలో రూఢీ కావడంతో సీపీ చర్యలు
- ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్‌ఐలపై సస్పెన్షన్ వేటు
- వీళ్లు మహంకాళి ఠాణాలో పనిచేసిన, చేస్తున్న వాళ్లే..
- అనుమతితోనే హెడ్ క్వార్టర్స్ వదలాలని షరతు



ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాసులు

సాక్షి, సిటీబ్యూరో: సివిల్ వివాదంలో తలదూర్చి ఓ నిందితుడికి మద్దతుగా నిలిచిన ముగ్గురు పోలీసు అధికారులపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి తాజాగా ఆదేశాలు జారీచేశారు. బాధితుడు ఫిర్యాదు చేసినా ఉదాసీనంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో మహంకాళి ఠాణా మాజీ ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాసులు, మాజీ ఎస్సై బి.భాస్కర్‌రావు, ఇప్పటికీ అక్కడే పనిచేస్తున్న జి.రాకేష్‌లపై చర్యలు తీసుకున్నారు. ఈ ముగ్గురూ ప్రతిరోజూ సీఏఆర్ హెడ్-క్వార్టర్స్‌లో హాజరుకావాలని, సరైన అనుమతులు లేకుండా బయటకు వెళ్లవద్దని కొత్వాల్ షరతులు విధించారు. మహంకాళి పోలీసుస్టేషన్ పరిధిలోని చంద్రలోక్ కాంప్లెక్స్‌లోని 503, 521 ఫ్లాట్ల యజమాని ఎం.హనుమంత శ్రవణ్. గతేడాది వరకు వీటిలో ఆనంద్ గాంధీ అనే వ్యాపారి అఫ్గన్ సర్వీసెస్ సంస్థను నిర్వహించారు. ఈ ఫ్లాట్స్‌కు సంబంధించి హనుమంతు-ఆనంద్ మధ్య కొన్నాళ్లుగా వివాదం నడుస్తోంది. ఖాళీ చేయాలని ఒకరు, చేయనంటూ మరొకరు భీష్మించుకు కూర్చున్నారు. ఈ వివాదంలో తనకు సహకరించాలంటూ హనుమంతు నాటి మహంకాళి ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాసులును కోరాడు. దీనికి సదరు అధికారి అంగీకరించడంతో గతేడాది ఏప్రిల్ 25న ఆ రెండు ఫ్లాట్స్‌లోకి ప్రవేశించిన హనుమంతి విలువైన వస్తువులు దోచుకోవడంతోపాటు ఫర్నిచర్ మొత్తం బయటపడేయగా చాలా వరకు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై మరునాడు మధ్యాహ్నం మహంకాళి ఠాణాలో గాంధీ ఫిర్యాదు చేశారు. పోలీసులు జనరల్ డైరీలో ఎంట్రీ చేసి, విచారణ నిమిత్తం ఎస్సై జి.రాకేష్‌కు అప్పగించారు. ఈ విషయంలో అవసమైన చర్యలు తీసుకోకుండానే సదరు ఎస్సై అదే నెల 28న ఫిర్యాదు దశలోనే కేసును మూసేశారు.

హైకోర్టు ఆదేశించినా ఉదాసీనంగానే...

గాంధీ హైకోర్టును ఆశ్రయించడంతో గత ఏడాది జూన్ 30న హనుమంతుపై ఇన్‌స్పెక్టర్ కావేటి శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో ఈ కేసును దర్యాప్తు చేసిన మరో ఎస్సై బి.భాస్కర్‌రావు సైతం ఉదాసీనంగా వ్యవహరించారు. ఈ వ్యవహారాలను పర్యవేక్షించాల్సిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మిన్నకుండిపోయారు. విషయం ఉన్నతాధికారులు దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే శ్రీనివాసులుతోపాటు రాకేష్, భాస్కర్‌రావు విధినిర్వహణలో నిర్లక్ష్యంగా, దురుద్దేశపూర్వకంగా వ్యవహరించారని తేలింది. ఈ మేరకు నగర పోలీసు కమిషనర్ శ్రీనివాసరెడ్డికి నివేదిక అందింది. ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న కావేటి శ్రీనివాసులు, చార్మినార్ ఠాణాలో విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్‌రావులతోపాటు మహంకాళి ఠాణాలోనే పని చేస్తున్న రాకేష్‌ను సస్పెండ్ చేస్తూ కొత్వాల్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ముగ్గురి బాధ్యతల్నీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ అదనపు పోలీసు కమిషనర్‌కు అప్పగించారు. వీళ్లు ప్రతిరోజూ ఆయన కార్యాలయానికి వెళ్లి సంతకాలు చేయాలని, అదనపు సీపీ నుంచి సరైన అనుమతులు లేకుండా బయటకు ఎక్కడకూ వెళ్లకూడదని షరతులు విధించారు.

బాధితుడిని చితకబాదిన ఎస్‌ఐ

పోలీస్ దెబ్బలతో గాయాలంటూ
ఉస్మానియా ఆస్పత్రి ఓపీలో నమోదు


బాధితుడు రాంసింగ్

సైదాబాద్: భార్య మరణానికి కారణం తెలుసుకునేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనను సైదాబాద్ ఎస్‌ఐ దుర్భాషలాడుతూ చితకబాదాడని ఓ బాధితుడు ఆరోపించాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... సింగరేణి కాలనీకి చెందిన రాంసింగ్ చిరువ్యాపారి. రెండునెలల క్రితం అతడి భార్య, పక్కింటి మహిళ మధ్య గొడవ జరిగింది. అదేరోజు రాత్రి అతడి భార్య మృతి చెందడంతో రాంసింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారిస్తున్నారు. బుధవారం పోస్టుమార్టం రిపోర్టు వచ్చిందన్న సమాచారంతో రాంసింగ్ పీఎస్‌కు వెళ్లాడు. ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో సెక్టార్ ఎస్‌ఐ సాయికృష్ణ వద్దకు వెళ్లాడు. అయితే ఎస్‌ఐ తీవ్రంగా దుర్భాషలాడుతూ మరో గదిలోకి తీసుకెళ్లి లాఠీలతో చితకబాదాడని బాధితుడు ఆరోపించాడు. తలకు, కాళ్లకు గాయాలతో ఉస్మానియా ఆసుపత్రిలో బాధితుడు చికిత్స పొందాడు. పోలీసులు కొట్టడంతో తలకు గాయాలైన రోగి రాత్రి 12 గంటలకు హాస్పిటల్‌కు వచ్చాడని సిబ్బంది వివరాలు నమోదు చేశారు.

తప్పుడు ఆరోపణలు: ఎస్‌ఐ సాయికృష్ణ

రాంసింగ్ సహా మరికొందరు తనను వేధిస్తున్నారని అదే ప్రాంతంలో నివసించే మహిళ ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ సాయికృష్ణ తెలిపారు. అదే విషయమై బుధవారం అతడిని పిలిచి విచారించామని తెలిపారు. ఈ కేసు నుంచి తప్పించుకోవాలనే ఉద్దేశంతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని ఎస్‌ఐ వివరించారు.

వారెంట్లు ఇవ్వడానికి వెళ్తూ సీఐడీ ఏఎస్సై మృతి

రాంగోపాల్‌పేట్: ఓ కేసులో వారెంట్లు ఇవ్వడానికి వెళుతున్న ఓ సీఐడీ ఏఎస్సై గుండెపోటుతో మరణించారు. గోపాలపురం పోలీసుల కథనం ప్రకారం... సాలార్‌జంగ్ కాలనీ టోలిచౌకికి చెందిన యూనస్‌ఖాన్(53) రాష్ట్ర సీఐడీలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. భీమవరం ప్రాంతానికి చెందిన ఓ కేసులో నిందితుడికి నాన్ బెయిలబుల్ వారెంట్లు ఇవ్వడానికి బుధవారం సాయంత్రం సెట్విన్ బస్సులో మెహిదీపట్నం నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు బయలుదేరాడు. సికింద్రాబాద్‌కు చేరుకోగానే వెనుక సీటులో ఉన్న ఆయన సీటు మీది నుంచి బస్సు ఫ్లోర్‌లో పడిపోయాడు. వెంటనే డ్రైవర్ 100 డయల్ చేయడంతో పోలీసులు వచ్చి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించాడు. గతంలోనే ఆయన గుండెకు శస్త్ర చికిత్స జరిగిందని కుటుంబ సభ్యులు చెప్పారు. గుండెపోటుతోనే మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

నాంపల్లి కోర్టుకు మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు

బంజారాహిల్స్(హైదరాబాద్): టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం నాంపల్లిలోని 17వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. 2018లో చెన్నుపాటి వేణు మాధవ్‌కు చెందిన క్రియా హెల్త్‌కేర్ లిమిటెడ్ సంస్థలో తలెత్తిన భాగస్వామ్య వివాదాన్ని పరిష్కరించడానికి రాధాకిషన్‌రావు రంగంలోకి దిగారు. తనను కిడ్నాప్ చేసి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లారని, బలవంతంగా సంస్థకు చెందిన షేర్ల బదలాయింపు చేసి చంద్రశేఖర్ వేగే, సినీ నిర్మాత నవీన్ ఎర్నేని సూరెడ్డి గోపాల కృష్ణ, మందల రవికుమార్‌కు ప్రయోజనం కలిగించారంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో వేణుమాధవ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాధాకిషన్‌రావుతోపాటు ఇతర నిందితులపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు రాధాకిషన్‌రావు ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. కాగా, ఆయన్ను షేర్ల బదలాయింపు కేసులో పీటీ వారెంట్ ద్వారా గురువారం కోర్టులో హాజరుపరిచారు. రాధాకిషన్‌రావుకు 14 రోజుల కస్టడీ విధించడంతో తిరిగి జైలుకు పంపించారు. కాగా, ఒకటి రెండు రోజుల్లో జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీ పిటిషన్ వేసి ఈ కేసులో రాధాకిషన్‌రావును విచారించేందుకు సిద్ధమవుతున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో తల్లి, బిడ్డ అరెస్టు

రాంగోపాల్‌పేట్: రోడ్డు పక్కన యాచిస్తున్న ఓ చిన్నారిని కిడ్నాప్ చేసిన ఇద్దరిని మోండా మార్కెట్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మహారాష్ట్రకు చెందిన నంద ఉత్తమ్ పవార్ భర్త మృతి చెందడంతో నలుగురు పిల్లలతో కలిసి సికింద్రాబాద్‌కు వచ్చి రైల్వేస్టేషన్ పరిసరాల్లో యాచిస్తూ జీవనం సాగిస్తోంది. చిన్న పాపను తన వద్దే ఉంచుకుంటూ మిగతా ముగ్గురిని యాచించడానికి పంపించేది. ఈ క్రమంలో గత నెల 26వ తేదీన 31వ నంబర్ బస్టాప్ ప్రాంతంలో ఆమె కూతురు దుర్గ(3) అదృశ్యమైంది. దీంతో ఆమె అదే రోజు మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి పల్నాడు దాచేపల్లికి చెందిన మల్ల గంగమ్మ, ఆమె మైనర్ కూతురు కలిసి దుర్గను కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. అడ్డగుట్ట ప్రాంతంలో సంచరిస్తుండగా వారిని పోలీసులు అరెస్టు చేశారు. బాలికను జువైనల్ హోంకు, దుర్గను చైల్డ్ హోంకు తరలించారు.

నకిలీమందుల తయారీదారుల అరెస్టు

- రూ.50 లక్షల సామగ్రి స్వాధీనం
- మేడ్చల్ జిల్లా దూలపల్లిలో ఘటన


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: నకిలీ మందుల తయారీ కేంద్రంపై పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్ బోర్డు అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.50 లక్షల విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, డ్రగ్ కంట్రోల్ అధికారులు గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలకలపల్లికి చెందిన గిర్నేని గోపాల్(42) 2001లో నగరానికి వలస వచ్చి నిజాంపేట మధురానగర్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో హరిణి ఇండస్ట్రీస్ పేరుతో ప్లాస్టిక్ మోల్డింగ్ పరిశ్రమ నిర్వహించేవాడు. అయితే కరోనా సమయంలో పరిశ్రమ నడవకపోవడంతో గోపాల్ ఆర్థికంగా చితికిపోయాడు. దీంతో తన మిత్రుడైన ఢిల్లీవాసి నిహాల్‌తో కలిసి నకిలీమందుల తయారీకి తెరలేపాడు.

ఢిల్లీ నుంచే ముడిసరుకులు..

గ్రాన్యులేటెడ్ ట్యాబ్లెట్లు, ప్యాకింగ్ మెటీరియల్స్, లేబుల్స్, అల్యూమినియం స్ట్రిప్ ఫాయిల్స్, ప్రముఖ ఫార్మాస్యుటికల్ కంపెనీల బాక్సులను నిహాల్ ఢిల్లీ నుంచి గోపాల్‌కు పంపేవాడు. మేడ్చల్ జిల్లా దూలపల్లిలో ఓ గోదామును ఏర్పాటు చేసి అవసరమైన యంత్రాలను కొనుగోలు చేశారు. వీరికి జగద్గిరిగుట్ట సంజయ్‌పురి కాలనీకి చెందిన మెషీన్ ఆపరేటర్ రామకృష్ణ(40) తోడయ్యాడు. ముగ్గురు కలిసి ప్రముఖ బ్రాండ్ల పేరిట నకిలీ మందులను తయారు చేయడం మొదలుపెట్టారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న డ్రగ్స్ కంట్రోల్ బోర్డు, ఎస్‌ఓటీ, పేట్ బషీరాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సామగ్రిని సీజ్ చేశారు. గోపాల్, రామకృష్ణలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించగా, నిహాల్ పరారీలో ఉన్నాడు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాస్, ఎస్‌ఓటీ ఏడీసీపీ శోభన్ కుమార్, ఎస్‌ఓటీ సీఐ శ్యాంసుందర్ రెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు పాల్గొన్నారు. కాగా, నకిలీ దందాను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందికి రివార్డు అందజేస్తామని డీసీపీ తెలిపారు.

అత్యాచార కేసు.. ఇద్దరు నిందితుల రిమాండ్

మియాపూర్: ఓ యువతిపై అత్యాచారం చేసిన కేసులో ఇద్దరు నిందితులను మియాపూర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. మియాపూర్‌లోని జేఎస్‌ఆర్ గ్రూప్ సన్‌సిటీ రియల్ ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్న యువతిపై అదే కంపెనీలో సెల్స్ ఎగ్జిక్యూటీవ్స్ లక్కిరెడ్డి జనార్ధన్ రెడ్డి (25), అనెగుంట సంగారెడ్డి(39) అత్యాచారం చేసిన విషయం తెలిసిందే. వివరాలు... ఓ యువతి(25) మియాపూర్‌లోని జేఎస్‌ఆర్ కంపెనీలో ఉద్యోగిగా చేరింది. ఆమె కార్యాలయానికి రాగా యాదగిరిగుట్టకు సైట్ విజిట్ కోసం వెళ్లాల్సి ఉందని చెప్పి వీరు ఆమెను కారులో తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో కూల్‌డ్రింక్‌లో బీరు కలిపి ఆమెకు తాగించారు. ఆమె స్పృహ కోల్పోయిన తర్వాత ఇద్దరు లైంగిక దాడి చేశారు. అనంతరం స్పృహలోకి వచ్చిన బాధితురాలిని కొట్టి చేతులు కట్టేశారు. ఆ తరువాత ఆమెను మియాపూర్ మహాలక్ష్మి హాస్టల్‌లో దింపారు. తనపై అత్యాచారం చేశారని బాధితురాలు ఈ నెల 2వ తేదీన ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి మియాపూర్ పోలీసులకు బదిలీ చేశారు. మియాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టి సంగారెడ్డి, జనార్ధన్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు.

అంతర్‌రాష్ట్ర గంజాయి గ్యాంగ్ అరెస్ట్

- 155 కిలోలు సీజ్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ సుధీంద్ర


నిందితులను ప్రవేశపెట్టి సమావేశంలో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ డీసీపీ సుధీంద్ర

హిమాయత్‌నగర్: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ టీమ్, స్థానిక పోలీసులతో కలిసి చేసిన జాయింట్ ఆపరేషన్‌లో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు గురువారం నగర టాస్క్‌ఫోర్స్, హెచ్‌న్యూ విభాగం డీసీపీ సుధీంద్ర బషీర్‌బాగ్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరికి చెందిన మనాజిత్ దాలి అలియాస్ జీతు అదే ప్రాంతానికి చెందిన అనీస్ దానాజి గాంటే, సుశాంత్ మిస్త్రీ, సుమంత్ మండల్, ప్రసన్‌జిత్ మిస్త్రీతో కలిసి నగరానికి గంజాయి తరలిస్తున్నారు. వీరిలో గతంలో రెండు వేల కేజీల గంజాయి అక్రమ రవాణా చేసిన నిందితులు ఉన్నారు. అయితే తాజాగా రౌడీషీటర్, మంగళ్‌హాట్‌కి చెందిన లక్కన్ సింగ్ అలియాస్ లక్కన్ అలియాస్ గోరు వారి వద్ద గంజాయి సేకరించి నగరంలో పలువురికి విక్రయిస్తున్నాడు. ఆసిఫ్‌నగర్‌కి చెందిన దేవరాజ్ అలియాస్ కాలు, సంగారెడ్డికి చెందిన చిన్న రాథోడ్ గోవింద్ ఆటో ద్వారా గంజాయి తరలించేవారు. ఈ విధంగా గంజాయిని తరలిస్తున్న ఈ ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొత్తం రూ.61 లక్షల విలువ చేసే 155 కిలోల గంజాయి సీజ్ చేశారు. స్కార్పియో వాహనం, ప్యాసింజర్ ఆటో, 9 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

10 ఏళ్లుగా గంజాయి సరఫరా...

మంగళ్ హాట్ ప్రాంతానికి చెందిన లక్కన్ చదువు మధ్యలో మానేసి స్నేహితులతో కలిసి మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిసయ్యాడు. దోపిడీ, హత్యయత్నం కేసులలో అతడు నిందితుడు. 2021లో అతనిపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. అతనిపై 3 కేసులు, పిడి యాక్ట్ నమోదు చేశారు. సుమారు 10 ఏళ్లుగా గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఏడాది నుంచి పోలీసు స్టేషన్‌కు సైతం గైర్హాజరవుతున్నాడు. దీంతో మరోసారి లక్కన్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మతిస్థిమితంలేని మహిళ ఆత్మహత్య

ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ కోసం ప్రిపేర్ అవుతూ..


నిహారిక రావు

నాగోలు: ఎంబీబీఎస్ పూర్తి చేసిన మహిళ మతిస్థిమితం కోల్పోయి అపార్ట్‌మెంట్ 8వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఏఎస్ రావు నగర్‌కు చెందిన కాకర్ల నాగేశ్వరావు-నిరూపరావు దంపతులు. కొంతకాలంగా బండ్లగూడ రాజీవ్ స్వగృహ సహభవన అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. నాగేశ్వరావు కూతురు నిహారికరావు(29) ఎంబీబీఎస్ పూర్తి చేసింది. రెండేళ్ల క్రితం డాక్టర్ మనోహర్షతో ఆమెకు వివాహమైంది. మనోహర్ష ఢిల్లీలోని ఓ హాస్పిటల్ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. నిహారికరావు తల్లిదండ్రుల వద్ద ఉంటూ పీజీ కోసం ప్రిపేర్ అవుతోంది. కంటి వైద్యనిపుణురాలుగా కావాలన్నదే తన కోరిక అని ఆమె తరచూ చెబుతుండేది. అయితే నిహారికరావుకు కొంతకాలంగా మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా ఉండటంలేదు. దీంతో ఆమెకు జంజారాహిల్స్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. అయినా ఆరోగ్యం మెరుగుపడటంలేదు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్ 8 వ అంతస్తు నుంచి కిందికి దూకడంతో పార్కింగ్ చేసి ఉన్న ఓ కారుపై పడింది. కుటుంబసభ్యులు గమనించి వెంటనే ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. నిహారికరావు ఆరోగ్య మానసిక పరిస్థితి సరిగా లేక ఆత్మహత్య చేసుకుందని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిహారిక రావు గతంలో కూడా అనేక సార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

తాగిన మైకంలో బాంబు బెదిరింపు

నిందితుడి అరెస్టు

రాంగోపాల్‌పేట్: తాగిన మైకంలో ఓ హోటల్‌లో బాంబు ఉందని తప్పుడు సమాచారమిచ్చిన వ్యక్తిని మోండా మార్కెట్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కథనం ప్రకారం... వెస్ట్ బెంగాల్‌కు చెందిన షేక్ నసీం(19) కుటుంబం కొద్ది సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి శంషాబాద్‌లో నివాసం ఉంటోంది. నసీం కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అప్పుడప్పుడు కలకత్తాకు వెళ్లి వచ్చే క్రమంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దిగి ఆల్ఫా హోటల్‌లో బిర్యాని తినేవాడు. ఈ నెల 2వ తేదీన మద్యం సేవించి డయల్ 100 కు ఫోన్ చేసి ఆల్ఫా హోటల్‌లో బాంబు ఉందంటూ చెప్పాడు. దీంతో పోలీసులు, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది హోటల్‌లో తనిఖీలు చేసి ఏమీ లేదని తేల్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నసీం మద్యం మత్తులో ఫోన్ చేసినట్లు గుర్తించారు. అనంతరం అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చనిపోతున్నా.. వెతకొద్దంటూ మెసేజ్

భర్తతో గొడవ పడి గర్భిణి అదృశ్యం


మణి

వెంగళరావునగర్: భర్తతో గొడవపడి ఓ గర్భిణి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... శ్యామలకుంటకు చెందిన జి.కళమ్మ, వెంకయ్య దంపతులు. వారికి ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. తమ కుమార్తె మణిని 2017 కె.ఉమేష్ అనే వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశారు. ఉమేష్, మణి దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఏడో నెల గర్భిణి అయిన మణి ఎస్‌ఆర్‌నగర్‌లోని బజాజ్ కంపెనీలో సేల్స్ ఉమెన్‌గా పనిచేస్తోంది. కాగా, ఈ నెల 2న మణి భర్తతో ఆర్థిక సమస్యలపై గొడవ పడింది. 3న సాయంత్రం 6.30 గంటలకు తాను చనిపోతున్నానని, వెతకవద్దని ఆమె తన సోదరుడు నరేష్‌కు మెసేజ్ పంపింది. వెంటనే నరేశ్, తల్లి కళమ్మ కలిసి బజాజ్ కంపెనీకి వెళ్లి విచారించగా, మణి అక్కడ నుంచి వెళ్లిపోయినట్టు సిబ్బంది చెప్పారు. దీంతో పలుప్రాంతాల్లో వెతికినా మణి కనిపించలేదు. ఆమె ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసుకుంది. దాంతో ఆమె తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్ చాకచక్యం.. డ్రైవర్ అప్రమత్తం!

ప్రయాణికురాలు పోగొట్టుకున్న రూ.3 లక్షలు అప్పగింత



జీడిమెట్ల: ఆర్టీసీ బస్సు కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఓ మహిళ ప్రయాణికురాలు పోగొట్టుకున్న రూ.3 లక్షల డబ్బులు దొరికాయి. వివరాలు.. జీడిమెట్ల డిపో బస్సు మెహిదీపట్నం నుంచి జీడిమెట్లకు వస్తోంది. ఈ క్రమంలో మూసాపేట వద్ద కొంతమంది మహిళా ప్రయాణికులు బస్సు ఎక్కారు. బస్సు మూసాపేటకు చేరుకోగానే ఓ మహిళ తన బ్యాగులో ఉన్న డబ్బు పోయిందని కండక్టర్ చిరంజీవికి తెలిపింది. వెంటనే అతడు డ్రైవర్ మల్లికార్జున్‌ను అప్రమత్తం చేయడంతో బస్సును ఎక్కడా ఆపకుండా పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లాడు. వెంటనే పోలీసులు బస్సులో ఎక్కి ప్రయాణికులను తనిఖీ చేశారు. బస్సులో దొరికిన బ్యాగ్‌ను ఓ ప్రయాణికుడు తన వద్దే పెట్టుకున్నారు. పోలీసులకు ఆ వ్యక్తి బ్యాగ్ ఇచ్చాడు. అందులో రూ.3 లక్షలు అలాగే ఉండటంతో ఆ బ్యాగ్‌ను అప్పగించారు.

పెళ్లి పేరిట నమ్మించి.. కోటిన్నర కొట్టేసి..!

- మ్యాట్రిమోనిలో నకిలీ ప్రొఫైల్.. అమ్మాయిలకు వల
- చివరికి పోలీసులకు చిక్కిన కేటుగాడు

సాక్షి, సిటీబ్యూరో: రూ.350 కోట్ల బ్యాంకు బ్యాలెన్స్ ఉందని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు.. విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని, బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని మాయమాటలు చెప్పాడు.. నమ్మిన ఓ బాధితురాలి నుంచి రూ.కోటిన్నర కొట్టేశాడు... చివరికి సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కాడు ఓ కేటుగాడు. ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ సైబర్ కేటుగాడికి పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారు. విలాస జీవితానికి అలవాటు పడి భార్యను వదిలేసి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. తనకు కోట్లాది రూపాయల ఆస్తి ఉందని, తల్లిదండ్రులు ఎవరూ లేరని, ఒంటరిగా అమెరికాలో ఉంటున్నానని అమ్మాయిలకు మాయమాటలు చెప్పి నమ్మించేవాడు. ఆస్టన్ మార్టిన్ కారు ముందు లగ్జరీ సూటు, బూటుతో హీరో మాదిరిగా స్టయిల్‌గా ఫొటోలను మార్ఫింగ్ చేసి, మ్యాట్రిమోనీలలో నకిలీ ప్రొఫైల్ సృష్టించాడు. ఏపీకి చెందిన ముగ్గురు అమ్మాయిలకు వాటిని పంపించాడు. ఒకరికి తెలియకుండా మరొకరితో ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడేవాడు. హైదరాబాద్‌లో ఉంటూనే విదేశీ నంబర్లతో ఫోన్లు చేసేవాడు. పుట్టిన రోజులు, ఇతరత్రా ప్రత్యేక దినాలకు ఖరీదైన బహుమతులు పంపించేవాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వస్తున్నానని, పెళ్లి చేసుకుందామని మాయమాటలు చెప్పాడు. అయితే విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని, తన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని చెప్పాడు. నిజమేనని నమ్మిన ఓ బాధితురాలు పెళ్లి కోసమని బ్యాంకు అకౌంట్లో దాచుకున్న రూ.కోటిన్నరను దశలవారీగా వసూలు చేశాడు. ఆ తర్వాత ఆమెతో మాట్లాడటం మానేశాడు. ఎంతకీ అతని నుంచి ఫోన్ రాకపోయే సరికి మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది.

పచ్చదనం పెంపొందించే పనులకు ప్రాధాన్యమివ్వండి

- పార్కులో ఆయా పనులను త్వరగా పూర్తి చేయాలి
- జలగం వెంగళ్‌రావు పార్కును పరిశీలించిన జెడ్సీ అనురాగ్ జయంతి



వెంగళ్‌రావు పార్కులో పర్యటిస్తున్న జెడ్సీ అనురాగ్ జయంతి

బంజారాహిల్స్: జలగం వెంగళ్‌రావు పార్కులో అభివృద్ధి పనులతో పాటు గ్రీనరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ జెడ్సీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తొలిసారిగా ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని జలగం వెంగళ్‌రావు పార్కులో వివిధ విభాగాల అధికారులతో కలిసి ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ కింద గ్రీనరీని అభివృద్ధి చేస్తున్న కన్హా శాంతి వనం ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. పార్కులో పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. బ్లూ డ్రాప్ సంస్థ ప్రతినిధులు పార్కులో ఉన్న చెరువులోకి మురుగు నీరు రాకుండా సీఎస్ఆర్ కింద పనులు చేస్తున్న విషయాన్ని అధికారులు జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. పార్కులోకి కుక్కలు రాకుండా, పారిశుద్ధ్య సమస్య లేకుండా అధికారులు చూసుకోవాలని సూచించారు. సర్కిల్–18 డీసీ ప్రశాంతి, ఈఈ విజయ్‌కుమార్, పార్కుల విభాగం మేనేజర్ బాలయ్య, ఎంటమాలజీ అధికారులు రజిని, రజిత తదితరులు పాల్గొన్నారు.

లోతైన మ్యాన్‌హోళ్ల వద్ద పటిష్ట భద్రత



లోటస్‌పాండ్‌లో లోతైన మ్యాన్‌హోల్ వద్ద రక్షణ చర్యలను పరిశీలిస్తున్న జీఎం హరిశంకర్

బంజారాహిల్స్: ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోళ్లతో పాటు లోతైన మ్యాన్‌హోళ్లు ఉన్న ప్రాంతాల్లో పౌరులను అప్రమత్తం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని జలమండలి డివిజన్–6 జీఎం హరి శంకర్ అన్నారు. గురువారం ఆయన బంజారాహిల్స్ లోటస్‌పాండ్‌లోని లోతైన మ్యాన్‌హోళ్లను పరిశీలించారు. వర్షాకాలంలో వచ్చే ఓవర్‌ఫ్లోతో చిన్న ప్రమాదం కూడా జరగకుండా తమ సిబ్బంది, అధికారులు ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల్లో నిఘా ఉంచుతున్నారని అన్నారు. ఇప్పటికే దెబ్బతిన్న మ్యాన్‌హోళ్ల మూతలను మార్చడంతో పాటు ఆ మూతల కింద కూడా ఒక జాలిని ఏర్పాటు చేశామని వర్షాలు బాగా వచ్చినప్పుడు నీళ్లు వెళ్లేందుకు ఎవరైనా మూతలు తెరిచి వదిలేసినా కూడా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బంజారాహిల్స్ డీజీఎం శ్రీనివాస్, తట్టికాన సెక్షన్ మేనేజర్ రాంబాబు తదితదరులు పాల్గొన్నారు.

అథ్లెట్ దినాకు అభినందన

శ్రీనగర్‌కాలనీ: రాజీవ్‌నగర్‌కాలనీ జీటీఎస్ గ్రౌండ్స్‌లో ఉచిత శిక్షణ పొందుతున్న అథ్లెట్ దీనా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ మీట్‌లో అర్హత సాధించడం సంతోషంగా ఉందని కోచ్, సామాజికవేత్త కళ్లెం శ్రీనివాస రెడ్డి, కోచ్ అనిల్ తయ్యప్ప అన్నారు. కిడ్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2024 హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ నిర్వహించిన టోర్నమెంట్‌లో లాంగ్ జంప్‌లో రెండవ స్థానం, 300 మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యిందన్నారు. ఈ నేపథ్యంలో గురువారం దినాను అభినందించారు. ఈ నెల 7న పుల్లెల గోపీచంద్ అకాడమీలో జరుగనున్న పోటీల్లో దినా తప్పక విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ నాగోన్ మెట్రో కార్యదర్శి లయన్ రాజశేఖర్, కోచ్‌లు పాల్గొన్నారు.



అథ్లెట్ దినాను అభినందిస్తున్న కళ్లెం శ్రీనివాసరెడ్డి, అనిల్ తయ్యప్ప

రోడ్డు పనులను సత్వరమే పూర్తిచేయండి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ రత్నదీప్ సూపర్ మార్కెట్ వెనుక నిర్మాణంలో ఉన్న వీడీసీసీ రోడ్డు పనులను గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల్లో జాప్యం జరుగుతుందని స్థానికులు ఫిర్యాదు చేయడమే కాకుండా ట్రాఫిక్ జాం అవుతుందని ఆరోపించారు. తరచూ వర్షాలు పడుతుండడం వల్ల పనులు ముందుకుసాగడం లేదని, వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామని జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఈఈ విజయ్ కుమార్ స్పష్టం చేశారు. 540 మీటర్ల మేర రూ. 65 లక్షల వ్యయంతో సెంట్రల్ మీడియంకు రెండు వైపులా ఇక్కడ సీసీ పనులు జరుగుతున్నాయి. ఎంత తొందరగా వీలైతే అంత తొందరంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఎన్‌బీటీనగర్‌లో కొత్తగా వీధి దీపాల ఏర్పాటు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో గురువారం జీహెచ్‌ఎంసీ వీధి దీపాల విభాగం అధికారులు పర్యటించారు. గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బస్తీలో వీధిదీపాలు ఏర్పాటు చేయాల్సిందిగా సూచించిన నేపథ్యంలో ఈ ప్రతిపాదనలను పరిశీలించేందుకు అధికారులు ఇక్కడ పర్యటించారు. హరేకృష్ణ ఎదురుగా అయ్యప్ప ఆలయాన్ని ఆనుకుని మెట్లపై వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, అలాగే డార్క్ స్పాట్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి అక్కడ విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేయాలని కోరడమే కాకుండా ఎక్కడెక్కడ స్తంభాలు అవసరమో వాటి జాబితాను కూడా మేయర్ అందజేశారు. దీంతో అధికారులు బస్తీల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి 20 చోట్ల వీధి దీపాలు అవసరం అని నిర్ధారించారు. కొత్త స్తంభాలతో పాటు లైట్లు కూడా వేయాలని, ఈ నెలాఖరులోగా పనులు పూర్తిచేస్తామని వీధి దీపాల విభాగం ఈఈ ఇంద్రదీప్ తెలిపారు.



ఎన్‌బీటీనగర్ పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ వీధి దీపాల విభాగం ఇంజనీర్లు

జీహెచ్‌ఎంసీకి జలమండలి బకాయిలు...

వసూలయ్యేనా?

- రూ. కోట్లలో పేరుకుపోయిన రోడ్డు కటింగ్ చార్జీలు
- అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా రోడ్ల తవ్వకాలు
- ఉన్నతాధికారులు స్పందిస్తేనే మేలంటున్న ఇంజినీర్లు



బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 ప్రధాన రహదారిలో పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్డు కటింగ్

బంజారాహిల్స్: జలమండలితో పాటు ఇతర సంస్థలు పైప్‌లైన్లు, ఇతరత్రా కేబుల్ వైర్ల నిర్మాణం కోసం రోడ్డు తవ్వాల్సి వస్తే ముందుగా జీహెచ్‌ఎంసీ నుంచి రోడ్డు కటింగ్ అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇందుకోసం జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఇతర ప్రైవేటు సంస్థలు పైప్‌లైన్ల నిర్మాణం కోసం రోడ్డు కటింగ్ చార్జీలు కింద జీహెచ్‌ఎంసీకి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఆ ప్రాంతంలో ఎంతమేర తవ్వకాలు చేపడతారో అందుకు నిబంధనల ప్రకారం ఈ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే టీఎస్ఎస్‌పీడీసీఎల్ సంస్థ మాత్రమే రోడ్డు కటింగ్ చేసినప్పుడు జీహెచ్‌ఎంసీకి చార్జీలు చెల్లిస్తున్నది. జలమండలి మాత్రం ఎలాంటి చార్జీలు చెల్లించకుండానే, అనుమతులు తీసుకోకుండానే దర్జాగా రోడ్డు తవ్వకాలు చేపడుతూ రాత్రికి రాత్రే పైపులు వేస్తూ గుంతలపై మట్టి పూడ్చి జారుకుంటున్నది.

- జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో ఇప్పటికే జలమండలి రోడ్డు కటింగ్ చార్జీల కింద జీహెచ్‌ఎంసీకి రూ. 20 కోట్ల వరకు బకాయి పడింది.
- డబ్బులు చెల్లించకుండానే యథేచ్ఛగా రోడ్డు తవ్వకాలు చేపడుతుండటంతో అడ్డదారి పనులతో వర్షాకాలంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు వాపోతున్నారు.
- జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్ డివిజన్లలోనూ జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండానే జలమండలి పైప్‌లైన్ల నిర్మాణం చేపడుతుంది. ఈ విషయంలో జలమండలి, జీహెచ్‌ఎంసీ ఇంజినీర్ల మధ్య ఎన్నోసార్లు వాగ్వాదం చోటుచేసుకుంది. అయినా సరే సంబంధిత ఇంజినీర్లు మాత్రం వినిపించుకున్న పాపానపోవడం లేదు.
- సర్కిల్–17లో సైతం జలమండలి రూ. 15 కోట్ల మేర రోడ్డు కటింగ్ పనులు చేసి జీహెచ్‌ఎంసీకి నయాపైసా చెల్లించలేదు. దీంతో జలమండలి పైప్‌లైన్ పూర్తయిన తరువాత జీహెచ్‌ఎంసీ రోడ్డు రిస్టోరేషన్ చేయడంలో చేతులెత్తేస్తుంది.
- ఫలితంగా రోడ్ల పక్కన, రోడ్లకు అడ్డంగా తవ్వకాలతో గోతులతో రోడ్లు పూర్తిగా గుంతలమయమై వానాకాలంలో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ఈ రెండు శాఖలు ప్రభుత్వానివే కావడంతో డబ్బులు చెల్లించడం మాకెందుకులే అని జలమండలి మిన్నకుండిపోతుంది.
- ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో ఈ తరహా రోడ్డు కటింగ్‌లు దర్జాగా జరుగుతుండగా, జీహెచ్‌ఎంసీకి మాత్రం రోడ్డు కటింగ్ చార్జీలు చెల్లించడం లేదు.

చార్జీలు ఇలా చెల్లించాలి...

జీహెచ్‌ఎంసీ అధీనంలో ఉన్న జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్, టెలికాం ఇతర ప్రైవేటు వ్యక్తులు రోడ్డు తవ్వాలంటే జీహెచ్‌ఎంసీకి రోడ్డు కటింగ్ చార్జీలు చెల్లించి అనుమతులు తీసుకున్న తర్వాతనే తవ్వకాలు ప్రారంభించాలి. సీసీ రోడ్డు తవ్వితే రోడ్డు కటింగ్ చార్జీ కింద మీటరుకు రూ. 2,400లు, ల్యాండ్ లీజు కింద ఆ ప్రాంతపు మార్కెట్ విలువలో 10 శాతం చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ బీటీ రోడ్డు తవ్వాల్సి వస్తే రోడ్డు కటింగ్ కింద మీటరుకు రూ. 2,200లు, ల్యాండ్ లీజు కింద మార్కెట్ విలువలో 10 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చెల్లించిన చార్జీలతోనే పనులు పూర్తయిన తరువాత జీహెచ్‌ఎంసీ తవ్విన చోట సిమెంట్ వేసి మరమ్మతులు చేపడుతుంది. జలమండలి నిర్వాకంతో చార్జీలు చెల్లించకపోవడంతో ఎక్కడ గోతులు అక్కడే దర్శనమిస్తున్నాయి. ఈ విషయంలో జలమండలి, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు సమీక్ష జరిపి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. జీహెచ్‌ఎంసీ వద్ద నిధులు లేకపోవడంతో ప్రస్తుతం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేక వందల చోట్ల పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో జలమండలి నుంచి డబ్బులు వసూలు చేసి జీహెచ్‌ఎంసీ ఆర్థికంగా బలోపేతం కావాల్సి ఉంది. ఈ డబ్బులతోనైనా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి ముందస్తు పనులకు వెళితే కొంత పురోగతి కనిపిస్తుంది.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులు అందజేస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కూలు బ్యాగులను ఫౌండేషన్ చైర్మన్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అందజేశారు. ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని నిషుల్క్ ప్రభాత్ ప్రభుత్వ పాఠశాల, వాసవి ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లలో విద్యార్థులకు విజయారెడ్డి ఆయా పాఠశాల యాజమాన్యాలతో కలిసి విద్యార్థులకు స్కూలు బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో నిషుల్క్ ప్రభాత్ పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బోరబండ పీఎస్‌లో మూడు బీఎన్‌ఎస్ కేసుల నమోదు

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్‌లో మూడు బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) కేసులు తొలిసారిగా నమోదు చేశామని ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ తెలిపారు. శ్రీరాంనగర్‌లో మ్యాన్ మిస్సింగ్‌లో బీఎన్ఎస్ కేసు 137, సారథినగర్ జరిగిన ఘర్షణలో ఇద్దరిపై 118, 152 కింద కేసులు నయోదు చేసినట్లు ఆయన వివరించారు. బీఎన్ఎస్ కొత్త చట్టాలపై పోలీసు సిబ్బంది మరింత అవగాహన కల్పించుకోవాలని ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి సూచించారు.

రోడ్ల మరమ్మతులను వెంటనే చేస్తాం

వెంకటేశ్వరకాలనీ: బోనాల పండుగ నేపథ్యంలో దెబ్బతిన్న రోడ్లను, ప్యాచ్ వర్క్‌లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశించిన నేపథ్యంలో సర్కిల్–18 ఈఈ విజయ్‌కుమార్ గురువారం బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని వెంకటేశ్వరనగర్ బస్తీలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, రాములు చౌహాన్‌లతో కలిసి పర్యటించారు. బస్తీల్లోని పలు వీధుల్లో జలమండలి అధికారులు పైప్‌లైన్లు వేసి వెళ్లారని రిస్టోరేషన్ చేయకపోవడంతో బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఈఈ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే గుర్తించిన రోడ్లలో మరమ్మతు పనులు పూర్తి చేస్తామని బోనాల పండుగ తర్వాత సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తామని ఆయన తెలిపారు.



వెంకటేశ్వరనగర్ బస్తీలో పర్యటిస్తున్న ఈఈ విజయ్‌కుమార్

రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో బంజారాహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌల్యాల రాజు ఫిర్యాదు చేశారు. వివరాలివీ... ఇందిరానగర్‌కు చెందిన నాగిళ్ల శివాజీరాజా అనే వ్యక్తి సోషల్ మీడియాలో రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా.. ఆయనను కించపరిచే విధంగా అసభ్యకర పోస్టులు పెట్టారన్నారు. దీని వల్ల కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఇలాంటి వారిని ఉపేక్షిస్తే భవిష్యత్తులో శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో...

రాహుల్‌గాంధీని కించపరుస్తూ కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన నాగిళ్ల శివాజీరాజాపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: ఇంటిముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... తూర్పు గోదావరికి చెందిన కటికరెడ్డి బాబీ ఈ నెల 2వ తేదీ రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా కనిపించకపోవడంతో గురువారం మధురానగర పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

ద్విచక్ర వాహనంతో జంప్

గంటలో బండి తీసుకొస్తానని చెప్పి ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లిన యువకుడు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడలో నివాసం ఉండే డి.చిరుహాస్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని ఏప్రిల్ 12వ తేదీన బాబూయాదవ్ అనే వ్యక్తి తీసుకెళ్లాడు. గంటలో వస్తానని చెప్పి రెండు నెలలైనా తిరిగి ఇవ్వలేదు. ఇటీవల ఆ వాహనంపై ట్రాఫిక్ చలానాలు చిరుహాస్‌కు వస్తున్నాయి. బాబూయాదవ్‌కు ఫోన్ చేస్తే ఆయన స్విచ్ ఆఫ్ వస్తుంది. నెల క్రితం చైతన్యపురిలో కనిపించాడు. అతనిని వెంబడించగా పారిపోయాడు. తాను మోసపోయానని గ్రహించి చిరుహాస్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎన్నికల బాటలో బస్తీలు!



కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వినాయకనగర్ బస్తీ నాయకులు

- ముగిసిన బస్తీల అధ్యక్షుల పదవీకాలం
- ఎన్నికలకు సిద్ధమవుతున్న బస్తీలు
- ప్రజాప్రతినిధులు, పోలీసులకు వినతులు
- బందోబస్తుకు నిరాకరిస్తున్న పోలీసులు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని బస్తీల్లో ఎన్నికల హడావిడి మొదలైంది. ఇప్పటికే పలు బస్తీల్లో సమావేశాలు నిర్వహించి ఎన్నికల నిర్వహణ కోసం ఏకగ్రీవ తీర్మానాలు సైతం చేశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో అనుమతి కోసం దరఖాస్తులు సైతం చేసుకున్నారు. మరి కొన్ని బస్తీల్లో ఎన్నికల నిర్వహణకు క్షేత్ర స్థాయిలో స్థానికులు సిద్ధమవుతున్నారు.

ఎన్నికల బాటబట్టిన బస్తీలు...

బస్తీ అధ్యక్షుల పదవీకాలం ముగిసి సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికలు నిర్వహించనందున చాలా బస్తీల్లో ఎన్నికలు నిర్వహించాలంటూ స్థానికులు పట్టుబడుతున్నారు.

- ఎస్పీఆర్‌హిల్స్‌లోని టి.అంజయ్య నగర్, బాబూజీ నగర్, వినాయక నగర్, హెచ్ఎఫ్ నగర్, మహాత్మా నగర్, ఓం నగర్, రాజీవ్‌గాంధీ నగర్, వెంకటేశ్వర కాలనీ, కమలా నగర్, ఇందిరానగర్ తదితర బస్తీల అధ్యక్షుల పదవీకాలం ముగిసి సంవత్సరాలు గడుస్తోంది.
- కొన్ని రాజకీయ కారణాల వల్ల గత ప్రభుత్వం కాలంలో బస్తీ ఎన్నికలు నిర్వహించలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి ఎన్నికల నిర్వహణ అంశం తెరపైకి వచ్చింది.
- దీంతో ఆయా బస్తీవాసులు ఎలాగైనా తమ తమ బస్తీల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించుకుని ఆ దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలను సమర్పిస్తున్నారు.
- ఇటీవల టి.అంజయ్య నగర్ బస్తీ నాయకులు బోరబండ పోలీస్ స్టేషన్‌లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే దారిలో బాపూజీ నగర్ బస్తీవాసులు సిద్ధం అవుతున్నారు. ఈ క్రమంలోనే వినాయకనగర్ బస్తీవాసులు ఎన్నికల జరిపించాలంటూ గురువారం స్థానిక కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఇలా పలు ప్రాంతాల్లో బస్తీల ఎన్నికల నిర్వహణ, జయాపజయాలు, ప్రచారం తదితర అంశాలపై చర్చోపచర్యలు జరుగుతున్నాయి.

రక్షణ కల్పించలేం...



ప్రభుత్వం పరంగా అధికృత అధికారులు ఎన్నికల నిర్వహిస్తేనే పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తాం. ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తే బందోబస్తు ఇవ్వలేము. ఎన్నికల నిర్వహణలో గొడవలు జరిగితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం. బస్తీ ఎన్నికల నిర్వహణ పూర్తిగా స్థానికుల ప్రాంతీయ అంశం. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం.

– వీరశేఖర్, ఎస్‌హెచ్‌ఓ బోరబండ పీఎస్

పిల్లల మెదడు, వెన్ను చికిత్సలకు కొత్త సాంకేతికత

లక్డీకాపూల్: పీడియాట్రిక్ న్యూరోసర్జరీకి సంబంధించిన మెదడు, వెన్నెముక వ్యాధులకు సరికొత్త సాంకేతికతో కూడిన శస్త్ర చికిత్సలు అవసరమని పలువురు న్యూరోసర్జన్‌లు అభిప్రాయపడ్డారు. ఇందుకు న్యూరో సర్జన్లు, నర్సులకు మెరుగైన నైపుణ్యాన్ని మరింత పొందించాల్సి ఉందన్నారు. గురువారం నిమ్స్‌లో బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే అవగాహన సదస్సును సొసైటీ కో చైర్మన్ ఆర్థర్ డా. కున్హా ప్రారంభించారు. నిమ్స్ డైరెక్టర్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, పీడియాట్రిక్ న్యూరో సర్జరీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ విపి సింగ్, సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ మానస్ పాణిగ్రాహి, నిమ్స్ న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుచంద భట్టాచార్జీ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు జరిగే ఈ సీఎంఈ ప్రోగ్రామ్‌లో ఆచరణాత్మక అనుభవాన్ని అందించడానికి హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్, నర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. చాలా మంది పిల్లలు మెదడులోని హైడ్రోసెఫాలస్ అని పిలువబడే అధిక నీరు, మెదడు కణితులు, వెన్ను వంటి నాడీ సంబంధిత వ్యాధులతో పుడతారన్నారని దాంతో చర్మంపై పొలుచు ఏర్పడుతుందన్నారు. దీనిని సాధారణంగా మైలో మెనింగోకోలె అని పిలుస్తారని వారు స్పష్టం చేశారు. వారిలో చాలా మందికి అవ్వవసర శస్త్ర చికిత్స చేయాల్సి వస్తుందని ఈ సందర్భంగా పలువురు న్యూరో సర్జన్‌లు పేర్కొన్నారు.

‘అమ్మ పేరున మొక్క నాటిన చింతల’



మొక్కను నాటిన మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుపై ఒక చెట్టు) సందర్భంగా ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తన తల్లి పేరిట గురువారం మొక్కను నాటారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని సాగర్ సొసైటీ కాలనీలో బీజేపీ నాయకులతో కలిసి మొక్కను నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ‘అమ్మ పేరుపై ఒక చెట్టు’ ఉద్యమాన్ని నరేంద్రమోదీ ప్రారంభించారని తెలిపారు. ప్రపంచంలోని అన్ని దేశాల ప్రజలందరూ అమ్మ పేరుపై ఒక చెట్టు నాటాలని మనకీ బాత్ వేదికగా ప్రధాన మంత్రి పిలుపుమేరకు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనాల దరఖాస్తులకు నేడు ఆఖరు

బంజారాహిల్స్: బోనాల జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలకు ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం ఆఖరి గడువు అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల అధ్యక్షులు, ఇతర కమిటీ ప్రతినిధులు తమ దరఖాస్తులను శుక్రవారం సాయంత్రంలోగా అందజేయాలన్నారు. ఆలయాల లెటర్‌హెడ్ మీద దరఖాస్తులు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి ఆలయ లెటర్, ప్రెసిడెంట్ ఆధార్ కార్డు, టెంపుల్ ఫొటో, టెంపుల్ బ్యాంక్ పాస్ బుక్, ఎంత ఖర్చు పెడుతున్నారో వివరాలు, రెవెన్యూ స్టాంప్ వేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులను ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ రూమ్ నెంబర్: 132 ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల లోపు అందించాలన్నారు. వివరాలకు, తమ దరఖాస్తులు అందజేయడానికి శ్రీనివాస్‌ను ఫోన్: 90632 25046లో సంప్రదించాలన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి



వెంకటేశ్వరకాలనీ: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమమే లక్ష్యంగా చేసిన పోరాటంలో తన ప్రాణాలనే కోల్పోయిన వంగవీటి మోహన రంగా జయంతిని గురువారం బంజారాహిల్స్‌లో ఘనంగా నిర్వహించారు. బ్రహ్మనాయుడు కాపు సంఘం ఆధ్వర్యంలో నేతలు బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని బంజారా భవన్ వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేన్సర్ ఆస్పత్రి వద్ద రోగులు వారి బంధువులకు పండ్లను పంపిణీ చేశారు. దీంతో పాటు 500 మందికి అన్నదానం చేశారు. నేతలు అనిల్‌కుమార్ నాయుడు, సాయి నాయుడు, ఏసుబాబు, సత్యనారాయణ, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ ప్రశాంతం

రహమత్‌నగర్: విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. బోరబండ, రహమత్‌నగర్ డివిజన్‌లలో ఎస్ఎఫ్ఐ జోన్ కార్యదర్శి సునిల్ పవార్ నేతృత్వంలో పాఠశాలలను మూసి వేయించారు. ఈ సందర్భంగా సునిల్ మాట్లాడుతూ... నీట్ అవకతవకలపై కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు పేరిట చేస్తున్న దోపిడీని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కవిత, సచిన్, అంజి, కేశవులు, సీపీఎం నేత శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత అల్లూరి సీతారామరాజు



వెంగళరావునగర్: దేశ స్వాతంత్ర ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు చేసిన సేవలు వెలకట్టలేనివని... నేటి యువతకు స్ఫూర్తిదాయకమని మధురానగర్ కాలనీ నేతలు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చిన్నారులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. చిన్నారి రుషిత నాయుడు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అసోసియేషన్ అధ్యక్షులు కోడె సాంబశివరావు, ఉపాధ్యక్షులు సిహెచ్ఎన్ రాజు, కోశాధికారి ఉప్పలయ్య, ప్రత్యేక ఆహ్వానితులు సత్యనారాయణరాజు, సుబ్బరాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

వెంగళరావునగర్: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని మహిళ వద్ద నుంచి రూ. 4 లక్షలు తీసుకున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు. పోలీసుల సమాచారం మేరకు... విజయవాడకు చెందిన నాగశ్వేత భర్తతో కలిసి వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లో నివాసం ఉంటుంది. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా ఆమె కజిన్ అఖిల్ ద్వారా ఏపీలోని పొన్నూరు ప్రాంతానికి చెందిన హరీష్ కొండబాబు పరిచయం అయ్యాడు. అతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కావాలంటే రూ. 4 లక్షలు చెల్లించాలని ఆమెకు తెలిపాడు. ఆ మాటలు నమ్మిన ఆమె జులై 10న రూ. 4 లక్షలు ముట్టజెప్పింది. హరీష్ ఆమెకు ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 4.45 లక్షలు జీతం ఇస్తున్నట్టుగా చెప్పి ఉద్యోగం ఇప్పించాడు. సదరు కంపెనీలో నాలుగు నెలలు ఉద్యోగం చేసినా సంస్థ నుంచి ఆమెకు ఎలాంటి ఐడీకార్డు, ల్యాప్‌టాప్, ఎలాంటి జీతం ఇవ్వలేదు. దాంతో ఆమె ఉద్యోగం మానేసింది. అనంతరం అతనిని తన డబ్బును తిరిగి ఇవ్వాలని కోరింది. దానికి హరీష్ తన భర్తకు తెలియకుండా ఒక్కదానివే కలిస్తే ఇస్తానని వాట్సప్ కాల్‌లో చెప్పాడు. ఆమె దానిని రికార్డు చేయలేకపోయింది. తన భర్తకు తెలియజేయగా అతని ఫోన కాల్స్ ఎత్తకుండా కట్ చేస్తుంది. ఏడాది గడుస్తున్న తన వద్ద తీసుకున్న నగదు తిరిగి ఇవ్వకపోగా అసభ్యంగా మాట్లాడటంతో గురువారం బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

పాలిటెక్నిక్ అధ్యాపకుడికి డాక్టరేట్

సాక్షి, సిటీబ్యూరో: బడంగ్‌పేట మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న శివర్ల అజయ్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంగ్లిష్ ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ పర్యవేక్షణలో మార్కెటింగ్ మైథాలజీ ఏ స్టడీ ఆఫ్ ది మైథలాజికల్ వర్క్స్ ఆఫ్ అమిష్ త్రిపాఠి, ఆనంద్ నీలకంఠన్ అండ్ దేవదత్ పట్నాయక్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఈ డాక్టరేట్ దక్కింది. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం, నారమ్మగూడెంకు చెందిన అజయ్ వివిధ ప్రధాన పత్రికల్లో సుమారు 10 ఏళ్ల పాటు జర్నలిస్టుగా పనిచేశారు. డాక్టరేట్ రావడంపై కళాశాల ప్రిన్సిపల్ ఎస్. భవాని, హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.ఎస్.రాహుల్, అధ్యాపకులు, కుటుంబసభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు 'మనూ'కు భారత అటార్నీ జనరల్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయానికి శుక్రవారం భారత అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి రానున్నారు. ఈ సందర్భంగా 'మనూ' వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షతన జరిగే 'మనూ' క్యాంపస్‌లోని లా స్కూల్‌లో 'మూట్ కోర్టు'ను అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ప్రారంభిస్తారు. అనంతరం క్యాంపస్‌లోని యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో సాయంత్రం 4 గంటలకు అటార్నీ జనరల్ వెంకటరమణి, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ విలేకరుల సమావేశంలో మాట్లాడతారు.

సామాజిక బాధ్యత నేర్పిన 'అభ్యుదయ్'...



సాక్షి సిటీబ్యూరో: సామాజిక బాధ్యత కలిగిన పారిశ్రామికవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ (ఐఎమ్‌టీ) ఆధ్వర్యంలో నిర్వహించిన అభ్యుదయ్ 2024 గురువారంతో ముగిసింది. ఈ విషయాన్ని ఐఎమ్‌టీ ప్రతినిధులు తెలిపారు. నగరంలో చుట్టుపక్కల ఉన్న నిర్మాణ్ ఫౌండేషన్, బాలవికాస ఫౌండేషన్, నాట్కో ఫౌండేషన్, లెప్రా సొసైటీ, స్వర్ణభారత్ ట్రస్ట్ తదితర స్వచ్ఛంద సేవా సంస్థలను విద్యార్థులు సందర్శించారని, అలాగే కన్హా శాంతివనం వంటి ఆధ్యాత్మిక కేంద్రాలనూ పరిశీలించారని వివరించారు. గత నెల 19న ప్రారంభమైన ఈ ఈవెంట్.. మేనేజ్‌మెంట్ రంగంలో యువతకు ఎదురయ్యే సవాళ్లు, ఎంచుకోవాల్సిన లక్ష్యాలను చేరుకునే విధానాలపై దిశానిర్దేశం చేసిందని నిర్వాహకులు తెలిపారు.

గోల్కొండ బోనాలకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: గోల్కొండ బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం 75 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నగరంలోని వివిధ మార్గాల నుంచి భక్తులు గోల్కొండ కోటకు చేరుకొనేవిధంగా ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. సికింద్రాబాద్, ఈసీఐఎల్, ఉప్పల్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, జీడిమెట్ల, కొండాపూర్, మెహదీపట్నం, చార్మినార్ తదితర ప్రాంతాల నుంచి ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. బస్సుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు మార్గాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ప్రారంభం

– ఐపీసీఏ అధ్యక్షుడు డాక్టర్ బి.పార్థసారథిరెడ్డి



మాట్లాడుతున్న ఐపీసీఏ అధ్యక్షుడు డాక్టర్ బి.పార్థసారథిరెడ్డి

మాదాపూర్: ఫార్మాస్యూటికల్ పరిశోధన, అభివృద్ధిలో తాజా పురోగతిపై దృష్టి సారించే విభిన్న సెషన్లు ఉంటాయని ఐపీసీఏ అధ్యక్షుడు డాక్టర్ బి.పార్థసారథిరెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌కు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో గురువారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎక్స్‌పోలో గ్లోబల్ లీడర్స్, ప్రిక్స్ గెలియన్ అవార్డు గ్రహీతలు, టాప్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీల సీఈవోలు, ప్రొఫెషనల్స్ పాల్గొననున్నట్లు తెలిపారు. పరిశోధన ప్రణాళిక, గణాంక విశ్లేషణ, ఎథిక్స్, స్వయం సాధికారత కోసం మహిళల చొరవ వంటి అంశాలపై దృష్టి సారించిందని తెలిపారు. కార్యక్రమంలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో యూరేత్రా @ ఏఐఎన్‌యూ

లక్డీకాపూల్: దేశంలోనే అతిపెద్ద యూరాలజీ సదస్సు రెండో ఎడిషన్‌ను యూరేత్రా : ఏఐఎన్‌యూ పేరిట నగరంలో నిర్వహించనున్నారు. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక యూరాలజీ సదస్సు దేశంలోని యూరాలజీ రంగంలో ఒక ప్రధాన మైలురాయిగా నిలిచిపోనుంది. ఈ నెల 6, 7 తేదీల్లో జేఆర్‌సీ కన్వెన్షన్ అండ్ ట్రేడ్ ఫెయిర్స్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు యూకే, మెక్సికో, గల్ఫ్ దేశాలు, ఆఫ్రికా, నేపాల్, బంగ్లాదేశ్, ఆగ్నేయాసియా దేశాలతో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి 800 మందికి పైగా యూరాలజిస్టులు హాజరు కానున్నట్లు సదస్సు సహ నిర్వాహకులు యూరోకేర్ ఫౌండేషన్ ప్రతినిధి మల్లిక్ రాజు పూర్ల తెలిపారు.


మూత్రనాళ పునర్నిర్మాణ చికిత్సలు సంక్లిష్టం..

మూత్రనాళ పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు చాలా సంక్లిష్టం యూరాలజిస్టు సీనియర్ కన్సల్టెంట్, ఆండ్రాలజిస్టు డాక్టర్ భవతేజ్ ఎన్‌గంటి తెలిపారు. వీటిలో వైఫల్యాలు కూడా ఎక్కువే. అందువల్ల బాగా శిక్షణ పొందిన, నైపుణ్యం ఉన్న యూరాలజిస్టుల అవసరం బాగా ఎక్కువని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో యూరాలజిస్టులకు మూత్రనాళ పునర్నిర్మాణాలలో కొత్త టెక్నిక్‌ల పట్ల అవగాహన కల్పించి తద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించడమే యూరేత్రా ఏఐఎన్‌యూ సదస్సు ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా 4కె ప్రొజెక్షన్ టెక్నాలజీ ద్వారా అత్యాధునిక శస్త్ర చికిత్స విధానంపై ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశామన్నారు. సదస్సులో పుణెకు చెందిన డాక్టర్ సంజయ్ కులకర్ణి, కోయంబత్తూరుకు చెందిన డాక్టర్ గణేశ్ గోపాలకృష్ణన్ వంటి ప్రముఖ యూరాలజిస్టులతో పాటు ఐఎస్‌బీ హైదరాబాద్ మాజీ డీన్ అజిత్ రంగ్నేకర్ కీలక ప్రసంగాలు చేస్తారని చెప్పారు.

'ఉస్మానియా' కలికితురాయి


- సీపీడీడీఎం ల్యాబ్ ద్వారా పాఠాలు
- ఓయూ విద్యార్థులకు వినూత్న అనుభూతి
- 2009లో త్రీడీ ప్రింటింగ్ యంత్రం అందుబాటులోకి..
- 'రూసా'నిధులతో మరిన్ని యంత్రాలు
- ఎన్‌సీఏఎంతో అవగాహన ఒప్పందం
- ల్యాబ్ ఆవరణలో ఎన్‌సీఏఎం ఏర్పాటు
- పలు స్టార్టప్‌లకు కేంద్రంగా ఎన్‌సీఏఎం

త్రీడీ ప్రింటింగ్‌లో అద్భుతాలు









సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులకు పాఠాలతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎంతో ముఖ్యం. ప్రయోగాత్మకంగా ఎంత రాటుదేలితే అంతే వేగంగా మార్కెట్‌లోని అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా, స్కిల్ వర్కర్లుగా తీర్చిదిద్దేది ప్రయోగశాలలే. ఇక్కడి అనుభవాలే వారి విజయానికి సోపానాలు. అలాంటి అద్భుతమైన ల్యాబ్ ఉస్మానియా యూనివర్సిటీలో ఉంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్యాలు, మెళకువలు నేర్పించడంలో ఈ ల్యాబ్ కీలక పాత్ర పోషిస్తోంది. ఆ ల్యాబ్ పేరే సెంటర్ ఫర్ ప్రొడక్ట్ డిజైన్, డెవలప్‌మెంట్ అండ్ అడిటివ్ మేనేజ్‌మెంట్.

దేశంలోనే తొలిసారిగా..

మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ పాఠాలు ముఖ్యం. ప్రయోగాత్మకంగా పాఠాలు చెప్పాలనే ఉద్దేశంతో 2008లోనే ఈ ల్యాబ్‌లో పౌడర్ సాయంతో త్రీడీ వస్తువులు తయారు చేసే యంత్రాన్ని రూ.1.5 కోట్లతో తెప్పించారు. ఆ తర్వాత రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) నిధులతో 2019లో రూ.6 కోట్లతో సెలెక్టివ్ లేజర్ మెల్టింగ్(ఎస్‌ఎల్‌ఎం) యంత్రాన్ని జర్మనీ నుంచి కొనుగోలు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఐఐటీ వంటి విద్యాసంస్థల్లో మాత్రమే ఉండే ఇలాంటి యంత్రాన్ని ఓ రాష్ట్రస్థాయి వర్సిటీ అప్పట్లోనే తొలిసారిగా కొనుగోలు చేసింది. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్‌గా పనిచేసిన శ్రీరాం వెంకటేశ్ కృషితో ఇది సాధ్యమైంది. ఈ ల్యాబ్‌లో ఉన్న ఎస్ఎల్ఎం, పర్‌మిగా ద్వారా పౌడర్‌తో త్రీడీ వస్తువులను ప్రింట్ చేస్తుంటారు. ఆబ్జెక్ట్ త్రీడీ ప్రో, ఫ్యాబ్ ప్రో 1000, అల్టిమేకర్స్ ఎస్5 ప్రో, ఫ్లాస్‌ఫోర్జ్ ఫైండర్, ఆర్‌టెక్ త్రీడీ స్కానర్ వంటి పరికరాలపై విద్యార్థులు నిరంతరం పరిశోధనలు చేసుకుంటున్నారు.

కృత్రిమ గుండె తయారీ

ఈ ప్రయోగశాలలో పరిశోధక విద్యార్థులు త్రీడీ ప్రింటింగ్ ద్వారా ఎన్నో అద్భుతాలు సృష్టించారు. ముఖ్యంగా కృత్రిమ గుండె, ప్రోస్థెటిక్స్, కపాలం ఎముకలు, గృహోపకరణాలను రూపొందించారు. మెడికల్ రంగంలో ఉపయోగపడే ఎన్నో పరిశోధనలు ఈ ల్యాబ్‌లో జరుగుతున్నాయి. చాలామంది డాక్టర్లు ఇక్కడ తయారైన అవయవాలను తీసుకెళ్లి పరిశోధనలు జరుపుతున్నారు.

డిజిటల్ ఇండియాలో భాగంగా..

కేంద్రం ప్రవేశపెట్టిన డిజిటల్ ఇండియా పథకంలో భాగంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మ్యానుఫ్యాక్చరింగ్(ఎన్‌కామ్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్‌కామ్ కేంద్రాన్ని ఈ ల్యాబ్ ఆవరణలోనే నెలకొల్పారు. దేశంలో ఏడు కేంద్రాలు నెలకొల్పగా.. అందులో ఒకటి ఉస్మానియా వర్సిటీలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ప్రతి సంవత్సరం ఏడెనిమిది స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందిస్తున్నారు. 'మ్యాట్రిక్స్ నానో'తో పాటు మరో స్టార్టప్ ఈ కేంద్రంలో పనిచేస్తున్నాయి.

చాలా అదృష్టంగా భావిస్తున్నా..



ఐదేళ్లుగా ఇదే ల్యాబ్‌లో పరిశోధనలు చేస్తున్నా. ఇక్కడి ల్యాబ్‌లో అనేక వసతులు ఉన్నాయి. ఎన్‌క్యామ్‌తో కలిసి పనిచేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నా. రెండింటితో కలిసి పనిచేయడం ద్వారా చాలా నాలెడ్జ్ పెంచుకున్నా. నా పరిశోధనలకు ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతోంది.

– సాట్ల సిద్ధార్థ చందర్, రీసెర్చ్ స్కాలర్, ఓయూ

విద్యార్థులకు ఎంతో మేలు..



సీపీడీడీఎం ల్యాబ్‌తో విద్యార్థులకు ఎంతో మేలు. ఓయూ విద్యార్థులతో పాటు వేరే కాలేజీల్లోని విద్యార్థులు కూడా ఇక్కడికి వచ్చి చాలా విషయాలు నేర్చుకుంటుంటారు. ఇలాంటి ల్యాబుల్లో పనిచేస్తే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సులువుగా వస్తాయి. ముఖ్యంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో జాబ్ సాధించే అవకాశం ఉంటుంది.

– శ్రీరాం వెంకటేశ్, తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్

అధికార పదవుల్లో కొనసాగినా ఇనాక్‌కు అహం లేదు

ప్రముఖ హాస్యావధాని, జర్నలిస్టు శంకరనారాయణ



మాట్లాడుతున్న శంకరనారాయణ

చిక్కడపల్లి: అహంకారం మనిషిని పతనం చేస్తుందని, అధికార పదవుల్లో కొనసాగినా ఇనాక్‌కు అహం లేదని ప్రముఖ హాస్యావధాని, జర్నలిస్టు శంకరనారాయణ అన్నారు. త్యాగరాయగానసభ నిర్వహణలో ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తాహంలో భాగంగా గురువారం సాయంత్రం నవలా సాహిత్యంపై జరిగిన ప్రసంగ కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ ఇనాక్ సామాజిక చింతనతో రచనలు చేశారన్నారు. 85 సంవత్సరాల వయస్సులోనూ ప్రయోజనకర జీవితాన్ని గడుపుతున్నారని కొనియాడారు. ఆయన నవలలోని కథాంశాలు సామాజిక చైతన్య దీపికలన్నారు. సాహితీ పరిశోధకులు దుగులూరు సురేఖ ఇనాక్ సాహిత్యంపై సోదాహరణ ప్రసంగం చేశారు. త్యాగరాయగానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ప్రముఖులు వెంకటరావు, శ్రావణి, వసుమతి తదితరులు పాల్గొన్నారు.

విశ్వంభర జాతీయ సాహిత్య పురస్కారానికి శివశంకరి

సుల్తాన్‌బజార్: విశ్వంభర డాక్టర్ సి.నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారానికి ఈ సంవత్సరం సుప్రసిద్ధ తమిళ రచయిత్రి ప్రతిష్ఠాకరమైన సరస్వతి సమ్మాన్ పురస్కార గ్రహీత శివశంకరి ఎంపికయ్యారు. పురస్కారం కింద రూ.5 లక్షల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటలకు నగరంలోని రవీంద్రభారతిలో జరిగే డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతి ఉత్సవంలో శివశంకరికి పురస్కారం ప్రదానం చేయనున్నట్లు సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ అధ్యక్షురాలు సి.గంగ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ముఖ్య అతిథిగా, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను విశిష్ట అతిథులుగా ఆహ్వానిస్తున్నట్లు వారు తెలిపారు. చెన్నైకి చెందిన శివశంకరి తమిళంలో 36 సంవత్సరాలు, 48 నవలికలు, 150 కథలు, 15 యాత్రా చరిత్రలు, ఏడు వ్యాస సంపుటాలు, 4 పరిశోధన గ్రంథాలు, రెండు జీవిత చరిత్రలు రచించారు.

సాగర్ అలలపై.. సెయిలింగ్ వీక్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో జరుగుతున్న 38వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌లో నావికులు అత్యుత్తమ నైపుణ్యం కనబర్చారు. 2వ రోజు పోటీల్లో భాగంగా గురువారం అన్ని కేటగిరీల్లో 4, 5, 6వ రేసులను పూర్తి చేశారు. హుస్సేన్ సాగర్‌లో జరుగుతున్న సెయిలింగ్ పోటీలకు 14 నుంచి 21 నాట్ల వరకు వీస్తున్న బలమైన గాలులు అడ్డుకుంటున్నప్పటికీ నావికులు ప్రతికూలతలను అధిగమిస్తూ రేసులు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఐఎల్‌సీఏ 7 విభాగంలో 4, 5, 6 రేసుల్లో మోహిత్ సైనీ, ఐఎల్‌సీఏ 6 (ఓపెన్)లో 4, 6 రేసుల్లో రితికా డాంగి, 5వ రేసులో బిక్రమ్ మహాపాత్ర, ఐఎల్‌సీఏ 6(మహిళా విభాగం)లో 4, 6 రేసుల్లో రితికా డాంగి, 5వ రేసులో లావేటి ధరణి, లో రామ్ మిలన్, 470 క్లాస్ మిక్స్‌లో శ్రద్ధా వర్మ – ఆర్ కె.శర్మ విజేతలుగా నిలిచారు.

నేడు గ్రేటర్ బీఆర్ఎస్ నేతలతో కేటీఆర్ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శనివారం జరగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పార్టీ నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో జీహెచ్ఎంసీలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు పాల్గొననున్నారు. కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై కేటీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

బీఆర్ఎస్ నుంచి మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సిల్‌లో ప్రజల తరపున బీఆర్ఎస్ వాణిని వినిపించేందుకు అనుసరించాల్సిన వ్యూహం, తదితరమైనవి వివరించనున్నట్లు సమాచారం.

నేడు ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ కామర్స్ (ఎఫ్‌టీసీసీఐ) అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం ఘనంగా జరగనుంది. దీనికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఫెడరేషన్ హౌజ్‌లోని కేఎల్ఎన్ ఆడిటోరియంలో సాయంత్రం 5 గంటలకు జరగనుంది. 21 విభాగాల్లో అవార్డులు అందజేయనున్నారు. చాంబర్ ప్రెసిడెంట్ మీల జయదేవ్, వైస్ ప్రెసిడెంట్ సురేశ్ కుమార్ సింఘాల్, ఎక్సలెన్స్ అవార్డ్స్ కమిటీ చైర్‌పర్సన్ కరుణేంద్ర ఎస్ జాస్తి పాల్గొంటారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

అత్తాపూర్: ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటాను అంటూ ఓ మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి ప్రాంతానికి చెందిన మైనర్ బాలికను ఇంటికి సమీపంలో నివసించే యువకుడు మాయమాటలతో లోబర్చుకున్నాడు. అనంతరం లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అత్యాధునిక సాంకేతికతతో ఎకో బూస్టర్



లక్డీకాపూల్: ఆధునాతన వ్యవసాయానికి దారితీసే సరికొత్త ఆవిష్కరణలను గ్రోవేర్ టెక్నాలజీస్ ప్రారంభించినట్లు సంస్థ స్ట్రాటజిక్ మార్కెటింగ్ మేనేజర్ తరుణ్ పాంటా తెలిపారు. రీమాజిన్డ్ ఫార్మింగ్ అనే నినాదంతో కొత్త పద్ధతులను అందుబాటులోకి తెచ్చామన్నారు. హైటెక్‌సిటీ పత్రిక నగరంలోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం, పర్యావరణ రంగాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఎకో బూస్టర్ విధానం దోహదపడుతుందన్నారు. దాంతో పాటు పొలాల్లో నీటి అవసరాన్ని 50 శాతం మేరకు ఆదా చేసే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ఇన్నోవేషన్ టెక్నాలజీస్ వాతావరణంలోని తేమను కూడా గ్రహిస్తుందన్నారు. అంతేగాకుండా వ్యవసాయ ఖర్చును ఆదా చేయడంతో పాటు పర్యావరణ వ్యవస్థలో రసాయనాల అదనపు భారాన్ని కూడా తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రోవెరో టెక్నాలజీస్ డైరెక్టర్ శ్రీకాంత్, సురేష్ వేముల, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎండీ దేవేంద్ర దాసరి, సీఈఓ నవదీప్ మెహతా, పున్న భాస్కర్, అనిల్ వర్మ, ధనరాజ్ అగర్వాల్, ఉదయకృష్ణ సుంకర తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను రద్దు చేయాలి

- పరీక్షలు నిర్వహించుకునే అధికారం రాష్ట్రాలకు ఇవ్వాలి
- కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలి
- కాచిగూడలో విద్యార్థి, యువజన సంఘాల ర్యాలీ



ర్యాలీలో విద్యార్థి సంఘాల నేతలు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు తదితరులు

కాచిగూడ: నీట్ పేపర్ లీకేజీను నిరసిస్తూ దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ సందర్భంగా విద్యార్థి యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కాచిగూడలో విద్యార్థులు, యువత భారీ ర్యాలీ నిర్వహించారు. బర్కత్‌పుర చౌరస్తా నుంచి నారాయణగూడ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నేతలు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఆర్ఎల్ మూర్తి, టి.నాగరాజు(ఎస్ఎఫ్ఐ), కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, ఎండి జావేద్(డీవైఎఫ్ఐ), పుట్టా లక్ష్మణ్ (ఏఐఎస్ఎఫ్), మహేష్, నాగేశ్వర్‌రావు, పి.రామకృష్ణ (పీడీఎస్‌యూ), వలి ఉల్లాఖాద్రి, ధర్మేంద్ర(ఏఐవైఎఫ్), ఏఎస్.ప్రదీప్(పీవైఎల్) మాట్లాడుతూ నీట్ ఎగ్జామ్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, పేపర్ లీకులకు కారణమైన ఎన్‌టీఏను రద్దుచేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు నిర్వహించుకునే అధికారం రాష్ట్రాలకు ఇవ్వాలన్నారు. లీకేజీలపై సీబీఐతో కాకుండా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు స్పందించకుంటే అడుగడుగునా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. నీట్ కౌన్సెలింగ్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, యువజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు నగరంలో విద్యా సంస్థల బంద్ పూర్తి సంపూర్ణంగా జరిగిందన్నారు. ఎం.మమత, కె.అశోక్‌రెడ్డి, లెనిన్, రమేష్, రవినాయక్, రమ్య, భావన, గ్యార నరేష్, క్రాంతి, రెహమాన్, చైతన్య, గడ్డం శ్యామ్, కె.శ్రీనివాస్, గౌతమ్, ఆసిఫ్, గణేష్, రాకేష్, శ్రీహరి, శ్రీను, వెంకటేష్, హస్మిబాబు, శ్రీకాంత్, బాలకృష్ణ, మజీద్, అనిల్, కళ్యాణ్, కృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య ఆలోచనా విధానం ఆదర్శనీయం



హరిప్రియ, షణ్ముక ప్రియలకు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తూ..

రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

గన్‌ఫౌండ్రీ: దివంగత మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, నేటికీ ఆయన ఆలోచన విధానాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రవీంద్రభారతిలో శ్రీవాసవి ఆర్ట్స్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య 91వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసులు హరిప్రియ, షణ్ముకప్రియలకు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కె.రోశయ్యతో కలిసి పనిచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో కలిసి పనిచేసిన కాలంలో ఆర్థికపరమైన క్రమశిక్షణను నేర్చుకున్నట్లు వెల్లడించారు. అంతకుముందు ప్రియ సిస్టర్స్ సంగీత గాత్ర కచేరి సమ్మోహన పరిచింది. కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు కోటి, మాజీ పార్లమెంట్ సభ్యులు కేవీపీ.రాంచంద్రరావు, ఏపీ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, తెలంగాణ పోలీస్ హౌసింగ్ మాజీ చైర్మన్ కె.దామోదర్‌గుప్తా, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, రోశయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్స్ కోసం 'ఎస్కీ'లో అనేక కోర్సులు

– 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు

రాయదుర్గం: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థుల కోసం గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అనేక కోర్సులను అందుబాటులో ఉంచినట్లు 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు గురువారం 'సాక్షి'కి గచ్చిబౌలిలో వివరించారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవనంలో ఎస్కీ స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ స్టడీస్‌కు సంబంధించిన ఒక కౌంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్కీలో రెండేళ్ల వ్యవధి గల పోస్టుగాడ్యుయేట్ డిప్లొమో ఇన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, పోస్టుగాడ్యుయేట్ డిప్లొమో ఇన్ ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో 2024–26 కోసం అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. ఈ కోర్సుల్లో చేరడానికి కట్టాల్సిన ఫీజు, వసతుల కోసం గచ్చిబౌలిలోని క్యాంపస్‌కు వచ్చే బదులు విశ్వేశ్వరయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవనంలోని కౌంటర్‌లో సంప్రదిస్తే సరిపోతుందన్నారు. ఈ కోర్సులే కాకుండా ఇతర కోర్సులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. ఈ కౌంటర్ రెండు నెలల పాటు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామన్నారు. అంతేగాకుండా స్వల్పకాలిక కోర్సులు ఏడాది కాలపరిమితితో కూడినవి కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ కోర్సులకు సంబంధించిన బ్రోచర్‌ను కూడా ఆవిష్కరించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఈ కోర్సులను ప్రారంభించామన్నారు.

శిక్షణ పొందిన మహిళలు



'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో..

సాక్షి మైత్రి మహిళ

బ్యూటీ కోర్సులో శిక్షణ

బంజారాహిల్స్: చిన్న శుభకార్యం నుంచి వివాహ వేడుకల వరకు నలుగురిలో ప్రత్యేకంగా కనిపించేందుకు మహిళలు ఆరాట పడుతుంటారు. అందుకు పది రోజుల ముందు నుంచే దగ్గరలోని బ్యూటీపార్లర్‌కు వెళ్తుంటారు. అయితే ప్రతి మహిళా సొంతంగా బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటే ఖర్చుతో పాటు సమయం ఆదా అవుతుంది. అలాగే ఉపాధి సైతం పొందవచ్చు. అలాంటి మహిళల కోసం 'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు నేర్చుకునేందుకు అవకాశం కల్పించింది. బంజారాహిల్స్ 'సాక్షి' ఆఫీస్ వద్ద నెల రోజులపాటు బ్యూటీషియన్ కోర్సులో మహిళలు, యువతులకు శిక్షణ ఇచ్చారు. కార్పొరేట్ బ్యూటీపార్లర్లకు తీసిపోని విధంగా 'సాక్షి' మైత్రి మహిళా ఆధ్వర్యంలో బ్యూటీషియన్ ఫ్యాకల్టీ నేరెల్ల మాలతి అందించిన శిక్షణ గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమములో బ్యూటీషియన్ ఫ్యాకల్టీ నేరెల్ల మాలతి శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.

'సాక్షి' మంచి కార్యక్రమం చేపట్టింది



మహిళలకు ఎంతగానో ఉపయోగపడే మంచి కార్యక్రమం. బ్యూటీషియన్ శిక్షణతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. మమ్మల్ని ఇందులో భాగస్వాములు చేయడం సంతోషం. తక్కువ ఖర్చుతో 'సాక్షి' అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు.

– నేరెల్ల మాలతి, బ్యూటీషియన్ ఫ్యాకల్టీ

ఇంట్లోనే మేకప్ వేసుకోవచ్చు



గతంలో సాధారణ మేకప్‌తోనే సరిపెట్టుకునేవాళ్లం. కొన్నిసార్లు బ్యూటీపార్లర్‌కు వెళ్లాం. ఇక నుంచి సొంతంగా తమకు తాముగా మేకప్ వేసుకోగలం. ఇంటి వద్దే తక్కువ సమయంలో అందంగా తయారవ్వొచ్చు. – స్రవంతి

సులువుగా నేర్చుకున్నాం



ఈ శిక్షణ కార్యక్రమంలో వివిధ రకాల మేకప్‌లను సులువుగా చేయడం ఎలాగో తెలుసుకున్నాం. 'సాక్షి' మైత్రి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది. – రోజా

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్‌,
శుక్రవారం, 5, జూలై, 2024



ఆదాయం కన్నా

అభిరుచిగానే మిన్న..

మ్యూజిక్‌ కెరీర్‌పై శాస్త్రీయ గాయనీమణులు ప్రియా సిస్టర్స్‌

సాక్షి, సిటీబ్యూరో: 'సంగీతంలో రాణించాలని అనుకోవడం మంచిదే. అయితే అదే సమయంలో చదువును ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు' అంటున్నారు ప్రియా సిస్టర్స్‌. ఉన్నత చదువులు చదివి ఆ తర్వాత శాస్త్రీయ సంగీతంలో లబ్ధప్రతిష్ఠులుగా పేరొందిన అచ్చతెలుగు అక్కా చెల్లెళ్లు హరిప్రియ, షణ్ముఖ ప్రియలు వేల సంఖ్యలో కచేరీలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురంలో పుట్టి అద్భుతమైన గానామృతాన్ని పంచుతూ అంతర్జాతీయ స్థాయిలో తెలుగు మహిళ ప్రతిభను చాటారు. శ్రీ వాసవీ ఆర్ట్స్‌ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రతినిధితో సంభాషించారు. ఆ విశేషాలు వారి మాటల్లోనే...

జన్మ ధన్యమైన సందర్భాలెన్నో..

'జీవనసాఫల్య పురస్కారం అందుకుంటున్న సందర్భంగా మా జీవితం ధన్యమైంది అనకున్న సందర్భాలను మననం చేసుకోవాలంటే ఎన్నో ఉన్నాయి.. పుట్టపర్తి సాయిబాబా గారి ముందు కచేరీ నిర్వహించడమే కల సాకారం అవడం అనుకుంటే, కచేరీ ముగిశాక మరోసారి ఓ కీర్తన ఆలపించమంటూ ప్రత్యేకంగా అడగడం... అలాగే శాస్త్రీయ సంగీతంలో వశిష్ఠుడు అని చెప్పదగ్గ స్వర్గీయ సుబ్బుడు (పి.వి.సుబ్రహ్మణ్యం)... మా సిస్టర్స్‌ని అనేక రకాలుగా ప్రశంసిస్తూ.. ట్రాన్సిస్టర్స్‌ అంటూ గొప్పగా అభివర్ణించడం... కంచి పరమాచార్య గారిని వ్యక్తిగతంగా కలిసి ఆయన ముందు పాడడం, ఆయన ప్రసాదం ఇవ్వడం...ఇలాంటివెన్నో ఉన్నాయి. ఇంకా జన్మ ధన్యం కావాల్సిన సందర్భాలు ఎన్నో రానున్నాయనే అనుకుంటాం'.

నా మనసు పాటనే ఎంచుకుంది..


నేను (హరిప్రియ) చిన్న వయసులో క్రికెటర్‌గా జిల్లా రాష్ట్ర స్థాయిలో కూడా ఆడాననేది నిజమే. అలాగే మరోవైపు శాస్త్రీయ సంగీతంలోనూ రాణిస్తున్న ఆ సమయంలో ఏ రంగం ఎంచుకోవాలి? అనే ప్రశ్న వేసుకున్నప్పుడు నా మనసు పాట వైపే మొగ్గింది. నేడు మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరగడం చూస్తున్నా...అది ఆనందాన్నిస్తోంది. నా చిన్నప్పుడు ఇలాంటి పరిస్థితే ఉన్నా సంగీతాన్నే కెరీర్‌గా ఎంచుకునేదాన్ని తప్ప క్రికెట్‌ను కాదనేది నిజం.

సినిమా తాపత్రయం లేదు...

శాస్త్రీయ సంగీతానికి తనదైన ప్రత్యేకత ఉంది. దానికే పరిమితమైన మేం సినిమా సంగీతంతో మమేకం కాలేదు.. కాలేం కూడా. మూడు నాలుగు సినిమాల్లో పాటలు పాడామంటే ఆయా సినిమాల రూపకర్తలకు ఆ పాటకు మా గాత్రం నప్పుతుందని మమ్మల్ని సంప్రదించడం వల్లే తప్ప సినిమా అవకాశాల గురించి మేం ఎప్పుడూ ఆలోచించలేదు. ఇక సినిమా నటన గురించి అంటే... చాలాకాలం క్రితం కె.బాలచందర్‌ గారు నన్ను (హరిప్రియ) సింధుభైరవి సీక్వెల్‌ సినిమా తీస్తున్న సందర్భంలో ఓ పాత్రకు అడిగారు. అయితే ఎందుకో అది కుదరలేదు.

పాపులారిటీ సరే... లాంగ్విటీ కూడా అవసరమే...

సాంకేతిక విప్లవం పుణ్యమాని పాపులారిటీ కోసం ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన అవసరం లేదు. అయితే షార్ట్‌ టర్మ్‌ పాపులారిటీ కన్నా దీర్ఘకాలం పాటు నిరూపించుకునే స్థిరత్వం ముఖ్యం. ప్రస్తుతం యువ కళాకారులకు శిక్షణ ఇస్తున్నాం. 2, 3 ఏళ్లలో అకాడమీని స్థాపించాలని అనుకుంటున్నాం. మా పిల్లల్లో ఎవరూ మా వారసులుగా రావాలని అనుకోవడం లేదు. మేం ఒత్తిడి చేయడం లేదు. మా చివరి శ్వాస వరకూ కచేరీలు ఇస్తూనే ఉండాలి.. భావి తరాలకు శాస్త్రీయ సంగీతం పంచాలని తప్ప...వేరే కలలు, లక్ష్యాలు అంటూ ఏమీ లేవు.





ఏ చాయ్‌ చటుక్కున తాగరా భాయ్‌
ఈ చాయ్‌ చమక్కులే చూడరా భాయ్‌
ఏ చాయ్‌ ఖరీదులో చీపురా భాయ్‌
ఈ చాయ్‌ ఖుషీలనే చూపురా భాయ్‌
ఏ చాయ్‌ గరీబుకు విందురా భాయ్‌
ఈ చాయ్‌ నవాబుకి
బంధువే నోయ్‌
ఏ చాయ్‌
మనస్సుకీ
మందురా
భాయ్‌

నగరంలో విస్తరిస్తున్న చాయ్‌ కేఫ్స్‌

అందుబాటులో రకరకాల టీలు

Chai చమక్‌

425 రకాలకు కేరాఫ్‌గా భవాని కాఫీ వరల్డ్‌

వెరై 'టీ', టేస్టీ కాఫీలకు అడ్రస్‌గా హట్‌-99

చంద్రబోస్‌ రాసిన ఈ పాట మనందరికీ సుపరిచితమే.. ఈ పాటలో పేర్కొన్నట్లే.. మార్కెట్‌లో అనేక రకాల టీలు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు నగరంలో చాయ్‌ ప్రియులు కూడా అంతకంతకూ పెరుగుతూనే ఉన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని చాయ్‌ కేఫ్‌లు కూడా భారీగా విస్తరిస్తున్నారు. అయితే చాలాచోట్ల సాధారణ చాయ్‌ మాత్రమే అందుబాటులో ఉంటుంది. కానీ రొటీన్‌కు భిన్నంగా కొన్ని చాయ్‌ కేఫ్‌లలో పదుల సంఖ్యలో వెరైటీలను అందుబాటులో ఉంచుతున్నారు. సరిగ్గా ఇదే కాన్సెప్ట్‌తో నగరంలోని దిల్‌సుఖ్‌నగర్‌ చైతన్యపురిలోని భవానీ కాఫీ వరల్డ్‌లో దాదాపు 425 రకాల చాయ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆ వివరాలేంటో తెలుసుకుందాం..

- చైతన్యపురి

తేనీరు (టీ, కాఫీ) అంటే ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఉదయం నిద్ర లేవగానే దాదాపు ప్రతి ఒక్కరూ వేడి వేడి టీ ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తుంటారు. కొందరు కాఫీ ఇష్టపడితే... మరికొందరు టీ అంటూ మంచడం మీద నుంచే కేకలు పెడుతుంటారు. అంతేకాదు.. ఇంటి నుంచి బయటకు వెళ్లి పనిచేసి అలసిపోయే వారికీ కొంచెం టీ తాగితే బాగుండనే కోరిక కలుగుతుంది. అందుకే నగరంలో అనేక చాయ్‌ స్టాళ్లు, కేఫ్‌లు నడుస్తున్నాయంటే ఆశ్చర్యపడనక్కర్లేదు. అయితే ప్రతి చోటా మామూలుగా రొటీన్‌ టీ.. కాఫీలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. దీంతోనే సరిపెట్టుకుంటాం...
అదే రకరకాల రుచులతో వివిధ రకాల కాఫీ, చాయ్‌లు అందుబాటులో ఉంటే ఎలా ఉంటదో ఒక సారి ఆలోచించండి. అలాంటి వెరైటీ కోరుకునే వారికోసమే ఈ విశేషాలు..

425 రకాల తేనీటి రుచులు..

దిల్‌సుఖ్‌నగర్‌ చైతన్యపురిలోని సాయినగర్‌ శివాజీచౌక్‌లో 'భవాని కాఫీ వరల్డ్‌ హట్‌–99' పేరుతో సమారు 425 రకాల కాఫీ, టీ, ఇతర తేయాకుతో తయారు చేసే తేనీటి రుచులు నగరవాసులను అలరిస్తున్నాయి. ఒక్కసారి రుచి చూస్తే మళ్లీ మళ్లీ తాగాలనుకునేలా నోరూరించే తేనీరు అందిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటూ స్థానికుల మన్ననలు అందుకుంటున్నారు.

బ్లాక్‌ కాఫీలో 50 రకాలు, బ్లాక్‌టీలో 50 రకాల రుచులు, కల్చర్‌ ఆఫ్‌ ది వరల్డ్‌కు చెందిన 72 రకాల టీ, కాఫీలు తేనీటి ప్రియులకు అందిస్తున్నారు. ఇవే కాక డేవిడ్‌ ఆఫ్‌ కాఫీ, హనీ, డ్రై ఫ్రూట్‌, మిల్క్‌,

ఫిఫ్టీ, ఫిఫ్టీ వెరైటీస్‌..

హెర్బల్‌, హనీగ్రీన్‌ టీ, ఆమ్లా గ్రీన్‌ టీ, సొంటి, మసాలా చాయ్‌, షుగర్‌లెస్‌లో వివిధ రకాల టీ, కాఫీలు, క్యాపిచినో, జెమని అరోమా, స్పెషల్‌ చాయ్‌లు ఆర్డర్‌ ఇచ్చిన క్షణాల్లో అందించటం వారి ప్రత్యేకత.



ఎనిమిది సంవత్సరాలుగా..



చైతన్యపురిలోని భవాని కాఫీ వరల్డ్‌ హట్‌–99 స్టాల్‌కు ఎనిమిది సంవత్సరాలుగా వస్తున్నాను. ఆఫీసులో విధులు ప్రారంభించే ముందు, లంచ్‌ తరువాత, సాయంత్రం ఇంటికెళ్లే ముందు ఇక్కడ టీ తాగటం అలవాటు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ రుచిలో తేడా లేదు. ఇక్కడ టీ తాగితే అదొక రిలీఫ్‌.

– ఎస్‌.వృద్ధి, ప్రయివేటు ఉద్యోగి

ప్రముఖులు సైతం కస్టమర్సే..

చైతన్యపురి ప్రాంతంలో 19 సంవత్సరాల క్రితం భవాని కాఫీ హట్‌–99 పేరుతో టీ స్టాల్‌ ప్రారంభించాం. ప్రస్తుతం నిత్యం వెయ్యి మందికి పైగా టీ, కాఫీ ప్రియులు వస్తుంటారు. వారడిగింది, వారికి ఇష్టమైంది ఏదైనా క్షణాల్లో తయారు చేసి వారికి అందిస్తామన్నారు. ప్రస్తుతం 425 రకాల టీ, కాఫీలు అందుబాటులో ఉన్నాయి. టీ కల్చర్‌ ఆఫ్‌ వరల్డ్‌కు సంబంధించిన 72 రకాల తేనీరు అందిస్తున్నాం. ఎక్కువగా గ్రీన్‌, బ్లాక్‌, హనీటీలతో పాటు అల్లం పుదీన, బాదం, షుగర్‌లెస్‌, ఇలాచి, స్పెషల్‌, మసాలా చాయ్‌లు తేనీటి ప్రియులు ఇష్టపడి తాగుతారు. గతంలో గాయని గీతా మాధురి, నందు దంపతులు వారానికి ఒకసారి వచ్చి టీ, కాఫీ తాగి వెళ్లేవారు. దిల్‌సుఖ్‌నగర్‌, చైతన్యపురి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా నగరంలోని పలు ప్రాంతాల నుంచి తేనీటి ప్రియులు ఇక్కడికి వస్తుంటారు.

– వెంకటరమణారెడ్డి, నిర్వాహకులు, భవాని కాఫీ వరల్డ్‌ హట్‌–99

ప్రపంచ ప్రసిద్ధి చెందిన రకాలు..

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన డేవిడ్‌ ఆఫ్‌ జర్మని, అరకు కాఫీ, టీలు, ఆర్గానిక్‌ ఇండియా, ట్విన్నింగ్‌ ఆఫ్‌ లండన్‌, శ్రీలంక దిల్మా, గ్రీస్మట్‌ హిమాలయ, జీ హైపోతో పాటు ఆరోగ్యానికి సంబంధించిన హెయిర్‌ గెయిన్‌, స్కిన్‌ గ్లో వంటి టీ రకాలు, వెయిట్‌ లాస్‌ కిక్‌ స్టార్ట్‌, కూల్‌ మడౌన్‌, ఫ్రూట్‌ బూస్టర్‌ ఇలా అనేక రకాల కాఫీలు, చాయ్‌లు అందిస్తున్నామని 'భవాని కాఫీ వరల్డ్‌ హట్‌–99' వెంకటరమణారెడ్డి, రమాదేవి దంపతులు



నగరంలో కొత్తగా ఇల్లు కట్టుకునే వారు ప్రస్తుతం మార్కెట్‌లో న్యూ ట్రెండ్‌ ఏం నడుస్తుందని ఇంటర్నెట్‌లో శోధిస్తున్నారు. దేశ, విదేశాల్లో అందుబాటులో ఉన్న ఆధునిక హంగులపై ఆరా తీస్తున్నారు. తమ అభిరుచులకు తగ్గట్లు వస్తువులను ఆర్డర్‌ చేస్తున్నారు. ఈ క్రమంలోనే కిటికీలు, తలుపులు, గోడలు, బెడ్రూంలో సరికొత్త డిజైన్లు దర్శనమిస్తున్నాయి. కొంత కాలంగా నచ్చిన సీనరీ, చిత్రాలను గోడలకు, విండోస్‌కు స్టిక్కర్‌ అతికించే పద్ధతి కొనసాగుతోంది. ఇటీవల మరింత అప్‌గ్రేడ్‌ అయ్యారు. త్రీడీ టెక్నాలజీ ఆ స్థానాన్ని భర్తీ చేస్తోంది. కస్టమైజ్‌ బ్లైండ్స్‌, జీబ్రా బ్లైండ్స్‌, ఉడెన్‌ బ్లైండ్స్‌, పీవీసీ బ్లైండ్స్‌, రోలర్‌ బ్లైండ్స్‌ అందుబాటులోకి వచ్చాయి. స్థాయిని బట్టి కనీసం రూ.200 (ఒక అడుగు) నుంచి గరిష్టంగా రూ.500 వరకు అందుబాటులో ఉన్నాయి. సాధారణంగా ఇంట్లోకి రూమల్‌ బ్లైండ్స్‌ను ఫ్యాబ్రిక్‌తో తయారు చేస్తున్నారు. కిటికీలు, డోర్లకు పీవీసీ బ్లైండ్స్‌ వినియోగిస్తున్నారు. ఇంటి యజమాని అభిరుచికి తగ్గట్లు చిత్రాలతో అందుబాటులోకి తెస్తున్నారు. పెద్ద పెద్ద కార్పొరేట్‌ ఆఫీసుల్లో మాత్రం సంస్థ లోగో, చేసే పనికి సంబంధించిన థీం చిత్రాలను త్రీడీ టెక్నాలజీలో అనుభూతి పొందుతున్నారు.

- నగరవాసుల అభిరుచిలో మార్పులు
- మనసును హత్తుకునే డిజైన్లు
- చూసేవారు ఔరా అనాల్సిందే
- వేడుకల్లోనూ డెకరేషన్‌.. అదిరెన్‌..





ఇప్పటి వరకు మనం థియేటర్‌లో త్రీడీ సినిమాలు చూసి ఉండొచ్చు.. కానీ ఇంట్లో కూర్చుని త్రీడీ కిటికీలు ఎప్పుడైనా చూశారా? పడక గదిలో నక్షత్ర మండలాన్ని చూశారా? అత్యాధునిక టెక్నాలజీతో ప్రస్తుతం మార్కెట్‌లోకి త్రీడీ కిటికీలు, తలుపులు, నక్షత్ర మండలం.. ఇలా చాలా అందుబాటులోకి వచ్చాయి. త్రీడీలో సినిమా చూసి అద్భుతమైన అనుభూతిని పొందుతాం. అదే ఇంట్లో త్రీడీ కిటికీలు ఉంటే.. తలుపులు ఉంటే.. నక్షత్రాలు బెడ్రూంలో దర్శనమిస్తే.. ఈ ఊహే మనసును ఎంతో ఉల్లాసపరిచేది ఉంటుంది. డిజిటల్‌ ప్రింటింగ్‌ అరంగ్రేటంతో ప్రతీ దృశ్యం మన కళ్ల ముందే ఉన్నట్లుగా ఉంటుంది. మనకు తెలియని కొత్తప్రపంచాన్ని పరిచయం చేస్తున్నట్లు ఉంటుంది. ఇంట్లో కూర్చుని పచ్చని అటవీ అందాలు వీక్షించవచ్చు. సొగసైన జలపాతాలు చూడవచ్చు. క్రికెట్‌ స్టేడియంలో ఉన్నట్లు ఫీలు కావచ్చు. గోడలపై బీచ్‌ రోడ్డు పక్కనే ఉన్న కొబ్బరిచెట్లు పెరుగుతున్నట్లు అనిపించవచ్చు.

– సాక్షి, సిటీ బ్యూరో

త్రీడీ.. ట్రెండీ

ఇంటి డోర్‌, కిటికీ, గోడలకు ఆధునిక హంగులు



రిలాక్స్‌.. రిలాక్స్‌

నగరంలో సగటు వ్యక్తులు ఉద్యోగం, వ్యాపారం, ఇతర పనులతో బిజీబిజీగా గడిపేస్తున్నారు. ఇంటికి వచ్చిన తర్వాత మనసుకు ఆహ్లాదకరమైన ప్రదేశంలో కూర్చుని అలా రిలాక్స్‌ అవుతున్నారు. ఒత్తిడి నుంచి ఒక్కసారిగా ప్రకృతి ఒడిలోకి ఒదిగిపోయి నట్లు ఫీల్‌ అవుతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో సమయం గడిపేస్తున్నారు. త్రీడీ టెక్నాలజీ ఎంత బాగుందో కదా.

వేడుకల్లోనూ ఆ సోయగాలే..

త్రీడీ తెరలతో చాలా మంది వేడుకల్ని సైతం సింపుల్‌గా కానిచ్చేస్తున్నారు. ముఖ్యంగా ఓ గంట ఫంక్షన్‌కి పూలు, అలంకరణ అంటే అంత ఖర్చు ఎందుకు దండగ అనుకుని త్రీడీ బ్యాక్‌డ్రాప్‌ స్క్రీన్స్‌ కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఒక దఫా కొంటే తర్వాత ఎప్పుడు కావాలంటే అప్పుడు వాడుకోవచ్చు. డెకరేటర్లు చేసిన వేదికల ఫొటోలను యథాతథంగా తెరమీదకి తెచ్చేస్తోంది. దీంతో అలంకరణ ఖర్చు తగ్గుతోంది. పూలు లేకుండానే ఫొటోల్లో పూల అలంకరణ కనిపించేస్తుంది. త్రీడీ మాయతో కనువిందు చేస్తున్నాయి.

అప్‌గ్రేడ్‌ అవుతున్నారు



నగరంలో ఒకే మోడల్‌ ఎక్కువ రోజులు వినియోగంలో ఉండదు. మారుతున్న కాలంతో పాటే ఇక్కడి ప్రజల అభిరుచులు మారుతున్నాయి. వాల్‌కి అతికించే ఇమేజ్‌ల నుంచి ప్రస్తుతం త్రీడీ టెక్నాలజీ వరకు ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్‌ అవుతున్నారు.

– దీపక్‌, డిజైన్‌ వాల్స్‌, మియాపూర్‌



లామాకాన్‌లో ఒలక్‌లంత్‌ కా సర్‌

కళలు, సాహిత్యం, థియేటర్‌కు వేదికైన లామకాన్‌లో 'ఒలక్‌లంత్‌ కా సర్‌' అనే మరాఠీ థియేటర్‌ ప్లే శుక్రవారం ప్రదర్శితమవ్వనుంది. రాత్రి 8 గంటలకు ప్రారంభమై గంట పాటు సాగనుంది. ఇందులో సౌరభ్‌ ఘరీపురీకర్‌, అదితీ ఇనామ్‌దార్‌ ప్రధాన పాత్రలు పోషించనున్నారు. ఈ ప్లేను యోగేశ్‌ సోమన్‌ రచించగ, సౌరభ్‌ ఘరీపురీకర్‌ దర్శకత్వం వహించనున్నారు. సౌరభ్‌ జోషి సంగీతం అందించనున్నారు.

15 నుంచి కుంగ్‌ ఫూ పాండా-4



మైక్‌ మిచెల్‌, స్టెఫానీ స్టైన్‌ దర్శకత్వం వహించిన ఈ యానిమేటెడ్‌ సంచలనం కుంగ్‌ ఫూ పాండా 4వ భాగం రానుంది. నగరంలోని చిన్నారులను, టీనేజర్లతో పాటు యానిమేషన్‌ చిత్రాలను ఇష్టపడే ప్రతి ఒక్కరినీ అలరించే సాహస దృశ్యాలు, అలాగే సునిశిత హాస్యంతో కూడిన ఈ చిత్రం... ఈ నెల15న జియో సినిమా ప్రీమియమ్‌లో ప్రసారం కానుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ డ్రాగన్‌ వారియర్‌ ఇంగ్లిష్‌, హిందీతో పాటు, తెలుగు, తమిళం తదితర ప్రాంతీయ భాషల్లోనూ అలరించనుందని వివరించారు.

జాగిల్‌ ఫిన్‌టెక్‌ లీడర్‌ ఆఫ్‌ ద ఇయర్‌..

మాదాపూర్‌లోని జాగిల్‌ ప్రీపెయిడ్‌ ఓషన్‌ సర్వీసెస్‌ లిమిటెడ్‌ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్‌ ఛైర్మన్‌ రాజ్‌ ఎన్‌కు ప్రతిష్టాత్మకమైన 'ఫిన్‌టెక్‌ లీడర్‌ ఆఫ్‌ ది ఇయర్‌' అవార్డు లభించింది. వినూత్న శైలి సామర్థ్య నిర్వహణతో ఫిన్‌టెక్‌ పరిశ్రమాభివృద్ధికి తోడ్పడినందుకు అవార్డు లభించిందని జాగిల్‌ సంస్థ ప్రతినిధులు తెలిపారు. టెక్నాలజీ, మార్కెటింగ్‌, ఫైనాన్స్‌, లీగల్‌తో సహా క్రాస్‌-ఫంక్షనల్‌ టీమ్‌లతో కలిసి పని చేయడం ద్వారా బహుళ వ్యాపార కార్యక్రమాలను అమలు చేయగల సామర్థ్యానికి ప్రశంసగా.. ఇటీవల నిర్వహించిన ఫెస్టివల్‌ ఆఫ్‌ ఫిన్‌టెక్‌ కాక్లేవ్‌-అవార్డ్స్‌ 2024లో ఈ పురస్కారం దక్కిందని వివరించారు.

‘విభజన’ కొలిక్కి వచ్చేనా?

రేపు హైదరాబాద్‌లో తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ • అపరిష్కృత విభజన వివాదాలపై చర్చించనున్న నేతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న విభజన వివాదాలు మళ్లీ తెరపైకి రానున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన నేపథ్యంలో అపరిష్కృత అంశాలపై రెండు రాష్ట్రాల మధ్య మళ్లీ చర్చలు ప్రారంభం కానున్నాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎ.రేవంత్‌రెడ్డి, ఎన్.చంద్రబాబునాయుడు శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సమావేశమై వీటిపై చర్చించనున్నారు. గతంలోనూ పలుసార్లు చర్చలు జరిగినా ప్రతిష్టంభన తొలగలేదు. కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశాల్లో సైతం వివాదాలకు పరిష్కారం లభించలేదు. ఈ నేపథ్యంలో శనివారం జరిగే భేటీపై ఆసక్తి నెలకొంది. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న ముఖ్యమైన అంశాలను ఓసారి పరిశీలిస్తే..

- షెడ్యూల్ 9, 10 సంస్థల విభజనపై తీవ్ర విభేదాలు
- షీలా భిడే సిఫారసులపై తెలంగాణ అభ్యంతరాలు
- ఫైనాన్స్ కమిషన్, దిల్ భూముల కోసం రెండు రాష్ట్రాల సిగపట్లు
- రూ. వేల కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలపైనా తకరారు

షెడ్యూల్-9లోని ప్రభుత్వరంగ సంస్థల విభజనపై

విభజన చట్టంలోని షెడ్యూల్-9లో పొందుపరిచిన 91 ప్రభుత్వ రంగ సంస్థల్లో 53 సంస్థల విభజనపై రెండు రాష్ట్రాల మధ్య ఎలాంటి విభేదాలు లేవు. 15 సంస్థల విభజనకు తెలంగాణ అంగీకరించగా, ఏపీకి మాత్రం అభ్యంతరాలున్నాయి. మిగిలిన 23 సంస్థల విభజన విషయంలో తెలంగాణకు అభ్యంతరాలున్నాయి. ఇందుకు సంబంధించి షీలా భిడే కమిటీ సిఫారసులను పూర్తిగా అంగీకరించాలని ఏపీ కోరుతుండగా, కొన్నింటిపై తెలంగాణకు అభ్యంతరాలున్నాయి. దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ లిమిటెడ్(దిల్)కు హైదరాబాద్‌లో కేటాయించిన భూములను తెలంగాణ స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా, ఏపీ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది. దిల్ ఆస్తులను సైతం విభజించాలని నిపుణుల కమిటీ సిఫారసు చేయడాన్ని తెలంగాణ వ్యతిరేకిస్తోంది. పలు సంస్థలకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండడంతో గతంలో నిర్వహించిన చర్చల్లో ముందడుగు పడలేదు.



ముదిరిన ఫైనాన్స్ కమిషన్ విభజన

ఏపీ ఫైనాన్స్ కమిషన్ విభజన ప్లాన్.. కమిషన్ బోర్డు 2016లో ఏకపక్షంగా రూపొందించి కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపడంతో వివాదం ముదిరింది. రంగారెడ్డి జిల్లాలో ఉన్న 238 ఎకరాల భూములను కమిషన్ నుంచి స్వాధీనం చేసుకోవడానికి తెలంగాణ ప్రయత్నించగా, ఏపీ ప్రభుత్వం 2015లో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది. నాటి నుంచి న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉంది. రూ.వేల కోట్ల విలువ చేసే భూములు కావడంతో రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరడం లేదు.

ప్రాతిపదిక జనాభానా? ప్రాంతమా?

షెడ్యూల్-10లోని 142 ప్రభుత్వ రంగ సంస్థల విభజనపై ప్రతిష్టంభన నెలకొంది. ఏపీ ఉన్నత విద్యామండలి కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల ఆధారంగా ఈ సంస్థల విభజనకు కేంద్రం గతంలో మార్గదర్శకాలు జారీ చేయగా తెలంగాణ అంగీకరించింది. జనాభా దామాషా ప్రకారం నగదు నిల్వలను, లొకేషన్ (ప్రాంతం) ఆధారంగా స్థిరాస్తుల పంపకాలు జరపాలని కేంద్రం మార్గదర్శకాల్లో కోరింది. దీనిపై ఏపీ హైకోర్టును ఆశ్రయించగా, కేసు పెండింగ్‌లో ఉంది. ప్రాంతం ప్రాతిపదికన కాకుండా జనాభా దామాషా ఆధారంగా షెడ్యూల్-10 సంస్థల ఆస్తుల విభజన జరగాలని ఏపీ కోరుతుండగా, తెలంగాణ వ్యతిరేకిస్తోంది. సింగరేణి సంస్థ పూర్తిగా తెలంగాణదేనని, దాని అనుబంధ కంపెనీ అప్మెల్‌ను సైతం తమకే కేటాయించాలని తెలంగాణ కోరుతుండగా, ఏపీ మాత్రం సింగరేణి సంస్థతో పాటు అప్మెల్ విభజన జరపాలని కోరుతోంది. ఏపీ పౌరసరఫరాల సంస్థ విభజనకు ముందు తెలంగాణ వాడుకున్న రూ.354 కోట్లకు పైగా రుణాల చెల్లింపులను తెలంగాణ చేయాల్సి ఉండగా, కేంద్రం నుంచి తమకు రావాల్సిన సబ్సిడీ బకాయిలను ఏపీ బదిలీ చేయాలని తెలంగాణ కోరుతోంది. ఇక విభజన చట్టంలో పొందుపరచని 12 సంస్థల విభజనకు ఏపీ పట్టుపడుతుండగా, తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

వేల కోట్ల విద్యుత్ బిల్లులు

రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ బిల్లుల బకాయిల వివాదంపై ఎన్నో దఫాలుగా చర్చలు జరిగినా కొలిక్కి రాలేదు. తెలంగాణ నుంచి రూ.6,015 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు రావాల్సి ఉందని ఏపీ డిమాండ్ చేస్తుండగా, ఏపీ నుంచే తమకు రూ.17,828 కోట్లు రావాల్సి ఉందని తెలంగాణ పేర్కొంటోంది. ఏపీకి రూ.6,015 కోట్ల బకాయిలను చెల్లించాలని గతంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేయగా, తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకుంది.

తెగని జల పంచాయితీలు

తెలంగాణలో నిర్మిస్తున్న పాలమూరు-రంగారెడ్డిపై ఏపీ, ఏపీలో నిర్మిస్తున్న రాయలసీమ ఎత్తిపోతలపై తెలంగాణ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. కృష్ణా జలాల ఆధారంగా నిర్మిస్తున్న ప్రధానమైన ఈ రెండు ప్రాజెక్టులతో పాటు పలు ఇతర ప్రాజెక్టులపై సైతం రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. కృష్ణాజలాల శాశ్వత పంపకాలు, గోదావరిపై కొత్త ప్రాజెక్టుల నిర్మాణం వంటి అంశాలపై సైతం విభేదాలున్నాయి. రెండు రాష్ట్రాల సీఎంల మధ్య జరిగే చర్చల్లో కృష్ణా, గోదావరి జలాల పంపకాలు, ప్రాజెక్టులపై సైతం చర్చ జరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

చంద్రబాబూ.. పద్ధతి మార్చుకో

▶ మొదటి పేజీ తరువాయి

దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని నిప్పులు చెరిగారు. ఇది ఏ మాత్రం న్యాయం కాదని, ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాలు పండుతున్నాయని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై, మంచి పాలన అందించడంపై చంద్రబాబు దృష్టి పెడితే మంచిదన్నారు. నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని గురువారం వైఎస్ జగన్ ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ‘ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా విధ్వంసక చర్యలు జరుగుతున్నాయి. కేవలం టీడీపీకి ఓటు వేయలేదన్న కారణంతో ఏకంగా ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దొంగ కేసులు పెడుతున్నారు. వీళ్లే కొడతారు, మళ్లీ వీళ్లే అటు వైపున ఉన్న వారి మీద కేసులు పెడతారు. ఇంతటి దారుణంగా ఈ రోజు రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పరిపాలనలో కులం చూడలేదు, మతం చూడలేదు. ప్రాంతం చూడలేదు. చివరికి ఏ పార్టీకి ఓటు వేశారన్నది కూడా చూడకుండా ప్రతి పథకం, ప్రతి మంచిని అర్హత ప్రామాణికంగా ప్రతి ఇంటికీ డోర్ డెలివరీ చేశాం. ఈ రోజు చంద్రబాబునాయుడుకు ఓటు వేయలేదనే కారణంతో అన్యాయంగా రాష్ట్రాన్ని రావణకాష్టం చేస్తున్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను విరగ్గొడుతున్నారు.. పగలగొడుతున్నారు. ఇవన్నీ శిశుపాలుని పాపాల మాదిరిగా పండుతాయి. ప్రజాస్వామ్యంలో ఏదైనా ప్రజలకు మంచి చేసి ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకుని, ప్రజల దగ్గరకు వెళ్లి ఫలాన మంచి చేశాం కాబట్టి ఓటు వేయండి అనే పరిస్థితులు ఉండాలి. కానీ ఈ మాదిరిగా దౌర్జన్యాలు చేసి, అన్యాయమైన కేసులు పెట్టి, ఆస్తులు ధ్వంసం చేసి, భయాందోళనలు సృష్టిస్తూ రాజకీయాలు చేస్తే, అలాంటి రాజకీయం ఏ రోజూ నిలబడదు. తాత్కాలిక మేలు ఏదైనా జరుగుతుందేమో కానీ తర్వాత ఓటు వేసేటప్పుడు ప్రజలు ఇవన్నీ కచ్చితంగా గుర్తు పెట్టుకుంటారు. అందుకే చంద్రబాబులో మార్పు రావాలి. లేదంటే ప్రజలు లెక్కా జమా సరిచేసి చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి’ అని వైఎస్ జగన్ నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..



నెల్లూరులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

ప్రజలు మీకు ఓటు వేసింది ఎందుకు?

- ప్రజలకు మంచి చేసి వైఎస్సార్‌సీపీ ఓడిపోలేదు. చంద్రబాబు నాయుడు చేసిన మోసపూరిత హామీలకు ప్రజలు కాస్తో కూస్తో కొద్దిగా ఆకర్షితులయ్యారు. 10 శాతం ఓట్లు అటు షిఫ్ట్ అయ్యి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారు. మేనిఫెస్టోలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు. రైతులకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్నారు. ఖరీఫ్‌లో జోరుగా వ్యవసాయం పనులు జరుగుతున్నాయి. రైతన్నలు పంటలు వేగంగా వేస్తున్నారు. ఇంత వరకు రైతు భరోసా రూ.20 వేలు ఇస్తానన్న దానికి అతీగతీ లేదు.
- బడులు మొదలయ్యాయి. అమ్మ ఒడి కింద జగన్ రూ.15 వేలు ఐదేళ్ల పాటు ఇచ్చాడు. చంద్రబాబు నాయుడు ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ ఇస్తాడని, ప్రతి ఒక్కరికీ రూ.15 వేలు ఇస్తాడని చెప్పారు. రాష్ట్రంలో కోటి మందికి పైగా బడి ఈడు పిల్లలున్నారు. తల్లికి వందనం కింద ఆ డబ్బులేమయ్యాయి అని ప్రతి తల్లీ అడుగుతోంది.
- 18 ఏళ్లు పైబడిన ప్రతి అక్కచెల్లెమ్మకు రూ.1,500 చొప్పున సంవత్సరానికి రూ.18 వేలు ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో 4.12 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని మొన్ననే లెక్కలు తేలాయి. అందులో దాదాపుగా 2.10 కోట్ల మంది మహిళా ఓటర్లే. అందరూ 18 సంవత్సరాలు నిండిన వారే. ప్రతి నెలా రూ.1500 ఇస్తానన్నావు, ఏమైంది? అని వీరందరూ ఈ రోజు అడుగుతున్నారు.
- వీటన్నింటి మీద ధ్యాస పెట్టే కార్యక్రమం చంద్రబాబు నాయుడు చేయాలి. గవర్నెస్ మీద కాస్త ధ్యాస పెట్టి ఆ తల్లులకు డబ్బులిచ్చే కార్యక్రమం చూడండి. రైతులకు రూ.20 వేలు ఇచ్చే కార్యక్రమం చూడండి. ప్రజలు ఎందుకు తమకు ఓటు వేశారు అని చంద్రబాబు నాయుడు ఆలోచించాలి. ఇవేవీ కూడా చేయకుండా కేవలం భయాందోళనలు నెలకొల్పాలి.. రాష్ట్రంలో రావణకాష్టం రగిలించాలి.. దొంగ కేసులు పెట్టి ఇరికించాలి.. ఆస్తులను ధ్వంసం చేయాలి.. వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన వారెవరినీ ఉంచకూడదు అన్న దుర్మార్గపు ఆలోచనలతో అడుగులు ముందుకు వేయడం అతి హేయమైన రాజకీయం.

పిన్నెల్లిపై ఇంత అన్యాయంగా కక్ష సాధింపా?

- పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మీద ఏకంగా 307 అంటే హత్యాయత్నం కేసు పెట్టారు. ఏ రకంగా అన్యాయంగా అతన్ని జైల్లో నిర్బంధించారో చూస్తున్నాం. కారంపూడి ఘటన జరిగిందెప్పుడు? ఎన్నికలు అయిపోయిన మరుసటి రోజు అంటే మే 14న. కారంపూడిలో టీడీపీ ఆకృత్యాలకు ఒక ఎస్సీ కుటుంబంలోని మహిళలు ఇబ్బంది పడే పరిస్థితి వచ్చినందున వాళ్లను పరామర్శించడానికి డీఎస్పీ అనుమతి తీసుకుని అప్పటి ఎమ్మెల్యే పిన్నెల్లి బయల్దేరాడు.
- కారంపూడికి అటు వైపున ఎస్సీ కుటుంబం ఇల్లు ఉంటే.. ఎమ్మెల్యే ఊర్లోకి ప్రవేశించక ముందే ఇటు వైపు అడ్డగించారు. గొడవ టౌన్‌లో జరుగుతుంటే పిన్నెల్లిని ఊరుబయటే అడ్డగించారు. నారాయణస్వామి అనే సీఐని పిన్నెల్లి చూసిన దాఖలాలు కూడా లేవు. మే 14న గొడవ జరిగితే 9 రోజుల తర్వాత అంటే మే 23న ఆయనకేదో జరిగింది అన్నట్లుగా ఆ సీఐ, రామకృష్ణారెడ్డి మీద హత్యాయత్నం కేసు పెట్టాడు. ఆ సీన్లో లేని వ్యక్తిపై ఈ కేసు బనాయించారు. ఇది అన్యాయం కాదా?
- అసలు ఇన్సిడెంట్ నిజంగా జరిగిందో లేదో కూడా తెలియదు. మే 14న జరిగి ఉంటే మే 15న మెడికో లీగల్ కేసు ఎందుకు పెట్టలేదు? 17వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం సిట్ వేసింది. 17 నుంచి 20వ తేదీ వరకు పల్నాడు ప్రాంతంలో ఆ సిట్ బృందం తిరిగి ఘటనపై రిపోర్టు ఇచ్చింది. ఆ రిపోర్టులో ఎందుకు ఈ అంశం రాలేదు? అలాంటప్పుడు ఈ రకంగా హత్యాయత్నం కేసులో ఒక మనిషిని ఇరికించడం ధర్మమేనా?.

ప్రతి దశలో ఓ రెడ్‌బుక్

- ప్రతి ఒక్కరూ వాళ్ల వాళ్ల స్థాయిలో రెడ్‌బుక్స్ అని చెప్పి పెట్టుకున్నారు. చంద్రబాబు స్థాయిలో ఒక రెడ్‌బుక్, లోకేశ్ స్థాయిలో ఒక రెడ్‌బుక్, ఎమ్మెల్యే స్థాయిలో, మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో ఇలా రెడ్‌బుక్‌లు పెట్టుకుని ఏం చేస్తున్నారు? అతి దారుణంగా, అన్యాయంగా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు.
- మీ విధ్వంసాలు, దాడులను రాష్ట్రం మొత్తం చూస్తోంది. కానీ ఎవరూ మాట్లాడటం లేదు. దొంగ కేసులు పెడుతున్నారు. చీనీ చెట్లు నరికేస్తున్నారు. జేసీబీలు, పొక్లెయిన్ల మీద స్వయంగా ఎమ్మెల్యేలు తిష్ట వేసి బిల్డింగులు పగలగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారు. ఊరూరా ఆస్తుల ధ్వంసం, దాడులు, దౌర్జన్యాలపై పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

ఎమ్మెల్యే 10 సార్లు ఫోన్ చేసినా ఎస్పీ స్పందించలేదు

- మే 13న ఎన్నికల సమయంలో పాల్వాయి గేట్ అనే పోలింగ్ కేంద్రం దగ్గరకు అప్పటి ఎమ్మెల్యే వెళ్లినప్పుడు జరిగిన ఘటన మీద మరో కేసు పెట్టారు. అసలు ఆ ఘటన ఎందుకు జరిగింది? అక్కడ ఉన్న ఎస్సీ సామాజిక వర్గం వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసే పరిస్థితి లేనప్పుడు ఎమ్మెల్యే ఆ గ్రామానికి వెళ్లారు. ఆ పరిస్థితులను చూసి ఎస్పీకి 10 సార్లు ఫోన్ చేసినా కూడా స్పందించని పక్షంలో కనీసం సీఐని, ఎస్సైని పంపించండనే పరిస్థితుల్లో ఉన్నారు. అలాంటి సెన్సిటివ్ బూత్‌లో కేవలం ఒకే ఒక్క హోంగార్డును పెట్టారు. అటువంటి పరిస్థితుల్లో ఆ ఘటన జరిగింది. ఆ ఈవీఎం పగలగొట్టిన కేసులో తనకు బెయిల్ వచ్చింది. కానీ ఎవరిపైనో హత్యాయత్నం చేశాడని తప్పుడు కేసులు పెట్టి ఇవాళ జైలు పాలు చేశారు.
- ఈ ఘటన జరిగిన 10 రోజుల తర్వాత అంటే మే 23వ తారీఖున కేసులు పెట్టారు. రిగ్గింగ్‌ను అడ్డుకునే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేస్తే, హత్యాయత్నం చేశాడని తప్పుడు కేసులు పెట్టారు. నిజంగా అటువంటిది జరిగి ఉంటే సిట్ 17వ తారీఖు నుంచి 20వ తారీఖు మధ్యలో ఇచ్చిన రిపోర్టులో చెప్పాలి కదా? 2009 నుంచి వరుసగా నాలుగు సార్లు పిన్నెల్లి గెలిచాడంటే మంచోడు కాబట్టే ప్రజలు ఆశీర్వదిస్తూ వచ్చారు. అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి తప్పుడు కేసుల్లో ఇరికించడం ఎంత వరకు ధర్మం? ఈ రోజు ఇది రామకృష్ణారెడ్డి ఒక్కడి పరిస్థితే కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇలానే జరుగుతోంది.
- వైఎస్ జగన్ వెంట మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అంబటి రాంబాబు పిన్నెల్లితో ములాఖత్‌లో పాల్గొన్నారు. మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు తలశీల రఘురామ్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కల్యాణ చక్రవర్తి తదితరులు ప్రెస్‌మీట్‌లో పాల్గొన్నారు.

కార్యాలయాల కూల్చివేతలపై సర్కారుకు ముకుతాడు

దుందుడుకు చర్యలను అడ్డుకుంటూ ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు

ప్రజా ప్రయోజనాలు ప్రభావితం అవుతుంటే మినహా కూల్చడానికి వీల్లేదు

అతిక్రమణలు స్వల్పం, సాధారణం, అప్రధానం అయినప్పుడు కూల్చరాదు

విచక్షణ, అధికారాన్ని ఉపయోగించేటప్పుడు నిష్పాక్షికంగా ఉండాలి

ఏ నిర్ణయం తీసుకున్నా చట్ట నిబంధనలకు అనుగుణంగానే ఉండాలి

వివరణలు, అదనపు వివరణలు, డాక్యుమెంట్లు తీసుకుని విచారించండి

అవసరమైనప్పుడల్లా వైఎస్సార్‌సీపీ వాదనలు వినాలి

రికార్డులు, సంబంధిత భవనాలను పరిశీలించండి

మొత్తం ప్రక్రియ ముగిసేవరకు కార్యాలయాలపై ఎలాంటి కఠినచర్యలొద్దు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ ఉత్తర్వులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఆదుకోండి..

ప్రధాని మోదీకి ఏపీ సీఎం చంద్రబాబు వినతిపత్రం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీల విషయంలో కేంద్రంతో ఏపీ ఇంకా పోరాడుతూనే ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు సహకారం అందించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు గురువారం ఉదయం 10 గంటల సమయంలో ప్రధానిని కలసి వినతిపత్రం అందచేశారు. విభజన సమస్యలతో పాటు వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో దోపిడీ జరిగిందని, ఆర్థిక వసూళ్లు తగ్గిపోయాయని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని చెప్పారు. జీతాలు, పెన్షన్లు, ఖర్చులు భారీగా పెరిగాయన్నారు. ప్రభుత్వ భవనాలను తాకట్టు పెట్టడం, పెద్ద ఎత్తున నిధుల మళ్లింపు, వనరుల కొరత కారణంగా రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. ఇలాంటి పలు సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇవ్వడం మినహా మరో మార్గం లేదని ప్రధానికి నివేదించారు.



ప్రధాని మోదీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు

‘కాళేశ్వరం’ విచారణ 2 వారాలకు వాయిదా

పిల్ ఉపసంహరణకు హైకోర్టు నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: ఒకసారి పిల్ దాఖలు చేసి.. విచారణ జరుగుతున్న సమయంలో పిటిషనర్ పాత్ర స్వల్పమేనని హైకోర్టు స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మేడిగడ్డ పియర్ల కుంగుబాటుపై విచారణ జరిపి వాస్తవాలను న్యాయస్థానం తెలియజేస్తుందని చెప్పింది. జ్యుడీషియల్ విచారణ ఇంకా కొనసాగుతున్నందున తదుపరి విచారణ రెండువారాలకు వాయిదా వేస్తున్నట్టు పేర్కొంది. వేల కోట్ల రూపాయలతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని.. దీనిపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌తోపాటు బక్క జడ్సన్ మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విష యం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం ఈ పిటిషన్లపై గురువారం విచారణ చేపట్టింది. తమ కౌంటర్ దాఖలు చేసినట్టు సీబీఐ తరఫు న్యాయవాది తెలిపారు. కాగా, ఇప్పటికే కాళేశ్వరంపై జ్యుడీషియల్ విచారణ సాగుతున్నందున తమ పిటిషన్ ఉపసంహరించుకోవాలని భావిస్తున్నట్టు జడ్సన్ తరఫు న్యాయవాది కోరారు. కమిషన్ నివేదిక సమర్పించిన తర్వాత దానిని చాలెంజ్ చేయాలని భావిస్తున్నట్టు తెలిపారు. దీనికి ధర్మాసనం నిరాకరించింది. ఒకసారి పిల్ దాఖలు చేసిన తర్వాత సమస్యను న్యాయస్థానం పరిష్కరిస్తుందని, పిటిషనర్ పాత్ర స్వల్పమేనని పేర్కొంది. వాదనలు విన్న ధర్మాసనం.. విచారణ రెండువారాలకు వాయిదా వేసింది.

భూముల రిజిస్ట్రేషన్లు నిరాకరిస్తే అది కోర్టు ధిక్కరణే: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: భూముల రిజిస్ట్రేషన్లపై ఎలాంటి కోర్టు ఉత్తర్వులు లేకున్నా వాటిని నిరాకరిస్తే అది ధిక్కరణేనని హైకోర్టు స్పష్టం చేసింది. స్టే, స్టేటస్ కో లాంటి ఉత్తర్వులను రద్దు చేసిన తర్వాత రిజిస్ట్రేషన్లను తిరస్కరించడం సరికాదని చెప్పింది. కోర్టు ఉత్తర్వులు అర్థంకాక కొందరు అధికారులు ప్రజలను ఇబ్బంది పెట్టడం, వారి హక్కులకు భంగం కలిగించడమే అవుతుందని వ్యాఖ్యానించింది. దీనిపై స్పష్టంగా సబ్ రిజిస్ట్రార్‌లకు నోట్ పంపాలని రెవెన్యూ ముఖ్యకార్యదర్శి, జిల్లా రిజిస్ట్రార్‌లను ఆదేశించింది. కోర్టు వివాదం పరిష్కారమైన తర్వాత కూడా రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన అనంత రామేశ్వరిదేవితో పాటు మరికొందరు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఇలాంటి పిటిషన్లు వచ్చినప్పుడు రిజిస్ట్రార్‌లను తమ వద్దకు పిలిచి అడిగితే.. అసలు పిటిషనర్లు రిజిస్ట్రేషన్ కోసం రాలేదని చెబుతున్నారన్నారు. కోర్టు ఆదేశాలను అర్థం చేసుకోలేక, రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఇచ్చిన ఉత్తర్వులు తీసుకురావాలని ప్రజలను ఇబ్బంది పెట్టడంపై అధికారుల తీరును తప్పుబట్టారు. ఇకపై ఇలా ఎవరు నిరాకరించినా కోర్టు ధిక్కరణగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్‌ను ఎందుకు తిరస్కరించారో నెల 5న (నేడు) వ్యక్తిగతంగా హాజరై చెప్పాలని అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. విచారణను నేటికి వాయిదా వేసింది.

ఘనంగా వైఎస్సార్ 75వ జయంతి

- జూలై 8న పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్ జగన్ పిలుపు
- వివరాలు వెల్లడించిన పేర్ని నాని

సాక్షి, అమరావతి: మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి సందర్భంగా జూలై 8న రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించిందని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని స్థాపించారని చెప్పారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. రక్తదానంతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, రహదారులు, కాలనీల్లో చెట్లు నాటడం వంటి సేవా కార్యక్రమాలు భారీ ఎత్తున చేపట్టి మహానేతకు ఘనంగా నివాళులర్పించాలని వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులందరికీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపునిచ్చారని తెలిపారు. అభివృద్ధిని అందరికీ పంచాలన్న వైఎస్సార్ కలలే తమ పార్టీ లక్ష్యమని చెప్పారు.

ప్రజలు తిరస్కరించినా ఇంకా బుద్ధి రాలేదు

- ఫామ్‌హౌజ్‌లో కూర్చొని కేసీఆర్ ప్రజలను రెచ్చగొడుతున్నారు
- విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే విజయ రమణారావు

సాక్షి, హైదరాబాద్: రాజరికపు పోకడలతో గడీల పాలన సాగించిన కేసీఆర్‌ను ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించినా ఇంకా బుద్ధిరాలేదని కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. అసెంబ్లీలోని సీఎల్పీ మీడియాహాల్‌లో గురువారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సీహెచ్.విజయ రమణారావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ప్రజలు కాంగ్రెస్‌ను ఆశీర్వదించి అధికారంలో కూర్చోబెడితే ఫామ్‌హౌజ్‌లో కూర్చొని ప్రజలను రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం పోయి ఆరునెలల్లోనే బీఆర్‌ఎస్ పార్టీ కనుమరుగైందని, కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిస్తే ఎమ్మెల్యేలు కాదు కదా ఒక్క బీఆర్‌ఎస్ కార్యకర్త కూడా మిగలడని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడతామని అంటున్నారని, అలాగే మాట్లాడితే కాంగ్రెస్ కార్యకర్తలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సచివాలయానికి పోని కేసీఆర్ కనీసం మంత్రులను కూడా కలవలేదని విమర్శించారు. గవర్నమెంట్ కూలిపోతుంది అని కేటీఆర్ కూడా పిచ్చిపట్టినట్లుగా మాట్లాడుతున్నారని, కూలిపోవడానికి అదేమైన ఫామ్‌హౌజా..? అని ప్రశ్నించారు.

న్యాయవాదుల ‘జీవితబీమా’ పెంచిన బార్‌కౌన్సిల్

సాక్షి, హైదరాబాద్: న్యాయవాదుల జీవితబీమాను రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచుతూ రాష్ట్ర బార్‌కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 6న కౌన్సిల్ భేటీలో అడ్వొకేట్స్ వెల్ఫేర్ ఫండ్ యాక్ట్‌లోని సెక్షన్16(2) ప్రకారం పెంపునకు ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన వివరాలను బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి గురువారం మీడియాకు వెల్లడించారు. కౌన్సిల్ పరిధిలో 53,220 మంది న్యాయవాదులుగా ఎన్‌రోల్ అయ్యారని, జూలై 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని చెప్పారు.

సొంత ప్రయోజనాలే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలేవీ?

మంత్రివర్గంలో కాంగ్రెస్‌పార్టీ సామాజిక సమతూకం పాటించదు: పొన్నాల లక్ష్మయ్య



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో పాలన గాలికివదిలి ఢిల్లీలో మకాం వేశారని, వారికి సొంత ప్రయోజనాలే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలు కనిపించవని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న ఆరు పదవులను భర్తీ చేయలేని దౌర్భాగ్య స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. గురువారం తెలంగాణభవన్‌లో పొన్నాల మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ కూర్పులో సామాజిక సమతూకాన్ని కాంగ్రెస్ పార్టీ పాటించిన ఉదంతాలు లేవని చెప్పారు. కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఆరుగురు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులను నిండా ముంచారు: బాల్క సుమన్

కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను నిండా ముంచిందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. నిరుద్యోగులను రెచ్చగొట్టిన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, బల్మూరు వెంకట్‌కు మాత్రం రాజకీయఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఆందోళన బాట పట్టిన నిరుద్యోగులను పోలీసులతో బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలిద్దరూ ఇప్పటికే అనేక పర్యాయాలు లోలోన భేటీ అయ్యారని, ఇప్పుడు బహిరంగంగా కలుస్తున్నారని చెప్పారు. తెలంగాణ హక్కుల పరిరక్షణలో రేవంత్ గట్టిగా నిలబడతారనే నమ్మకం తమకు లేదన్నారు. తెలంగాణ ప్రయోజనాల తాకట్టు కోసమే ఈ భేటీ జరుగుతుందని చెప్పారు.

పిల్లలకు బ్రషింగ్ నేర్పడం ఇలా...



పెరిగే పిల్లల పళ్లు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే, వాళ్లకు పళ్లు రంధ్రాలు పడటం, పుచ్చుపళ్లు రావడం వంటివి నివారించాలంటే ఈ కింది జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బ్రషింగ్ ప్రక్రియనూ నేర్పాలి... ● పళ్లపై ఏర్పడే గార తొలగిపోడానికి, అది ఏర్పడకుండా ఉండటానికి పేస్ట్‌తో రోజూ రెండుసార్లు బ్రష్ చేయడం నేర్పాలి. ● పళ్ల మీద గుండ్రంగా తిప్పుతున్నట్లుగా బ్రష్‌ను ఉపయోగించేలా చిన్నప్పటినుంచి అలవాటు చేయాలి. దానికి వాళ్లు అలా అలవడిపోయి, జీవితాంతం కరెక్ట్‌గా బ్రషింగ్ చేస్తారు. ● బ్రష్ మీద బఠాణీ గింజ అంత పేస్ట్ వేస్తే ... దానిని వారు మింగకుండా ఉంటారు. ● నాలుగేళ్లు దాటాక కూడా వేలు చప్పరించే పిల్లల పళ్లు వంకర టింకరగా రావడం లేదా ఒకేచోట గుంపుగా రావడం జరగవచ్చు. అందుకే ఈ అలవాటు త్వరగా మానేలా జాగ్రత్త తీసుకోవాలి.

వంటిల్లు

మన వంటగదికి పొరుగింటి రుచిని అద్దుదాం.
కేరళ కొబ్బరితో బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం.
పెరుగుతో పంజాబీ కడీ చేద్దాం.
శనగలతో జైసల్మీర్ చనే కూడా ట్రై చేద్దాం.
పిల్లలకు అన్ని రుచులూ అలవాటైతే...
పై చదువులకు ఏ రాష్ట్రానికి వెళ్లినా సరే...
మన ఇంట్లో భోజనం చేసినట్లే ఉంటుంది.

ఆ ఉత్తరం ఈ దక్షిణం అన్ని రుచులూ అద్భుతః

కేరళ పాలాపం



కావలసినవి: బియ్యం– పావు కేజీ ; పచ్చి కొబ్బరి తురుము – యాభై గ్రాములు ; నీరు– వంద మిల్లీలీటర్లు ; చక్కెర – అర స్పూన్ ; ఉప్పు – అర స్పూన్ ; బేకింగ్ సోడా– చిటికెడు.

తయారీ: ● బియ్యాన్ని శుభ్రంగా కడిగి మంచినీటిలో ఐదు గంటల సేపు నానబెట్టాలి. మిక్సీలో బియ్యంతోపాటు కొబ్బరి తురుము కూడా వేసి తగి నంత నీటిని చేరుస్తూ మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇది అపం పిండి ● బాణలిలో నీటిని పోసి, అందులో పై మిశ్రమాన్ని ఒక కప్పు వేసి గరిటెతో కలుపుతూ మరిగించి దించేయాలి. మిశ్రమం చల్లారిన తర్వాత అపం పిండిలో వేసి కలపాలి. ఈ పిండిని ఎనిమిది గంటల సేపు కదిలించ కుండా ఉంచాలి. రాత్రి గ్రైండ్ చేసి పెడితే ఉదయానికి పొంగుతుంది. ఇందులో చక్కెర, ఉప్పు, బేకింగ్ సోడా వేసి గరిటెతో బాగా కలపాలి. మిశ్రమం గరిటె జారు డుగా ఉండాలి. అవసరాన్ని బట్టి మరికొంత నీటిని వేసుకోవచ్చు ● అపం పెనం వేడి చేసి ఒక గరిటె పిండి వేసి అంచులు పట్టుకుని వలయాకారంగా తిప్పితే పిండి దోశలాగ విస్తరిస్తుంది. మీడియం మంట మీద కాల్చాలి. కాలే కొద్దీ అంచులు పైకి లేస్తాయి. అట్లకాడతో తీసి ప్లేట్‌లో పెట్టాలి. దీనిని రెండవ వైపు కాల్చాల్సిన పని లేదు, కాబట్టి తిరగేయకూడదు. ఈ ఆపం అంచులు ఎర్రగా కరకరలాడుతూ మధ్యలో దూదిలా మెత్తగా ఉంటుంది. నూనె వేయాల్సిన పని లేదు. ఆపం పెనం లేకపోతే దోశ పెనం (ఫ్లాట్‌గా కాకుండా కొంచెం గుంటగా ఉండే పెనం) మీద ప్రయత్నించవచ్చు.

పంజాబీ కడీ



కావలసినవి: శనగపిండి మిశ్రమం కోసం: శనగపిండి– కప్పు; పెరుగు– 2 కప్పులు; నీరు– 4 కప్పులు; పసుపు– చిటికెడు.

కడీ కోసం: ఆవనూనె లేదా వేరుశనగ నూనె– టేబుల్ స్పూన్ ; పసుపు – అర టీ స్పూన్ ; ఇంగువ– పావు టీ స్పూన్ ; ఆవాలు – టీ స్పూన్ ; జీలకర్ర – టీ స్పూన్ ; మెంతులు – అర టీ స్పూన్ ; లవంగాలు – 3 ; ఎండుమిర్చి – 2 ; కరివేపాకు – 3 రెమ్మలు ; ఉల్లిపాయ – 1 పెద్దది (తరగాలి) ; అల్లం– అంగుళం ముక్క (తరగాలి) ; వెల్లుల్లి– 4 రేకలు (తరగాలి) ; మిరప్పొడి– అర టీ స్పూన్ ; ధనియాల పొడి –2 టీ స్పూన్‌లు ; ఉప్పు – టీ స్పూన్ ; గరం మసాలా– అర టీ స్పూన్ ; ఆమ్‌చూర్ పౌడర్– 2 టీ స్పూన్‌లు లేదా పచ్చి మామిడి గుజ్జు టేబుల్ స్పూన్ ; కసూరీ మేథీ (ఎండిన మెంతి ఆకుల పొడి)– 2 టీ స్పూన్.

తద్కా కోసం: నూనె – టేబుల్ స్పూన్ ;ఎండుమిర్చి– 2 ; కశ్మీరీ మిర్చిపౌడర్– అర టీ స్పూన్ ; కొత్తిమీర తరుగు– టేబుల్ స్పూన్

తయారీ: ● ఒక పెద్ద పాత్రలో పెరుగు, శనగపిండి వేసి బాగా కలిసేటట్లు చిలకాలి. అందులో పసుపు వేసి, నీరు పోసి మళ్లీ చిలికి అరగంట సేపు పక్కన ఉంచాలి ● స్టవ్ మీద మందపాటి పాత్ర పెట్టి నూనె వేడి చేయాలి. అందులో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, మెంతులు, అల్లం, వెల్లుల్లి, లవంగాలు, ఉల్లిపాయ ముక్కలు, ఇంగువ వేసి వేగనివ్వాలి. అవి వేగిన తర్వాత మిర్చిపౌడర్, ధనియాల పొడి, పసుపు, ఉప్పు వేసి కలపాలి. ఇవన్నీ చక్కగా వేగిన తర్వాత ముందుగా కలిపి పెట్టుకున్న శనగపిండి– పెరుగు మిశ్రమాన్ని పోసి ఉండలు కట్టకుండా గరిటెతో కలుపుతూ ఉడికించాలి. ఐదు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికిన తర్వాత మంట తగ్గించి మూత పెట్టి పది నిమిషాల సేపు ఉడికించిన తర్వాత ఆమ్‌చూర్ పౌడర్, కసూరీ మేథీ, గరం మసాలా పొడి వేసి కలిపి దించేయాలి ● బాణలి పెట్టి నూనె వేడి చేసి అందులో ఎండుమిర్చి, కశ్మీరీ మిర్చిపౌడర్ వేసి వేగిన తర్వాత ఉడికించిన కడీ మిశ్రమాన్ని పోసి చివరగా కొత్తిమీర చల్లితే పంజాబీ కడీ రెడీ. ఇది అన్నంలోకి బాగుంటుంది. పంజాబీ కడీలో నీరు ఎక్కువగా కలిపి పలుచగా చేసుకుని సూప్‌లా కూడా తాగుతారు. వర్షాకాలం, చలికాలం ఈ సూప్ తాగుతుంటే జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడి తేలిగ్గా, హాయిగా ఉంటుంది.

జైసల్మీరీ చనే



కావలసినవి: ముడి శనగలు – కప్పు ; నెయ్యి – టేబుల్ స్పూన్; ఇంగువ – చిటికెడు ; జీలకర్ర– అర టీ స్పూన్ ; జీలకర్ర పొడి– టీ స్పూన్ ; ధనియాల పొడి – 2 టీ స్పూన్‌లు ; మిరప్పొడి – టేబుల్ స్పూన్ ; పసుపు– అర టీ స్పూన్ ; గరం మసాలా పొడి– అర టీ స్పూన్ ; పెరుగు– ఒకటిన్నర కప్పులు ; శనగ పిండి –3 టేబుల్ స్పూన్‌లు ; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.

తయారీ: ● శనగలను శుభ్రంగా కడిగి ఆరింతలుగా నీటిని పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం నీటిని వంపేసి మరోసారి కడిగి ప్రెషర్ కుకర్‌లో వేసి నాలుగు కప్పుల నీటిని పోసి ఐదు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. దించేసిన తర్వాత చల్లారే వరకు పక్కన ఉంచాలి ● ఒక వెడల్పు పాత్రలో శనగపిండి, పెరుగు, పసుపు, మిరప్పొడి, జీలకర్ర పొడి, ధనియాల పొడి, గరం మసాలా పొడి, ఉప్పు వేసి ఉండలు లేకుండా బాగా కలపాలి ● పెనంలో నెయ్యి వేడి చేసి జీలకర్ర, ఇంగువ వేయాలి. జీలకర్ర చిట పట పేలిన తర్వాత ముందుగా కలిపి పెట్టుకున్న శనగపిండి, పెరుగు మిశ్రమాన్ని వేసి అడుగు పట్టకుండా కలుపుతూ ఐదు నిమిషాల సేపు ఉడికించాలి ● ప్రెషర్‌కుకర్‌లో ఉడికించి సిద్ధంగా ఉంచిన శనగలను నీటితో సహా ఉడుకుతున్న శనగపిండి, పెరుగు మిశ్రమంలో వేసి కలిపి మరో ఐదు నిమిషాల సేపు ఉడికించాలి. చివరగా కొత్తిమీర చల్లి దించేయాలి. ఈ జైసల్మీరీ చనే కర్రీ రోటీ, పుల్కాలతో పాటు అన్నంలోకి కూడా రుచిగా ఉంటుంది.

ఫ్యాషన్

స్కర్ట్... స్టయిల్







అమ్మాయిల సంప్రదాయ అలంకరణలో
స్కర్ట్‌కు ప్రత్యేక స్థానం ఉంటుంది.
ఒకేతరహా ఫ్యాబ్రిక్‌తో స్కర్ట్ సాదాసీదాగా కనిపించేది.
దీనికి అదనపు హంగుగా కుచ్చులు జత చేసి,
ఒకవైపు నుంచి మరోవైపుకు సెట్ చేస్తే..
వచ్చిన స్టైల్ డ్రేప్డ్ స్కర్ట్.
షార్ట్ కుర్తీ, ట్యునిక్, ఖఫ్తాన్ వంటి టాప్స్ ఎంపిక ఏదైనా
డ్రేప్డ్ స్కర్ట్‌కి జత చేస్తే ఆ స్టైల్ అదుర్సే మరి.

ఇండియన్ ట్రెడిషనల్ డ్రెస్‌గా ఆకట్టుకునే డ్రేప్డ్ స్కర్ట్ వెస్ట్రన్ స్టైల్‌లోనూ యంగ్‌స్టర్స్‌ని ఆకట్టుకుంటుంది. ఫ్లోరల్ ప్రింట్లు, ఎంబ్రాయిడరీ వర్క్‌తో మరింత ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటుంది.

డ్రేప్డ్ స్కర్ట్ అంచులు ఎగుడు దిగుడుగా ఉండటమే దీని ప్రత్యేకత. అందుకే ఎక్కువ భాగం ఈ స్కర్ట్‌కి ఎంబ్రాయిడరీ వంటి హంగులు అవసరం లేదు. టాప్‌గా ఎంచుకునే కుర్తీ, లాంగ్ అండ్ షార్ట్ జాకెట్స్, ఖఫ్తాన్, ట్యునిక్స్‌ని ఎంబ్రాయిడరీ లేదా ఫ్లోరల్ వర్క్‌తో రిచ్‌లుక్‌ని తీసుకురావచ్చు.





ప్లెయిన్ శాటిన్, సిల్క్ మెటీరియల్‌తో విరివిగా కనిపించే డ్రేప్డ్ స్కర్ట్ సెట్స్ ఇండోవెస్ట్రన్ లుక్‌ని సొంతం చేస్తుంది. అందుకే ఈ స్టైల్ యూత్‌ని అట్రాక్ట్ చేస్తుంది.

టాప్ టు బాటమ్ ఒకే రంగులో ప్లెయిన్‌గా ఉండే డ్రేప్డ్ స్కర్ట్ సెట్స్ ఫ్యామిలీ గెట్ టు గెదర్ వేడుకలకు ప్రత్యేకంగా నిలిస్తే, పట్టు, ఫ్లోరల్, జరీ వర్క్‌తో డిజైన్ చేసినవి వివాహ వేడుకలలోనూ గ్రాండ్‌గా కనిపిస్తాయి.

మన్ కీ బాత్

కష్టాలకు గొడుగు పట్టారు

కేరళలోని అట్టపాడి గిరిజన ప్రాంతంలో నవజాత శిశువుల మరణాలు అనేకం చోటు చేసుకున్నాయి. కారణం పౌష్టికాహార లోపం. పోషకాలు ఇచ్చే అటవీ ఆహారం నశించిపోయి గర్భిణులకు తిండి కరువైంది. దాంతో ఒక స్వచ్ఛంద సంస్థ వారిని గొడుగుల తయారీలో శిక్షణ ఇచ్చింది. 2015 నుంచి 'కార్తుంబి' (తూనీగ) అనే బ్రాండ్ కింద ఆ గిరిజన మహిళలు తయారు చేస్తున్న గొడుగులు దేశమంతా అమ్ముడుపోతున్నాయి. తాజాగా ప్రధాని మోడి తన 'మన్ కీ బాత్'లో వీరిని శ్లాఘించారు. కర్తుంబి గురించి....



కార్తుంబి గొడుగుల తయారీలో ఆదివాసీ మహిళలు

'కేరళ సంస్కృతిలో గొడుగులు ఒక భాగం. అక్కడి కార్తుంబి గొడుగుల గురించి నేను ప్రస్తావించ దలుచుకున్నాను. రంగు రంగుల ఆకర్షణీయమైన ఈ గొడుగులను ఆదివాసి మహిళలు తయారు చేస్తారు. కేరళలోని చిన్న పల్లె నుంచి తయారయ్యే ఈ గొడుగులు నేడు పెద్ద పెద్ద మల్టీనేషనల్ కంపెనీలకు చేరుతున్నాయి. ఒకల్ ఫర్ లోకల్‌కు ఇంతకుమించిన ఉదాహరణ ఏం కావాలి' అని జూన్ 30న తన 111వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడి కర్తుంబి గొడుగుల గురించి చేసిన ప్రస్తావన అక్కడి గిరిజన మహిళల ముఖాన చిర్నవ్వులు తేవడమే కాదు దేశవ్యాప్తంగా వారు సాగిస్తున్న కృషిని తెలిపింది. చాలామంది నేడు కార్తుంబి గొడుగుల గురించి తెలుసుకుంటున్నారు. ఆ గాథతో స్ఫూర్తి పొందుతున్నారు.

పాలక్కాడ్‌లో గిరిజనులు

పాలక్కాడ్‌లోని లోపలి పల్లెల్లో ముడుగ, ఇరుల, కర్మ్మగ తదితర గిరిజనులు ఉంటారు. చాలా ఏళ్లపాటు వీరికి డబ్బు అవసరం ఏర్పడలేదు. అటవీ ఆహారమే వీరి ఆహారం. అయితే 2012 నుంచి ఈ ప్రాంతంలో నవజాత శిశువుల మరణాలు ఎక్కువగా నమోదవడం స్వచ్ఛంద సంస్థలు గమనించాయి. 2012 నుంచి 2015 వరకు ఇక్కడ అనధికారికంగా 200 శిశుమరణాలు జరిగి ఉంటాయని అంచనా. ఇందుకు కారణం గర్భిణులకు పౌష్టికాహారం లేకపోవడమే.'మేము తినే కందమూలాలు, పండ్లు, ఆకుకూరలు ఇప్పుడు అడవుల్లో లేవు. క్రూరమృగాల భయం వల్ల మేము వ్యవసాయం చేయము. మాకు అంతిమంగా డబ్బుతో అవసరం ఏర్పడింది. అది మా దగ్గర లేదు. కాబట్టి మేము ఆహారం కొనుక్కుని తినే పరిస్థితుల్లో లేము' అని అక్కడ మహిళలు చెప్పారు. దాంతో పాలక్కాడ్‌లో గిరిజనుల కోసం పని చేసే 'తంపు' అనే స్వచ్ఛంద సంస్థ వీరి సమస్యను లోకానికి తెలియచేసింది. గల్ఫ్‌లో పని చేస్తున్న కేరళీయుల బృందం వీరి సాయానికి ముందుకు వచ్చింది. ఫలితంగా ఏర్పడిందే 'కార్తుంబి' గొడుగుల బ్రాండ్.



రంగుల తూనీగ

పాలక్కాడ్‌లో పిల్లల కోసం పని చేసే ఒక సంస్థ 'కార్తుంబి' (తూనీగ) పేరుతో అందరికీ తెలుసు. అందరినీ ఆకర్షించే ఈ పేరుతోనే బ్రాండ్ ఏర్పాటు చేసి ఆదివాసీ మహిళలకు గొడుగుల తయారీలో శిక్షణ ఇచ్చారు. మొదట 70 మందిని ఎంపిక చేసి వారికి మెటీరియల్ సరఫరా చేస్తే గొడుగులు ఎలా చేయాలో నేర్పారు. ఆ తర్వాత వారు తమ రోజువారీ పనులు చేసుకుంటూనే ఇంట్లో వీలైనప్పుడల్లా గొడుగులు తయారు చేసే వెసులుబాటు ఇచ్చారు. ఒక గొడుగు తయారు చేస్తే 30 రూపాయల కూలీతో ఈ పని మొదలైంది. 2017 నుంచి కేరళ గిరిజన సంక్షేమ శాఖ ఫండ్ రిలీజ్ చేస్తోంది. వీరి నుంచి తయారైన గొడుగులు వివిధ సంస్థల ద్వారా మార్కెటింగ్ అవుతున్నాయి.

సీజన్‌లో 17 వేల గొడుగులు

70 మంది మహిళలతో మొదలైన ఈ పని నేడు 350 గిరిజన మహిళలకు చేరుకుంది. వీరు జనవరి నుంచి మే చివరి వరకు మాత్రమే పని చేస్తారు. జూన్ మొదటి వారంలో మాన్‌సూన్ రావడంతో గొడుగుల అమ్మకాలు ఉంటాయి కాబట్టి. ఒక సీజన్‌లో వీరంతా కనీసం 17 వేల గొడుగులు తయారు చేస్తున్నారు. ఒక్కొక్క మహిళ రోజుకు 700 నుంచి వేయి రూపాయల వరకు సంపాదిస్తుంది. ఈ త్రీఫోల్డ్ గొడుగులు మెటీరియల్‌ను బట్టి 350 రూపాయల నుంచి 649 రూపాయల వరకూ అందుబాటులో ఉన్నాయి.

గొడుగుల దానం

చలికాలంలో రగ్గుల దానం ఎంత అవసరమో వానాకాలంలో గొడుగుల దానం అంత అవసరం. కార్తుంబి గొడుగుల మార్కెటింగ్ కోసం ఒక టెకీ సంస్థ కార్పొరేట్ సంస్థలను సంప్రదించి వారిచేత గొడుగులు కొనేలా చేస్తోంది. ఉద్యోగులకు, పేదవారికి ఉచితంగా ఇచ్చేలా చూస్తుంది. అలాగే కేరళలో వానాకాలంలో స్కూళ్లకు వచ్చిపోయే పేద పిల్లలకు గొడుగులు చాలా అవసరం. అందుకే 'స్కూలు పిల్లలకు కార్తుంబి గొడుగులు' పేరుతో కూడా క్యాంపెయిన్‌లు జరుగుతుంటాయి. సీజన్ మొదట్లో బల్క్‌గా ఈ గొడుగులు కొని పిల్లలు పంచుతుంటారు చాలామంది. ఇప్పుడు ప్రధాని ప్రసంగం వల్ల కేరళలోని ఇతర మహిళలు కూడా ఈ గొడుగుల తయారీ పట్ల ఆసక్తి చూపుతున్నారు. రాబోయే రోజుల్లో వానలొస్తే రంగు రంగుల కార్తుంబి తూనీగలు ప్రతి ఒక్కరి నెత్తిమీద ఎగురుతుంటాయని ఆశిద్దాం.

● టెక్.. టాక్

ఆస్క్ మెటా ఏఐ



రోజురోజుకూ ఏఐ టూల్స్‌కు ప్రాధాన్యత పెరుగుతున్న నేపథ్యంలో పెద్ద సంస్థలు కొత్త ఏఐ టూల్స్‌ను యూజర్‌లకు చేరువచేస్తున్నాయి. వాట్సాప్ 'ఆస్క్ మెటా ఏఐ' అలాంటిదే. వాట్సాప్ చాట్‌మెనూలో మెటా ఐకాన్‌ను క్లిక్ చేస్తే 'ఆస్క్ మెటా ఏఐ ఎనీ థింగ్' అనే పాప్‌అప్ ఓపెన్ అవుతుంది. యూజర్‌ల కోసం కొన్ని టాపిక్‌లు కనిపిస్తాయి. వాటికి సంబంధించిన ప్రశ్నలకు 'ఆస్క్ మెటా ఏఐ' సమాధానం చెబుతుంది. 'ఏఐ'తో చిట్‌చాట్ చేయవచ్చు. 'ఆస్క్ మెటా'కు సంబంధించి యూజర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటుంది వాట్సాప్. మెటా ఏఐ ఇచ్చిన జవాబులను లాంగ్ ప్రెస్ చేస్తే 'గుడ్ రెస్పాన్స్' 'బ్యాడ్ రెస్పాన్స్' అనే ఆప్షన్‌లు కనిపిస్తాయి. వీటి ద్వారా మన అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు.

రియల్‌మీ సి 63



సైజ్	: 6.74 అంగుళాలు
రిజల్యూషన్	: 720×1600 పిక్సెల్స్
ర్యామ్	: 4జీబి
స్టోరేజ్	: 128జీబి
బ్యాటరీ	: 5000 ఎంఏహెచ్
వోఎస్	: ఆండ్రాయిడ్ 14
ఫ్రంట్ కెమెరా	: 50 ఎంపీ
బ్యాటరీ	: 5000 ఎంఏహెచ్
కనెక్టివిటీ	: 5జీ

మెటా ఏఐ ఇన్ఫో



'మేడ్ విత్ ఏఐ' లేబుల్స్‌ను 'ఏఐ ఇన్ఫో'గా అప్‌డేట్ చేసింది మెటా. వైట్‌హౌజ్ ఫొటోగ్రాఫర్ సూజ తీసిన బాస్కెట్‌బాల్ గేమ్ ఫొటోపై 'మేడ్ బై ఏఐ'గా లేబుల్ వేయడం దుమారం రేపింది. ఎడిట్ చేసిన ఒరిజినల్ ఇమేజ్‌లను 'మేడ్ విత్ ఏఐ'గా మార్క్ చేసినందుకు 'ఏఐ ఇమేజ్ లేబుల్స్' ఇటీవల విమర్శలు ఎదుర్కొంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కంపెనీ తన యాప్‌లలో 'ఏఐ ఇమేజ్ లేబుల్స్'ను 'ఏఐ ఇన్ఫో'గా మార్చింది. 'ఏఐ ఇన్ఫో' బ్యాడ్జ్ ద్వారా కంటెంట్ గురించి మరింత సమాచారం తెలుసుకోవచ్చు.

వివో ఎక్స్ 100 అల్ట్రా



డిస్‌ప్లే	: 6.8 అంగుళాలు
వోఎస్	: ఆండ్రాయిడ్ 14
మెమోరీ	: 256జీబి 12జీబి ర్యామ్/ 512జీబి 16జీబి ర్యామ్
రిజల్యూషన్	: 1440×3200 పిక్సెల్స్
రిఫ్రెష్‌రేట్	: 120 హెచ్‌జడ్
బ్యాటరీ	: 5500 ఎంఏహెచ్
కనెక్టివిటీ	: 5జీ

యువర్స్

● సక్సెస్ స్టోరీ
మోటో వ్లాగింగ్

'ప్రయాణం అంటే మరో ప్రపంచంలోకి వెళ్లడం' అంటున్న ముంబైకర్ నిఖిల్(నిఖిల్ శర్మ) సోలో మోటర్‌సైకిల్ ట్రిప్స్‌తో మోటో వ్లాగింగ్ మొదలుపెట్టాడు. కే2కే (కన్యాకుమారి టు కశ్మీర్) యాత్ర చేసి సోషల్ మీడియాలో లక్షలాదిమంది ఫాలోవర్‌లను సంపాదించుకున్నాడు. లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా కంటెంట్ క్రియేట్ చేస్తున్నాడు....

జయహో విజయ విహారి



ముంబైలో హోటల్ మేనేజ్‌మెంట్ చేసిన నిఖిల్‌కు ప్రయాణాలు చేయడం అంటే బోలెడు ఇష్టం. ఎంత ఇష్టం అంటే రోజూ 50 నుంచి 100 కిలోమీటర్‌లు ఎక్కడో ఒకచోటుకి వెళ్లిరావాల్సిందే. అయితే ఒకానొక రోజు మాత్రం... 'ఎప్పుడూ ముంబై మాత్రమేనా....ఔట్ సైడ్ ముంబై కూడా వెళ్లాలి' అనుకున్నాడు.

అలా బైక్‌పై ఆజ్మీర్, బెంగళూరుకు వెళ్లాడు. ఇక అప్పటి నుంచి మొదలైన ఔట్‌సైడ్ ముంబై ప్రయాణాలు ఆగలేదు. ఈ ప్రయాణాల పుణ్యమా అని మన దేశంలోని 'మోటో వ్లాగింగ్' ప్రఖ్యాత యూట్యూబర్‌లలో ఒకరిగా నిఖిల్ శర్మ పేరు తెచ్చుకున్నాడు.

నిఖిల్ ఫ్యాన్ బేస్ విషయానికి వస్తే....

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఫాలోవర్‌ల సంఖ్య లక్షలలో ఉంది. తాను వీడియోలు చేయడం మొదలుపెట్టినప్పుడు మన దేశంలో వ్లాగింగ్‌కు పెద్దగా ప్రాచుర్యం లేదు. డైలీ వ్లాగింగ్ చేయడం ద్వారా ఆడియెన్స్‌తో ఎప్పటికప్పుడూ టచ్‌లో ఉండేవాడు. మన దేశంలో ఏ మూలన ఉన్న ఆడియెన్స్ అయిన నిఖిల్ చెబుతున్న కబుర్లు విని ఊహాల్లోనే తాను ఉన్న చోటుకి వెళ్లేవారు.

వ్లాగింగ్‌కు ఆవలి ప్రపంచంలోకి వెళితే... నిఖిల్‌కు నటన అంటే ఇష్టం. బాలీవుడ్ సినిమాల్లో, టీవీ సీరియల్స్‌లో నటించాడు. ఫ్లైట్ అటెండెంట్‌గా కొంతకాలం ఉద్యోగం కూడా చేశాడు. ఉద్యోగం మానేసినప్పుడు తల్లిదండ్రులు ఆందోళన పడ్డారు. అదే సమయంలో తండ్రి చనిపోవడంతో కుటుంబాన్ని పోషించాల్సిన బాధ్యత తన భుజస్కంధాలపై పడింది. 'వ్లాగింగ్ వద లేయ్. డబ్బు సంపాదనపై దృష్టి పెట్టు' అని కొద్దిమంది సలహా ఇచ్చారు. అయితే ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా తన పాషన్‌కు ఎప్పుడూ దూరం కాలేదు.

ఆ ప్యాషనే తనను ప్రతిష్ఠాత్మకమైన యూట్యూబ్ ఫ్యాన్స్ ఫెస్టివల్‌లో పాల్గొనేలా చేసింది. ఔట్ సైడ్ ముంబై యాత్రలు చేస్తే చాలు అనుకున్న అతడిని అమెరికా, కెనడా, ఇండోనేషియ, సౌత్ కొరియా, జపాన్... మొదలైన దేశాలకు వెళ్లేలా చేసింది. 'ఫోర్బ్స్ 30 అండర్ 30-ఇండియా' జాబితాలో చోటు సంపాదించేలా చేసింది. క్లాతింగ్ బ్రాండ్ లేబుల్ ఎంఎస్‌తో డిజైనర్, ఎంటర్‌ప్రెన్యూర్‌గా నిరూపించుకున్న నిఖిల్... 'ఎన్ని చేసినా వ్లాగింగ్ అనేది నా పాషన్' అంటున్నాడు.

ప్రతిభతో పాటు...

మన పాషన్‌కు ప్రతికూల పరిస్థితులు ఎదురు కావచ్చు. రాజీ పడి వేరే దారి చూసుకోవడం సులభం. రాజీ పడకుండా నచ్చిన దారిలోనే వెళ్లడం కష్టం. అయితే ఆ కష్టం ఎప్పుడూ వృథా పోదు. తప్పకుండా ఫలితం ఇస్తుంది. ప్రతిభతో పాటు ఓపిక కూడా ఉండాలి. తొందరపాటు వల్ల నష్టపోయిన ప్రతిభావంతులు ఎంతో మంది ఉన్నారు.

– నిఖిల్ శర్మ

● యంగ్ టాలెంట్

రాక్ మాయాజాలం



అమెరికాస్ గాట్ టాలెంట్ వేదికపై తన ప్రదర్శనతో ఉర్రూతలూగించిన మాయా నీలకంఠన్‌ను సైమన్ కోవెల్ 'రాక్ దేవత' అని ప్రశంసించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా కూడా ఆమెను ప్రశంసల్లో ముంచెత్తాడు. ముంబైలోని మహీంద్రా బ్లూస్ ఫెస్టివల్‌లో మాయ త్వరలో ప్రదర్శన ఇవ్వనుంది.

రెండేళ్ల వయసు నుంచే సంగీతంతో స్నేహం మొదలు పెట్టింది మాయ. నాన్న గిటార్ వాయించేవాడు. ఆయన ద్వారా ఎన్నో పాటలు నేర్చుకుంది మాయ.

యూట్యూబ్ వీడియోల ద్వారా గిటార్ వాయించడం ఎలాగో తండ్రి నేర్పించాడు. ఆరేళ్ల వయసు నుంచే గిటార్ ప్లే మొదలు పెట్టింది. యాభైమంది ప్రేక్షకులు ఉన్న హాలులో తొలిసారి స్టేజీపై ప్రదర్శన ఇచ్చింది. ఇంటి నాలుగు గోడలకే పరిమితమైన తన ప్రతిభ తొలిసారిగా ప్రేక్షకుల్లోకి వచ్చింది.

ప్రపంచంలోనే నంబర్ వన్ టాలెంట్ షో అమెరికాస్ గాట్ టాలెంట్(ఏజీటీ)లో వెయ్యిమంది ప్రేక్షకుల మధ్య ప్రదర్శన ఇచ్చింది. తాను స్టేజి మీదికి వెళుతున్నప్పుడు ప్రేక్షకులు అరవడంతో మాయ కాస్త భయపడింది.

అయితే మాయ ప్రదర్శన మొదలు కావడంతో ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు.

గిటార్ ప్రసన్న అనే గురువు దగ్గర కర్నాటక సంగీతం నేర్చుకుంది మాయ. 'ఏజీటీ' కోసం రెండు మూడు వారాల పాటు శిక్షణ తీసుకుంది. శిక్షణ సమయంలో ప్రసన్నతో పాటు ఎంతోమంది తనకు సలహాలు ఇచ్చారు.

'ఏజీటీ' వేదికపై మూమెంట్స్‌కు సంబంధించి నెటిఫ్లిక్స్ సిరీస్ 'ఆరేంజ్ ఈజ్ ది న్యూ బ్లాక్'తో అవార్డ్ గెలుచుకున్న జెస్సికా పిమెంటల్ శిక్షణ ఇచ్చింది. షో కోసం మానసికంగా సిద్ధం కావడానికి అవసరమైన సలహాలు ఇచ్చింది. 'విభిన్నమైన జానర్స్‌తో నాదైన సంగీతాన్ని సృష్టించాలనేది నా కల' అంటుంది మాయా నీలకంఠన్.

English Idioms

ఆన్ ఏ టియర్

క్విక్‌గా రైజ్ కావడం. సడన్‌గా యాక్టివ్ కావడం... మొదలైన సందర్భాలలో వాడే మాట... ఆన్ ఏ టియర్.

ఉదా: ది ప్రైస్ ఆఫ్ గోల్డ్ హ్యాజ్ బీన్ ఆన్ ఏ టియర్ రీసెంట్లీ

* * *

గివ్ ఇట్ ఏ వర్ల్

తొలిసారిగా చేసే పని, కొత్తగా ప్రయత్నించడం... మొదలైన సందర్భాల్లో వాడే మాట... గివ్ ఇట్ ఏ వర్ల్.

ఉదా: ఐ హ్యావ్ నెవర్ డ్యాన్స్‌డ్ సల్సా బిఫోర్ బట్ ఐ విల్ గివ్ ఇట్ ఏ వర్ల్

గురి చూసి కొట్టాలి



థర్డ్-పర్సన్ షూటర్ గేమ్ 'ది ఫస్ట్ డిసెన్‌డెంట్' విడుదల అయింది. హైక్వాలిటీ గ్రాఫిక్స్‌తో కూడిన ఈ స్ట్రాటజిక్ గేమ్‌లో యూనిక్ క్యారెక్టర్లు ఉంటాయి. 'ఇన్‌గ్రిస్' కాంటినెంట్‌ను కాపాడడానికి ఆక్రమణదారులకు వ్యతిరేకంగా ప్లేయర్ పోరాడవలసి ఉంటుంది. ఇది మాత్రమే కాదు ప్లేయర్ రకరకాల మిషన్‌లలో పాల్గొనవలసి ఉంటుంది. డిస్టింక్టివ్ కాన్సెప్ట్‌తో వచ్చిన ఈ గేమ్‌లో యూనిక్ స్కిల్ సెట్స్, ఫ్రీ మూమెంట్స్, చైన్ యాక్షన్స్, గ్రాప్లింగ్ హుక్స్, కలర్‌ఫుల్ ఫైర్‌ఆర్మ్స్... మొదలైనవి గేమింగ్ ప్రియులను ఆకట్టుకుంటాయి.

డెవలపర్: నెక్సన్ గేమ్స్ ఇంజిన్: యునైటెడ్ ఇంజిన్ 5
జానర్: థర్డ్-పర్సన్ షూటర్ యాక్షన్ ఆర్‌పీజీ మోడ్: కోఆపరేటివ్ మల్టీప్లేయర్.

సినిమా

మాటలు ఆరంభం



చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' డబ్బింగ్ పనులు షురూ అయ్యాయి. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 సంక్రాంతి సందర్భంగా జనవరి 10న విడుదల కానుంది. అందుకు తగ్గట్టు ఓ వైపు షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టింది చిత్రబృందం. గురువారం మాటల (డబ్బింగ్) పనులను ప్రారంభించారు. ''క్రేజీ సోషియో ఫ్యాంటసీ యాక్షన్ అడ్వెంచరస్ మూవీగా 'విశ్వంభర' రూపొందుతోంది. ఈ చిత్రంలో హనుమాన్ భక్తుడిగా కనిపిస్తారు చిరంజీవి. యాక్షన్ సీక్వెన్స్‌లు అద్భుతంగా ఉంటాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ టైమ్ పడుతుంది. అందుకే ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ పనులను ఏకకాలంలో చేస్తున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, కెమెరా: ఛోటా కె. నాయుడు.

● చిరంజీవి

పెళ్లి చేసుకోను సార్



అమ్మాయిలను వారి పెళ్లి గురించి అడగడం మానుకోండి అంటున్నారు హీరోయిన్ శ్రుతీహాసన్. ఇంతకీ విషయం ఏంటంటే.. వీలైనప్పుడల్లా సోషల్ మీడియా మాధ్యమాల్లో నెటిజన్లతో చాట్ సెషన్ నిర్వహించడం శ్రుతీహాసన్‌కు అలవాటు. ఇటీవల మరోసారి ఈ బ్యూటీ చాట్ సెషన్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా... 'మీరు ఎలాంటి వ్యక్తిని పెళ్లి చేసుకుంటారు?' అని ఓ నెటిజన్ అడిగితే శ్రుతీహాసన్ కాస్త గట్టిగానే బదులిచ్చారు. ''ఇది 2024... అమ్మాయిలను ఇలాంటి ఉపయోగం లేని వెర్రి ప్రశ్నలు అడగడం మానుకోండి'' అంటూ బదులిచ్చారామె. అలాగే 'మీరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు మేడమ్' అని మరో నెటిజన్ శ్రుతీహాసన్‌ను ప్రశ్నించగా... 'ఐ వోన్ట్ సార్' (చేసుకోను సార్) అని బదులిచ్చారు. అంటే... పెళ్లి చేసుకోనని సూటిగా చెప్పేశారు. ఇక సినిమాల విషయానికొస్తే... అడివి శేష్‌తో 'డెకాయిట్' సినిమా చేస్తున్నారు. అలాగే ప్రభాస్‌తో 'సలార్ 2', తమిళంలో 'చెన్నై స్టోరీ' సినిమాలు కూడా శ్రుతి చేతిలో ఉన్నాయి.

● శ్రుతీహాసన్

హింసకు బీమా!



● నాని

సూర్య కోపంగా ఉంటే ఎలా ఉంటాడో చూశాం. కానీ కూల్‌గా ఉంటే ఇలా ఉంటారంటూ చూపిస్తున్నారు 'సరిపోదా శనివారం' సినిమా మేకర్స్. నాని హీరోగా నటిస్తున్న సినిమా ఇది. ఇందులో నాని పాత్ర పేరు సూర్య. గురువారం ఈ సినిమా నుంచి సూర్య సెకండ్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''సండే టు ఫ్రైడే.. వయొలెన్స్‌కి ఇన్సూరెన్స్ (హింసకు బీమా) సూర్య' అంటూ తన సెకండ్ లుక్‌ను ఉద్దేశించి 'ఎక్స్'లో పేర్కొన్నారు నాని. అంటే... మిగతా రోజుల్లో కూల్‌గా ఉండే సూర్య శనివారం శత్రువుల భరతం పడతాడు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ నిర్మిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆగస్టు 29న విడుదల కానున్న 'సరిపోదా శనివారం' సినిమాకు సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: జి. మురళి.

పవర్‌ఫుల్ సూర్య



● సత్యదేవ్

సత్యదేవ్, డాలీ ధనంజయ హీరోలుగా ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన మల్టీస్టారర్ మూవీ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ట్యాగ్‌లైన్. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిక్కినాటో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో నటుడు సత్యరాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఎస్ఎన్ రెడ్డి, ఎస్. పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించారు. గురువారం (జూలై 4) సత్యదేవ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ''క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'జీబ్రా'. ఈ సినిమాలో సత్యదేవ్ చేసిన సూర్య పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. సునీల్, సత్య ఆకల కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: సత్య పొన్మార్.

అరిషడ్వర్గాల అరి



● అనసూయ

అనసూయ భరద్వాజ్, సాయికుమార్, వినోద్ వర్మ, సూర్య పురిమెట్ల, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. మై నేమ్ ఈజ్ నో బడీ అనేది ఉపశీర్షిక. 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్‌వీ రెడ్డి సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, శేషు మారంరెడ్డి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ''ప్రస్తుతం మైథాలజీ సక్సెస్‌ఫుల్ ట్రెండ్‌గా మారింది. పురాణాలు, ఇతిహాసాలు, దైవిక అంశాలతో కూడిన సినిమాలు బ్లాక్ బస్టర్ అవుతున్నాయి. మా 'అరి' అరిషడ్వర్గాలు, శ్రీకృష్ణుడి గొప్పతనం వంటి అంశాలతో రూపొందింది. అరిషడ్వర్గాల కాన్సెప్ట్‌తో నిర్మించిన మా సినిమాపై అందరిలో ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమా కథ నచ్చడంతో అభిషేక్ బచ్చన్ హిందీలో రీమేక్ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు'' అన్నారు మేకర్స్.

నా లైఫ్‌ని మార్చేసింది!



● సుహాస్, సంగీర్తనా విపిన్

'ఆ ఒక్క డెసిషన్ నా లైఫ్‌ని మార్చేసింది' అంటూ మొదలవుతుంది 'జనక అయితే గనక' సినిమా టీజర్. సుహాస్ హీరోగా నటిస్తున్న సినిమా ఇది. సంగీర్తనా విపిన్, రాజేంద్రప్రసాద్, గోపరాజు రమణ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. రాజేంద్రప్రసాద్, 'వెన్నెల' కిశోర్ కీలక పాత్రల్లో నటించారు. సందీప్ బండ్ల దర్శకత్వంలో శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ను హీరో ప్రభాస్ విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ''నేను ఒకవేళ తండ్రినైతే నా పెళ్లాన్ని సిటీలోని బెస్ట్ హాస్పిటల్‌లో చూపించాలి. నా పిల్లల్ని బెస్ట్ స్కూల్‌లో చదివించాలి. బెస్ట్ కాలేజీలో చదివించాలి. వాళ్లకు బెస్ట్ లైఫ్ ఇవ్వాలి. బెస్ట్ ఇవ్వలేనప్పుడు పిల్లల్ని కనకూడదు'' అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి.

స్వీయ రక్షణ నేర్చుకోవాలి



● మాల్వీ మల్హోత్రా

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా నటించిన చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో హీరోయిన్ మాల్వీ మల్హోత్రా మాట్లాడుతూ– ''స్వస్థలం హిమాచల్ ప్రదేశ్. స్టడీస్ కోసం ముంబై వెళ్లి, థియేటర్ ఆర్ట్స్‌లో చేరాను. తెలుగులో నేను నటించిన తొలి సినిమా 'తిరగబడర సామీ'. ఈ సినిమాలో నా క్యారెక్టర్ ఆసక్తికరంగా ఉంటుంది. అమ్మాయిలు సెల్ఫ్ డిఫెన్స్ నేర్చుకోవాలని నా క్యారెక్టర్ చెబుతుంది. నేను రియల్ లైఫ్‌లో ఎమ్ఎమ్ఏ (మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్) నేర్చుకున్నాను. అందుకే ఈ సినిమాలో నా పాత్రకు ఉన్న యాక్షన్ సీక్వెన్స్‌ని ఈజీగా చేశాను. రాజ్ తరుణ్‌గారి పాత్ర సైలెంట్‌గా మొదలై వైలెంట్‌గా మారుతుంది. ఎందుకు అనేది సినిమాలో చూడాలి. లవ్, యాక్షన్, రొమాన్స్, ఎమోషన్... ఇలా అన్ని అంశాలు మిళితమైన 'తిరగబడరా సామీ' సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''తమిళ, మలయాళ భాషల్లో కూడా సినిమాలు చేశాను. 'ఆర్ఆర్ఆర్' తర్వాత తెలుగు పరిశ్రమ గురించి అంతర్జాతీయ స్థాయిలో మాట్లాడుకుంటున్నారు. ఇప్పుడు తెలుగులో నేనూ భాగమైనందుకు హ్యాపీగా ఉంది. రాజమౌళిగారి సినిమాలో నటించాలన్నది నా కల. అలాగే మణిరత్నం గారన్నా చాలా అభిమానం. హీరోల్లో మహేశ్‌బాబు, నాని, అడివి శేష్‌గార్లంటే ఇష్టం. నా తర్వాతి సినిమాల గురించి చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

గీతా ఆర్ట్స్‌లో...



● నిహారిక

కంటెంట్ క్రియేటర్‌గా సోషల్ మీడియాలో ఫేమస్ అయిన నిహారిక ఎన్ఎం గీతా ఆర్ట్స్ సంస్థ నిర్మించనున్న సినిమాతో తెలుగు పరిశ్రమలోకి హీరోయిన్‌గా అడుగుపెడుతున్నారు. గురువారం ఆమె పుట్టినరోజు (జూలై 4) సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించింది గీతా ఆర్ట్స్ సంస్థ. చెన్నైలో పుట్టిన నిహారిక బెంగళూరులో పెరిగారు. కాలిఫోర్నియాలోని చాప్‌మాన్ యూనివర్సిటీలో ఎంబీఏ చేశారు. థియేటర్ ఆర్ట్స్‌పై ఆసక్తి ఉన్న నిహారిక తన పదో తరగతిలో యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కెరీర్ ఆరంభించి, సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ క్వీన్‌గా పేరు తెచ్చుకున్నారు. ఇటీవల యూట్యూబ్ ఆధ్వర్యంలో జరిగిన 'క్రియేటర్స్ ఫర్ ఛేంజ్' కార్యక్రమంలో ఇండియా నుంచి వరుసగా రెండోసారి రిప్రజెంట్ చేశారామె.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
	63	16
	80,050	24,302

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు బుధవారం ముగింపు)

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	18,188	▲ 159
డోజోన్స్	39,308	▽ 24
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,228	▲ 57
డాక్స్	18,428	▲ 54
షాంఘై	2,953	▽ 25
నికాయ్	40,914	▲ 333

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	72,469	▲ 243
బంగారం (99.5 స్వచ్ఛత)	72,179	▲ 242
వెండి (కిలో)	90,018	▲ 320

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.13	84.15
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.83	107.38
€	యూరో	ఎస్‌బీఐ	88.69	91.04
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.29	52.41
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.88	56.82
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.83	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.44



లీజు కారు.. యమా జోరు!

వాహనాల సబ్‌స్క్రిప్షన్‌కు డిమాండ్

- జెన్–జడ్ యూజర్ల మొగ్గు
- 4 ఏళ్లలో మార్కెట్ 30% వృద్ధి
- సర్వీసులు అందిస్తున్న మారుతీ, టాటా మోటార్స్, మహీంద్రా తదితర సంస్థలు

కారు కొనుగోలు వ్యయాలు పెరిగిపోతుండటంతో కొనుక్కోవడం కన్నా కొన్నాళ్ల పాటు అద్దెకు తీసుకుంటే మంచిదనే ధోరణి క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా కొత్త తరం యూజర్లు (జెన్–జడ్), మధ్యతరగతి వారు ఈ విధానం వైపు మొగ్గు చూపుతున్నారు. దీనితో, ప్రస్తుతం బేస్ కాస్త తక్కువగానే ఉన్నప్పటికీ వచ్చే 3–4 ఏళ్లలో దేశీయంగా సబ్‌స్క్రిప్షన్ మార్కెట్ 20–30% మేర పెరగవచ్చని పరిశ్రమ అంచనా వేస్తోంది. పెరుగుతున్న మధ్య తరగతి వర్గాల ఆదాయాలు, పట్టణీకరణ, ఫైనాన్సింగ్ ఆప్షన్లు, జెన్–జడ్ తరం కొనుగోలు దార్లు ఇందుకు ఊతంగా ఉండవచ్చని భావిస్తోంది. 2030 నాటికి దేశ జనాభాలో మధ్య తరగతి వర్గం ప్రజలు 45% ఉంటారని అంచనా.

మారుతీకి 10వేల మంది వినియోగదారులు..

మారుతీ సుజుకీ ఇండియా, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి దిగ్గజాలు తమ వాహనాలకు సబ్‌స్క్రిప్షన్ మోడల్స్‌ను అందిస్తున్నాయి. 2020లో ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన మారుతీ సుజుకీ వాహనాలకు 10,000 మంది పైచిలుకు వినియోగదారులు ఉన్నారు. పెద్దగా బాదరబందీకి ఇష్టపడని యువ వినియోగదార్లే, తమ యూజర్లలో ఎక్కువగా ఉంటున్నారని మారుతీ వర్గాలు తెలిపాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగం 36% వృద్ధి నమోదు చేసిందని పేర్కొన్నాయి. మొత్తం అమ్మకాల్లో 53% వాటా బ్రెజా, బాలెనో, గ్రాండ్ విటారా, ఎర్టిగా వంటి మోడల్స్‌ది ఉంటోందని వివరించాయి. ఇటీవలే ప్రవేశపెట్టిన ఫోర్త్ జనరేషన్ స్విఫ్ట్‌కి కూడా కస్టమర్ల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని కంపెనీ వర్గాలు తెలిపాయి. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ నిర్వహించిన అంతర్జాతీయ అధ్యయనంలో 18–34 ఏళ్ల యూజర్లలో 67% మంది సబ్‌స్క్రిప్షన్ విధానం వైపు మొగ్గు చూపారు. అనిశ్చితి వల్ల ఆర్థిక పరిస్థితులు ఆందోళనకరంగా మారుతుండటంతో యువ యూజర్లు కారు కొనడం కంటే, వీలైతే సబ్‌స్క్రిప్షన్‌ను ఇష్టపడుతున్నట్లు సర్వేలో వెల్లడైంది.

మోడల్ ఇలా ..

వాహన సబ్‌స్క్రిప్షన్ విధానంలో కారును పూర్తి రేటు పెట్టి కొనుక్కోవాల్సిన అవసరం లేకుండా కొన్నాళ్ల పాటు తీసుకునేందుకు వీలుంటుంది. 1–4 ఏళ్ల పాటు సబ్‌స్క్రయిబ్ చేసుకోవాలి. నెలకు ఇంతని అద్దె చెల్లించాలి. వాహన ఖరీదు, మెయింటెనెన్స్, బీమా, రోడ్ సైడ్ అసిస్టెన్స్ మొదలైనవి ఇందులోకి వస్తాయి. సాధారణంగా కారు కొనుక్కోవాలంటే ముందస్తుగా డౌన్‌పేమెంట్లు, రిజిస్ట్రేషన్, రోడ్ ట్యాక్స్‌లు మొదలైనవి చెల్లించాల్సినవి చాలానే ఉంటాయి. దానితో పోలిస్తే సబ్‌స్క్రిప్షన్ మోడల్‌లో తక్కువ ముందస్తు వ్యయాలు, నెలవారీగా కొంత మొత్తం కడితే చాలు.. కావాల్సినన్నాళ్లు వాహనాన్ని ఉపయోగించుకుని, తర్వాత కావాలంటే వేరే దానికి మారే వీలుండటం ఆకర్షణీయాంశం!!

– సాక్షి, బిజినెస్ డెస్క్

మార్కెట్ల పరుగు... తస్మాత్ జాగ్రత్త!

- సెబీ, శాట్‌లకు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన
- మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌ల ఏర్పాటు అవసరమని ఉద్ఘాటన

ముంబై: ఈక్విటీ మార్కెట్ల గణనీయమైన పెరుగుదల నేపథ్యంలో భారత్ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ రెగ్యులేటర్–సెబీ, సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు (శాట్) కీలక సూచనలు చేశారు. ఈ విషయంలో ముందస్తు జాగ్రత్త అవసరమన్నారు. ఎటువంటి సవాలునైనా సత్వరం పరిష్కరించడానికి, వ్యవస్థ పటిష్టంగా ఉండడానికి మరిన్ని ట్రిబ్యునల్ బెంచ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. శాట్ కొత్త ప్రాంగణాన్ని ఇక్కడ ప్రారంభించిన ప్రధాన న్యాయమూర్తి ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్లలో అధిక మొత్తంలో లావాదేవీలు, అలాగే కొత్త నిబంధనల కారణంగా శాట్‌పై అధిక పనిభారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో శాట్ కొత్త బెంచ్‌లను ఏర్పాటు చేసే అంశాన్ని అధికారులు పరిశీలించాలన్నారు.

- బీఎస్‌ఈ సెన్సెక్స్ 80,000 పాయింట్ల మైలురాయిని దాటడం ఒక ఆనందకరమైన క్షణం అంటూ వచ్చిన వార్తాపత్రికల కథనాలను ప్రస్తావిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవ్వరూ నష్టపోని వ్యవస్థల ఏర్పాటు, పటిష్టతలపై రెగ్యులేటరీ అధికారుల దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఇలాంటి సంఘటనలు ఉద్ఘాటిస్తున్నాయని తెలిపారు.
- 'మీరు స్టాక్ మార్కెట్‌లో ఉప్పెనను ఎంత విజయవంతంగా చూస్తారో... అంతే … స్థాయిలో జాగ్రత్తలు పాటించే విషయంలో సెబీ, శాట్‌లకు ఎక్కువ పాత్ర ఉంటుందని నేను విశ్వసిస్తునాను. మార్కెట్ భారీ పెరుగుదల సమయాల్లోనే వ్యవస్థ స్థిరంగా ఉండేలా చూసుకోవాలి' చీఫ్ జస్టిస్ పేర్కొన్నారు.
- స్థిరమైన–ఊహాజనిత పెట్టుబడి వాతావరణాన్ని మెరుగుపరచడంలో, పరిరక్షించడంలో సెబీ, శాట్ వంటి అప్పీలేట్ ఫోరమ్‌ల ప్రాముఖ్యత ఎంతో ఉంటుందన్నారు. దీనిని కీలక జాతీయ ప్రాముఖ్యతగల అంశంగా పేర్కొన్న ఆయన, ఇది దేశ ఆర్థిక వృద్ధిలో ఎంతో కీలకమైన అంశంగా వివరించారు.

6,700 అప్పీళ్ల పరిష్కారం

శాట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ జస్టిస్ పీఎస్ దినేష్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ శాట్‌లో ప్రస్తుతం 1,028 పెండింగ్ అప్పీళ్లు ఉన్నాయని, 1997లో మొదలైనప్పటి నుండి 6,700 అప్పీళ్లను పరిష్కరించామని తెలిపారు.



ముంబైలో శాట్ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్

శాట్ కొత్త వెబ్‌సైట్ ప్రారంభం..

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రూపొందించిన శాట్ కొత్త వెబ్‌సైట్‌ను భారత్ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఈ కార్యక్రమంలో ప్రారంభించారు. సాంకేతికత సమస్యపై తగిన శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించారు. డిజిటల్ రంగం పురోగతి నేపథ్యంలో న్యాయం పొందడానికి సంబంధించిన భావనకు కొత్త రూపును ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

అన్విత గ్రూప్ 2,000 కోట్ల ప్రాజెక్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ సంస్థ అన్విత గ్రూప్ రూ.2,000 కోట్ల భారీ ప్రాజెక్టు చేపట్టింది. హైదరాబాద్ సమీపంలోని కొల్లూరు వద్ద ఇవానా పేరుతో గృహ నిర్మాణ ప్రాజెక్టును నెలకొల్పుతోంది. 12.9 ఎకరాల్లో రెండు దశల్లో 1,850 ఫ్లాట్లు రానున్నాయి. మొదటి దశలో 15 అంతస్తుల్లో 2 టవర్లలో 450 ఫ్లాట్ల నిర్మాణం పూర్తి కావస్తోంది. వీటిని ఈ ఏడాది చివరికల్లా కస్టమర్లకు అప్పగిస్తారు. రెండవ దశలో 36 అంతస్తుల్లో 4 టవర్లను నిర్మించనుంది. ఇందులో భాగంగా 1,400 ఫ్లాట్లను 2027లో వినియోగదార్లకు అందజేస్తామని అన్విత గ్రూప్ సీఎండీ అచ్యుతరావు బొప్పన గురువారమిక్కడ మీడియాకు తెలిపారు. 36 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇవానా ఉంటుందని కంపెనీ డైరెక్టర్ అనూప్ బొప్పన చెప్పారు. భారత్‌లో 6, అమెరికాలో 3 స్థిరాస్తి ప్రాజెక్టులను గ్రూప్ చేపట్టింది.




అన్విత గ్రూప్ సీఎండీ అచ్యుతరావు బొప్పన

భారత్‌లో మెటా థ్రెడ్స్ జోరు

అంతర్జాతీయంగా 17.5 కోట్ల యాక్టివ్ యూజర్లు

న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్ (ఇప్పుడు ఎక్స్)కు పోటీగా ఏడాది క్రితం ప్రవేశపెట్టిన థ్రెడ్స్ యాప్‌కి గణనీయంగా ఆదరణ లభిస్తోందని సోషల్ మీడియా దిగ్గజం మెటా తెలిపింది. అంతర్జాతీయంగా నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య 17.5 కోట్లుగా ఉందని పేర్కొంది. క్రియాశీలక వినియోగదారులు అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ కూడా ఒకటని మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌లో ఎక్కువగా సినిమాలు, టీవీ, ఓటీటీ, సెలబ్రిటీలు, స్పోర్ట్స్‌కి సంబంధించిన కంటెంట్ ఉంటోందని మెటా వివరించింది. క్రికెట్‌లో రిషభ్ పంత్, రవీంద్ర జడేజా, ఆకాశ్ చోప్రా మొదలైన వారు క్రియాశీలకంగా ఉంటున్నారని పేర్కొంది. టీ20 క్రికెట్ వరల్డ్ కప్, ఐపీఎల్, ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ 2024 మొదలైనవి హాట్ టాపిక్‌లుగా నిల్చాయని, 200 మంది పైచిలుకు క్రియేటర్లు ఇటీవల ముగిసిన ఐపీఎల్ సీజన్‌పై అప్‌డేట్స్ ఇచ్చారని వివరించింది. 2023 జూలైలో ప్రవేశపెట్టిన వారం రోజులకే 10 కోట్లకు పైగా యూజర్ సైనప్‌లతో థ్రెడ్స్ ఒక్కసారిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. అయితే, క్రమంగా దానిపై యూజర్ల ఆసక్తి తగ్గుతూ వస్తోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.



80,000 పైన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు గురువారమూ ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త రికార్డులు నమోదు చేశాయి. అయితే జీవితకాల గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు లాభాలు స్వీకరించడంతో స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం సెన్సెక్స్ 80,322 వద్ద మొదలైంది. ఐటీ, ఫార్మా, బ్యాంకులు, టెలికం షేర్లు రాణించడంతో ట్రేడింగ్‌లో 406 పాయింట్లు పెరిగి 80,393 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 63 పాయింట్లు పెరిగి 80,050 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 115 పెరిగి 24,401 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. ఆఖరికి 16 పాయింట్ల లాభంతో 24,302 వద్ద నిలిచింది. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి.

కన్జూమర్ డ్యూరబుల్స్, ఎఫ్‌ఎంసీజీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్‌అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఆసియాలో చైనా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు సానుకూలంగా ముగిశాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి. స్వాతంత్య్ర దినోత్సవ సందర్భంగా గురువారం అమెరికా మార్కెట్లు పనిచేయలేదు.

- ప్రమోటర్ ఐనాక్స్ విండ్ ఎనర్జీ రూ.900 కోట్ల పెట్టుబడులు పెట్టడంతో ఐనాక్స్ విండ్ షేరు 10% పెరిగి రూ.157 వద్ద ముగిసింది. అలాగే ఐనాక్స్ విండ్ ఎనర్జీ 5% షేరు ఎగసి రూ.7562 వద్ద అప్పర్ సర్క్యూట్ తాకింది.
- అధిక వెయిటేజీ గల ఐసీఐసీఐ బ్యాంకు 2.65%, టీసీఎస్ 1.50%, ఇన్ఫోసిస్ 1.30%, కోటక్ బ్యాంక్, ఎంఅండ్‌ఎం, ఏషియన్ పేయింట్స్ ఒకశాతం చొప్పున రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి.

447 లక్షల కోట్లు

రికార్డుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదైన కంపెనీల మొత్తం విలువ, జీవితకాల గరిష్టం రూ.447 లక్షల కోట్లకు చేరింది.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా...

- నేడు దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టి20 మ్యాచ్
- రాత్రి 7 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



చెన్నై: ఇప్పటికే వన్డే సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసి... ఏకైక టెస్టులో ఘనవిజయం సాధించి... జోరు మీదున్న భారత మహిళల క్రికెట్ జట్టు టి20 సిరీస్‌నూ దక్కించుకోవాలనే లక్ష్యంతో ఉంది. దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా ఇరు జట్ల మధ్య నేడు తొలి మ్యాచ్ జరుగుతుంది. బలాబలాలను పరిశీలిస్తే దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌లోనూ భారత్‌దే పైచేయి ఉండటం ఖాయమనిపిస్తోంది. వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలు, ఒక అర్ధ సెంచరీతో అదరగొట్టిన స్మృతి మంధాన... ఏకైక టెస్టులో డబుల్ సెంచరీతో మెరిసిన షఫాలీ వర్మ అదే జోరును టి20 సిరీస్‌లోనూ కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదు. బౌలింగ్ విభాగంలో పేసర్లు రేణుక సింగ్, అరుంధతి రెడ్డి... స్పిన్నర్లు ఆశా శోభన, శ్రేయాంక పాటిల్ కీలకం కానున్నారు. దక్షిణాఫ్రికా అవకాశాలన్నీ కెప్టెన్ లౌరా వోల్వార్ట్, మరిజన్ కాప్, సునె లుస్ ఆటతీరుపై ఆధారపడి ఉన్నాయి.

మూడో రౌండ్‌లో జొకోవిచ్



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మాజీ చాంపియన్ జొకోవిచ్ (సెర్బియా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 6-3, 6-4, 5-7, 7-5తో జేకబ్ ఫెర్న్‌లె (బ్రిటన్)పై గెలుపొందాడు. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) 3 గంటల 42 నిమిషాల్లో 7-6 (7/3), 7-6 (7/4), 2-6, 7-6 (7/4)తో బెరెటిని (ఇటలీ)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ఐదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 4-6, 7-6 (9/7), 1-6తో జిన్‌యు వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా); యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీలు తొలి రౌండ్‌లో నెగ్గి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాయి.

సంద్రం.. జనసంద్రం

పొట్టి ఫార్మాట్‌లో 17 ఏళ్ల క్రితం ఆరంభించిన తొలి టి20 ప్రపంచకప్‌ను ధోని బృందం గెలుచుకొచ్చింది. దేశమంతా వరల్డ్‌కప్ విజయంతో పెద్ద పండగే చేసుకుంది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత రోహిత్ శర్మ జట్టు రెండో టి20 ప్రపంచకప్‌ను తెచ్చి పెట్టింది. మరి అ'ద్వితీయ' చాంపియన్‌షిప్ సంబరాలు మామూలుగా ఉండవుగా! ఢిల్లీలో ప్రత్యేక విమానం ల్యాండ్ అవగానే గ్రాండ్‌గా మొదలైన సంబరాలు సాయంత్రం ముంబైలో మెరైన్‌డ్రైవ్‌ను ముంచెత్తాయి. రాత్రయ్యేసరికి వాంఖెడేలో ఆటగాళ్లకు రూ. 125 కోట్ల నజరానా, ఘన సన్మానంతో కనులవిందుగా ముగిసింది.



జగజ్జేతలకు ఘనస్వాగతం



- ఢిల్లీలో ఉదయం ప్రధానితో భేటీ
- ముంబైలో సాయంత్రం కనులవిందు
- టీమిండియాకు రూ. 125 కోట్లు నజరానా అందించిన బీసీసీఐ

న్యూఢిల్లీ/ముంబై: గత శనివారం టీమిండియా టి20 ప్రపంచకప్ గెలిచింది. యావత్ భారతం చిందేసింది. 17 ఏళ్ల తర్వాత మరోసారి ప్రపంచకప్ గెలవడం... ఆ కప్ రాక ఆలస్యం కావడంతో దాని కోసం ఇన్నాళ్లు వేచి చూసిన అభిమానగణం రాగానే ఊరుకుంటారా? 'పూనకాలు లోడింగ్' అని హోరెత్తించరు! అవును సరిగ్గా అదే చేశారు. అడుగడుగునా అ'ద్వితీయ' ప్రపంచకప్‌నకు అపూర్వ స్వాగతం పలికారు. వేల సంఖ్యలో వచ్చిన అభిమానుల్లో కొందరు 'త్రివర్ణ' పతాకాలతో... మరికొందరు 'కంగ్రాట్స్' ప్లకార్డులతో ఆటగాళ్లను అభినందిస్తూ తెగ సందడి చేశారు. క్రికెట్‌కు మతమైన భారత్‌లో అభిమానులు కప్‌నకు, కప్ కార్యసాధకులకు అడుగడుగునా నీరాజనం పలికారు. ఉదయం ఢిల్లీలో ఆగమనంతో మొదలైనపుడు ఎంతటి జోష్ కనబడిందో... ముంబైలో ఘన సన్మానం పూర్తయ్యేసరికి రాత్రిదాకా అభిమానోత్సాహం అలాగే కొనసాగడం విశేషం!

అభిమాన ప్రవాహం

ప్రత్యేక విమానంలో 16 గంటల పాటు ఏకబిగిన 14 వేల కిలోమీటర్ల ప్రయాణం బహుశా ఇదే మొదటిసారేమో! ఎందుకంటే 14,000 వేల కి.మీ. అంటే సగం ప్రపంచాన్ని చుట్టేసే దూరమన్న మాట! ఇంత ప్రయాణ బడలిక ఎవరికైనా అసౌకర్యంగానే ఉంటుంది. వెంటనే తనువు–మనసు విశ్రాంతి కోరుతుంది. కానీ అభిమాన ప్రవాహం ముందు ఆటగాళ్లలో ఎలాంటి అలసటే కనిపించలేదు.

కిక్కిరిసిన మెరైన్ డ్రైవ్

ముంబై ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక బస్‌లో బయలుదేరిన భారత క్రికెటర్లు నారీమన్ పాయింట్‌కు రాగానే ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ఓపెన్ టాప్ బస్‌లో ఎక్కారు. మెరైన్ డ్రైవ్ తీరం వెంట సాగరం (అరేబియా సముద్రం) పక్కన సాగరం (ప్రేక్షకులతో) కనిపించింది. వానచినుకులు పడుతున్నా ఇసుకేస్తే రాలనంత జనం ఎక్కడికీ కదల్లేదు. తమ దేశానికి కప్ సాధించిపెట్టిన క్రికెటర్ల అభివాదాల కోసం వాళ్లంతా వేయి కళ్లతో ఎదురు చూశారు తప్ప వెనక్కి తగ్గలేదు. ఓపెన్ టాప్ బస్‌లో ప్రపంచకప్‌తో ఉన్న ఆటగాళ్లను క్రికెట్ వీరాభిమానులంతా తమతమ ఫోన్ కెమెరాల్లో అదేపనిగా బంధించే పనిలో పడ్డారు. దారిపొడవునా సాగిన ఈ విజయోత్సవ ర్యాలీ మెరైన్ డ్రైవ్‌కే కొత్త శోభ తెచ్చిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అక్కడే సమీపంలో ఉన్న వాంఖెడే స్టేడియంలో సీట్ల సామర్థ్యానికి సరిపడా అభిమానుల్ని అనుమతించగా, ప్రత్యేకంగా నీలిరంగులో ఏర్పాటు వేదికపై తెలుపు రంగులో 'చాంపియన్స్' అక్షరాలు ప్రముఖంగా కనిపించేలా తీర్చిదిద్దారు. కోహ్లి, రోహిత్, హార్దిక్ ఇతర సభ్యులందరూ డాన్స్ చేసి ప్రేక్షకులను అలరించారు. ఇక ఆలస్యం చేయకుండా ప్రకటించిన నజరానాను ఒక్కొక్కరిగా కాకుండా టీమ్ సాధించిన విజయానికి సూచికగా రూ. 125 కోట్ల చెక్‌ను ఆటగాళ్లకు అందజేసి ఘనంగా సన్మానించారు. ఇక నిష్క్రమించే సమయంలో టీమిండియా ఆటగాళ్లంతా టెన్నిస్ బంతులపై ఆటోగ్రాఫ్ చేసి ప్రేక్షకుల గ్యాలరీ దిశగా కొట్టారు.

జగజ్జేతలకు మోదీ జేజేలు

కరీబియన్ గడ్డపై టి20 ప్రపంచకప్ సాధించిన భారత క్రికెటర్లకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆత్మీయ ఆతిథ్యమిచ్చారు. ఉదయం అల్పాహార విందు ఇచ్చిన ప్రధాని ప్రతి ఒక్క క్రికెటర్ కప్ కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు. కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ ద్రవిడ్ ఇద్దరు కలిసి మోదీ చేతిలో ప్రపంచకప్‌ను పెట్టారు. ఇరువైపులా జట్టు సభ్యులంతా నిల్చొని ఫొటోకు ఫోజిచ్చారు. 'చాంపియన్స్‌తో జరిగిన ఈ మీటింగ్ చాలా అద్భుతంగా గడిచింది. వారికి ఇచ్చిన ఆతిథ్యం ఎంతో ఆనందాన్ని పంచింది. కప్ వేటలో వాళ్లు పడిన పాట్లు, చేసిన పోరాటాలు. మొత్తం టోర్నీ జర్నీపై వారు నాతో పంచుకున్న అనుభవాలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నా మదిలో పదిలంగా ఉంటాయి' అని మోదీ 'ఎక్స్'లో ఫొటోలను జతచేసి ట్వీట్ చేశారు. క్రికెటర్లతో పాటు ప్రధానిని కలిసిన బోర్డు అధ్యక్ష కార్యదర్శులు రోజర్ బిన్నీ, జై షా ఈ సందర్భంగా మోదీకి 'నమో' పేరిట నం.1 జెర్సీని అందజేశారు.





"ఇంతటి జనసందోహం చూస్తుంటే మాలాగే ఈ ప్రపంచకప్ కోసం వాళ్లు ఎంతగా ఆరాటపడ్డారో... టీమిండియా గెలవాలని ఎంత బలంగా కోరుకున్నారో అర్థమవుతోంది.
–కెప్టెన్ రోహిత్ శర్మ

కిక్కిరిసిన రోడ్లపై ఈ రాత్రి మీరు కురిపించిన ప్రేమాభిమానాల్ని ఇకపై మిస్ అవుతాను. ఈ అనిర్వచనీయ ఆనందాన్ని నేనెప్పటికీ మరచిపోను.
–కోచ్ రాహుల్ ద్రవిడ్

2011లో వన్డే ప్రపంచకప్ నెగ్గినపుడు సీనియర్లు వెలిబుచ్చిన భావోద్వేగాలకు, కన్నీళ్లకు నేను చలించలేదు. కానీ ఇప్పుడు అవే... నన్ను నేను అదుపు చేసుకోలేనంతగా బయటికి వస్తున్నాయి.
–విరాట్ కోహ్లి




తొక్కిసలాటలో ఇలా రక్షించుకోవాలి

వీడియో షేర్ చేసిన ఐపీఎస్ స్వాతి లక్రా




సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లోని హత్రస్‌లో భోలే బాబా సత్సంగ్ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటపై దేశవ్యాప్త చర్చ నేపథ్యంలో ఐపీఎస్ అధికారి స్వాతిలక్రా తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. తొక్కిసలాట జరిగితే ఎలా తప్పించుకోవాలన్న అంశాలను నిపుణులు వివరిస్తున్న ఓ వీడియోను స్వాతిలక్రా నెటిజన్లతో పంచుకున్నారు. కిందపడిపోకుండా ఎలా నిలువరించుకోవాలో అందులో ఓ నిపుణుడు చూపించారు. రద్దీ ఎక్కువగా ఉండి కింద పడిపోయినప్పటికీ ఎలాంటి భంగిమలో ఉంటే.. తమను తాము రక్షించుకోవచ్చన్నది ఆ వీడియోలో చూపారు. ఈ వీడియోను స్వాతిలక్రా షేర్ చేసిన ఐదు గంటల్లోనే 55 వేల మంది వీక్షించారు.



మెక్సికో సిటీలో బుల్‌ఫైట్‌కి జనం భారీగా హాజరయ్యారు. ఎంతమంది వచ్చారో తెలియాలంటే.. ఇదిగో ఇలాంటి డ్రోన్ ఫొటోలే దిక్కు. ఈ చిత్రాన్ని రోబర్టో హెర్నాండెజ్ తీశారు. ఫొటో సూపర్‌గా ఉంది కదూ..

ప్రపంచంలోకెల్లా అత్యధిక మంది టూరిస్టులు సందర్శించే దేశాల్లో యూరోపియన్ దేశం ఫ్రాన్స్ అగ్రస్థానంలో నిలిచింది. ప్రముఖ గణాంక సేకరణ, విశ్లేషణ సంస్థ స్టాటిస్టా లెక్కల ప్రకారం 2023లో ఆ దేశాన్ని ఏకంగా 7.24 కోట్ల మంది సందర్శించారు. అందమైన బీచ్‌లు, ఆహ్లాదకరమైన వాతావరణం మొదలు ఆల్ప్స్ పర్వతాల్లో స్కీయింగ్, ప్రపంచ ప్రఖ్యాత క్యూజిన్ దాకా ఎన్నో విశేషాలు ఉన్నందున పర్యాటకులు ఎక్కువగా ఫ్రాన్స్ బాటపడుతున్నారు.



ఏఐ.. ఏం పర్వాలేదు!

కృత్రిమ మేధ ప్రభావాన్ని పెద్దగా పట్టించుకోని సగానికి పైగా భారతీయులు

తమ ఉద్యోగాలు, అవకాశాలకు అంతగా నష్టం వాటిల్లదంటున్న 54% మంది

- ఇతర దేశాలతో పోలిస్తే భారత ఉద్యోగుల్లోనే ఎక్కువ ధీమా
- ఏఐ, జనరేటివ్ ఏఐ రెండూ తమ ఉద్యోగాల్లో భారీ మార్పులకు దారితీస్తాయన్న 88% మంది
- తగిన శిక్షణ పొందామంటున్న 53% ఫ్రంట్‌లైన్ ఉద్యోగులు, 47% మేనేజర్లు.. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ అధ్యయనంలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాబోయే రోజుల్లో తమ ఉద్యోగాలు, తదుపరి అవకాశాలపై కృత్రిమ మేధ (ఏఐ) చూపే ప్రభావంపై మనోళ్లు అంతగా ఆందోళన చెందడం లేదట. తాము ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలపై ఏఐ, జనరేటివ్ ఏఐ పెద్దగా ప్రభావం చూపవని 54 శాతం మంది భారతీయ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఇతర దేశాల్లో మాత్రం ఈ తరహా ధీమా కాస్త తక్కువగా ఉండటం గమనార్హం. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే 42% మంది మాత్రమే తమ ఉద్యోగాలపై ఏఐ ప్రభావం అంతగా ఉండదని భావిస్తున్నారు. వాస్తవానికి ఏఐతో పడబోయే ప్రభావంపై ఆందోళన అనేది ప్రపంచ వ్యాప్తంగా ఐదు శాతం పెరిగినట్టు బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) 'ఏఐ ఎట్ వర్క్ : ఫ్రెండ్ అండ్ ఫో–2024'పేరిట విడుదల చేసిన తాజా నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా 15 దేశాల్లోని వివిధ ప్రాంతాల్లో 13 వేల మందికి పైగా ఉద్యోగుల నుంచి బీసీజీకి చెందిన టెక్ బిల్డ్ అండ్ డిజైన్ యూనిట్.. బీసీజీ ఎక్స్ అభిప్రాయాలు సేకరించింది. తమ అధ్యయనం ఆధారంగా ఒక రిపోర్ట్‌ను రూపొందించింది. నివేదికలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

భారీ మార్పులు ఖాయం!

- తమ ఉద్యోగాల్లో ఏఐ, జనరేటివ్ ఏఐ రెండూ తమ ఉద్యోగాల్లో భారీ మార్పులకు తెరలేపుతాయని 88 శాతం మంది భారతీయులు అభిప్రాయపడ్డారు.
- ఈ కారణంగా వచ్చే పదేళ్లలో తాము చేస్తున్న ఉద్యోగాలు ఊడిపోయే అవకాశం ఉందని 54 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- ప్రపంచవ్యాప్తంగా విభిన్న రంగాలకు చెందిన 43 శాతం ఫ్రంట్‌లైన్ ఉద్యోగులు ఇప్పటికే రెగ్యులర్‌గా ఏఐ ఇతర టూల్స్‌ను ఉపయోగిస్తున్నారు.
- ప్రపంచ సగటుతో పోల్చితే భారత్ ఫ్రంట్‌లైన్ ఎంప్లాయిస్ రెట్టింపు స్థాయిలో వీటిని వినియోగిస్తున్నారు. (సర్వే చేసిన వారిలో 85శాతం మంది ఈ టూల్స్ ఉపయోగిస్తున్నట్టు తెలిపారు)
- తాము చేస్తున్న ఉద్యోగాల్లో ఏఐ తెచ్చే మార్పులకు అనుగుణంగా శిక్షణ పొందామని భారత్‌లోని 53 శాతం ఫ్రంట్‌లైన్ ఉద్యోగులు, 47 శాతం మేనేజర్లు చెప్పారు. ఇది ప్రపంచ స్థాయిలో పోల్చితే 28 శాతం, 30 శాతంగా ఉంది.
- ప్రపంచవ్యాప్తంగా సాంకేతికంగా వస్తున్న మార్పులతో ఎదురయ్యే సవాళ్ల కంటే కూడా...జరిగే మార్పులకు అనుగుణంగా తమను తాము మార్చుకునే విధంగా 'ఛేంజ్ మేనేజ్‌మెంట్'కు ఉద్యోగులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.
- ప్రస్తుతం ఏఐ, జనరేటివ్ ఏఐను ఉపయోగిస్తున్న వారిలో 49 శాతం మంది.. రాబోయే దశాబ్ద కాలంలో సాంకేతికపరంగా చోటుచేసుకునే అభివృద్ధి కారణంగా తమ ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ఇవి రెండూ రెండంచుల కత్తి లాంటివి

'ఏఐ, జనరేటివ్ ఏఐ అనేవి రెండూ రెండంచుల కత్తి లాంటివని మా సర్వేలో తేలింది. ఇది ఒకవైపు సౌకర్యవంతంగా ఉంటే మరోవైపు ఆందోళన, ఆదుర్దా కలిగించేదే. జనరేటివ్ ఏఐ అనేది విప్లవాత్మక టెక్నాలజీ. అందువల్ల సహజంగానే దీన్ని వ్యతిరేకించే వారు, ఈ సాంకేతికతపై ఆందోళన కలిగి ఉండేవారు ఉంటారు..'అని ఈ అధ్యయనం నిర్వహించిన వారు చెబుతున్నారు.

నిరుద్యోగ భారత్

దేశవ్యాప్తంగా అన్‌ఎంప్లాయ్‌మెంట్

మే నెల	జూన్ నెల
6.3%	9.2%

- గ్రామీణ ప్రాంతాల్లోనే నిరుద్యోగులు ఎక్కువ
- సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) కన్జ్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వేలో వెల్లడి



నిరుద్యోగానికి ప్రధాన కారణాలు...

- అధిక జనాభా
- తక్కువ స్థాయిలో చదువు, నైపుణ్యాల కొరత (ఒకేషనల్ స్కిల్స్)
- ప్రైవేట్‌రంగ పెట్టుబడులు తగ్గిపోవడం
- వ్యవసాయరంగంలో తక్కువ ఉత్పాదకత
- చిన్న పరిశ్రమలకు ఇబ్బందులు, ప్రభుత్వ సహాయం కొరవడటం
- మౌలిక సదుపాయాలు, ఉత్పత్తిరంగాల్లో పురోగతి సరిగ్గా లేకపోవడం
- అనియత రంగం (ఇన్ఫార్మల్ సెక్టార్) ఆధిపత్యం
- కాలేజీల్లో చదివే చదువు, పరిశ్రమ అవసరాల మధ్య అంతరం పెరగడం

సాక్షి, హైదరాబాద్: ఉపాధి, ఉద్యోగ అవకాశాలు తగ్గడంతో దేశంలో నిరుద్యోగిత శాతం క్రమక్రమంగా పెరుగుతోంది. గత మే నెలలో 6.3 శాతం ఉండగా, జూన్ నాటికి 9.2 శాతానికి చేరింది. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే..గ్రామీణ ప్రాంతాల్లోనే నిరుద్యోగిత శాతంగా అధికంగా ఉంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర రంగాల్లో డిమాండ్ తగ్గడంతో అక్కడ పనులు చేసుకునేవారిలో నిరుద్యోగం పెరిగింది.అదే సమయంలో ఆర్థిక రంగం దిగజారడం, ఇతర అంశాల కారణంగా పట్టణాల్లోనూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గడంతో దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతూ వచ్చినట్టుగా నిపుణులు అంచనా వేస్తున్నారు.

- గ్రామీణ ప్రాంతాల్లో మే నెలలో నిరుద్యోగశాతం 6.3 ఉండగా, జూన్‌లో 9.3కు పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో చూస్తే...మే నెలలో 8.6 ఉండగా, జూన్ నాటికి 8.9 శాతానికి పెరిగింది.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా రెండుచోట్లా మహిళల్లోనే నిరుద్యోగమనేది ఎక్కువగా ఉన్నట్టుగా స్పష్టమవుతోంది.
- దేశవ్యాప్తంగా మహిళల విషయానికొస్తే... పట్టణ ప్రాంతాల్లో 21.36, గ్రామీణ ప్రాంతాల్లో 17.1 శాతం నిరుద్యోగులు ఉన్నారు.
- పురుషుల విషయంలో నిరుద్యోగిత శాతం పట్టణ ప్రాంతాల్లో 8.9, గ్రామీణ ప్రాంతాల్లో 8.2 శాతంగా ఉంది.
- 2023 జూన్‌లో నిరుగ్యోగ శాతం 8.5 ఉండగా, ఈ ఏడాది ఇదే సమయానికి 9.2 శాతానికి పెరిగింది.
- కన్జ్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వేలోని గణాంకాల ప్రాతిపదికగా సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) ఆయా వివరాలు వెల్లడించింది.

జనవరి–మార్చి మధ్యలో 6.7 శాతం... పీఎల్ఎఫ్ఎస్ సర్వే

దేశంలోని పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది జనవరి–మార్చి మధ్యలో 6.7గా నిరుద్యోగశాతం ఉన్నట్టుగా పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) పేర్కొంది. 2013లో 5.42 శాతమున్న నిరుద్యోగ శాతం, కరోనా పరిస్థితుల కారణంగా 2020లో 8 శాతానికి, ఆ తర్వాత 2021లో 5.98 శాతానికి తగ్గి, 2022లో 7.33 శాతానికి, 2023లో 8.4 శాతానికి, 2024లో తొలి ఆరునెలల్లో 6.7 శాతానికి (జూన్‌లో 9.2 శాతానికి) చేరుకున్నట్టుగా వివిధ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

15-29 ఏజ్ గ్రూప్ నిరుద్యోగంలో మూడోప్లేస్

దేశంలోని పట్టణ ప్రాంతాల్లో 15–29 ఏళ్ల మధ్య వయసున్న వారిలో అత్యధిక నిరుద్యోగ శాతమున్న రాష్ట్రంగా కేరళ నిలవగా, తెలంగాణ మూడో స్థానంలో నిలిచినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి–మార్చి మధ్యకాలంలో ఈ ఏజ్ గ్రూప్ నిరుద్యోగుల్లో టాప్‌ఫైవ్ రాష్ట్రాలు కేరళ 31.8 శాతం, జమ్మూకశ్మీర్ 28.2, తెలంగాణ 26.1, రాజస్తాన్ 24, ఒడిశాలో 23.3 శాతం ఉన్నట్టు వెల్లడైంది. దేశవ్యాప్తంగా ఈ ఏజ్‌గ్రూప్‌లో మొత్తంగా నిరుద్యోగిత శాతం జనవరి–మార్చి మధ్యలో 17 శాతంగా (అంతకు ముందు అక్టోబర్–డిసెంబర్‌ల మధ్యలో పోల్చితే 16.5 శాతం నుంచి) ఉంది. ఇక ఏజ్ గ్రూపుల వారీగా చూస్తే (అన్ని వయసుల వారిలో నిరుద్యోగ శాతం) నిరుద్యోగిత శాతం 6.7 శాతంగా ఉంది.

మహిళల్లో అత్యధిక నిరుద్యోగ శాతంలో తెలంగాణ ఫోర్త్ ప్లేస్

ఈ ఏడాది జనవరి–మార్చి నెలల మధ్యలో వివిధ వయసుల వారీగా నిరుద్యోగిత శాతంపై మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ (ఎంఎస్‌పీఐ) విడుదల చేసిన పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్)లో ఇవి వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా మహిళల్లో అత్యధిక నిరుద్యోగుల శాతంలో తెలంగాణ 38.4 శాతంతో నాలుగో స్థానంలో నిలిచినట్టు ఈ సర్వే వెల్లడించింది. మహిళల్లో అత్యధికంగా నిరుద్యోగులు అంటే 48.6 శాతంతో జమ్మూ కశ్మీర్ మొదటిస్థానంలో నిలవగా...కేరళ 46.6 శాతంతో రెండోస్థానంలో, ఉత్తరాఖండ్ 39.4 శాతంతో మూడోస్థానంలో, హిమాచల్‌ప్రదేశ్ 35.9 శాతంతో ఐదో స్థానంలో నిలిచాయి.

- పురుషుల్లో అత్యధిక నిరుద్యోగిత శాతమున్న రాష్ట్రంగా 24.3 శాతంతో కేరళ మొదటి స్థానంలో, బిహార్ 21.2 శాతంతో రెండోస్థానం, ఒడిశా, రాజస్తాన్‌లు 20.6 శాతంతో మూడో స్థానంలో, ఛత్తీస్‌గఢ్ 19.6 శాతంతో నాలుగోస్థానంలో నిలిచాయి.

నిరుద్యోగుల శాతం లెక్కింపు ఇలా...

నిరుద్యోగిత శాతం = నిరుద్యోగుల సంఖ్య/ఉద్యోగులు, ఉపాధి పొందిన సంఖ్య + నిరుద్యోగుల సంఖ్య

ఏ అంశాల ప్రాతిపదికన...

- 16 ఏళ్లు పైబడినవారు పరిగణనలోకి
- నెలలో నాలుగువారాలపాటు పనిచేసేందుకు అందుబాటులో ఉండేవారు
- ఈ కాలంలో ఉపాధి కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నవారు
- ఉపాధి కోల్పోయి మళ్లీ పనికోసం చురుగ్గా వెతుకుతున్నవారు.



కాడి ఒక్కటే.. 5 దారలు

ముథోల్: సోయా పంటలో కలుపు మొక్కలు కూలీలతో తొలగిస్తే అధిక భారం పడుతుంది. దీంతో వినూత్న ఆలోచనతో స్వల్ప ఖర్చుతోనే కలుపు నివారిస్తున్నాడు నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రానికి చెందిన రైతు మారుతి. సాధారణంగా ఒక కాడికి రెండు లేదా మూడు దారలు బిగించి కలుపు తీస్తుంటారు. అయితే మారుతి రెండు ఎడ్లకు ఒక్కటే కాడి కట్టి దానికి ఐదు దారలు బిగించి ఐదుగురు కూలీలతో ఒక్క రోజులోనే పది ఎకరాల్లో దార కొట్టి కలుపు నివారిస్తున్నాడు.

ఈ బాలుడు బతకాలంటే.. రూ.16 కోట్ల ఇంజెక్షన్ కావాలి!

దాతల ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రుల విన్నపం



శ్రీయాన్

కోటపల్లి: గర్భం దాల్చింది మొదలు పుట్టబోయే సంతానం కోసం ఎన్నో కలలు కన్నారు ఆ దంపతులు. బాబు పుట్టగానే ఎంతో సంతోషించారు. శ్రీయాన్‌గా పేరు పెట్టుకున్నారు. కానీ ఓ అరుదైన వ్యాధి ఆ బాబును కదలకుండా చేసింది. శ్రీయాన్ జీవితాన్ని నిలబెట్టాలంటే రూ.16 కోట్ల ఖరీదైన ఇంజెక్షన్ చేయాలని వైద్యులు చెపుతున్నారు. అయితే తమ బిడ్డకు అంత ఖరీదైన వైద్యం చేయించే స్తోమత లేక ఆ తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం వెంచపల్లి గ్రామానికి చెందిన పడాల రవళి, సతీశ్ దంపతులకు శ్రీయాన్ (13 నెలలు) అనే కొడుకు ఉన్నాడు. నెలలు గడుస్తున్నా అందరు చిన్నారుల మాదిరిగా తమ బిడ్డ బోర్లాపడడం, పాకడం వంటివి చేయకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. మంచిర్యాల, కరీంనగర్ నగరాల్లోని వైద్యులను సంప్రదించి వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని కార్పొరేట్ పిల్లల ఆస్పత్రిలో వైద్యులను ఆశ్రయించారు. అనేక వైద్య పరీక్షల అనంతరం శ్రీయాన్ ప్రాణాంతక స్పైనల్ మస్క్యులార్ అట్రోఫి అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్లు తేల్చారు. బుడిబుడి అడుగులు వేయాల్సిన బాబును ప్రాణాంతక వ్యాధి క్షీణింపజేస్తోంది. శ్రీయాన్‌కు 24 నెలలు వచ్చేలోపు ఓ ఇంజక్షన్ ఇప్పించాలని, అందుకు రూ.16 కోట్లు ఖర్చవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. తమకు అంత డబ్బు పెట్టే స్థోమత లేదని.. దాతలు, ప్రభుత్వం స్పందించి తమ బాబు ప్రాణాలు నిలబెట్టాలని తల్లిదండ్రులు రవళి, సతీశ్ వేడుకుంటున్నారు.

పిచ్చి మొక్కలను తొలగిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



పార పట్టి.. పిచ్చి మొక్కలు తొలగించి..

పాఠశాల ఆవరణను శుభ్రపరిచిన భద్రాద్రి కలెక్టర్

టేకులపల్లి: భవిష్యత్ బాగుండాలంటే కష్టపడాలి.. ఉత్తమ లక్ష్యంతో ముందుకు సాగాలంటూ విద్యార్థులకు చెప్పడమే కాకుండా చేసి చూపిస్తేనే వారు ఆదర్శంగా తీసుకుంటారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ స్పష్టం చేశారు. జిల్లాలోని టేకులపల్లి మండలం కోయగూడెం ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి బాగా పెరగడంతో స్వయంగా పార పట్టి వాటిని తొలగించారు. ఆ స్థలంలో తులసి, ఉసిరి, కరివేపాకు, ఎలక్కాయ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. తిరుగు ప్రయాణంలో శాంతినగర్ వద్ద రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ : కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌తో గురువారం ఢిల్లీలో బీఆర్ఎస్ ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావు భేటీ అయ్యారు. గురువారం ఢిల్లీ నార్త్ బ్లాక్‌లోని కేంద్ర హోంశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన మంత్రి బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలను తెలిపారు.

త్వరలోనే రాష్ట్రానికి కురియన్ కమిటీ

- పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల పనితీరుపై సమీక్షలు..
- అధిష్టానానికి నివేదిక ఇవ్వనున్న కమిటీ

సాక్షి, హైదరాబాద్: ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ నేతల పనితీరును సమీక్షించేందుకు కాంగ్రెస్ అధిష్టానం నియమించిన త్రిసభ్య కమిటీ త్వరలోనే రాష్ట్రానికి రానుంది. రాజ్యసభ మాజీ చైర్మన్ పి.జె.కురియన్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం రెండు, మూడు రోజుల్లో రాష్ట్రా నికి వస్తుందని తెలుస్తోంది. ఈ కమిటీ పార్లమెంటు ఎన్నికల ఫలితాలను సమీక్షించనుంది. రాష్ట్ర మంత్రులు, ఇన్‌చార్జులు, టీపీసీసీ నేతలు, అనుబంధ విభాగాల నాయకులు, డీసీసీ అధ్యక్షులతో పాటు పలుస్థాయిల్లోని నేతల పనితీరును అధ్యయనం చేయనుంది. అలగే పోటీ చేసిన అభ్యర్థులతో కలసి సమావేశాలు నిర్వహించనుంది. ముఖ్యంగా ఓటమి పాలయిన నాయకులతో కమిటీ ముఖా ముఖి సమావేశమై ఎన్నికల్లో పార్టీ నేతల సహకారం, వారి పనితీరు గురించి స్వయంగా అడిగి తెలుసుకుంటుందని సమాచారం. అన్ని అంశాలపై సమీక్ష అనంతరం రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల వారీగా పార్టీ అధిష్టానానికి కురియన్ కమిటీ తన నివేదిక సమర్పిస్తుందని తెలుస్తోంది. ఈ కమిటీ నివేదిక అనంతరం రాష్ట్ర కాంగ్రెస్‌లో పలు మార్పులుంటాయని గాంధీ భవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణతో పాటు, టీపీసీసీ అధ్యక్షుడి నియామకం, నామినేటెడ్ పోస్టులు వంటి అన్ని విషయాల్లో ఈ కమిటీ నివేదిక కీలకమవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

ఖాకీ కాఠిన్యం

గొర్రెల చోరీ కేసులో గిరిజనుడిపై థర్డ్ డిగ్రీ

- జూన్‌లో రెండుసార్లు స్టేషన్‌లో చిత్రహింసలు
- ఆరోగ్యం క్షీణించడంతో ఆస్పత్రిలో చేరిన బాధితుడు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: గొర్రెలు ఎత్తుకెళ్లాడన్న ఆరోపణలపై ఓ గిరిజనుడిని ఒకే నెలలో రెండుసార్లు అదుపులోకి తీసుకొని.. చితకబాదిన ఘటన రామడుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే...గత ఏప్రిల్ నెలలో వెలిచాలలో ఓ వ్యాపారికి చెందిన కొన్ని గొర్రెలు కనిపించకుండా పోయాయి. అయితే గ్రామంలోని కుతాడి కనకయ్యపై అనుమానం ఉందంటూ రామడుగు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో జూన్ 11న తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్న కనకయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రామడుగు ఠాణాలో థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. అనంతరం మరో ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ రోజంతా ఎస్సై చితకబాదాడని, 12వ తేదీ రాత్రి తమకు అప్పగించారని బాధిత కుటుంబసభ్యులు అంటున్నారు. 13న కూడా స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు అతని ఆరోగ్యం బాగాలేదని విచారించకుండానే పంపించారు. తిరిగి 26న సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు బాధితుడిని విచారణ పేరిట చావబాదారని ప్రత్యక్ష సాక్షులు 'సాక్షి'కి తెలిపారు. పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్న సమయంలో ఆ వ్యాపారి అక్కడే ఉన్నాడని, ఈ విషయం సీసీ కెమెరాలు చూస్తే స్పష్టమవుతుందని పేర్కొన్నారు. మరునాడు మరోసారి రావాలని కనకయ్యను ఆదేశించడంతో గత్యంతరం లేక వెళ్లాడు. అక్కడ అతని ఆరోగ్యం సహకరించకపోయేసరికి వదిలేశారు. కనకయ్య ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబసభ్యులు ప్రభుత్వ



కనకయ్య

ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయమై ఎస్సై సురేందర్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. విచారణ విషయమై కనకయ్యను పిలిపించామని, ఆయన నేరం అంగీకరించాడని తెలిపారు. ' మా ఆయన్ను చేయని నేరాన్ని ఒప్పుకోవాలంటూ పోలీసులు పలుమార్లు చితకబాదారు. ఆయన ఆరోగ్యం క్షీణించింది. వైద్యం చేయించుకునే స్తోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చాం. ఎస్సై సురేందర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టరమ్మను కలిసి వేడుకున్న. న్యాయం చేస్తానని హామీ ఇచ్చింది' అని కనకయ్య భార్య అనిత చెప్పింది. ఈ ఘటనపై తాజాగా సీపీ, కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు.

రిటైరైనా రెగ్యులర్‌గా విధులకు..

- ప్రస్తుతం కోదాడ మండల పరిషత్ కార్యాలయంలోనే అటెండర్‌గా డ్యూటీ
- 14 ఏళ్ల కిందట ఇదే ఆఫీస్ నుంచి రిటైర్‌మెంట్

కోదాడరూరల్ : సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్‌మెంట్ తర్వాత శేష జీవితాన్ని కుటుంబసభ్యులతో గడుపుతారు. కానీ హుస్సేన్ మాత్రం 14 ఏళ్ల కిందట సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగవిరమణ పొందాడు. ఆయన స్థానంలో మరో అటెండర్ వచ్చారు. హుస్సేన్ రిటైర్‌మెంట్ తర్వాత ఒక నెల అటుఇటుగా తన సొంత పనులు పూర్తి చేసుకున్నాడు. అప్పటి నుంచి డ్యూటీపై ఉన్న ఆసక్తితో రోజూ విధులకు హాజరవుతూనే ఉన్నాడు. మొదట్లో అతనిని చూసిన ఉద్యోగులు నువ్వు రిటైర్ అయ్యావు గుర్తుందా లేదా మరిచిపోయి ఎప్పటిలాగే రోజూ ఆఫీసుకు వస్తున్నావా అంటూ ఆట పట్టించేవారు. అవేవీ పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతున్నాడు.

డ్యూటీపై ఉన్న ఆసక్తితో వస్తున్నాడు



రెగ్యులర్ అటెండర్లు ముగ్గురు ఉన్నారు. అయినా, హుస్సేన్ మాత్రం డ్యూటీపై ఉన్న ఆసక్తితో వస్తున్నాడు. రిటైర్ అయ్యావు ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకోవచ్చుగదా అని చెప్పాను. ఇంటి వద్ద ఉంటే కాలక్షేపం కాదని చెబుతూ డ్యూటీకి వస్తున్నాడు.

– రాంచందర్‌రావు, ఎంపీడీఓ, కోదాడ



ఓపిక ఉన్నంత వరకు వస్తా

ఓపిక ఉన్నంత వరకు వస్తూనే ఉంటా. ప్రభుత్వం నుంచి నాకు నెలనెలా పెన్షన్ వస్తోంది. ఇలా పని చేస్తుండటంతో తీసుకుంటున్న జీతానికి న్యాయం చేస్తున్న అనే ఆత్మసంతృప్తి నాకు కలుగుతుంది.

– షేక్.హుస్సేన్, రిటైర్డ్ అటెండర్, కోదాడ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.